# SOCIOLOGY – I
# PRINCIPLES OF SOCIOLOGY
# (DSOC1)
# (BACHELOR OF ARTS)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే $B^{++}$ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కల్గి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థిని విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

ఆచార్య. కె. వియన్నారావు
కులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# Sociology

## Paper - I : Principles of Sociology

## (At the end of I year)

## Syllabus

1. Sociology - Definition, Nature and Scope - Its relation to the other Social Sciences - Economics, Psychology, Anthropology. History and Political Science.
2. Human Society - Its nature characteristics and functions - Individual and Society - Social Contract, Theory - Organismic and Group Mind Theory - Socialisation, Its Meaning - Process and Agencies - Culture and Personality.
3. Social Structure and Organisation - Social Groups, Primary, Secondary, Formal, Informal, In and Out groups, Institutions, Associations and Communities, Role, Status Norms, Values, Power and Authority.
4. Social Disorganisation and Social Control Agencies fo Social Control.
5. Heredity and Environment - their influence on the Individual Natural and Social Selection and Social Heritage.
6. Social Interaction and its Associative and Dissociative Processes - Co-operation, Accommodation, Assimilation, Acculturation, Integration and Competition and Conflict.
7. Social Stratification - Its Nature, Forms and Characteristics Caste and Class.

## BOOKS


| | | | | |
|---|---|---|---|---|
| 1. | సమాజ శాస్త్రము - ప్రాథమిక సూత్రాలు | | | (తెలుగు అకాడమి) |
| 2. | వ్యక్తి - సమాజము | | | (తెలుగు అకాడమి) |
| 3. | సమాజ శాస్త్రము | | | (తెలుగు అకాడమి) |
| 4. | సాంఘిక సమూహాలు | | | (తెలుగు అకాడమి) |
| 5. | Bierstedt. | Social Order | | |
| 6. | H.M. Johnson | Sociology | : | A Systematic Study |
| 7. | Bottomore | Sociology | : | A Guide to Problems |
| 8. | MacIver | Society | : | An Introductory Analysis |
| 9. | R.R. Sarma | Principles of Sociology | | |
| 10. | Brooms and Selznick | Principles of Sociology | | |
| 11. | P. Gisbert | Fundamentals of Sociology | | |
| 12. | సమాజ నిర్మితి - పరివర్తన | (తెలుగు అకాడమి) | | |

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2005

(Examination at the end of First Year)

Sociology

## PARER I - PRINCIPLES OF SOCIOLOGY

Time : Three hours

Maximum : marks 100

**Answer any FIVE questions.**

**Select atleast TWO from each Section, All questions carry equal marks.**

### SECTION - A

1. Examine the need for the study of Sociology.
   సమాజ శాస్త్రాన్ని అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతను పరిశీలించుము.
2. Write an essay on Spencer's Organismic theory.
   స్పెన్సరు వివరించిన జైవిక సిద్ధాంతమును తెల్పుతూ ఒక వ్యాసమును వ్రాయుము.
3. Define Socialization and explain its agencies..
   సమాజీకరణను నిర్వచించి, దానిని ఒనగూర్చు సాధనాలను వివరించుము.
4. Explain the need for group life to the individual.
   వ్యక్తికి సామూహిక జీవనము ఎందుకు అవసరమో వివరింపుము.
5. Analyse the factors responsible for social disorganization.
   సామాజిక అవ్యవస్థాపనకు దారితీయు కారణములను విశ్లేషించుము.

### SECTION - B

6. Distinguish natural selection from social selection.
   సహజ వరణమును, సామాజిక వరణముతో పోల్చి చూపుము.
7. "Cooperation and conflict are the two sides of the same coin." - Discuss.
   "సహకారము, సంఘర్షణ అనేవి నాణెమునకున్న బొమ్మ, బొరుసు వంటివి". చర్చించుము.
8. What do you mean by Social Stratification? Explain its nature and characteristics.
   సామాజిక స్తరీకరణ అంటే ఏమిటి? దాని స్వభావమును, లక్షణాలను తెల్పుము.
9. Define community and distinguish Rural community from Urban Community.
   సముదాయమును నిర్వచించి, గ్రామీణ సముదాయమును, నాగరిక సముదాయముతో పోల్చి చూపుము.
10. Write short notes on any Two of the following :
    a) Power and authority
    b) Social heritage.
    c) Social Values.
    d) Casteism.

    ఈ క్రింది వానిలో ఏ రెండింటికైనా లఘుటీకను వ్రాయుము :

    (a) శక్తి, అధికారము
    (b) సామాజిక వారసత్వము
    (c) సామాజిక విలువలు
    (d) కులాభిమానము.

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2004.

(Examination at the end of First Year)

Sociology

## PARER I - PRINCIPLES OF SOCIOLOGY

Time : Three hours

Maximum : marks 100

**Answer any FIVE questions.**

**Select atleast TWO from each Section, All questions carry equal marks.**

### SECTION - A

1. Define Sociology. Discuss its relationship with Anthropology and Psychology.

   సమాజ శాస్త్రాన్ని నిర్వచించి, సమాజ శాస్త్రమునకు మానవ శాస్త్రానికి మరియు మనస్తత్వ శాస్త్రానికి గల సంబంధమును గురించి చర్చింపుము.

2. Discuss the characteristics and functions of human society.

   మానవ సమాజ లక్షణములను, ప్రాకార్యాలను గూర్చి చర్చింపుము.

3. Define social group. Distinguish between primary and secondary groups.

   సామాజిక సమూహమును నిర్వచించి, ప్రాథమిక సమూహమునకు, గౌణ సమూహమునకుగల తేడాలను వివరింపుము.

4. What are the agencies of social control? Discuss the importance of any two agencies.

   సామాజిక నియంత్రణ సాధనాలు ఏవి? వాటిలో ఏవైనా రెండు సాధనాల ప్రాముఖ్యతను చర్చించుము.

5. Write an essay on the relationship between

   మూర్తిమత్వ అభివృద్ధిలో వారసత్వం మరియు పరిసరము (వాతావరణము)నకు మధ్యగల సంబంధముపై ఒక వ్యాసమును వ్రాయుము.

### SECTION B

6. What is social interaction? Describe associative processes of social interaction.

   సామాజిక పరస్పర చర్య అనగానేమి? సామాజిక పరస్పర చర్య యొక్క, అనుబంధ ప్రక్రియలను వివరించుము,

7. Define social stratification. Discuss caste as a special form of stratification in India.

   సామాజిక స్తరీకరణమును నిర్వచించి, భారతదేశంలోని స్తరీకరణ ప్రత్యేక రూపముగా కుల విధానాన్ని చర్చింపుము.

8. Define and discuss status, role, power and authority as elements of social structure.

   సామాజిక నిర్మితిలు, మౌలికలైన అంతస్తు, పాత్ర, శక్తి, అధికారమును నిర్వచించి, చర్చింపుము.

9. Write about the contributions made by John Locke, J.J. Roussau and Hobhouse towards social contract theory.

   సామాజిక ఒడంబడిక సిద్ధాంతము పట్ల జాన్ లాకి, జె.జె. రూసో మరియు హాబ్ హౌస్ చేసిన కృషిని గూర్చి వ్రాయుము.

10. Write short notes on any Two of the following

    a) Norms. b) Social Heritage.

    c) Acculturation d) Natural selection

    ఈ క్రింది వానిలో ఏ రెండింటికైనా లఘుటీకను వ్రాయుము :

    (a) ప్రమాణాలు (b) సాంఘిక వారసత్వము

    (c) పరసంస్కృతీకరణము (d) సహజవరణము.

B.A. DEGREE EXAMINATION, JULY 2005

(Examination at the end of First Year)

**Sociology**

## PARER I - PRINCIPLES OF SOCIOLOGY

Time : Three hours Maximum : marks 1(

**Answer any FIVE questions.**

**Select atleast TWO from each Section, All questions carry equal marks.**

### SECTION - A

1. Define Sociology and explain its nature and scope.
   సమాజశాస్త్రాన్ని నిర్వచించి, దాని స్వభావమును, పరిధిని వివరించుము.
2. Bring out the relationship between individual and society.
   వ్యక్తికి, సమాజానికి మధ్యగల సంబంధాన్ని తెల్పుము.
3. In what way culture is influencing the personality of the individual? Explain.
   సంస్కృతి ఏ విధంగా వ్యక్తి మూర్తిమత్వాన్ని ఉత్తేజ పరచి ప్రభావితం చేస్తుందో వివరించుము.
4. Define social structure and explain its various elements.
   సమాజ నిర్మితిని నిర్వచించి, దాని వివిధ అంశాలను వివరించుము.
5. Explain the role of social control and its agencies in maintaining social order.
   సమాజాన్ని అదుపులో ఉంచుటలో సామాజిక నియంత్రణ, దాని వివిధ సాధనాల పాత్రను వివరించుము.

### SECTION - B

6. Write an essay on the influence of environment on the individual.
   వ్యక్తి మీద పరిసరాలు చూపు ప్రభావమును గూర్చి ఒక వ్యాసమును వ్రాయుము.
7. Explain competition and conflict as dissociative processes of human society.
   పోటీ, సంఘర్షణలను మానవ సమాజం యొక్క ప్రతిబంధ ప్రక్రియలుగా వివరించుము.
8. Define social class and discuss its characteristics.
   సాంఘిక వర్గమును నిర్వచించి, దాని లక్షణాలను చర్చించుము.
9. "Role and status are the two sides of the Same coin" - Explain.
   "పాత్ర, అంతస్తు - ఈ రెండు నాణెమునకున్న బొమ్మ, బొరుసు వంటివి" - వివరించుము.
10. Write short notes on any Two :
    a) Institution b) History and Sociology
    c) Social contract theory d) Social integration.

    ఈ క్రింది వానిలో ఏ రెండింటికైనా లఘుటీకను వ్రాయుము :

    (a) సంస్థ. (b) చరిత్ర మరియు సమాజశాస్త్రము
    (c) సామాజిక ఒడంబడిక సిద్ధాంతము (d) సామాజిక సమైక్యత.

## B.A. DEGREE EXAMINATION, MAY 2006.

(Examination at the end of First Year)

Part II - Sociology Paper I - **PRINCIPLES OF SOCIOLOGY**

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE of the following questions

Answer not less than TWO from each Section., All questions carry equal marks.

### SECTION A

1. Define sociology and discuss its nature.
సమాజశాస్త్రాన్ని నిర్వచించి, దాని స్వభావాన్ని తెలియచేయండి.

2. Examine the relative between sociology and other social sciences.
సమాజశాస్త్రానికి మరియు ఇతర సామాన్య శాస్త్రాలకు గల సంబంధాన్ని తెలియచేయండి.

3. Define Human society and explain its characteristics.
మానవ సమాజాన్ని నిర్వచించి వాటి లక్షణాలను వివరింపుము.

4. Examine the concept of socialization and agencies of socialization.
సాంఘికీకరణ భావనను పరిశీలించి వాటి యొక్క ఏజన్సీలను తెలపండి.

5. Examine the relation between Individual and society.
వ్యక్తికి సమాజానికి మధ్య గల సంబంధాన్ని వివరింపుము.

### SECTION B

6. Describe the social stratification and its characteristics.
సామాజిక స్థరీకరణను నిర్వచించి వాటి లక్షణాలను తెలపండి.

7. Define social disorganization and the causes for social disorganization.
సామాజిక అవ్యవస్థను నిర్వచించి, వాటికి ల కారణాలను వివరించండి.

8. Examine the components of social structure.
సామాజిక నిర్మితిలో వివిధ భాగాలను పరిశీలించండి.

9. Write an essay on disagrowative social process.
సామాజిక అనుబంధ ప్రక్రియలపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.

10. Answer any TWO of the following (short note) :
    (a) August Comte.
    (b) Community.
    (c) Folk ways.
    (d) Reference group.

    ఏవేని రెండింటి సమాధానాలు వ్రాయండి :
    (a) ఆగస్ట్ కోమ్టే
    (b) సముదాయము.
    (c) జానపద రీతులు
    (d) ఆదర్శ సమూహం.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | సామాజిక శాస్త్ర దృక్కోణం సామాజిక శాస్త్ర పరిచయం - నిర్వచనం | 1.1 - 1.6 |
| 2. | సమాజశాస్త్ర స్వభావం - పరిధి | 2.1 - 2.5 |
| 3. | సమాజ శాస్త్రానికి ఇతర సాంఘిక శాస్త్రాలకు మధ్యగల సంబంధం | 3.1 - 3.7 |
| 4. | మానవుడు - సమాజము మానవ సమాజము - స్వరూప స్వభావము | 4.1 - 4.7 |
| 5. | మానవుడు - సమాజము | 5.1 - 5.7 |
| 6. | మానవుడు - సమాజము (వ్యక్తి - సమాజము) | 6.1 - 6.7 |
| 7. | సాంఘికీకరణ - సాంఘికీకరణ - ప్రక్రియ | 7.1 - 7.7 |
| 8. | సంస్కృతి - మూర్తిమత్వం - సామాజిక వారసత్వం | 8.1 - 8.6 |
| 9. | సామాజిక వ్యవస్థాపన - నిర్మితి | 9.1 - 9.4 |
| 10. | సామాజిక నిర్మితి - వ్యవస్థాపన | 10.1 - 10.6 |
| 11. | సామాజిక సమూహాలు - ప్రాథమిక - గౌణ సమూహాలు | 11.1 - 11.8 |
| 12. | సామాజిక సంస్థలు - సంఘాలు సముదాయాలు | 12.1 - 12.14 |
| 13. | సామాజిక నిర్మితి - వ్యవస్థాపన | 13.1 - 13.5 |
| 14. | శక్తి - అధికారము | 14.1 - 14.4 |
| 15. | సామాజిక నిర్మితి - వ్యవస్థాపన | 15.1 - 15.4 |
| 16. | సామాజిక అవ్యవస్థ - అర్థము - కారణాలు | 16.1 - 16.5 |
| 17. | సామాజిక అవ్యవస్థ - రూపాలు | 17.1 - 17.3 |
| 18. | సామాజిక నియంత్రణ - అర్థము - రూపాలు | 18.1 - 18.4 |
| 19. | సామాజిక నియంత్రణ - సాధనోపకరణాలు | 19.1 - 19.4 |
| 20. | సామాజిక నియంత్రణ - ఏజన్సీలు | 20.1 - 20.6 |
| 21. | అనువంశికత - (వారసత్వము) సామాజిక వాతావరణం | 21.1 - 21.8 |
| 22. | సహజ వరణము - సామాజిక వరణము | 22.1 - 22.4 |
| 23. | సాంఘిక పరస్పర చర్య - అనుబంధ విచ్ఛిన్న ప్రక్రియలు | 23.1 - 23.9 |
| 24. | విలీనీకరణము - సంస్కృతీకరణము సమైక్యత | 24.1 - 24.5 |
| 25. | సాంఘిక పరస్పర చర్య - విచ్ఛిన్న ప్రక్రియ | 25.1 - 25.7 |
| 26. | సామాజిక స్తరీకరణము - స్వభావము రూపాలు ప్రధాన లక్షణాలు | 26.1 - 26.5 |
| 27. | కులము - వర్గము - స్వభావము - లక్షణాలు - బేధములు | 27.1 - 27.8 |

పాఠం - 15

# సామాజిక నిర్మితి - వ్యవస్థాపన

## (SOCIAL STRUCTURE & SOCIAL ORGANISATION)

## ప్రమాణాలు - విలువలు


15.0 లక్ష్యం

15.1. - సామాజిక ప్రమాణాలు - సామాజిక విలువలు వివరణ

15.2. - ప్రమాణాలు - నిర్వచనము - రకాలు - వివరణ

15.3. - సామాజిక ప్రమాణాలు - అమలు చేయబడుటకు దోహదము చేయు కారణాలు

15.4. - సామాజిక విలువలు - వివరణ

15.5. - వ్యక్తిపరమైన విలువలు - సాంఘికీకరణ - సామాజిక విలువలు

15.6. - సారాంశము


## 15.0. లక్ష్యం :

సమాజములో సంక్షోభము అలుముకొని ఉన్నప్పుడు సమాజము గజిబిజిగా తయారయినప్పుడు సమాజ వ్యవస్థాపన పరముగా మనము ఆందోళన చెందుతూ ఉంటాము. కాని త్వరలోనే పై చెప్పుకొన్న సంక్షోభాలు గందరగోళ పరిస్థితులు సమసిపోయి నెమ్మది ఏర్పడుతుంది. అలా నెమ్మది ఏర్పడుటకు ముఖ్యకారణము సామాజిక క్రమత. సామాజిక క్రమతలో వ్యక్తుల యొక్క ప్రవర్తనలను క్రమబద్ధము చేయుటకు కొన్ని సామాజిక ప్రమాణాలు ఉండును. సమాజములో నివసించెడి వ్యక్తులు తమ కోర్కెలను, లక్ష్యాలను పొందుటకు ప్రయత్నిస్తూ ఉంటారు. ఆ ప్రయత్నముల ఆధారంగా వారి వారి జీవిత విధానములు జరుగుతూ ఉంటాయి. ఇటువంటి సందర్భములో వ్యక్తుల ప్రవర్తనలను కొన్ని నియమ నిబంధనల ద్వారా నియంత్రించకపోతే క్రమతకు భంగము వాటిల్లి సమాజములో గందరగోళ పరిస్థితులు ఏర్పడవచ్చును. అందువలన సమాజములోని వ్యక్తులు ఏ విధముగా ప్రవర్తించాలో తెలియజేసే నిర్దేశిక సూత్రాలను సామాజిక ప్రమాణాలుగా చెప్ప వచ్చును.

అదేవిధముగ కొన్ని అంశాలు మంచివి అని వాటిని విశ్వసింప వచ్చునని, అవి కావలసినవని భావించెడి వాటిని సామాజిక విలువలు అటారని హరలామ్‌బాస్ (M. Haralambos) అభిప్రాయ పడినాడు. ఏది ఏమైనప్పటికిని సామాజిక క్రమతను కాపాడుటకు వ్యక్తుల యొక్క ప్రవర్తనలను చర్యలను క్రమబద్ధము చేయు అంశములే సామాజిక ప్రమాణములు.

## 15.1. సామాజిక ప్రమాణాలు - సామాజిక విలువలు - వివరణ :

సామాజిక ప్రమాణాలు సమాజమునకు సామాజిక వ్యవస్థకు పునాదులు వంటివి. Hobbes అభిప్రాయములో ప్రమాణాలు లేకుండగా సమాజమును ఊహించుట సాధ్యము కాదు. ఇతని అభిప్రాయములో ప్రమాణాలు లేనటువంటి సమాజము మృగప్రాయముగా, ఏకాకిగా ఉండును. ప్రమాణాలు మార్గదర్శకముగా ఉండు సమాజములలోని వ్యక్తులు ఏ విధముగా జీవించాలి, ఎలా జీవించాలి, ఏలా జీవించకూడదు అనె నిర్దిష్టమైన సూచనలను ఇస్తూ సమాజములో క్రమరాహిత్యము ఏర్పడకుండగా కాపాడుతుంది. సామాజిక ప్రమాణాలు, విలువలు మొదలగునవి సమాజమును అవ్యవస్థనుండి కాపాడుతాయని చెప్పుట సత్యదూరము కాదు.

## 15.2. ప్రమాణాలు నిర్వచనము - రకాలు - వివరణ :

పై ఇచ్చిన వివరణను బట్టి ప్రమాణాలు సామాజిక క్రమతకు దోహదం చేస్తాయని తెలుసుకున్నాము. సమాజములోని వ్యక్తులు ఏ విధముగా ప్రవర్తించాలో తెలియజేసే కొన్ని నిర్దేశిక సూత్రాలనే ప్రమాణాలుగా నిర్వచించవచ్చు. అందువలన సామాజిక ప్రమాణాలు వ్యక్తుల యొక్క ప్రవర్తనలను చర్యలను జీవన విధానములను నిర్దేశించ గలుగుతుంది. సమాజ శాస్త్రవేత్తలు ఈ క్రింది వివిధ రకములైన సామాజిక ప్రమాణాలను గుర్తించి వివరించినారు. అవి:

**15.2.1. జానపద రీతులు** : అమెరికా దేశ సమాజశాస్త్రవేత్త అయిన సిమ్నర్ (Symner) అనునతడు జానపద రీతులు అనే పదమును ప్రప్రథమముగా ఉపయోగించినాడు. జానపద రీతులు అనగా సమాజములోని వ్యక్తులు తమ అవసరాలను తీర్చుకోవడానికి ఇతరులతో సామాజిక సంబంధాలను ఏర్పరచుకోవడానికి మార్గ దర్శకంగా అమలు చేసెడి కొన్ని విధానాలు. ఇవి సమాజములో మనకు తెలియకుండగనే ఒక సాంప్రదాయముగా కొనసాగుతు మనము వీటికి తల ఒగ్గేటట్టుగా చేస్తుంది. పెద్దలను గౌరవించడము, నిద్రకొరకు పక్కను ఏర్పాటు చేసుకోవడము ఉదాహరణగా చెప్పవచ్చును. వీటిని మనము తప్పనిసరిగా అమలు చేయాలని, అవలంబించాలని నియమము లేదు వీటిని అమలు చేయక పోతే దండన కూడ విధించబడదు. కాని మనకు తెలియకుండగానే జానపద రీతులకు కట్టుబడి ఉంటాము.

**15.2.2. సామాజిక రీతులు** : సమాజములో నీతిగా నిర్వచించే విషయాలను సామాజిక రీతులుగా అవగాహన చేసుకొనవచ్చు. ఈ పదమును కూడా అమెరికా సమాజశాస్త్రవేత్త. సిమ్నర్ Latin భాషకు చెందిన Mores అనే పదము ద్వార ప్రప్రథమముగా ప్రవేశపెట్టినాడు. సమాజములోని ప్రతివ్యక్తి సమాజ సంక్షేమాన్ని కోరుకుంటాడు. అందువలన కొన్ని కట్టుబాట్లను విధిగా అనుసరిస్తు ఉంటాడు. ఈ వ్యక్తులు సామాజిక రీతులను ఉల్లంఘించినట్లయితే దండనలకు గురికావలసి వస్తుంది. అందువలన అందరు వీటిని గౌరవించి వాటికి అనుకూలముగా జీవిస్తూ ఉంటారు. వ్యక్తులు సామాజిక రీతులను ఉల్లంఘించినట్లయితే దండనలకు గురికావలసి వస్తుంది. అందువలన అందరు వీటిని గౌరవించి వాటికి అనుకూలముగా జీవిస్తూ ఉంటారు. వ్యక్తులు సామాజిక రీతులను వ్యతిరేకించటము కాని, ప్రశ్నించటము కాని దాదాపుగా జరగదు. ప్రతివ్యక్తి వీటిని గౌరవిస్తునె ఉంటాడు. ఈ సామాజిక రీతులలో ఒప్పందాలు చట్టాలు మొదలైనవి చోటుచేసుకొని ఉంటాయి. వీటిని ఉల్లంఘించినప్పుడు వ్యక్తులను శిక్షలకు గురిచేస్తు ఉంటారు.

**15.2.3. విలువలు** : సమాజములో ఆపేక్షణీయమైన అంశాలను విలువలు అంటారు. అనగా ఏవి మంచివి ఏవి వాంఛనీయమైనవి అని గ్రహించి విశ్వసించెడి అంశాలనే విలువలు అంటారు. విలువలను అవగాహన చేసుకొనుటకు చక్కని ఉదాహరణ ప్రజాస్వామ్య ప్రభుత్వము. అభిలషణీయమైన ప్రభుత్వము అనేది ఒక నియమము. అదేవిధముగ ప్రస్తుతము నెలకొని ఉన్న పరిస్థితులను గూర్చిన నమ్మకాల నుండి భవిష్యత్‌లో ఎటువంటి పరిస్థితులు ఉండాలో తెలియజేసే అంశాలే విలువలు. కొన్ని సమాజాలలో విలువలుగా భావించబడే అంశాలు మరియొక సమాజాలలో అంత ప్రాముఖ్యం ఉన్న విలువలుగా భావింపబడక పోవచ్చును.

**15.2.4. ఆమోదాలు** : సమాజములోని సామాజిక ప్రమాణాలను సమర్ధించే వాటిని ఆమోదాలు అని అంటారు. ప్రమాణాలను గౌరవిస్తు, అమలు చేస్తూ, వాటి ప్రకారము నడచుకొనే వారికి బహుమానాలను ఇస్తారు. ఈ బహుమానములు గుర్తింపు రూపేణా, పొగడ్త రూపేణా ఉండవచ్చును. అదే విధముగా సామాజిక ప్రమాణాలను గౌరవించని వారికి లేక వాటికి వ్యతిరేకముగా ప్రవర్తించెడి వారికి దండనలు ఉంటాయి. ఈ దండనలు వివిధ రకములుగా ఉండవచ్చును. శిక్షించుట, అవహేళన చేయుట, విమర్శించుట, బహిష్కరించుట మొదలగునవి. ఈ దండనలు వ్యక్తిని తమ సమూహమునకు దూరము చేసి ఒంటరి వానిని చేస్తాయి. ఈ విధముగ ఆమోదాలు, సామాజిక ప్రమాణాలను సమర్ధిస్తు వ్యక్తులు వాటిని గౌరవించి వాటి ప్రకారము ప్రవర్తించే విధముగా చేస్తాయి. చట్టాలు కఠినముగా ఉన్నంత మాత్రాన వాటికి గురి అయిన వ్యక్తులు ప్రామాణాలకు అనుగుణముగా ప్రవర్తిస్తారని భావించడం కూడ సరికాదు.

## 15.3. సామాజిక ప్రమాణాలు - అమలు చేయబడుటకు దోహదము చేయు కారణాలు :

సమాజములో ప్రవేశపెట్టబడియున్న సామాజిక ప్రమాణాలను వ్యక్తులు పైన చెప్పుకున్నట్లుగా దండనలు, బహుమానములను ఆధారము చేసుకొనే లోబడి ఉండరు. కాని వివిధ కారణముల వలన వ్యక్తులు సామాజిక ప్రమాణాలకు కట్టుబడి ఉంటారని బైర్‌స్టెడ్ (Robert Byarsted) అభిప్రాయ పడినాడు. ఇతని అభిప్రాయములో సమాజములోని వ్యక్తులు సామాజిక ప్రమాణాలకు కట్టుబడి ఉండటానికి ఈ క్రింది కారణములు ముఖ్య దోహదకారములు. అవి :

**15.3.1. సిద్ధాంతబోధన** : బిడ్డకు పుట్టుకతో ఏర్పడు సాంఘికీకరణ ప్రక్రియ ద్వార సామాజిక ప్రమాణాల గురించిన వివరణ, జ్ఞానము అందించబడుతుంది. ఉదాహరణకు పెద్దలను గౌరవించడము, కుడిచేతితో పనులు చేయటము, నియమిత సమయాలలో ఆహారము

తీసుకోవటము వంటి ప్రామాణికతలు ఈ ప్రక్రియ ద్వార బిడ్డకు మొదటి నుండి నేర్పబడతాయి. తరువాతి కాలములో వ్యక్తి తాను నేర్చుకున్న ప్రమాణాలు తన జీవన విధానమునకు సరియైన మార్గదర్శకాలని వాటిని గౌరవించి అనుసరిస్తూ ఉంటాడు.

**15.3.2. అలవాట్లు :** సమాజములో కొన్ని నియమ నిబంధనలకు మార్గదర్శ సూత్రాలకు పనులకు మనము అలవాటు పడతాము. ఈ విధముగా అలవాటు పడిన అంశములను మనకు తెలియకుండగనే చేసుకుంటూ పోతూ ఉంటాము. అలవాట్ల వలన సామాజిక ప్రమాణాలు బలపడతాయి. ఈ విధముగ యాంత్రికంగా వ్యక్తులు సామాజిక ప్రమాణాలకు కట్టుబడి ఉంటారు.

**15.3.3. ఉపయోగము :** వ్యక్తులు సామాజిక ప్రమాణాలకు కట్టుబడి ఉండటానికి మరియొక కారణము వాటివలన వ్యక్తులు పొందుతున్న ఉపయోగాలు. ప్రతి వ్యక్తి సమాజ సంక్షేమమును, అందరి సంక్షేమమును కాంక్షించి ఇతరులతో సామాజిక సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తారు. అనుభవము ద్వారా ప్రతి వ్యక్తి సామాజిక ప్రమాణాల ఉపయోగాలను గ్రహించగలుగుతాడు. ఉదాహరణకు Bus Station లో Counter వద్ద టిక్కెట్టు తీసుకొనే విషయములో క్యూ పద్ధతిని పాటించవలెను, అనే ప్రమాణాన్ని గౌరవించడం వల్ల టిక్కెట్టు కొనే ప్రయాణికులందరికి న్యాయము, మేలు, సుఖము ఉంటుంది. ఈ రకమైన ఉపయోగాలను పొందుటకు ప్రమాణాలు తోడ్పడుతూ ఉంటాయి. కనుక వ్యక్తులు వాటిని గౌరవించడము నేర్చుకుంటారు.

**15.3.4. గుర్తింపు :** సామాజిక ప్రమాణాలను అవలంబించుట ద్వారా వ్యక్తి తాను నివసిస్తున్న సమూహము యొక్క గుర్తింపును పొందగలుగుతాడు. సహజముగ వ్యక్తి ఏ సమూహానికి చెంది ఉంటాడో ఆ సమూహము యొక్క ప్రమాణాలను మాత్రమే అవలంబిస్తు ఉంటాడు. ఈ విధముగ వ్యక్తి ఏ సమూహమునకు చెందినవాడో గుర్తించుట సులభము. పై చెప్పుకొన్న అంశములతోపాటుగా సామాజిక ప్రమాణాలలో ఆచారాలు, ఫ్యాషన్లు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు ప్రజాభిప్రాయము ఒప్పందాలు చట్టాలు మొదలగునవి కూడ చేర్చబడి ఉన్నవి. ఇవి అన్నియు సమాజములో వ్యక్తుల యొక్క ప్రవర్తనలను, క్రమతను కాపాడుటకు తోడ్పడతాయి.

## 15.4. సామాజిక విలువలు - వివరణ :

వ్యక్తులు చేసే ప్రతిచర్యల ప్రయోజనాలే సామాజిక విలువలు. విలువలు ఒక అంశము గురించి అది ఏమిటి అని వివరించగలవు. అయితే ఆ అంశాన్ని సాధించటానికి ఆచరించవలసిన చర్యలను గురించి తెలియజేస్తుంది. సమాజములోని ప్రతివ్యక్తి కొన్ని లక్ష్యాలను కోర్కెలను కలిగి ఉంటాడు. ఈ లక్ష్యసాధనకు కొన్ని విధానాలు అవసరము. ఎటువంటి విధానాలను అనుసరింపవలసి ఉన్నదో అను విషయాన్ని సామాజిక విలువలు రూపొందిస్తాయి.

## 15.5. వ్యక్తి పరమైన విలువలు - సాంఘికీకరణ - సామాజిక విలువలు :

విలువలను మనము రెండు రకములుగా అవగాహన చేసుకొనవచ్చును. అవి వ్యక్తిపరమైన విలువలు, సామాజిక విలువలు.

**15.5.1. వ్యక్తిపరమైన విలువలు :** ఈ రకమైన విలువలు వ్యక్తి పరముగా ఉండి అతని యొక్క సంతోషము కొరకు, సంతృప్తి కొరకు నిర్మింపబడి ఉంటాయి. వ్యక్తి ఈ రకమైన విలువలను ఇతరులతో పంచుకొన్నప్పటికి సామాజిక విలువలుగా గుర్తింపబడవు.

**15.5.2. సామాజిక విలువలు :** ఈ రకమైన సామాజిక విలువలు వ్యక్తి పరమైన విలువలకు వ్యతిరేకముగా ఉంటవి. సామాజిక విలువలలో ఇతర వ్యక్తులు, వారి సంక్షేమము ముఖ్యముగా చోటు చేసుకొంటాయి.

ఈ రకమైన సామాజిక విలువలు వ్యక్తి యొక్క మూర్తిమత్వ పరిధిని నిర్ణయిస్తు, అతని ఆలోచనలను ప్రవర్తనలను క్రమబద్ధము చేస్తూ, అతడు సామాజిక క్రమతకు తోడ్పడునట్లుగా చేస్తాయి. కొన్ని సామాజిక విలువలు సమాజానికి, సమాజానికి వేరుగా ఉంటాయి. ఉదాహరణకు భారత సమాజము ఆధ్యాత్మిక చింతనను చాలా ముఖ్యమైన విలువగా భావించుచుండగా శాస్త్రీయ పరముగా ముందుకు వెళుతున్న పాశ్చాత్య సమాజాలలో భౌతిక సంపద విలువకు ప్రాధాన్యత ఎక్కువ. కాని సత్యమును మాటలాడుట, ధైర్యసాహసాలు, తల్లిదండ్రులను గౌరవించుట, మొదలగు అంశములు, విలువలు అన్ని సమాజాలలో శ్రేష్టమైన విలువలుగా గుర్తించబడి ఉంటాయి.

**15.5.3. సాంఘికీకరణ సామాజిక విలువలు :** వ్యక్తి జీవితములో అతిముఖ్యమైన సాంఘికీకరణ ప్రక్రియ యొక్క ముఖ్య ఉద్దేశ్యము సామాజిక విలువలను ఆధారము చేసుకొని వ్యక్తి మూర్తిమత్వమును అభివృద్ధి చేయుట. సంస్కృతి యొక్క నిర్మితి సామాజిక విలువలపై ఆధారపడి ఉంటుంది. అనగా సంస్కృతి నిర్మాణములో విలువలు ఒక ముఖ్యమైన పాత్రను వహిస్తాయి. సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా బిడ్డకు సమాజ సంస్కృతి అందించబడుతుంది.

## 15.6. సారాంశము

సమాజములో క్రమరాహిత్యం ఏర్పడకుండగా సామాజిక వ్యవస్థ చెదరకుండగా సామాజిక వ్యవస్థాపన సజావుగా సాగిపోవలెనంటే సమాజములో నివసిస్తున్న వ్యక్తుల యొక్క ఆలోచనలు ప్రవర్తనలు చర్యలు విధిగా నియంత్రించబడవలెను. ఇది జరగని నాడు సమాజ అవ్యవస్థ తప్పనిసరి అవుతుంది. అందుకనే సామాజికప్రమాణాల ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

## ప్రశ్నలు

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము? (20 మార్కులు)**

1. సామాజిక క్రమతను కాపాడుటలో సామాజిక ప్రమాణాల పాత్రను వివరింపుము?
2. సామాజిక ప్రమాణాలు ఆవశ్యకత ప్రజలు వాటిని గౌరవించుటకు గల కారణాలను వివరింపుము?

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానములు వ్రాయుము (10 మార్కులు)**

1. విలువలు - ప్రాముఖ్యత
2. ప్రమాణాలు - ప్రాముఖ్యత
3. సామాజిక క్రమత - సామాజిక ప్రమాణాలు విలువలు.

*రచయిత :*
**యం.డి. క్రిష్టాఫర్**

## పాఠము - 16

# సామాజిక - అవ్యవస్థ - అర్థము - కారణాలు

## (Social Disorganisation - Meaning - Causes)

16.1. లక్ష్యం

16.2. సామాజిక అవ్యవస్థ - అర్థము

16.3 సామాజిక అవ్యవస్థ - నిర్వచనములు

16.4. సామాజిక అవ్యవస్థ - విధానాలు

16.5. సామాజిక అవ్యవస్థ - కారణాలు

16.6. సారాంశము

### 16.1. లక్ష్యం

ప్రతి సమాజము వ్యవస్థీకృతమైనది. సమాజమునకు ఒక ప్రత్యేక నిర్మితి, ప్రకార్యములు కలిగి ఉండును. సమాజమున సామాజిక మార్పు సర్వసాధారణమైనది ఈ మార్పు అనేక కారణాల ఫలితంగా ఏర్పడును. సమాజమున ప్రతి వ్యక్తి తన తెలివితేటలు, వివేకము ద్వారా అనుకూల వాతావరణములోనేగాక, ప్రతికూల వాతావరణమునకు అనుగుణముగా మారుతూ; తప్పనిసరి అయినపుడు ప్రకృతి పరిస్థితులను, సామాజిక పరిస్థితులతో ఏ విధంగా సర్దుబాటు చేసుకుంటాడో అదే విధంగా సాంస్కృతిక పరిస్థితులు కూడా సర్దుబాటు చేసుకొని జీవించాలి. ఆ విధంగా సర్దుబాటు గుణమును కలిగి ఉండకపోయినచో జీవన మనుగడ కష్టసాధ్యమగును. తత్ఫలితంగా వ్యక్తులలో నిరాశ నిస్పృహలు చోటుచేసుకొని అవ్యవస్థకు దారితీయును. అవ్యవస్థీకృతమైన సమాజము మానవ మనుగడకు ఒక పెద్ద అవరోధముగా ఏర్పడుటయేగాక తమ కనీస బాధ్యతలు నెవవేర్చలేదు. సామాజిక వ్యవస్థాపనలో అనేక అంశములు చేరియుండును. అవి వ్యక్తులను అదుపు చేయుట, నియంత్రణ చేయుటయేగాక సమాజ వికాసానికి తోడ్పడును. ప్రతి సమాజమున వ్యక్తులు నియమ బద్ధమైన జీవనము గడుపుటకు వ్యవస్థాపన ఎంతైనా అవసరము. సమాజమున వాంఛనీయమైన ప్రవర్తనను సమ్మతించేది వ్యవస్థాపన. అవాంఛనీయమైన అంశాలు చోటు చేసుకోవడము ద్వారా అవ్యవస్థాపన చెందును. ఆవిధమైన అవ్యవస్థాపనకు గల కారణాలు, తెలుసుకొనుట ప్రస్తుత పాఠ్యాంశము.

### 16.2. సామాజిక అవ్యవస్థ - అర్థము

మానవుడు సమాజమున కొన్ని లక్ష్యాలను సాధించడానికి వ్యవస్థలను స్థాపిస్తాడు. ఆ వ్యవస్థ నియమ నిబంధనలకు బద్ధుడై వ్యవహరించును. ఈ వ్యవస్థలు తమ సభ్యులు నిర్వహించబోయే చర్యలు లేదా ప్రయోజనాల దృష్ట్యా వారిని సంఘటితపరచి, సమన్వయపరిచి తద్వారా శక్తిని, నియంత్రణను పొందుతాయి. వ్యక్తులు సమాజనియంత్రణకు, అధికారానికి, విలువలకు, కట్టుబడి సర్దుబాటు చేసుకొని జీవించాలి. అలా జరగకపోయినచో మానవుని మనుగడ కష్టసాధ్యమౌతుంది. సంస్కృతికి మానవునికి మధ్య ఏర్పడిన అసమయోజనం (mal adjustment) చరిత్రలో ఎన్నో కష్టనష్టాలకు కారణమైనది. కాని ప్రతి వ్యక్తి సమాజంలో జీవించాలనే ధృడమైన కోరిక ఉండుటచే శరీరబలాన్ని, బుద్ధి బలాన్ని ఉపయోగిస్తూ జీవిత పోరాటంలో విజయాన్ని సాధించడానికి ప్రయత్నాలు సాగించును. ప్రతి వ్యక్తి ప్రేమ, సానుభూతి, సహకారాలతోపాటు మోసము, స్వార్థము, ద్వేషమనే గుణాలను కూడ కలిగియుండుట వలన మానవ మనుగడకు ఎప్పుడో ఒకప్పుడు ముప్పు వాటిల్లే అవకాశముండును. అందుచేత మానవాళి మనుగడ దుర్లభమౌతుంది.

నేటి ఆధునిక సమాజంలో పారిశ్రామికీకరణ (Industrialisation), నగరీకరణ (Urbanisation), పాశ్చాత్యీకరణ (Westernisation) ఆధునికీకరణ (Modernisation) మొదలైన సాంఘిక ప్రక్రియ ద్వారా పరివర్తన చెందుట వలన, సాంస్కృతిక గతివేగం పెరుగుట జరుగుతున్నది. ఈ మార్పులకు అనుగుణముగా మానవుడు సర్దుబాటు చేసుకొనలేక ఎంతో అసమయోజనానికి గురి అగుచున్నాడు. పాత విలువలకు, కొత్త విలువలకు, ప్రాచీన దృక్పధాలకు, సంప్రదాయక విధానాలకు ఆధునిక వర్తనకు మధ్య సాగే తీవ్ర సంఘర్షణకు గురి అవుతున్నాడు. దీని ఫలితంగా అనేక సామాజిక సమస్యలు ఉత్పన్నమై సమాజములో అవ్యవస్థ పరిస్థితులు నెలకొనడం జరుగుతుంది.

## 16.3. సామాజిక అవ్యవస్థ నిర్వచనములు

సమాజములోని ప్రమాణాలు, విలువలు కాలనుగుణంగా మార్పు చెందుట వలనవాటిని మానవుడు అంతర్గతం చేసుకోలేక అలవరచుకొనలేక పోతున్నాడు. తన కోర్కెలు సమాజంలో తీరకపోవటం చేత అవ్యవస్థా పరిస్థితులు ఏర్పడతాయి. సామాజిక అవ్యవస్థనుగురించి అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు అనేక రకములుగా వివరించిరి.

1. ఎలియట్ మరియు మెరిల్ నిర్వచనము (Eliot and Merril) : పాత అలవాట్లు, సామాజిక నియంత్రణ రూపాలు నియత, అనియత, శక్తివంతముగా పనిచేయలేకపోయినపుడు సామాజిక వ్యవస్థ క్షీణించినపుడు, సామాజిక అవ్యవస్థ ప్రస్ఫుట మౌతుంది.

2. మౌరర్ నిర్వచనము : సాంస్కృతిక స్థితిలో వచ్చిన మార్పు సమాజములో సమన్వయ ధోరణులను ప్రతి బంధకంగానో లేదా వినాశకారిగానో ఏర్పడినపుడు సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది.

3. గిల్లన్ మరియు గిల్లిన్ నిర్వచనము : (Gillin G.P. & Gillon J.L) వీరి ఇతర నిర్వచనాలకన్న భిన్నమైనది. వీరి అభిప్రాయము ప్రకారము సంస్కృతిలో వివిధ అంశాలలో ఏర్పడిన తీవ్రమైన అసమయోజనం ఒక సమూహము యొక్క అస్థిత్వానికి ప్రమాదకరంగా తయారు అయినపుడు లేదా వ్యక్తుల మౌలిక సమాజంలో ఏకత్వభావన, ఐక్యత క్షీణించి అవ్యవస్థకు దారితీస్తుంది.

4. మెకైవర్ నిర్వచనము (Maciver) : సమాజమున సామాజిక ప్రమాణాలు, విలువలు పటిష్టంగా ఉన్నంతవరకు వ్యక్తులు నాటి నియంత్రణకు గురై సామాజిక వ్యవస్థాపితమై ఉందురు. అవి లోపించుట వలన సక్రమమైన నియంత్రణలేక అవ్యవస్థాపనకు దోహదము చేయును.

5. జాన్‌సన్ నిర్వచనము (John Son, HM) : సామాజిక అవ్యవస్థాపన విచలిత (devient) ప్రవర్తన వలన ఏర్పడును. ఈ విచలిత సామాజిక నియంత్రణ లోపించుట వలన, వ్యక్తుల మధ్య సంఘీభావము శూన్యమగుట వలన ఏర్పడును.

## 16.4. సామాజిక అవ్యవస్థ - విధానాలు

సామాజిక అవ్యవస్థ పరిస్థితులను మరియు సామాజిక సమస్యలను విచ్ఛిన్న రీతులలో పరిశీలించి అవగాహన చేసుకొనవచ్చును. ఈ పరిస్థితులను ప్రధానముగా నాలుగు విధాలుగా పేర్కొనవచ్చును. అవి 1) సామాజిక సహభాగిత రీతి (Social participation Approach) 2) సాంస్కృతిక సంఘర్షణ రీతి (Cultural Conflict Approach) 3. పరస్పర చర్యరీతి (Intraction Approach) 4. సాంస్కృతిక విశ్లేషణ రీతి (Cultural Analysis Approach).

16.4.1. సామాజిక సహభాగిత రీతి : సామాజిక కార్యకలాపాలలో వివిధ వ్యక్తులు ఉత్సాహమును కనబరచి చొరవగా పాల్గొనేటట్లయితే వైయక్తిత అవ్యవస్థ ఏర్పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. అనగా సామాజిక కార్యకలాపాలలో అతి తక్కువమంది పాల్గొన్నచో ఆ సమాజములో సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుందని పేర్కొనవచ్చును. కాని రాల్ఫ్ లింటన్ (Ralflinton) అభిప్రాయము ప్రకారము వ్యక్తులు సమాజ కార్యకలాపాలలో చొరవగా పాల్గొనడం కన్న సామాజిక సంస్కృతిలోని మౌలిక అంశములను ఎంతవరకు అవగాహన చేసికొని అర్థం చేసుకొన్నారో, అవసరము అయినవానిని జీర్ణించుకొన్నప్పుడే సామాజిక అవ్యవస్థత ఏర్పడునని పేర్కొనెను.

**16.4.2. సాంస్కృతిక సంఘర్షణ రీతి :** సామాజిక సంస్కృతిలోని అసంగతాలు (Inconsistencies) సామాజిక అవ్యవస్థకు దారితీయును; కొంతమంది సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయము. ఆధునిక సమాజములలో భౌతిక సంస్కృతిలో నూతన పరికల్పన (inventions, ప్రభావము వలన శాస్త్రీయ సాంకేతిక ఉత్పత్తి విధానాలలో అనేక మార్పులు ఏర్పడుట చేత అభౌతిక సంస్కృతిలో మార్పులు రాని కారణము చేత విభేదములు ఏర్పడి సామాజిక అవ్యవస్థ పరిస్థితులు వ్యాపించునని ఆగ్‌బర్న్ అభిప్రాయము. అదే విధముగా పాత క్రొత్త సామాజిక రీతుల మధ్య జరిగే సంఘర్షణ వలన సామాజిక సమస్యలు ఏర్పడునని ఫ్రాంక్ (Frank) పేర్కొనెను. కావున సమాజంలో సమూహాలకు ప్రజలకు మధ్య కల సంగతాల (consistency) ద్వారా కూడ సంఘర్షణ ఏర్పడును. సామాజికాభివృద్ది విలువలు సంబంధించి రెండు సమూహాలకు భిన్నమైన, విరుద్ధమైన అభిప్రాయాలు ఉండడమే దీనికి కారణము.

**16.4.3. పరస్పర చర్య రీతి :** సామాజిక అవ్యవస్థకు మరొక ప్రధాన పరిస్థితి పరస్పర చర్యరీతి. బ్రౌన్ (Brown) అభిప్రాయము ప్రకారము మానవ ప్రకృతికి, నైజానికి, సామాజిక వ్యవస్థకు మధ్య జరిగే పరస్పర చర్యల పర్యవసానమే సామాజిక అవ్యవస్థ. ఇతని సిద్ధాంతము ప్రకారము సాధారణ సమాజ వ్యవస్థకు అస్వస్థత సమాజ వ్యవస్థకు కల తేడా వ్యక్తుల యొక్క ప్రత్యేక అనుభవాల పై ఆధారపడి ఉండును.

**16.4.3. సాంస్కృతి విశ్లేషణ రీతి :** రాల్ఫ్ లింటన్ (Ralflinton) అభిప్రాయము ప్రకారము సామాజిక సంస్కృతిని మూడు భాగాలుగా విడదీసి అధ్యయనము చేయవచ్చును. అవి 1) విశ్వజనీన అంశములు 2) ప్రతీకాంశములు 3) ప్రత్యామ్నాయ అంశములు. సమాజములోని వ్యక్తులు అందరికి ఉమ్మడిగా కల భావాలు, అలవాట్లు, ఆచారాలు, సాంప్రదాయాలు, వేషభాషలు, కట్టుబాట్లు, సాంఘిక సంబంధాలు విశ్వజనీయ అంశములు. సమాజములోని ఒక ప్రత్యేక సమూహానికి సంబంధించిన అంశాలను ప్రతీక అంశాలుగా పేర్కొనవచ్చును. సమాజ సభ్యులు అందరిలోను ఇవి కనబడవు. బాగా అభివృద్ధి చెందిన సాంప్రదాయక సమాజములో ఉదాహరణకు కార్మికులు, వడ్రంగి, కుమ్మరిగా పేర్కొనవచ్చును. ప్రత్యామ్నాయ అంశాలు: ఒక సమాజములోని వ్యక్తులు ఒక అవసరాన్ని తీర్చుకొనుటకు లేదా ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొనుటకు ఉపయోగించే ప్రత్యామ్నాయ సాధనాలను లేదా సాంస్కృతిక అంశాల నమూనాలను సాంస్కృతికాంశాలుగా పేర్కొనవచ్చును. వీటి మూలముగా వ్యక్తులలోను, సమూహాలలోను విభిన్నతలు స్పష్టంగా కనిపిస్తాయి. అందుచే వ్యక్తిగత సమస్యలు, సామాజిక సమస్యలు, మరియు సామూహిక సమస్యలు వృద్ధి చెందును. ఈ సమస్యల పర్యవసానమే సామాజిక అవ్యవస్థ.

**16.5. సామాజిక అవ్యవస్థ - కారణాలు :** సామాజిక అవ్యవస్థకు అనేక కారణాలు కలవు. ఒకొక్క సమాజమున ఒక్కొక్క రకమైన కారణాలు ఉండును. ఈ కారణాలు కొన్ని సమాజాలలో ప్రధానంగానూ, మరికొన్ని సమాజాలలో అప్రధానముగాను ఉండునని సమాజ శాస్త్రవేత్తల అభిప్రాయము. ఒక సమాజము యొక్క నైజము, ప్రవృత్తి, నిర్మితి ప్రకార్యములను బట్టి అనేక కారణములను పేర్కొనవచ్చును. ఎలియట్ మరియు మెరిల్ (Elliot & Merrill) తమ సామాజిక అవ్యవస్థ (Social Disorganisation) అనే గ్రంథములో సామాజిక అవ్యవస్థకు నాలుగు ప్రధాన కారణములను వివరించిరి. అవి: 1. సామాజిక ప్రక్రియలు 2. సాంస్కృతిక విలంబనము 3. సంఘర్షణాత్మక దృక్పధాలు, విలువలు మరియు 4. సామాజిక సంక్షోభము.

**16.5.1 సామాజిక ప్రక్రియలు :** సాంఘిక అవ్యవస్థకు ప్రధానంగా తోడ్పడునది సామాజిక ప్రక్రియలు. సామాజిక ప్రక్రియలలో భావప్రసారము (Communication), సంఘర్షణ (conflict), పోటీ (competetion), సహకారము (Co-operation), విలీనీకరణము (Assimilation) ప్రధానమైనవి. ఈ సామాజిక ప్రక్రియల ద్వారా అనేక మార్పులు సమాజమున సంభవించునని పార్క్ మరియు బర్జస్ (Park & Bourges) లు పేర్కొనిరి. ఈ మార్పులు హింసాత్మక రూపములు దాల్చినపుడు, సామాజిక సంస్థలు ఆ విధమైన హింసాత్మక ధోరణులను అరికట్టలేనప్పుడు సామాజిక అవ్యవస్థ ఏర్పడును. సామాజిక ప్రక్రియలలో భాగముగ సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, ప్రక్రియలు కూడ చేరి ఉండును.

**16.5.1.1 సాంస్కృతిక ప్రక్రియలు :** సామాజిక ప్రక్రియలో ఒక భాగమైన సాంస్కృతిక ప్రక్రియలో సమాజములోని వ్యక్తుల నడవడిక, విలువలు, ఆచార్య సాంప్రదాయాలు, కట్టుబాట్లు, విధానాలు, నమూనాలు ఇమిడి యుండును. సంస్కృతి వివిధ జానపద సామాజిక రీతుల రూపములో ఉండి సమాజములోని ఒక తరము నుండి ఇంకొక తరము వారికి సంక్రమించును. ఈ సాంస్కృతిక ప్రక్రియలు తరచు మార్పులకు చేర్పులకు గురి అగుచుండును. అందువలన మారుచున్న విలువలకు, నడవడికలకు అనుగుణముగా సర్దుబాటు చేసికొని

సమూహాలు సముదాయాలు, సామాజిక అస్వస్థతను సృష్టిస్తాయి. ఫలితంగా సాంస్కృతిక సంఘర్షణలకు తోడ్పడతాయి. ఉదాహరణకు భారతదేశమున హిందూ మహమ్మదీయ విభేదాలు, బాబరీమసీదు, రామజన్మభూమికి సంబంధించిన మత కలహాలు ఆఫ్రికాలో శ్వేతజాతివారికి, నీగ్రోలకి మధ్య జరిగే కలహాలను సాంస్కృతిక సంఘర్షణలుగా పేర్కొనవచ్చును.

**16.5.1.2. ఆర్థిక ప్రక్రియ :** సమాజమున అవ్యవస్థకు అసంతృప్తికి, వర్గపోరాటానికి, ఆర్థిక దోపిడికి, అసంతృప్తికి, తద్వారా అవ్యవస్థకు ఆర్థిక ప్రక్రియలు తోడ్పడుచున్నవి. పెట్టుబడి దారి విధానము, వ్యక్తి స్వేచ్ఛా విధానానికి, స్వప్రయోజనమునకు అధిక లాభాలకు అవకాశము ఇచ్చుటచేత అవినీతి మార్గాలద్వారా (ఉదా : చీకటి బజారులో అక్రమ నిల్వలు, తప్పుడు కొలతలు, తూకాలు, కృత్రిమ ధరల పెరుగుదల మొదలైనవి) దేశ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభాన్ని సృష్టించుటయేగాక ప్రజల అవసరాలు తీరక ఉన్నవాడు నానాటికి అభివృద్ధి చెందుచు, లేనివాడు ఆకలి దప్పులతో అలమటిస్తు, పెట్టుబడిదారుల దోపిడీకి గురియై వర్గపోరాటానికి, సంఘర్షణకు అవకాశం ఏర్పడుతున్నది. వీటి ఫలితంగా సమాజమున అరాచక పరిస్థితి ఏర్పడి అవ్యవస్థాపనకు దారితీయును.

**16.5.1.3. రాజకీయ ప్రక్రియ :** సామాజిక అవ్యవస్థకు మరొక ప్రధాన సామాజిక ప్రక్రియ రాజకీయ ప్రక్రియ. సమాజమున శాంతి భద్రతలను పరిరక్షించుటకు, నియంత్రించుటకు, చట్టాలను రూపొందించి వాటిని అమలు పరిచి, ఉల్లంఘించిన శిక్షించి, సామాజిక వ్యవస్థాపనకు పూనుకొనుట రాజ్యాంగ ప్రక్రియ. దీనిలో పాలనా యంత్రాంగము కార్యనిర్వాహక పాత్ర పోషించును. ప్రధానమైన ఆశయము. ఈ విధానమునే రాజకీయ ప్రక్రియగా పేర్కొనవచ్చును. రాజకీయ ప్రక్రియలలో చట్టాలు, శాసనాలు, రూపొందించుట, అమలు చేయుట ఉల్లంఘించిన శిక్షించుట జరుగును. పాలనా యంత్రాంగము, శాసన సభలు, న్యాయస్థానాలు, సామాజిక నియమాలు మొదలైనవి రాజకీయ ప్రక్రియ విధానాలకు తోడ్పడి, నియమబద్ధమైన నాగరికతా ప్రవర్తనను ప్రజలలో పెంపొందించును. అలజడులను తిరుగుబాటులను చట్ట వ్యతిరేకతను, హత్యలను, దోపిడీలను విప్లవాలను అరికట్టును. అవి సమాజ వ్యతిరేక చర్యలుగా సామాజిక అవ్యవస్థకు చిహ్నాలుగా గుర్తించబడును.

**16.5.2. సాంస్కృతిక విలంబనము :** సాంఘిక అవ్యవస్థకు మరొక ప్రధాన కారణము సాంస్కృతిక విలంబనము. సంస్కృతిని హెర్స్కోవిట్స్ (Herskovits) రెండు రకాలుగా విభజించెను. అవి 1) వస్తు పరస్పర సంస్కృతి లేదా భౌతిక సంస్కృతి (Meterial culture) 2. భౌతికేతర సంస్కృతి (Non-Material Culture). భౌతిక సంస్కృతి వస్తు రూపమున ఉదా : వ్యక్తులు ధరించే దుస్తులు, వాడే పనిముట్లు, యంత్ర సామాగ్రి, వాహనాలు, అలంకరణ సామానులు, గృహోపకరణాలు, తినే పదార్థాలు మొదలైనవి. అభౌతిక సంస్కృతి, మత విశ్వాసాలు, ఆచార్య సాంప్రదాయాలు, అలవాట్లు, కట్టుబాట్లు, ప్రమాణాలు, కలలు, దృక్పధాలు, తాత్విక సిద్ధాంతాలు, భాషా భావాలు మొదలైనవి. భౌతికేతర సంస్కృతిలోని భాగాలు భౌతికేతర సంస్కృతి కన్న వేగంగాను, బహుముఖంగాను మార్పు చెందుటచే సంస్కృతిలో విలంబన (Diffusion) ఏర్పడి సామాజిక అవ్యవస్థకు దారితీయునని ఆగ్‌బర్న్ (Ogburn) పేర్కొనెను. ఉదా : యూరప్‌లో పారిశ్రామిక విప్లవము, ఫ్రెంచి విప్లవము, ప్రారంభము కావడంతో సామాజిక ఆర్థిక వ్యవస్థలలో తీవ్రమైన సంచలనము ఏర్పడి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనమై, వ్యష్టి కుటుంబ వ్యవస్థ ఏర్పడటానికి దారితీసెను.

**16.5.3. సంఘర్షణాత్మక దృక్పధాలు, విలువలు :** సాంఘిక అవ్యవస్థకు మరొక ప్రధాన కారణము సంఘర్షణాత్మక దృక్పధాలు, విలువలు. ఆధునిక సమాజాలు, మార్పులకు చేర్పులకు తరచు గురియగుచుండును. ఈ మార్పుల ఫలితంగా వ్యక్తుల మధ్య ఘర్షణ జరుగును. సమాజము ఒక సమస్యకు సంబంధించిన ప్రక్రియ. వ్యక్తి యొక్క కార్యాచరణ దృక్పధము, సామాజిక విలువలపై ఆధారపడి ఉండును. ఈ సామాజిక విలువలు (Social Values) రెండు విధములు అవి. 1) స్వసంబంధమైన విలువలు (Subjective values). 2. వస్తుపరమైన విలువలు (Objective values). సమాజమున ఒకప్పుడు వ్యక్తికి ఉండే స్వసంబంధమైన విలువలకు, మారుచున్న సామాజిక విలువలుకు మధ్య ఘర్షణ జరుగుతుంది. దీనికి ప్రధాన కారణము సమాజము మారినా వ్యక్తులు సమాజము మారినంత త్వరగా మారకపోవడము. ఉదా : ఆధునిక భారతదేశమున అంటరానితనము, వరకట్నము, మదిరావ్యసనము, బూజుపట్టిన సాంప్రదాయాలు నేటికి పూర్తిగా మారకపోవుట. విజ్ఞాన శాస్త్రమున జరిగిన నూతన పరిశోధనలు, సిద్ధాంతాలు మానవుని విశ్వాసాలకు సంబంధించిన ప్రాచీన భావనలను మార్చి వేయును. ఫలితంగా ఆధునీకరణ, విలీనీకరణ, లౌకికీకరణ, పాశ్చాత్యీకరణలకు దోహదపడును. నేటి మానవుడు ప్రకృతి విజేతగా అనగా సృష్టికి ప్రతిసృష్టిగా అనేక విజయాలను శాస్త్రీయ విజ్ఞానముతో సాధిస్తున్నాడు. వీటి మూలముగా నేటి సమాజమున దృక్పధాలలో, విలువలలో అనేక

మార్పులు వైవిధ్యాలు, సమస్యలు పెరిగి అవ్యవస్థా ధోరణులు నానాటికి అభివృద్ధి చెందుచున్నవి. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలలో భావ వైవిధ్యము, ఆచరణ వైవిధ్యము అధికముగా ఉండుట వలన సామాజిక సమస్య నానాటికి అధికమగుచున్నదె కాని తగ్గుట లేదు. ఉదా : సామ్యవాద పెట్టుబడి దారి వర్గాలమధ్య దృక్పధాలలోను, విలువలలోను, వైవిధ్యము హెచ్చుగా ఉండుటవలన సమాజమున అవ్యవస్థాపన కార్యక్రమములు పెరిగిపోవుచున్నవి. ఉదా : బోడో సమస్య, రామజన్మభూమి - బాబరీమసీదు సమస్య, రిజర్వేషన్ల సనుస్య, నక్సలైట్ల ఉద్యమము, జార్ఖండ్ ముక్తి విమోచన ఉద్యమము, కాశ్మీరు సమస్య మొదలైనవి.

**16.5.4. సామాజిక సంక్షోభము :** సాంఘిక అవ్యవస్థకు మరొక ప్రధాన కారణము సాంఘిక సంక్షోభము. ఈ సంక్షోభాలు చెలరేగినపుడు దాని తీవ్రరూపము కనబడును. ఫలితంగా మానవుల అలవాట్లలో ఆచార జీవన విధానాలలో సంచలనము బయలుదేరును. వరదలు, అగ్నిప్రమాదాలు, అరాచక పరిస్థితి, విప్లవాలు, సమ్మెలు, బందులు, నిరసన ప్రదర్శనలు మొదలైనవి సాంఘిక సంక్షోభానికి ఉదాహరణలు. వీటి ఫలితంగా ప్రజల జీవిత సరళిలో నిత్య కార్యక్రమములలో భంగము కలిగి అవ్యవస్థ ఏర్పడును. దీని ఫలితముగా అనేక కష్టనష్టములకు గురికావలసి ఉండును.

## 16.6. సారాంశము :

సామాజిక అవ్యవస్థాపన ప్రతి సమాజమున పైన పేర్కొనబడిన కారణాల ఫలితముగా లేక ఏదో ఒక కారణము ఫలితంగా ఏర్పడును. అవ్యవస్థాపన ఫలితంగా సామాజిక భద్రత లోపించి విభేదీకరణకు, సంఘర్షణలకు అవకాశము కల్పించును. ఏ సమాజమైన వ్యవస్థీకృతమైన నాడే మానవ మనుగడ సులభ సాధ్యము లేనిచో మానవ మనుగడ దుర్లభము, కష్టము. మానవుడు సంఘజీవి. కావున ప్రతి మానవుడు వ్యవస్థీకృత సమాజమున నివసించవలెనని సమాజానికి అనుగుణముగా వ్యవహరించవలెనని భావించును. సామాజిక వ్యవస్థాపన ఆ సమాజములోని వ్యక్తుల ప్రవర్తన బాధ్యతాయుత జీవనము, సమైక్యత, పరస్పర అవగాహన, సుస్థిరమైన సామాజిక నియంత్రణలపై ఆధారపడి యుండును.

### ప్రశ్నలు

1. సామాజిక అవ్యవస్థ అనగానేమి, నిర్వచించి ప్రధాన కారణాలను వివరించుము?
2. సామాజిక అవ్యవస్థ అనగా నేమి నిర్వచించి వివిధ పరిశీలనారీతులను వివరించుము?
3. ఈ క్రింది ప్రశ్నలకు లఘుటీక వ్రాయుము.
   ఎ) సామాజిక సహభాగితి రీతి
   బి) సాంస్కృతిక విలంబనము
   సి) సామాజిక సంక్షోభము
   డి) సాంస్కృతిక ప్రక్రియలు
   ఇ) సంఘర్షణాత్మక దృక్పధాలు - విలువలు

**పాఠము - 17**

# సామాజిక అవ్యవస్థ - రూపాలు

**(FORMS OF SOCIAL DISORGANISATION)**

17.0. లక్ష్యం.
17.1. సామాజిక అవ్యవస్థ - రూపాలు
17.2. కుటుంబ అవ్యవస్థ
17.3. సాముదాయక అవ్యవస్థ
17.4. సారాంశము

## 17.0. లక్ష్యం :

మానవుడు సంఘజీవి. సమాజమున ప్రకృతితో ఏ విధంగ సర్దుబాటు చేసికొనునో అదే విధంగా సాంస్కృతిక అంశాలలో కూడ సర్దుబాటు చేసికొని జీవించవలెను. ఆ విధంగా జీవించక పోయినచో మానవునికి సంస్కృతికి మధ్య అసమయోజనం (Maladjustment) ఏర్పడును. ఆధునిక సమాజములో పారిశ్రామీకరణ (Industrialisation), నగరీకరణ (Urbanisation), ఆధునీకరణ (Moderisation) మొదలగు ప్రక్రియల ద్వారా ఏర్పడిన సామాజిక మార్పు ప్రవర్తనతో సర్దుబాటు చేసుకోలేక విలీనీకరణము (Assimilation) చెందలేక పోవుచున్నాడు. పాతవిలువలకు, క్రొత్తవిలువలకు, ప్రాచీనదృక్పధాలకు, అధునాతన దృక్పధాలకు, సాంప్రదాయ విధానాలకు, ఆధునిక వర్తనకు మధ్య సాగే తీవ్ర సంఘర్షణకు మానవుడు గురియగుచున్నాడు. ఫలితముగ అనేక సమస్యలు ఉత్పన్నమై సమాజములో అవ్యవస్థత పరిస్థితులు ఏర్పడుచున్నవి. ఈ సామాజిక అవ్యవస్థ సమాజములో అనేక రూపాలలో కనిపించుచున్నది.

## 17.1. సామాజిక అవ్యవస్థ - రూపాలు :

సామాజిక అవ్యవస్థ సమాజములో అనేక రూపాలలో కనిపిస్తుంది. ప్రధానంగా దానిని రెండు రూపాలలో పేర్కొనవచ్చును. అవి : 1. కుటుంబ అవ్యవస్థ. 2. సాముదాయక అవ్యవస్థ.

**17.2. కుటుంబ అవ్యవస్థ :** (Family Disorganisation) : ఏ సమాజములోనైనా కుటుంబము ముఖ్యమైన ప్రాథమిక వ్యవస్థ. వివాహముతో కుటుంబము ఏర్పడును. ఈ కుటుంబము ప్రాథమిక అవసరాల ప్రాథమిక వ్యవస్థ. అట్టి కుటుంబాలలో ప్రేమ, అనురాగము, సన్నిహితత్వము మొదలగు దృఢమైన బంధాలు సంబంధాలు కుటుంబ వ్యక్తుల మధ్య ఏర్పడును. కాని కుటుంబ సభ్యుల మధ్య సరియైన అవగాహన సర్దుబాటు లోపించినపుడు గాని, ఎడబాటు సంభవించినపుడు గాని భార్యభర్తల మధ్య విడాకులు ఇచ్చుకొనుట వలన గాని కుటుంబములో అవ్యవస్థ ఏర్పడును.

**17.2.1. కుటుంబవ్యవస్థకు, సామాజిక అవ్యవస్థకు కల సంబంధము :** కుటుంబ అవ్యస్థకు, సామాజిక అవ్యవస్థకు సన్నిహిత సంబంధము కలదు. సమాజములోని సభ్యులు అందరు ఏదో ఒక కుటుంబములో సభ్యులుగా ఉండక తప్పదు. భార్యాభర్తలు కుటుంబ సభ్యులేగాని కాక సమాజసభ్యులుగా అనేక రూపాలలో తమ పాత్రలను సమాజములో నిర్వహిస్తూ ఉందురు. సమాజములో వీరు పొందే అనుభవాలు, అంతస్తు, కష్టసుఖాలు, వారి కుటుంబజీవనములో కూడ ప్రతిబింబిస్తాయి. అంతేకాక వ్యక్తి ఇతర సమూహాలలో ఏ విధముగా ప్రవర్తించాలో, కుటుంబములోని సాంఘికీకరణ ద్వారా నేర్చుకొందురు. కావున కుటుంబము సాంఘికీకరణలో మొదటిది. సామాజిక విలువలు, ప్రమాణాలు మొదలగు వాటిని ప్రతి వ్యక్తి కుటుంబము ద్వారా అభ్యసించును.

17.2.2. కుటుంబములోని భార్యాభర్తల మధ్య ప్రేమ, అనురాగము, సదవగాహన లోపిస్తే కుటుంబ వ్యవస్థ తాత్కాలికంగాను, శాశ్వతంగాను దెబ్బతినే అవకాశం కలదు. కుటుంబ సభ్యుల మధ్య బలహీనతలు ఉండటం, సర్దుబాటు లేకపోవటం, వివాహ సంబంధాలు

తెగిపోవటం మొదలైనవి అవ్యవస్థా లక్షణాలు. ఒక కుటుంబములోని భార్యభర్తల మధ్య, సోదరులమధ్య, అక్కచెల్లెళ్ళ మధ్య, అన్నా, చెల్లెళ్ళు తమ్ముళ్ళ మధ్య, తల్లిదండ్రులు పిల్లల మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడటం కూడ అవ్యవస్థాపరిస్థితులకు దారి తీయును. అనగా సమాజములోని అతి ముఖ్యమైన కుటుంబ వ్యవస్థలో అవగాహన లోపించి విఘాతము ఏర్పడినదని అర్థము.

17.2.3. కుటుంబములోని సభ్యులందరు తమతమ పాత్రలను అంతస్థులకు అనుగుణంగా నిర్వహించకపోయినచో కుటుంబ విచ్ఛిన్నతకు దారితీయును. కొన్ని కొన్ని కుటుంబములలో భర్త హింసించినా, చెడువ్యసనాలు కలిగియున్నా, అతనిపై అనురాగము లేకపోయినా స్త్రీలు ఆర్థిక కారణముల వలన కుటుంబ పరిధిని దాటి బయటకు వెళ్ళలేరు. అనగా స్వతంత్ర ప్రతిపత్తి లేకపోవుట దీనికి ప్రధాన కారణం. కాని ఆధునిక సమాజాలలో పెరుగుచున్న విద్య, ఉద్యోగావకాశాలు, సాంకేతిక అభివృద్ధి, శాస్త్రీయ పరిజ్ఞానము, చట్టపరమైన పరిరక్షణము మొదలగు వాటి ద్వారా స్త్రీకి కొంత ఆర్థిక స్వాతంత్ర్యము వచ్చిన పిల్లల సంక్షేమము, కుటుంబ భద్రత దృష్ట్యా బాహ్యంగా, వ్యవస్థాయుతంగా పటిష్టంగా ఉన్నట్లు కనిపించును. అయినా అంతర్గతంగా అవ్యవస్థ పరిస్థితులుంటాయి. అంతేకాక కొన్ని సమాజాలలో స్త్రీ, పురుషులు కుటుంబ నీతి నియమాలను ఉల్లంఘించి తమలైంగిక వాంఛలను అడ్డదారుల ద్వారా తీర్చుకొంటారు.

17.2.4. కుటుంబమున విభిన్న మనస్తత్వాలు, దృక్పధాలు, అనుభవాలు, వైయక్తిక వైవిధ్యాలు, విలువలు కలిగిన స్త్రీ పురుషులు భార్యాభర్తలుగా కుటుంబ వ్యవస్థలో ప్రవేశిస్తారు. దీనివలన కొన్ని సందర్భాలలో వారి మధ్య అవగాహన లోపించి ఘర్షణ సంభవించే అవకాశము ఉండును. ఈ ఘర్షణ సామాజిక అవ్యవస్థకు దారి తీయును. జీవిత అనుభవాలకు, సాంప్రదాయాలకు సమన్వయము లేనప్పుడు కుటుంబ వ్యవస్థ దెబ్బతినును. ఆధునిక కాలమున విద్యావంతులైన స్త్రీలు ఉద్యోగములు పొంది, పురుషులతో సమానముగా వ్యవహరించ గలుగుతున్నారు. ఫలితంగా, ఆధిపత్యము పూర్తిగా తగ్గిపోకపోయినా విభిన్న దృక్పధాలు, విలువలు, భావాలు పుట్టుకొచ్చాయి. వీటి మధ్య సమన్వయము కుదరకపోవుటతో కుటుంబమున క్రొత్త అవ్యవస్థకు ఆస్కారము ఏర్పడింది. అయినా ఇది తాత్కాలిక పరిణామము.

17.2.5. ఆధునిక సంశ్లిష్ట సమాజములలో స్త్రీ విభిన్న పాత్రలను నిర్వహించుటలో సంఘర్షణ, స్పర్థ, ఆదుర్దా తొందరపాటుతనము మొదలగునవి కలిగి తద్వారా కుటుంబ అవ్యవస్థ ఏర్పడుచున్నది. ప్రధానంగా కుటుంబమున స్త్రీ తల్లిగా, చెల్లిగా, భార్యగా, అక్కగా మాత్రమే గాక ఉద్యోగినిగా, యజమానురాలుగా, సలహాదారులుగా, స్నేహితురాలుగా అనేక పాత్రలను సమర్థవంతంగా పోషించవలసి యున్నది. ఈ పాత్రలన్నింటిని అన్ని రంగాలలోను సక్రమంగా పోషించలేకపోయిన అవకాశాలు సమానంగా లభించకపోయిన మానసిక అసంతృప్తికి గురియై తద్వారా కుటుంబ అవ్యవస్థకు కారకురాలగును. కొన్ని కుటుంబములలో భార్య ఉద్యోగము చేయుట భర్తకు ఇష్టము ఉండదు. కానీ ఉద్యోగము చేయడము తప్పనిసరి అయినప్పుడు గాని, ఉద్యోగము చేయవలెనని పట్టుపట్టడము వలన కాని కుటుంబాలలో అవ్యవస్థ ఏర్పడును. ఈ విధంగా వివిధ సందర్భాలలో కుటుంబము అవ్యవస్థా పరిస్థితులకు కారణమై సామాజిక అవ్యవస్థకు దారి తీయును.

**17.3. సాముదాయక అవ్యవస్థ :** ఇది సామాజిక అవ్యవస్థకు ప్రధాన కారణమని పార్క్ మరియు బర్జెస్ (Park & Burgess) పేర్కొనెను. ఇతని అభిప్రాయములో భౌతికంగా సన్నిహితమైన సామాజిక సంస్థల సమ్మేళనకు సముదాయము. ఒక ప్రత్యేకమైన భౌగోళిక ప్రాంతములో నివసిస్తున్న సమూహానికి గల పరిమితమైన జీవనము గడుపుతున్న జనాభాను, సముదాయముగా పేర్కొనవచ్చును. వార్నర్ మరియు లంట్ (Warner & Lunt) అభిప్రాయము ప్రకారము ఉమ్మడి అభిరుచులు ఒకే వ్యవస్థ కలిగి ఒక ప్రాంతంలో నివసిస్తూ ఒకే చట్టానికి, విధానాలకి కట్టుబడి ఉన్న ప్రజాసమూహమే సముదాయము.

17.3.1. ఒక సముదాయము లోని అవ్యవస్థా ధోరణులను, విచ్ఛిన్నకర ధోరణులను తెలిసికొనుటకు ఆ సముదాయములోని వ్యక్తులలో మధ్యగల పరస్పర సహకారము, సంఘీభావము, ఐక్యత ఏ విధముగ ఉన్నదో ముందుగ తెలుసుకోవాలి. దీనిని ఎలియట్ మరియు మెరిల్(Elliot & Merril) ఈ విధముగ పేర్కొనెను. "సముదాయము శక్తివంతముగ నడవడమనేది ఉమ్మడి కోరికలు ఉద్దేశాలను గూర్చి వ్యక్తులు చేసే సహకార ప్రయత్నాలు సర్వజన సమ్మతమైన కార్యకలాపాలను బట్టి ఉండును. సమిష్టి ఉద్దేశాలను సహకార ప్రయత్నాల ద్వారా సాధించినప్పుడు సాముదాయక సామర్థ్యము ఏర్పడుతుంది. కాని స్థానిక ప్రకటనలు సాముదాయక సంక్షేమ కార్యకలాపాల పట్ల సరియైన అవగాహన, శ్రద్ధలేనిచో సముదాయములో అవ్యవస్థా పరిస్థితులు ఏర్పడే అవకాశము ఎక్కువగా ఉండును. అనగా వ్యక్తులలో స్వార్థం పెరిగినప్పుడు సమాజమున ఆశ్రిత పక్షపాతము మితిమీరిన వ్యక్తులు కేవలం తమతమ వర్గాల వారి సంక్షేమం కొరకే పాటుపడుచున్నప్పుడు వ్యక్తి ప్రయోజనాలకు, సామాజిక ప్రయోజనాలకు సమన్వయము కుదరక రెండిటి మధ్య వైరుధ్యము ఏర్పడినప్పుడు సమాజములోని వ్యక్తులు సామాజిక నియమ నిబంధనలను అతిక్రమించి అరాచకంగా వ్యవహరిస్తారు. ఈ అరాచక స్థితి ఫలితముగ

సామాజిక అవ్యవస్థాపన ఏర్పడును. కావున వ్యక్తులు చిత్తశుద్ధితో సామాజిక విధులను, కర్తవ్యాలను నిర్వహించిన అట్టి స్థితిలో సముదాయమున అవ్యవస్థ ఏర్పడదు.

17.3.2. భారత దేశమున గ్రామీణ సముదాయాలలో కన్పించే దృక్పధము బ్రిటీషు వారి పరిపాలనా ఫలితమే. పంచాయితీ, జమీందారి వ్యవస్థలు రద్దు కావటము, నూతన విద్యా విధానము, నూతన న్యాయ వ్యవస్థ, శాస్త్రీయ విజ్ఞానం, హెచ్చుగా పెరుగుచున్న దారిద్ర్యము ఈ విధమైన దృక్పధాలకు ముఖ్య కారకాలు. నైతిక విలువలు పతనం కావటం, స్వార్థ అనైతిక విధానము, ధోరణులు పెరగటం, వ్యక్తుల సామాజిక అంతస్తులో పాత్రలలోను, వర్గాలలోను వ్యత్యాసము కలిగి ఉండటము వలన నగర ప్రాంతాలలో సాముదాయక అవ్యవస్థ మరింతగా ప్రబలుతుంది. వివిధ వర్గాల ప్రజలు సాముదాయక కార్యక్రమాలలో ఒకే రకంగా పాల్గొనకపోవడం వల్ల సాముదాయక అవ్యవస్థ ఉత్పన్నమగును.

17.3.3. ప్రతి సమాజము సామాజిక మార్పునకు గతిశీలతకు లోనగుచుండును. గతిశీలతకు సాముదాయక అవ్యవస్థకు సన్నిహిత సంబంధము కలదు. ఒక సముదాయములోని వ్యక్తుల మధ్య ఉన్న ఐక్యత భావన వారి గతిశీలత శాతముపై ఆధారపడి ఉండును. వ్యక్తి ఒక సముదాయములో సభ్యుడిగా ఉన్నప్పుడే ఆ సమూహముతో అతనికి సన్నిహిత సంబంధాలు ఏర్పడును. ఆ విధముగా కాక ఒక సముదాయము నుండి మరొక సముదాయమునకు తరుచు తరలి పోతున్నప్పుడు అనగా వలసపోవుట వలన అతని సామూహిక సంబంధాలలో శూన్యత స్తంభవ ఏర్పడుతుంది. దాని ఫలితముగ ఆ వ్యక్తి యొక్క స్థాన చలనము, సత్సంబంధాలను తెంచివేస్తుంది. అందుచేత సాముదాయక అవ్యవస్థ ఏర్పడును.

17.3.4. సామాజిక గతిశీలత సాధారణంగా గ్రామీణ సముదాయాలలో కన్న నగర సముదాయాలలో ఎక్కువగా కన్పించును. దీనికి ప్రధాన కారణము నగర సముదాయాలలో పారిశ్రామికీకరణ (Industrialisation) ఎక్కువగా ఉండుటచే శ్రమవిభజన (Division of Labour), విశిష్టీకరణము (Specialisation) ఎక్కువగా ఉండుటవలన ఒక పనిలో వృత్తిలో నైపుణ్యము కలవారు మాత్రమే ఒక నగర సముదాయమున ఉండి మరొక నగర సముదాయానికి తరలి పోవుదురు. మొదట వీరు అపరిచితులుగ ప్రవేశించి చివరివరకు అపరిచితులుగాను, ప్రవాసులుగాను ఉండిపోదురు. వీరు స్థానిక పౌర సమస్యలలో ఎక్కువ ఆసక్తిని చూపరు. అనగా నూతన సముదాయానికి చెందిన వారమనే భావన వీరిలో ఉండదు. తమకు తామే పరాయి వారుగా భావించుకుందురు. ఇట్టి పరిస్థితి సాముదాయక అవ్యవస్థకు దారితీయును. ఆధునిక పారిశ్రామిక పెద్ద పెద్ద నగరాలలో కదలిక గతిశీలత ఎక్కువగా ఉండును. వ్యక్తుల రాకపోకలు ఈ నగరాలలో అనేక సమస్యలను సృష్టిస్తాయి. గతిశీలత కదలికల వలన అవసరాలను తీర్చుకొనుటలో నగరంలోని సాముదాయక వ్యవస్థను భంగపరచడం వలన వ్యభిచారము, జూదము, త్రాగుబోతుతనము, నేరాలు మొదలగునవి బయలుదేరి వాటి ఫలితముగా సాముదాయక అవ్యవస్థ అనేక రీతులలో కన్పించును.

## 17.4. సారాంశం

సామాజిక అవ్యవస్థలో ప్రధాన రూపాలు కుటుంబ అవ్యవస్థ, సాముదాయక అవ్యవస్థవి. టితోపాటు వ్యక్తిగత అవ్యవస్థ కూడ ఉండును. సాంఘిక వ్యక్తిగత అవ్యవస్థ ఆచార సాంప్రదాయాలు సన్నగిల్లుట వలన, వ్యవస్థలు సమూహాలు సంఘాల నియంత్రణ లేకపోవుట, వలన సంభవించును. వివిధ రూపాలైన సామాజిక అవ్యవస్థ, నిరుద్యోగ సమస్య, కుటుంబ అవ్యవస్థీకరణ, పేదరికము, నేరము జాతిపరమైన విభేదాలు, శ్రామిక సమస్యలు ఫలితముగ ఏర్పడును.

## ప్రశ్నలు

1. సామాజిక అవ్యవస్థ అనగానేమి? అందలి ప్రధాన రూపాలను వివరించుము?
2. సామాజిక అవ్యవస్థ కుటుంబ అవ్యవస్థ, సాముదాయక అవ్యవస్థ ఎంత వరకు కారణము వివరించుము?
3. ఈ క్రింది వాటికి లఘుటీక వ్రాయుము

ఎ) కుటుంబ అవ్యవస్థ - కారణాలు - ఫలితాలు.

బి) సాముదాయ అవ్యవస్థ స్వభావము

సి) పారిశ్రామికీకరణ, నగరీకరణ

తగ్గినది. అందుచేత ప్రభుత్వము, చట్టాలు, పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, సాంఘిక నియంత్రణ సాధనాలుగా వున్నాయి. సామాజిక నియంత్రణ ప్రమాణాలు చట్టబద్ధమైనా, చట్టబద్ధము కాక పోయినా సమాజ ఆమోదము ఉండుట వలన శక్తివంతముగా వుంటాయి.

ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకుంటే సకారాత్మక ఆమోదం, వ్యతిరేకంగా నడుచుకుంటే నకరాత్మక ఆమోదం సమాజం నుంచి స్వీకరించవలసి ఉంటుంది. సకారాత్మక ఆమోదం సాధారణంగా మెచ్చికోలు నుంచి గొప్ప సన్మానం వరకు ఉంటే; నకారాత్మక ఆమోదం సాధారణ ఆక్షేపణ నుంచి ఉరి శిక్ష వరకు వుంటుంది. మానవ ప్రవర్తన అంతా లాంఛనీయప్రాయం చేసి, అనుబద్ధ సామాజిక నియంత్రణ ద్వారా వ్యక్తిని అదుపులో ఉంచటం సాధ్యం కాని పని. కేవలం కొంత వరకు మాత్రం సాంఘిక ప్రవర్తన అనుబద్ధ నియంత్రణ ద్వారా అదుపు చేయబడితే మిగిలినదంతా అసంబద్ధ సామాజిక నియంత్రణ ద్వారా క్రమ పరచబడుతుంది.

ఉత్తమమైన ప్రజాహిత కార్యక్రమాలు చేయడం ద్వారా ప్రభుత్వ సత్కారం పొందడం, దొంగతనము చేసి కారాగార శిక్ష అనుభవించడం, అనుబద్ధ సామాజిక నియంత్రణకు ఉదాహరణగా చెప్పవచ్చును. ఇరుగు పొరుగుతో మర్యాద పూర్వకముగా స్నేహబద్ధంగా వుంటే వారి వద్ద నుంచి కూడా గౌరవం సహాయం ఉంటాయి అలా లేక వారితో కఠినంగా వ్యవహరిస్తే వారి నుంచి ప్రతికూలాన్ని నిరసనను ఎదుర్కోవలసి వస్తుంది. అటువంటి ప్రవర్తన వున్న వ్యక్తి తన ప్రవర్తన మార్చుకొనెలా ఆ వ్యక్తిపై సమాజం వత్తిడి తీసుకొని రావడం అసంబద్ధ సామాజిక నియంత్రణ అవుతుంది. అసంబద్ధ సామాజిక నియంత్రణలో ప్రమాణాలకు వ్యతిరేకంగా ప్రవర్తించే వ్యక్తికి దండన గాని, శిక్షగాని వుండదు. కాని అతను తోటి వ్యక్తుల నిరసనను, ప్రతికూలతను ఎదుర్కోవసి వస్తుంది. ఉదా : ఒక వ్యక్తి మరో వ్యక్తి కరచాలనానికి కుడిచేయి బదులు ఎడమచేయి అందిస్తే అందుకు శిక్షగాని, దండనగాని వుండదు. కాని అలా చేసిన వ్యక్తి ఎదుట వ్యక్తుల నిరసనకు గురికావలసి వస్తుంది.

చాలా వరకు వ్యక్తి తన ప్రవర్తనపై తనకై తాను నియంత్రణ విధించుకోవడం ద్వారా సామాజిక నియంత్రణ కొనసాగుతుంది. సాంఘికీకరణలో భాగంగా సమాజంలోని సభ్యుడు ఆ సమాజంలోని విలువలను, ప్రమాణాలను, కట్టుబాట్లను గుర్తించి వాటి అంతర్గతీకరించు కుంటాడు. ఈ విలువలు కట్టుబాట్లు ప్రమాణాలు పాటించనప్పుడు ఆ వ్యక్తి ఇతరులతో ప్రమేయం లేకుండా తనంతట తాను అపరాధ భావనకు లోనవుతాడు. దీనినే స్వయం నియంత్రణగా పేర్కొనవచ్చును. సామాజిక నియంత్రణ బాహ్యమైంది కాగా స్వయం నియంత్రణ అంతర్గతమైంది.

సాంఘిక నియంత్రణకు ఉపయోగించే ఏజన్సీలు సాధనాలు అన్ని సమాజాలలో ఇంచుమించు ఒకటే అయినప్పటికి వీటిని ఉపయోగించే విధానం, విస్తృతి, పరిధి సమాజాన్ని బట్టి వేర్వేరుగా ఉంటాయి. సంక్లిష్టంగాని గ్రామీణ సమాజాలు చిన్న సమాజాలలో ఎక్కువగా అసంబద్ధ విధానాలైన సాంప్రదాయము ఆచారాలు, విలువలు వ్యక్తి నియంత్రణ తోడ్పడతాయి. సంక్లిష్టమైన సమాజంలలో పెద్ద సమాజంలలో వ్యవస్థీకృతమైన నియమాలు, చట్టాలు, పోలీసు, న్యాయ వ్యవస్థలు వంటి సంస్థల ద్వారా నియంత్రణ జరుగుతుంది.

## 18.1. సామాజిక నియంత్రణ అర్థ వివరణ (Meaning) :

సమాజంలోని సభ్యుల ప్రవర్తన సాంఘికంగా ఆమోదకరమైన రీతిలో వుండేందుకు ప్రతి సమాజం సాంఘిక నియంత్రణ సాధనాలను ఏర్పరచుకుంటుంది. ఈ సాంఘిక నియంత్రణ సాధనాలు అనుబద్ధ లేదా అసంబద్ధ నియంత్రణ విధానాల ద్వారా మరియు పరోక్ష, ప్రత్యక్ష సామాజిక నియంత్రణ ద్వారా వాటి విస్తృతి పరిధిని బట్టివుంటాయి. దీనినే సామాజిక నియంత్రణ అని అందురు.

## 18.2. నిర్వచనాలు (Definitions) :

సామాజిక నియంత్రణను నిర్వచించడం చాలా కష్టతరమైనప్పటికి అనేకమంది శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

1. అగ్‌బర్న్ & నిమ్‌కాఫ్ : వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయటంలో సమాజం చేసే వత్తిడిని సామాజిక నియంత్రణ.

**పాఠము : 18**

# సామాజిక నియంత్రణ - అర్థము - రూపాలు

## (SOCIAL CONTROL : MEANING, DEFINITIONS AND FORMS)


18.0 లక్ష్యం

18.1 సామాజిక నియంత్రణ - అర్థవివరణ

18.2 నిర్వచనములు

18.3 సామాజిక నియంత్రణ రకాలు

18.4 సామాజిక నియంత్రణ-స్వయం నియంత్రణ

18.5 సామాజాకి నియంత్రణ - సాంఘికీకరణ

18.6 సారాంశం


## 18.0 లక్ష్యం

ప్రతి సమాజంలో వ్యక్తులు సుఖశాంతులతో జీవించుటకు, సమాజ పురోభివృద్ధికి సమాజంలో శాంతితో బాటు క్రమత అవసరం. సమాజంలో క్రమత పెంపొందించట ద్వారా సుస్థిర మనుగడను సాధించడానికి సమాజం, వ్యక్తులు ఆది నుండి ఎంతో కృషి చేయడం జరుగుతుంది. అలా లేనట్లయితే సమాజం అస్థవ్యస్థంగా వుండి అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. సహజంగా మానవుడు స్వేచ్ఛా జీవి మరియు స్వార్థజీవి. అందుచేత ఇష్టంగా ప్రవర్తించటానికి, కోర్కెలను తీర్చుకోడానికి ప్రయత్నిస్తుంటాడు. జీవితో సమాజం అవ్యవస్థీకృతంగా తయారౌతుంది. ఈ సమస్యల పరిష్కారానికి, సమాజాన్ని క్రమ పద్ధతిలో పెట్టడానికి వ్యక్తుల ప్రవర్తనను అదుపులో పెట్టడానికి పద్ధతులను అనుసరిస్తుంది. ఉదా : రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు వాళ్లకు ఇష్టం వచ్చినట్లు ప్రయాణం చేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది. అందుచేత ట్రాఫిక్ నియమ నిబంధనలను ఏర్పరచి ప్రమాదాలను నివారించవచ్చును.

ఆధునిక సమాజంలో సామాజిక నియంత్రణ యొక్క అవసరము ప్రాధాన్యత ఎంతైన ఉంది. అటువంటి పరిస్థితులలో వ్యక్తులు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించినట్లయితే అశాంతి, ఆందోళన ఏర్పడుతుంది. అందుచేత ప్రతి సమాజం సామాజిక రీతులలో ఏదో ఒక రకంగా అమలు చేస్తుంది. భారతీయ సమాజంలో కూడా అనాది నుండి నేటి వరకు ఏదో ఒక రూపంలో సాంఘిక నియంత్రణ జరుగుతునే ఉంది. ఉదా : వ్యక్తి బాల్యవ్యవస్థలో తల్లిదండ్రుల నియంత్రణలోను యుక్తవయస్సులో, తోటి సమాజ సభ్యుల, ఆచార సాంప్రదాయ, మతపరమైన ప్రభుత్వ శాసాలు, చట్టాలు యొక్క నియంత్రణలోను వృద్ధాప్యంలో పిల్లల యొక్క నియంత్రణ లోను వుంటారు.

మొట్టమొదటిసారిగా సామాజిక నియంత్రణ అనే పదము 1894 వ సంవత్సరములో స్మాల్ (Small) విన్సెంట్ (Wincent) అనే శాస్త్రవేత్తలు తమ "ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ సొసైటీ" అనే గ్రంథంలో వాడిరి. ఆ తరువాత సామాజిక నియంత్రణ గూర్చి విశేషమైన కృషి ఇ.ఎ. రాస్‌తో ప్రారంభమైనది. తరువాత అనేక మంది శాస్త్రవేత్తలు సామాజిక నియంత్రణ గూర్చి వివరించిరి. ఇ.సి. హేస్ సామాజిక నియంత్రణను అధికారపూర్వక నియంత్రణ, అనుకరణ పూర్వక ప్రతీకాత్మక నియంత్రణ అని విభజించాడు. ఫ్రెడరిక్ ఇట్లామ్లి సామాజిక నియంత్రణా పద్ధతుల్ని బల ప్రయోగ పద్ధతులు, ప్రతీక పూర్వక పద్ధతులని వివరించాడు. లూథర్ యల్. బెర్నాడ్ : నకారాత్మక, సకారాత్మక పద్ధతులని రెండు తరహాలుగా విభజించాడు.

పూర్వకాలంలో వ్యక్తుల సామాజిక నియంత్రణకు మతము, గోత్రము, ప్రముఖ నాయకులు సాధనాలుగా వుండేవి. కాని పారిశ్రామికాభివృద్ధి జరిగిన తరువాత ప్రజల ఆచార వ్యవహారాలలో జీవన విధానంలోను చాలా మార్పు వచ్చింది. మతము యొక్క ప్రాముఖ్యము

తగ్గినది. అందుచేత ప్రభుత్వము, చట్టాలు, పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, సాంఘిక నియంత్రణ సాధనాలుగా వున్నాయి. సామాజిక నియంత్రణ ప్రమాణాలు చట్టబద్ధమైనా, చట్టబద్ధము కాక పోయినా సమాజ ఆమోదము ఉండుట వలన శక్తివంతముగా వుంటాయి.

ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకుంటే సకారాత్మక ఆమోదం, వ్యతిరేకంగా నడుచుకుంటే నకరాత్మక ఆమోదం సమాజం నుంచి స్వీకరించవలసి ఉంటుంది. సకారాత్మక ఆమోదం సాధారణంగా మెచ్చికోలు నుంచి గొప్ప సన్మానం వరకు ఉంటే; నకారాత్మక ఆమోదం సాధారణ ఆక్షేపణ నుంచి ఉరి శిక్ష వరకు వుంటుంది. మానవ ప్రవర్తన అంతా లాంఛనీయప్రాయం చేసి, అనుబద్ధ సామాజిక నియంత్రణ ద్వారా వ్యక్తిని అదుపులో ఉంచటం సాధ్యం కాని పని. కేవలం కొంత వరకు మాత్రం సాంఘిక ప్రవర్తన అనుబద్ధ నియంత్రణ ద్వారా అదుపు చేయబడితే మిగిలినదంతా అసంబద్ధ సామాజిక నియంత్రణ ద్వారా క్రమ పరచబడుతుంది.

ఉత్తమమైన ప్రజాహిత కార్యక్రమాలు చేయడం ద్వారా ప్రభుత్వ సత్కారం పొందడం, దొంగతనము చేసి కారాగార శిక్ష అనుభవించడం, అనుబద్ధ సామాజిక నియంత్రణకు ఉదాహరణగా చెప్పవచ్చును. ఇరుగు పొరుగుతో మర్యాద పూర్వకముగా స్నేహబద్ధంగా వుంటే వారి వద్ద నుంచి కూడా గౌరవం సహాయం ఉంటాయి అలా లేక వారితో కఠినంగా వ్యవహరిస్తే వారి నుంచి ప్రతికూలాన్ని నిరసనను ఎదుర్కోవలసి వస్తుంది. అటువంటి ప్రవర్తన వున్న వ్యక్తి తన ప్రవర్తన మార్చుకొనేలా ఆ వ్యక్తిపై సమాజం వత్తిడి తీసుకొని రావడం అసంబద్ధ సామాజిక నియంత్రణ అవుతుంది. అసంబద్ధ సామాజిక నియంత్రణలో ప్రమాణాలకు వ్యతిరేకంగా ప్రవర్తించే వ్యక్తికి దండన గాని, శిక్షగాని వుండదు. కాని అతను తోటి వ్యక్తుల నిరసనను, ప్రతికూలతను ఎదుర్కోవసి వస్తుంది. ఉదా : ఒక వ్యక్తి మరో వ్యక్తి కరచాలనానికి కుడిచేయి బదులు ఎడమచేయి అందిస్తే అందుకు శిక్షగాని, దండనగాని వుండదు. కాని అలా చేసిన వ్యక్తి ఎదుట వ్యక్తుల నిరసనకు గురికావలసి వస్తుంది.

చాలా వరకు వ్యక్తి తన ప్రవర్తనపై తనకై తాను నియంత్రణ విధించుకోవడం ద్వారా సామాజిక నియంత్రణ కొనసాగుతుంది. సాంఘికీకరణలో భాగంగా సమాజంలోని సభ్యుడు ఆ సమాజంలోని విలువలను, ప్రమాణాలను, కట్టుబాట్లను గుర్తించి వాటి అంతర్గతీకరించు కుంటాడు. ఈ విలువలు కట్టుబాట్లు ప్రమాణాలు పాటించనప్పుడు ఆ వ్యక్తి ఇతరులతో ప్రమేయం లేకుండా తనంతట తాను అపరాధ భావనకు లోనవుతాడు. దీనినే స్వయం నియంత్రణగా పేర్కొనవచ్చును. సామాజిక నియంత్రణ బాహ్యమైంది కాగా స్వయం నియంత్రణ అంతర్గతమైంది.

సాంఘిక నియంత్రణకు ఉపయోగించే ఏజన్సీలు సాధనాలు అన్ని సమాజాలలో ఇంచుమించు ఒకటే అయినప్పటికి వీటిని ఉపయోగించే విధానం, విస్తృతి, పరిధి సమాజాన్ని బట్టి వేర్వేరుగా ఉంటాయి. సంక్లిష్టంగాని గ్రామీణ సమాజాలు చిన్న సమాజాలలో ఎక్కువగా అసంబద్ధ విధానాలైన సాంప్రదాయము ఆచారలు, విలువలు వ్యక్తి నియంత్రణ తోడ్పడతాయి. సంక్లిష్టమైన సమాజంలలో పెద్ద సమాజంలలో వ్యవస్థీకృతమైన నియమాలు, చట్టాలు, పోలీసు, న్యాయ వ్యవస్థలు వంటి సంస్థల ద్వారా నియంత్రణ జరుగుతుంది.

## 18.1. సామాజిక నియంత్రణ అర్థ వివరణ (Meaning) :

సమాజంలోని సభ్యుల ప్రవర్తన సాంఘికంగా ఆమోదకరమైన రీతిలో వుండేందుకు ప్రతి సమాజం సాంఘిక నియంత్రణ సాధనాలను ఏర్పరచుకుంటుంది. ఈ సాంఘిక నియంత్రణ సాధనాలు అనుబద్ధ లేదా అసంబద్ధ నియంత్రణ విధానాల ద్వారా మరియు పరోక్ష, ప్రత్యక్ష సామాజిక నియంత్రణ ద్వారా వాటి విస్తృతి పరిధిని బట్టివుంటాయి. దీనినే సామాజిక నియంత్రణ అని అందురు.

## 18.2. నిర్వచనాలు (Definitions) :

సామాజిక నియంత్రణను నిర్వచించడం చాలా కష్టతరమైనప్పటికి అనేకమంది శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

1. ఆగ్‌బర్న్ & నిమ్‌కాఫ్ : వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయటంలో సమాజం చేసే వత్తిడిని సమాజిక నియంత్రణ.

2. మాన్ హేమ్ : క్రమ బద్ధతను కాపాడుటకు, మానవ ప్రవర్తనను ప్రభావితం చేయడానికి సమానంగా ఉపయోగించె పద్ధతులు సామాజిక నియంత్రణ.

3. మెకైవర్ & పేజ్ : సామాజిక క్రమత పొందికతో నిలిచి మనుగడ సాగించడానికి సామాజిక నియంత్రణ పద్ధతులు అవసరము.

4. కిమ్ బాల్ యంగ్ : సమాజంలో ఐక్యతా స్థితిని సుస్థిరతను అవిచ్ఛినంగా కొనసాగే పరిస్థితిని పెంపొందిచడమే సామాజిక నియంత్రణ యొక్క ప్రధాన లక్ష్యము.

5. రోసెక్ : ఏ పద్ధతులు ద్వారా వ్యక్తులు సామాజిక విలువలను అలవాట్లను జీవన విధానాన్ని అలవర్చుకుంటారో ఆ పద్ధతుల మొత్తమె సామాజిక నియంత్రణ.

## 18.3. సామాజిక నియంత్రణ లక్షణాలు :

**18.3.1. ప్రత్యక్ష సామాజిక నియంత్రణ (Direct Social Control) :** ఈ పద్ధతిలో దగ్గరగా నివసించే వ్యక్తుల ప్రతి క్రియలను నియంత్రించడము జరుగుతుంది. ఈ విధమైన నియంత్రణలో కుటుంబము, ఇరుగుపొరుగు వారు, ప్రాథమిక సమూహాలు ఈ పద్ధతి క్రిందకు వస్తారు. వ్యక్తి సహజముగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆట సమూహాలలోని స్నేహితులు చెప్పే విషయాలు ద్వారా గాని, పొగడడం ద్వారా గాని, నమ్మించటం ద్వారా గాని తిట్టడం ద్వారాగాని వ్యక్తి ప్రవర్తనను అదుపులో ఉంచుతారు. ఈ విధమైన నియంత్రణను ప్రత్యక్ష సామాజిక నియంత్రణ అని అందురు.

**18.3.2. పరోక్ష సామాజిక నియంత్రణ (Indirect Social Control) :** ఈ విధమైన పరోక్ష సామాజిక నియంత్రణ సహజముగా సమూహాలలో జరుగుతుంది. ఈ పద్ధతిలో వ్యక్తిని భౌతికంగా దూరంగా మున్న కొన్ని పద్ధతుల ద్వారా అతని ప్రవర్తన నియంత్రణ చేయడం జరుగుతుంది. ఈ విధమైన నియంత్రణ సాధనాలలో సాంప్రదాయాలు, సంస్థలు, ఆచారాలు, రాజ్యము, చట్టము, మొదలైన వాటిని పేర్కొనవచ్చును. ఈ పద్ధతిలో వ్యక్తులకు ప్రాధాన్యత లేకుండా సూక్ష్మమైన పద్ధతుల ద్వారా నియంత్రించడం జరుగుతుంది.

**18.3.3. అనుకూల సామాజిక నియంత్రణ (Positive Social Control) :** ప్రతిఫలాలు, బహుమతులు వ్యక్తులను అమితంగా ప్రభావితం చేస్తాయి. సమాజంలో ఎక్కువ మంది తమకు మంచి గౌరవం రావాలని, ఎక్కువ మంది తమని మెచ్చుకోవాలని కోరుకుంటారు. ఈ కారణంగా వారు సమాజంలో నున్న సాంప్రదాయాలను, ఆచారాలను, విలువలను, ఆదర్శాలను అనుకరించడానికి ప్రయత్నిస్తారు. అనేకమంది సభ్యులు సమాజంలో ఆమోదం పొందిన ప్రమాణాలను అనుకరించక పోతే వారికి గౌరవం ఉండదని గుర్తిస్తారు. ఈ విధముగా సభ్యులు సామాజిక ప్రమాణాలను అనుకరించినట్లయితే వారికి సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటాయి. దీనిని అనుకూల సామాజిక నియంత్రణ అని అందురు.

**18.3.4. ప్రతికూల సామాజిక నియంత్రణ (Negative Social Control) :** ఈ పద్ధతిలో కొన్ని పనులు చేసినట్లయితే శిక్షార్హులవుతారని బెదిరించడము జరుగుతుంది. సమాజం మంచి పనులు చేసే వ్యక్తులను గౌరవిస్తుంది. ఆ విధంగానే సమాజానికి వ్యతిరేకంగా, వనరుల దుర్వినియోగానికి పాల్పడితే శిక్షించడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో వారు చేసే తప్పిదమును బట్టి శిక్షను నిర్ణయించడం జరుగుతుంది. కొన్ని శిక్షలు శబ్దపరంగాను, మరికొన్ని భౌతిక రూపంలోనూ ఉంటాయి. శబ్దపరమైన శిక్షను మాటలతో దండించడం జరుగుతుంది. వెక్కిరించడం, పరిహాసముగా మాట్లాడటము మొదలైనవి ఉంటాయి. ఈ శిక్షల యందు భయం, వ్యక్తులు సామాజికంగా ఆమోదించబడిన సాంప్రదాయాలు చట్టాలలో విలువలు, ఆదర్శాలు, ఉల్లంఘించకుండా ఉంటానికి సహాయపడుతుంది.

**18.3.5. నియత సామాజిక నియంత్రణ (Formal Social Control) :** నియత సామాజిక నియంత్రణా పద్ధతిలో ప్రభుత్వము, చట్టము, పోలీసు వ్యవస్థ సైనిక వ్యవస్థ, పీనల్ కోడ్ మొదలైనవి ఉంటాయి. సమాజాన్ని నియంత్రణ చేయడానికి సమాజాన్ని అదుపులో ఉంచి సక్రమమైన మార్గంలో నడిపించటానికి ప్రజలకు శాంతియుత సహజీవనాన్ని అందించటానికి ప్రస్తుత సమాజంలో వీటి ప్రాముఖ్యత బాగా కనపడుతుంది.

**18.3.6. అనియత నియంత్రణ (Informal Social Control) :** అనియత సామాజిక నియంత్రణా సాధనాలు నిర్దిష్టంగా తయారు చేయబడినవి కావు. అవి ఏ ప్రభుత్వము చేత అమలు చేయబడవు. అంటే చట్టబద్ధమైనవి కావు. అంతేకాక ఎక్కడా కూడా లిఖిత పూర్వకంగా వుండవు. సమాజంలో ఇవి ఇమిడిపోయి ఉంటాయి. సమాజంలోని వ్యక్తుల జీవన విధానంలో ఈ నియంత్రణ సాధనాలు అనేక రూపాలలో కనపడతాయి. ఉదా : జానపద రీతులు, సామాజిక రీతులు, ఆచారాలు, మతము, కళలు, సాహిత్యం, ప్రజాభిప్రాయం మొదలైన రూపాలలో వుంటాయి. వీటికి వ్యతిరేకంగా ప్రవర్తించి వారికి చట్టబద్ధమైన శిక్షలు ఏమి ఉండవు. కానీ తోటి వ్యక్తుల నిరసన ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే వ్యక్తులు సమాజ ఆమోదమైన కార్యక్రమాలు చేసి ఇతరుల మెప్పు పొందుటకు ప్రయత్నిస్తుంటారు.

## 18.4. సామాజిక నియంత్రణ-స్వయం నియంత్రణ:

చాలా వరకు సామాజిక నియంత్రణ వ్యక్తి తనపై తాను నియంత్రణ విధించుకోవడం ద్వారా కొనసాగుతుంది. వ్యక్తి సామాజిక ప్రమాణాల విలువలను అంతర్గతీకరించుకుంటాడు. వీటికి భిన్నంగా ప్రవర్తించినప్పుడు తనకై తాను అపరాధన భావనకు లోనౌతాడు. ఈ విధంగా వ్యక్తులు తమ ప్రవర్తనపై నియంత్రణను నిర్వహిస్తారు. ఇది అంతర్గత నియంత్రణ. సమాజంలోని వ్యక్తులు పెరిగే కొలదీ వారి ఆలోచనలలో, జీవన విధానలలో మార్పులు వచ్చినప్పుడు వ్యక్తులను నియంత్రణ చేయడం చాలా కష్టతరమైన పని. అంటే సమాజం అందులోని ప్రతి వ్యక్తినీ పరీక్షించలేము. కాబట్టి ఇటువంటి పద్ధతి చాలా ఉపయోగపడుతుంది. ఈ స్థాయిలకు యించుమించు యాంత్రికంగాను, ఇచ్ఛా పూర్వకంగానూ వ్యక్తులు నిబద్ధులౌతారు. ఇటువంటి నియంత్రణ ఆ సమాజంలో వ్యక్తి యొక్క సామాజికీకరణపై ఆధారపడి వుంటుంది. సామాజిక నియంత్రణ బాహ్యమైంది. స్వయం నియంత్రణ అంతర్గతమైంది.

## 18.5 సామాజిక నియంత్రణ సాంఘికీకరణం :

సాంఘీకరణలో సాంఘిక నియంత్రణ ఒక భాగం. అవి రెండూ కూడా చాలా సన్నిహిత పరస్పర సంబంధాలను కలిగి వుంటాయి. సాంఘికీకరణ సాధనాలైన కుటుంబము, పాఠశాల, సమస్థాయి సముదాయం (Peer groups), రాజ్యం సామూహిక ప్రసార సాధనాలుగా వుంటాయి. సామాజికీకరణ క్రమం అన్నది సమాజం అంతటా ఒక పద్ధతిలో వుండదు. ఆధునిక సమాజం సాంఘిక సమూహాలను, ఉపసమూహాలను కలిగిఉంది. అది సామాజిక ప్రమాణాలను సమానంగా అందరికి పంచలేదు. వైవిధ్య పూర్వకంగానే సామాజికీకరణ ఉంటుందన్నది చాలా నిజం. ఉదా : కొన్ని కుటుంబాలు తమ పిల్లల హింసాయుత ప్రవర్తనను ఆమోదించవు. కాని కొందరు పిల్లలు కొన్నిటిని సాధించుకునేందుకు హింసను ఆశ్రయించక తప్పదనే భావనను కలిగి వుంటారు. తత్ఫలితంగా హింసాత్మక చర్యలను ఆశ్రయించని వారు నిబద్ధత కలిగిన వారుగాను, యితరులు అసంబద్ధంగాను తయారవుతారు.

## 18.6. సారాంశము :

సామాజిక నియంత్రణ ప్రతి సమాజానికి అత్యవసరము. సమాజములోని వ్యక్తులు సుఖ జీవనం గడపడానికి, సమాజ పురోభివృద్ధికి, శాంతి భద్రతలకు, క్రమతను పెంపొందించుటకు సుస్థిర మనుగడకు ఈ నియంత్రణ ఎంతైనా అవసరము. ఆధునిక సమాజంలో సామాజిక నియంత్రణ ఆవశ్యకత ఎంతైన కలదు. ఆధునిక సమాజాలు నిరంతరం సాగే పరివర్తన ఆధారంగా గణనీయమైన మార్పులు రావడము వలస పట్టణాల అభివృద్ధి పారిశ్రామీకరణ, జనాభా పెరుగుదల, ఉత్పత్తిలో మార్పులు ఏర్పడుట వలన సాంప్రదాయ లేక అనియత సాధనాల నియంత్రణ సమర్థవంతముగా లేకపోవుటవలన నియత సాధనాల ప్రాముఖ్యత ఆవశ్యకత పెరిగెను. అందుచేత చట్టాలు, కోర్టులు, పోలీసు శాఖ వంటి సామాజిక నియంత్రణ సాధనాలు అభివృద్ధి చెంది సామాజిక నియంత్రణకు తోడ్పడుచున్నవి.

### ప్రశ్నలు

1. సామాజిక నియంత్రణ అనగానేమి? నిర్వచించి వివిధ రకాలను పేర్కొనుము?
2. సామాజిక నియంత్రణ అనగానేమి వివరించి, నియత, అనియత నియంత్రణలను పేర్కొనుము?
3. సామాజిక నియంత్రణను నిర్వచించి వివిధ రకాలైన నియంత్రణలను వ్రాయుము?
4. సామాజిక నియంత్రణ మరియు స్వయం నియంత్రణలను వివరించుము?

పాఠము - 19

# సామాజిక నియంత్రణ - సాధనోపకరణాలు

## (MEANS OF SOCIAL CONTROL)


19.0 లక్ష్యం

19.1 సాధనోపకరణాలు

19.2 జానపద రీతులు

19.3 సామాజిక రీతులు

19.4 శాసనాలు

19.5 తాత్విక సిద్ధాంతాలు

19.6 మర్యాద

19.7 సంస్కారాలు

19.8 ఫాషన్

19.9 ప్రజాభిప్రాయాలు

19.10 కళలు - సాహిత్యము

19.11 నాయకత్వము

19.12 సారాంశము


### 19.0. లక్ష్యం

సామాజిక నియంత్రణకై ప్రత్యక్షంగా కొన్ని, పరోక్షంగా కొన్ని సాధనోపకరణాలు ఉపయోగపడుతున్నాయి. అవి నియత, అనియత సాధనాలు. సామాజిక నియంత్రణ ధనాత్మకము కావచ్చు ఋణాత్మకము కావచ్చు. అనియతమైన సామాజిక నియంత్రణ సాధారణంగా పొగడ్త, ప్రజాభిప్రాయం ఫ్యాషన్, పిచ్చాపాటి మొదలైన రూపాలలో వుంటుంది. సమాజంలో నియతమైన సాధనాల కంటే అనియత సాధనాలు శక్తివంతంగా కూడా పరిగణింపబడతాయి.

ఇవి ఎక్కువగా గిరిజన సమూహాలలో, గ్రామీణ ప్రాంతాలలో అమలులో ఉంటాయి. అక్కడ వ్యక్తి శీలం గుర్తింపబడుతుంది. అనియత సాధనాలు ఒకరు ప్రవేశపెట్టినవి కావు. కాలానుగుణంగా వ్యక్తుల అవసరాలకు అనుగుణంగా ఉద్భవించినవి. ఉదా : బ్రాహ్మణులు మాంసాహారము తినరు. జైనులు పెరుగుతినరు. సగోత్రికుల మధ్య వివాహాలు జరుగవు.

### 19.1. సాధనోపకరణాలు :

నియత సామాజిక సాధనాలు చట్టబద్ధంగా లిఖిత పూర్వకంగా వుంటాయి. పట్టణ మరియు నగరాలలో ఇవి ఎక్కువగా కనపడతాయి ఆధునిక సమాజం వాటి పాత్ర చాలా ఎక్కువగా ఉంటుంది. సామాజిక నియంత్రణలో ఇవి ప్రధాన సాధనోపకరణాలు.

### 19.2. జానపద రీతులు (Flok ways) :

సమాజంచే గుర్తింపబడిన కొన్ని అలవాట్లను జానపద రీతులు అని అందురు. సమాజంలో వ్యక్తికి వుండవలసిన ప్రవర్తన పద్ధతులనే జానపద రీతులు అని అందురు. విలియమ్ గ్రహమ్ సమ్నర్ అనే శాస్త్రవేత్త Folk Ways అనే గ్రంథములో మొట్టమొదటి సారిగా జానపద రీతులు అనే ఒక పదాన్ని వాడినారు. ఈ పదానికి సామాజిక శాస్త్ర పరిభాషలో చాలా ప్రాముఖ్యత కలదు. ఈ జానపద రీతులను సమాజం చట్టబద్ధంగా శాసించక పోయినా వ్యక్తులు వీటిని ఆచరిస్తూ ఉంటారు. సాంఘికీకరణ ద్వారా ఒక తరం నుంచి మరొక తరానికి ఈ జానపద

రీతులు సంక్రమిస్తూ వుంటాయి. ప్రతి సంస్కృతిలో ఈ జానపద రీతులు మూలాధారాలు. ఇవి మానవ జాతి ఉన్నంత కాలం వుంటాయి. కానీ ఒక సమాజానికి మరొక సమాజానికి ఉండే జానపద రీతులలో తేడా వుంటుంది. ఉదా : 1. సమాజంలో వ్యక్తులు వీటిని ఆచరించడంలో అశ్రద్ధ చేస్తే సమాజ నిరాదరణకు, పరిహాసానికి గురి అవుతారు. 2. ఇంగ్లండులో వ్యక్తులు ఒకరిచేయి ఒకరి చేతిలో కలపటం ద్వారా అభినందన తెలుపుకోవడం జరగుతుంది. అదే భారతీయ సమాజంలో నమ్కరించుట ద్వారా అభినందనలు తెలుపుకోవడం జరుగుతుంది. 3. దేవాలయంలో పాదరక్షలు విడవడం, ఉపాధ్యాయుడు ఎదురైతే నమస్కరించడం, తల్లి దండ్రులను, పెద్దలను గౌరవించడం వంటివి జానపదరీతులు.

## 19.3. సామాజిక రీతులు (Mores) :

W.G. సమ్నర్ Mores అనే పదాన్ని మొట్టమొదట సమాజ శాస్త్రానికి ఉపయోగించాడు. సామాజిక రీతులు అనేవి సమాజ సంక్షేమానికి తోడ్పడేవిగా వుంటాయి. అందుచేత ఇవి బలవంతమైనటువంటివిగా, శక్తివంతమైనటువంటివిగా వుంటాయి. కొన్ని జానపదాచారాలను సమాజ సంక్షేమానికి మార్గదర్శకులుగా, ఉత్తమమైనవిగా ఆ సమాజంలోని ప్రజలు విశ్వసించి వాటిని ఆచరిస్తే అవి సామాజిక రీతులుగా గుర్తింపబడతాయి.

కట్టుబాట్లను వ్యతిరేకించడం, వీటిని అతిక్రమించడం పెద్ద అపరాధంగా పరిగణించబడుతుంది. వాటిని వ్యతిరేకించడం అనే చర్యల వలన సమాజాన్ని అస్తవ్యస్థం చేస్తాయని ఆ సమాజంలో అనర్థాలు ఏర్పడుతాయని ప్రజలు భావిస్తారు. మానవుని ప్రాథమిక అవసరాలను తీర్చడంలో ఇవి ప్రముఖమైన పాత్రను నిర్వహిస్తాయి. ప్రాచీన కాలంనుండి వస్తున్న కొన్ని కట్టుబాట్లను ఆధునిక కాలంలో వ్యతిరేకిస్తున్నారు. అయినా కట్టుబాట్లను మానవ సామాజిక జీవనంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. ఇవి చట్టం కంటే బలమైనవి. వీటి వెనుక ప్రజాభిప్రాయం చాలా బలంగా ఉంటుంది. ఉదా : బాల్య వివాహాలు, వరకట్నం, అంటరాని తనం పాటించడం, అక్రమలైంగిక సంపర్కం మొదలైనవి. రామాయణ కాలం నుండి పురుషుడు ఏకపత్నీ వ్రతుడై ఉండవలననే సామాజిక రీతులు భారతదేశంలో వుంటూ వచ్చాయి. అంతేకాకుండా అవి సమాజంలోని వ్యక్తుల ప్రవర్తనను తీర్చి దిద్దుతాయి. పెండ్లి ఇండ్లలో ఇరుగుపొరుగు వారు సహాయం చేయడం. ఇలా సహాయపడటమనేది ఒక సామాజిక రీతి రివాజులు. ఎలా ప్రవర్తించాలో చెప్పడంతో పాటు ఏ రకంగా ప్రవర్తించకూడదు చెబుతుంది కూడా. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం మీద ఆధారపడి జీవించే వారిలో ఈ సామాజిక రీతులు ఎక్కువగా ఉంటాయి. కొన్ని సమయాలలో ఈ సామాజిక రీతులు జానపద రీతులు మిళితమై కూడా వుంటాయి. ఉదాహరణకు గ్రామంలో రైతులందరు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఒకేసారి ఏరూవాక సాగించడం.

## 19.4 శాసనాలు Law :

సమాజంలో క్రమబద్ధమైన జీవన విధానాలు కొనసాగడానికి, సమాజ పురోభివృద్ధికి ఐక్యతను, సుస్థిరతను అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి ఆధునిక కాలంలో చట్టాలు శాసనాలు ఎంతో తోడ్పడుతున్నాయి. ఆదిమ సమాజాలలో వాళ్లుకొన్ని విలువలకు, పద్ధతులకు, ఆచారాలకు కట్టుబడి జీవించేవారు. వాటికి భిన్నంగా వున్న వ్యక్తిని గ్రామ పెద్దలు, సముదాయాలు, నియంత్రించే అవకాశం వుండేది. ఇవి స్వచ్ఛందంగా అభివృద్ధి చెందుతూ వుండేవి. కానీ నేడు ఆధునిక సమాజంలో ఆదిమ సమాజాలలోని విలువలు, ఆచారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు ఊహించని విధంగా మారిపోతాయి. అట్టి పరిస్థితులలో సమాజంలోని వ్యక్తుల సామాజిక నియంత్రణకై ఉపయోగకరంగా వున్న రీతి రివాజులు శాసనాలుగా రూపొందాయి. ఇవి లిఖిత పూర్వకంగా వుంటాయి. వీటిని శాసనశాఖ రూపొందిస్తుంది, కార్య నిర్వాహక శాఖ అమలు చేస్తుంది న్యాయశాఖ వీటిని పరిరక్షించుటకు కోర్టులు, పోలీసు శాఖలు తోడ్పడుతాయి.

## 19.5. తాత్విక సిద్ధాంతాలు (Ideology) :

తాత్విక సిద్ధాంతాలు సామాజిక జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి సామాజిక వాస్తవాలను కళ్లకు కట్టినట్టు వివరిస్తాయి. ఇవి మానవ కళ్యాణం కొరకు కొన్ని ఆదర్శాలను బోధిస్తాయి. వీటి అసరాగా ఎంతోమంది జీవన యాత్ర గడపుతారు. ఉదా : బ్రిటీష్ సామ్రాజ్య ఆధిపత్యాన్ని ధిక్కరించి భారతదేశం ప్రజాస్వామికం కావడానికి గాంధీ సిద్ధాంతాలు ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసాయి.

పారిశ్రామిక సమాజంలో పెట్టుబడి దారుల నిరంకుశత్వాన్ని పెత్తందారీతనాన్ని కాదనుటకు శ్రామికులందరికి మార్క్స్ సిద్ధాంతం ఎంతో ఉపయోగపడింది. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా ఎన్నో ఉద్యమాలు నూతన తాత్విక సిద్ధాంతాల ప్రభావ ఫలితంగా బయలు దేరినాయి.

## 19.6. మర్యాద :

మర్యాద పూర్వకంగా ఆచరించే ప్రవర్తనను మర్యాదలు అనవచ్చును. ఇవి సమాజానికి సమాజానికి వేరు వేరుగా ఉంటాయి. అంటే ఇవి వారి జీవన విధానాన్ని బట్టి నిర్ణయించబడతాయి. ఉదా : భారతదేశంలో పిల్లలు తల్లిదండ్రులు మొదలైన పెద్దలు కనబడగానే లేచి నుంచుని తమ మర్యాదను తెలుపుతారు. పాశ్చాత్య సమాజంలో వారి మర్యాదలు వేరుగాఉంటాయి.

## 19.7. సంస్కారాలు (Rituals) :

సంస్కారాలు సమాజంలోనిండుదనాన్ని, ప్రత్యేకతలను, సంతోషాన్ని, తృప్తిని కలిగిస్తుంటాయి. ముఖ్యమైన సన్నివేశాలు పురస్కరించుకొని ఈ సంస్కారాలు జరుపుతారు. ఉదా : పుట్టుక నుండి మరణించువరకు అనేక సంస్కారాలు అనగా సంతానోత్సవ, జన్మదిన, నామకరణ, చూరకర్మ మొదలు అంత్యేష్టి (కర్మ కాండలు) వంటి సన్నివేశాలను పురస్కరిచుకొని అనేక సంస్కారాలను నిర్వహిస్తారు. ఉత్తమమైన ఘనకార్యాలను సాధించిన వ్యక్తిని సత్కరించటం, శుభసమయాలలో ఒక వయస్సు నుంచి మరొక వయస్సుకు చేసే ఉత్సవాలు బాల్య దశ నుండి యవ్వన దశకు చేరే వ్యక్తికి చేసే ఉపనయనము మొదలైనవి, వ్యక్తి జీవితములో జరిగే కొన్ని సంఘటనలకు సమాజము ప్రాముఖ్యాన్నియిస్తూ జరిపే కర్మకాండలను సంస్కారాలు అనవచ్చును. ఇది సామాజిక నియంత్రణ ఉపకరణాలుగా ప్రాముఖ్యత పొందును.

## 19.8. ఫాషన్ (Fashion) :

మానవుడు సంఘజీవి. అయితే మానవుడు తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలని ఉబలాటపడతాడు. దానిని తాను ధరించే వస్తువులలో ఆభరణాలలో వస్త్రులలో తోటి వ్యక్తులకు తెలియజేస్తుంటాడు. ఇవి ఎప్పటికప్పుడు మారిపోతాయి. కళ (Art) సాహిత్య (literature) విషయాలలో వ్యక్తుల మీద ఫాషన్ ప్రభావము ఉండును. ఇది అనుకోకుండా బాధ్యతారహితంగా మారిపోతున్నప్పుడు Fad అనవచ్చును.

## 19.9. ప్రజాభిప్రాయము (Public Opinion) :

ప్రజాభిప్రాయం ద్వారా సామాజిక నియంత్రణ పెంపొందుతుంది. ఆదిమ ఫ్యూడల్ సమాజాలలో ప్రజాభిప్రాయం పాత్ర ఎంతో ఉండేది. పూర్వం రాజులు మారువేషాలు వేసుకొని ప్రజాభిప్రాయాన్ని సేకరించి వారి అభిప్రాయానికి తగిన విధంగా ప్రవర్తిస్తూ ఉండేవారు. ఆధునిక సమాజములో కూడా ఒక వ్యక్తితనను ఇతరులు పొగడాలని కోరుకుంటాడు. ఏ వ్యక్తి సమాజంచే విమర్శింపబడి అపకీర్తి పాలు కావడానికి ఇష్టపడడు. ప్రజలచే నవ్వుల పాలు కావడానికి వ్యక్తులు అవినీతి, సమాజ వ్యతిరేక కార్యక్రమాలు చేయుటకు పూనుకోరు. కాబట్టి వ్యక్తుల ప్రవర్తనను సక్రమంగా నియమబద్ధంగా ప్రవర్తించుటకు ప్రజాభిప్రాయం ఎంతో తోడ్పడతుంది. ఇవి కాక, ప్రచారము, వార్తా పత్రికలు, సినిమా, రేడియో, నీతి సూత్రాలు, నాయకత్వము, హాస్యము, వ్యంగ్యము, కుటుంబము కూడా వ్యక్తుల ప్రవర్తనా క్రమబద్ధం చేయడానికి ఉపయోగపడతాయి.

## 19.10 కళలు - సాహిత్యము (Art & Literature) :

కళలు, సాహిత్యము సమాజంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. అనేక ప్రజాహిత కార్యక్రమాలలో కళలు, సాహిత్యము ప్రముఖ పాత్ర వహిస్తున్నవి. ఉదా : ప్రజాహిత కార్యక్రమాలైన కుటుంబ నియంత్రణ, వయోజన విద్య గురించి చిత్రలేఖనాలు మొదలైన వాటి ద్వారా ప్రజలకు తెలియజేస్తూ ఉంటారు. వీటితో పాటు కవిత్వము, నవలలు, నాటకాలు, కల్పిత కథలు మొదలైన వాటికి ప్రజాజీవనంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. భారతదేశంలో అనేక కట్టడాలు ప్రజలకు ఒక గొప్ప సందేశాన్నందిస్తుంటాయి. గాంధీ విగ్రహాన్ని చూసినప్పుడు శాంతి, అహింస, మానవత్వము, మంచితనము, గుర్తుకువస్తాయి.

## 19.11 నాయకత్వము (Leadership) :

నాయకత్వమంటే ఒక సామాజిక సంబంధంలోపలకానీ, బృందం లోపల కానీ ఒక సభ్యుడు లేదా కొందరు చెలాయించే అధికారము అని అర్థము. సామాజిక న్యాయాలు, అంగీకరించేటట్లు, ప్రవర్తన ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకునేటట్లు వ్యక్తులను నాయకుల వునికి ప్రభావితం చేస్తుంది. ఇది మూడు రకాలుగా వుంటుంది.

**19.11.1. స్థానగత నాయకత్వం :** ఒక వ్యక్తి సమాజంలో ఉన్నత స్థాయిగల కుటుంబానికి చెందినవాడై వుంటాడు. ఇది ఆపాదించబడిన నాయకత్వమై వుంటుంది. ఉదా : పారిశ్రామిక, రాజకుటుంబాలకు చెందిన వ్యక్తికి ఎలాంటి ప్రత్యేక సామర్థ్యాలు, నైపుణ్యాలు, మీదగానీ ఆధారపడరు. అయినా వీరు నాయకులుగా, ప్రజాభిమానాన్ని సంపాదించి ఉంటారు. సాధారణంగా ఇలాంటి నాయకత్వం సాంప్రదాయక సమాజాలలో కనిపిస్తుంది.

**19.11.2. వ్యక్తిగత నాయకత్వం :** ఇది స్థానగత నాయకత్వానికి పూర్తిగా భిన్నమయినది. నాయకత్వానికిపూర్తిగా భిన్నమైనది. ఒక వ్యక్తికి గల వ్యక్తిగత గుణాల వల్ల అతను నాయకుడుగా పరిగణింపబడతాడు. వీటిలో కూడా నిపుణ నాయకత్వం, ఆకర్షణ నాయకత్వం, నిర్వహణాధికారిగత నాయయత్వం అను మూడు రకాల నాయకత్వాలు ఉన్నాయి.

నిపుణ నాయకుడుకి ఏదో ఒక రంగంలో ఉదా : అణుశాస్త్రజ్ఞుడు, ప్రముఖ న్యాయవాది, ప్రసిద్ధ సంఘసేవకుడు, సినిమాతార, బహుగ్రంథకర్త మొదలైన వాటిలో రాణిస్తూ ఉంటాడు. వీరు తమ తమ రంగాలలో నిపుణులుగా ఉండి ఇతరులు ఆలోచనలను చర్యలను పరోక్షంగా ప్రభావితం చేస్తూ ఉంటారు. ఆకర్షణ నాయకత్వం కేవలం ఒక వ్యక్తికి ఉన్న ఆకర్షణశక్తికి సంబంధించినది. వీరు ఆయా వ్యక్తిత్వ ప్రతిభతో ఎందరినో ప్రభావితం చేస్తూ ఉంటారు. ఉదా. గాంధి, నెహ్రూ, బోస్. ప్రభుత్వాలలోను, పరిశ్రమలలోనూ, ఇతర సంస్థలలో కనిపించే నాయకత్వం నిర్వహణాధికారిక నాయకత్వం.

**19.12. సారాంశము :** ఈ పాఠమున సామాజిక నియంత్రణ సాధనోపకరణాలను తెలుసుకున్నాము. ప్రతిసమాజము తన సభ్యుల ప్రవర్తనను వివిధ యంత్రాంగముల ద్వారా నియత్రించడానికి ప్రయత్నిస్తుంది. సమాజంలో శాంతిని భద్రతను కల్పించేందుకు సామాజిక నియంత్రణ అవసరం.

సామాజిక నియంత్రణ అన్నది ధనాత్మకం కావచ్చు. ఋణాత్మకం కావచ్చు. బృందనియంత్రణ, వ్యవస్థానియంత్రణ, కళా, సాహిత్యం, నాయతకత్వం, ప్రజాభిప్రాయం, ప్రచారం, మతం, విద్య అనేవి ముఖ్యమైన సామాజిక నియంత్రణ సాధనాలు. కావున సామాజిక నియంత్రణ సమాజములోని సభ్యులను ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రవర్తించేటట్లు, సమాజానికి బద్దులుగా ఉండునట్లు చేయును. సాపేక్షమై స్థిరత్వాన్ని సమతౌల్యాన్ని సమాజంలో కొనసాగించేందుకు సామాజిక నియంత్రణ తోడ్పడుతుంది.

### ప్రశ్నలు

1. సామాజిక నియంత్రణ అనగానేమి? సాధనోపకరణాలను వివరించుము.
2. సామాజిక నియంత్రణ సాధనాలపై ఒక వ్యాసం వ్రాయుము?

**II లఘుటీక ప్రశ్నలు :**

1) బృంద నియంత్రణ 2) స్థానగత నాయకత్వం 3) ప్రజాభిప్రాయము. సామాజిక నియంత్రణ 4) నియత, అనియత నియంత్రణ సాధనాలు 5) సామాజిక నియంత్రణ విద్య. 6) జానపదరీతులు 7) సామాజిక రీతులు

పాఠము : 20

# సామాజిక నియంత్రణ ఏజన్సీలు

## (AGENCIES OF SOCIAL CONTROL)


20.0 లక్ష్యం

20.1 సామాజిక నియంత్రణమ ప్రభావితము చేసే అంశాలు

20.2 సామాజిక నియంత్రణ ఏజన్సీలు

20.2.1 కుటుంబము

20.2.2 మతము

20.2.3 రాజ్యము

20.2.4 విద్య

20.2.5 శాసనాలు

20.3 సామాజిక నియంత్రణ ప్రాముఖ్యత

20.4 సారాంశం


### 20.0 లక్ష్యం :

సామాజిక నియంత్రణ ద్వారా సమాజంలో కట్టుబాట్లకు ప్రమాణాలకు అనుగుణ్యత సాధించటం జరుగుతుంది. సామాజిక నియంత్రణ లేనినాడు సమాజం అస్తవ్యస్తం అవుతుంది. సమాజానికి ఆయోగ్యమైన రీతిలో వ్యక్తి ప్రవర్తించేలా అనుగుణ్యత సాధించటానికి సమాజం ఉపయోగించే పద్ధతుల వ్యవస్థే సామాజిక నియంత్రణ అవుతుంది. మన చుట్టూ జరిగే అనేక విషయాలను గమనించి మనం సామాజిక నియంత్రణా వ్యవస్థ అమలును గమనించవచ్చు. సాధారణంగా రోడ్డుకు ఎడమవైపు నడవడం, ఉపాధ్యాయుడు పాఠం చెప్తున్నపుడు విద్యార్థులు నిశ్శబ్దంగా వినటం అన్ని సాంఘిక నియంత్రణకు ఉదాహరణలే. సమాజంలో కొద్దిమంది ఈ కట్టుబాట్లు, ప్రమాణాలకు వ్యతిరేకంగా ప్రవర్తించినప్పటికి అధికులు అనుగుణ్యంగా నడచుకొంటారు. సమాజంలో శాంతి, వ్యవస్థిత నియమ నిబంధనలను అమలుపరచడంలో సమాజం ఉపయోగించే ఒత్తిడి తరహాలే సామాజిక నియంత్రణ అని అగ్‌బర్న్, నియ్‌కాఫ్ పేర్కొన్నారు. సమాజం తన సభ్యులు ఆమోదించి ప్రవర్తనా స్థాయిలకు బద్ధులుగా ఉండేలా చేసే సాధనాల వ్యవస్థ సామాజిక నియంత్రణ అని ఇ.ఎ.రాస్ (E.A. Ross) అభిప్రాయపడ్డారు.

వ్యక్తులు సమాజంలో ప్రతీక్షణలకు అనుగుణంగా నడుచుకొంటున్నంతకాలం సామాజిక నియంత్రణ ఏజన్సీల వ్యవస్థ ఉనికిని మనం గమనించం. విచలిత ప్రవర్త లేదా నేరం ఉన్నప్పుడు వీటికి వ్యతిరేకంగా సమాజిక నియంత్రణ ఉనికి, అదుపు స్పష్టంగా కనిపిస్తాయి. మనం నియంత్రణ ఏజన్సీలను, దాని ప్రభావాన్ని గమనించగలం. కాబట్టి సాంఘికనియమాలు ఉల్లంఘించినపుడు సామాజిక నియంత్రణ వెలుగులోకి వస్తుంది. సాంఘీకీకరణం సరిగా జరగకపోవడం బలమైన ఆంక్షలలేమి, సాంఘిక నియంత్రణగా ఏజన్సీలు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల సాంఘీక నియమాలు ఉల్లంఘించబడతాయి.

### 20.1. సామాజిక నియంత్రణను ప్రభావితము చేసే అంశాలు :

సామాజిక నియంత్రణ వ్యవస్థను ప్రభావితం చేసే అంశాలుగా క్రింది విధంగా పేర్కొంటారు అవి 1) సాంఘికీరణం 2) సాంఘిక అనుజ్ఞ ఆమోదాలు 3) సమూహ ప్రభావం 4) వ్యవస్థాపనా నిర్బంధం 5) సంస్థీకరణం, సాంఘికీకరణంలో ప్రతి వ్యక్తి ఆ సమాజంలోని విలువలు, నమ్మకాలు, కట్టుబాట్లు, ప్రమాణాలు, పాత్రా నిర్వహణలోని మెలకువలు, ప్రవర్తనను బేరీజు వేయడం సమాజంలో ఇతరుల వల్లే

నేర్చుకొంటాడు. దీనివల్ల సామాజంలోని సభ్యులందరూ ఏది తప్పు ఏది ఒప్పు అన్న విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉంటారు. సమాజంలోని సభ్యులు వారి వారి కార్యకలాపాలలో పాల్గొనేలా సాంఘికీకరణ తోడ్పడుతుంది. ఎలా ప్రవర్తించాలి ఎలాంటి ప్రతీక్షణలు ఉండాలి ఒక ప్రత్యేక ప్రవర్తనకు ఇతరులు ఎలా ప్రవర్తిస్తారు, ప్రతిస్పందిస్తారు అనేది సాంఘికీకరణంలో వ్యక్తులు తెలుసుకొంటారు.

**20.1.1** లక్ష్యాలు, లక్ష్యసాధనకు ఎంచుకోవలసిన మార్గాలు నిర్ణయించుకోవడానికి కూడా సాంఘికీకరణం తోడ్పడుతుంది. వ్యక్తి మూర్తిమత్వం సాంఘికీకరణం ఫలితంగా ఉంటుంది. సాంఘికీకరణం సామాజిక నియంత్రణలో ముఖ్యమైన భాగంగా ఉంటూ సామాజిక నియంత్రణకు తోడ్పడుతుంది. సాంఘికీకరణం సరిగ్గా లేనినాడు సమాజంలో విచలిత ప్రవర్తన అధికంగా ఉంటుంది. విచలిత ప్రవర్తనను అణచివేయడానికి దండన, అనుగుణ్యతకు పారితోషికం, సమాజం అమలు జరిపే అనుజ్ఞ ఆమోదాలు ఉంటాయి.

**20.1.2** అనుజ్ఞ ఆమోదాలు అనుబద్ధమైనవి కావచ్చు. ఇవి సకారాత్మకమైనవి లేదా నకారాత్మకమైనవిగా కూడా వుండవచ్చు. అనుబద్ధంకాని అనుజ్ఞ ఆమోదాలు సమాజంలో సభ్యులు అమలుజరిపేవి, ఇచ్చిపుచ్చుకునేవిగా వుంటాయి. చీదరించుకోవడం, కఠినంగా మాట్లాడడం, కోపంగా చూడటం వంటివి అనుబద్ధంకాని నకారాత్మక ఆమోదాలు కాగా, కరచాలనం చేయటం చిరునవ్వు నవ్వడం, ఉత్సాహపరచడం అనుబద్ధంకాని నకారాత్మక ఆమోదాలుగా గుర్తింపబడతాయి. సాంఘిక ఆమోదాలలో అధిక భాగం అనుబద్ధం కానివిగా వుంటాయి. ముఖకవళికలు, అభిప్రాయాలు, సంజ్ఞలు ఎదుటివారిలో భావ ప్రసారానికి మాత్రమే కాక, వారి ప్రవర్తనను అదుపులో ఉంచడానికి ఉపయోగపతాయి. కాగా అనుబద్ధ సాంఘిక ఆమోదాలు వ్యవస్థీకృతమైన పారితోషిక దండనాలు. సాధారణంగా అనుబద్ధ సాంఘిక ఆమోదాలు అధికారం ద్వారా, అధికారంలో నియమితమయిన వ్యక్తుల ద్వారా అమలు పరచబడతాయి. ధైర్యసాహసాలకు ప్రభుత్వం ప్రధానం చేసిన పతకం, స్నాతకోత్సవ పట్టా, అభివృద్ధి చూపినందుకు ఇచ్చిన బోనస్ ఉద్యోగంలో ఇచ్చిన ఉన్నతస్థితి వంటివి. అనుబద్ధ నకారాత్మక సాంఘిక ఆమోదాలుగా జరిమానా విధించడం, కారాగారశిక్ష విధించడం, తీవ్రమైన శిక్షగా ఉరితీయడం వంటివి ఉంటాయి. సాంఘికీకరణ సరిగ్గా లేనినాడు, అనుబద్ధంకాని నకారాత్మక సాంఘిక ఆమోదాల ద్వారా అనుగుణ్యత సాధించలేనప్పుడు అనుబద్ధ నకారాత్మక సాంఘిక ఆమోదాల ద్వారా వ్యక్తులను అదుపులో ఉంచడం జరుగుతుంది. అనుబద్ధం కాని లేదా అసంబద్ధ ఆమోదాలు సాధారణ ప్రజానీకం ఉపయోగిస్తే, అనుబద్ధ ఆమోదాలు ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు ఉపయోగిస్తాయి. అనుబద్ధ ఆమోదాలలో పోలీసు వ్యవస్థ, న్యాయస్థానం, కారాగారాలు, నకారాత్మకంగా వ్యక్తులను అదుపులో ఉంచడానికి ఉపయోగపడతాయి. వ్యక్తియొక్క అధికమైన సాంఘిక చర్యలు, పరస్పర చర్యలు సాధారణంగా చిన్న సమూహాలైన కుటుంబం, స్నేహితులు, సహోద్యోగులు, సమానస్థాయి వారితో ఉంటుంది. వ్యక్తులకు ఈ సమూహాలు అత్యావశ్యకమైనవి. ఈ సమూహాలు వ్యక్తులను అదుపులో ఉంచుతాయి. సమూహ సభ్యత్వానికి సభ్యులు అత్యంత విలువ ఇస్తున్నప్పుడు తన సభ్యత్వం తప్పక కొనసాగాలని వాంఛిస్తున్నప్పుడు వ్యక్తి సమూహం మాటకు తప్పక విలువ ఇవ్వాల్సి వస్తుంది. కుటుంబం, దగ్గర స్నేహితులను ఈ చిన్న సమూహాలకు ఉదాహరణగా తీసుకొన్నప్పుడు, ఈ సమూహాలు ప్రతికూలతా లేదా నకారాత్మక అసంబద్ధ ఆమోదాలు ఎదుర్కోవలసి వస్తుందన్న భయం ఆ వ్యక్తిని అనుగుణ్యత పాటించేలా చేస్తుంది. వ్యవస్థాపనా నిర్బంధం అని చెప్పడం ద్వారా విచలితులను నిర్బంధించే వ్యవస్థాపనలుగా అర్థం చేసుకోవాలి. ఈ వ్యవస్థాపనా నిర్బంధాలలో ముఖ్యమైందిగా కారాగారాన్ని పేర్కొనవచ్చు. కఠినమైన అనుబద్ధ నకారాత్మక సాంఘిక ఆమోదంగా కారాగారాన్ని చెప్పవచ్చు. విచలితుణ్ణి శిక్షించడానికి సాధారణంగా కొన్ని సందర్భాలలో పునర్ సాంఘికీకరణానికి వ్యవస్థాపనా నిర్బంధాన్ని ఉపయోగించడం జరుగుతుంది. ఇతర సాంఘిక నియంత్రణ పద్ధతులు విఫలం అయినప్పుడు వ్యవస్థాపనా నిర్బంధం ఉపయోగించడం జరుగుతుంది. పరస్పర చర్యలను నిర్మితిపరం చేయడం, నమూనాపరం చేయడాన్ని సంస్థీకరణం అని చెప్పవచ్చును. పరస్పర చర్య క్రమబద్ధమై వ్యవస్థీకృత అంతస్తులు స్పష్టమైన ప్రమాణాలు కలిగి వుండి, ప్రతిక్షణ ప్రవర్తన విస్పష్టంగా నిర్వహింపబడి సందేహాలకు తావులేనిదిగా ఉన్నప్పుడు సాంఘికచర్య, సాంఘిక సంబంధం వ్యవస్థీకృతమై వుందని గుర్తించాలి. చాలవరకు మానవ జీవితం సంస్థీకృతమై వుంటుంది. ఇంటిలో, పాఠశాలలో, వృత్తి ఉద్యోగాలలోనేకాక వినోద వేళలోకూడ ఎలా ప్రవర్తించాలో వ్యక్తి తెలిసికొని వుంటాడు అందుకే సంస్థీకరణ సామాజిక నియంత్రణ అంశంగా సామాజిక శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఇంటిలో ఒక వ్యక్తి నెమ్మదిగా విశ్రాంతితో, అప్యాయతానురాగాలతో ప్రవర్తిస్తూ వుంటే అదే వ్యక్తి ఉద్యోగ నిర్వహణలో కష్టపడటం, చురుకుగా ఉండటం కోరబడుతుంది. ఈ రెండు పాత్రపోషణలు పరస్పర విరుద్ధమైనవి. చర్యలను నమూనాపరం, నిర్మితి పరం చేయడం ద్వారా వ్యక్తి ఏ సందర్భంలో ఎలా మెలగాలో సంస్థీకరణం స్పష్టం చేస్తుంది. ఇందువల్ల ఒకదానితో ఒకటి పొసగని పనులను వేరుచేసి ఆ విధంగా విచలిత ప్రవర్తనకు దారితీయగల

మానసిక ఆందోళనను తగ్గించడం జరుగుతుంది. సాంఘిక నియంత్రణ సమాజంలోని అనేక ఏజన్సీల సహాయంతో కొనసాగుతుంది. రాస్ సాంఘిక నియంత్రణ ఏజన్సీల గురించి విస్తృతంగా చర్చించాడు. ప్రజాభిప్రాయం, చట్టం, నమ్మకం, సాంఘిక సలహా, మతం, వ్యక్తి విలువలు, కర్మకాండలు, కళ, మూర్తిమత్వం, విశదీకరించడం, భ్రమపరచడం, సాంఘిక మదింపులను సామాజిక నియంత్రణకు సమాజం ఉపయోగించే ఏజన్సీలుగా రాస్ గుర్తించాడు. ఒక చర్యపై సమూహం తీర్పును ప్రజాభిప్రాయం అని చెప్పవచ్చు. ప్రజాభిప్రాయం సామాజిక నియంత్రణలో ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రజాభిప్రాయం ఒక వ్యక్తి పూర్తి స్వార్ధ చింతనతో కాక నలుగురు మెచ్చే రీతిలో వ్యక్తి నడుచుకొనేలా పనిచేస్తుంది. ప్రజాభిప్రాయంగా సమూహం తీర్పు మెచ్చుకోలు, గౌరవించడం, అసహ్యించుకోవడం, ఎగతాళి చేయడం లేదా ఒక చర్యను మంచిది లేదా చెడ్డదిగా గొప్పదిగా లేదా పనికిరానిదిగా గుర్తించడం ద్వారా వ్యక్తమవుతుంది. ఈ విధమైన ప్రజాభిప్రాయ వ్యక్తీకరణలో వ్యతిరేక ప్రజాభిప్రాయానికి వెరచి సమాజం ఆమోదించని రీతిలో ప్రవర్తించేందుకు వ్యక్తులు ఇష్టపడరు. కావున సమాజం చేత నిర్వచించబడి అమలుచేయు అంశాలు సామాజిక నియంత్రణ పరిధిలో చేరిఉంటాయి.

## 20.2. సామాజిక నియంత్రణ ఏజన్సీలు :

**20.2.1. కుటుంబము (Family) :** ఏ సమాజంలోనైనా కుటుంబము అతి ముఖ్యమైన ప్రాథమిక సంస్థ. కుటుంబములో ప్రతీవ్యక్తి సభ్యత్వాన్ని కలిగి వుంటాడు. ఏ వ్యక్తి అయినా కుటుంబము ద్వారా ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను, నీతి నియమాలను, మంచిచెడ్డలను తెలుసుకుంటాడు. అంటే వ్యక్తి సమాజంలోని విభిన్న పరిస్థితులలో వ్యవహరించవలసిన విధానాలను శిక్షణ ద్వారా అలవరచుకుంటాడు. వీటన్నింటిని కుటుంబము సాంఘికీకరణమనే ప్రక్రియ ద్వారా సభ్యునకు తెలియజేస్తుంది. ఏ సభ్యుడైనా కుటుంబం ఆచరించే విధానాలకు వ్యతిరేకంగా నడిస్తే సభ్యుని శిక్షించి అదుపులో వుంచుతుంది. అంటే కుటుంబము వ్యక్తికి సమాజంలో అంతర్గతీకరణ పొందడానికి కావలసిన తర్ఫీదును యిస్తుంది. వ్యక్తి యొక్క మూర్తిమత్వము సమాజము నిర్దేశించిన రీతులలో మలచడానికి కుటుంబం ప్రధానమైన పాత్రను పోషిస్తుంది.

అంతేకాక కుటుంబము సభ్యుల మధ్య, సమాజంలో యితర సమూహాల మధ్య కూడా లైంగిక సంబంధాలను క్రమబద్ధం చేస్తుంది. ఇంకా సంఘవ్యతిరేక చర్యలైన పడుపు వృత్తి, వ్యభిచారము నేరవృత్తి మొదలైనవి ఎక్కువకాకుండా కుటుంబము వ్యక్తికి తర్ఫీదు నిస్తుంది. కుటుంబము వ్యక్తిలో ఆదర్శవంతమైన లక్షణాలు ఏర్పడేటట్లుగా బాల్యంనుండి ప్రేమతో, అనురాగంతో, ఆప్యాయతలతో వ్యక్తులను తయారుచేస్తుంది. వారిలో జాతి, సహకారము, సద్భావము, కరుణ, ఓర్పు వంటి గుణాలు ఎక్కువగుటకు తోడ్పడుతుంది. కుటుంబ సభ్యుల మధ్య శారీరక మానసిక లక్షణాలను పెంపొందిస్తూ వివిధ సంఘటనలలో, సందర్భాలలో ఎలా ప్రవర్తించాలో శిక్షణ ఇస్తుంది. సి.ఎ.ఎల్.వుడ్ అను శాస్త్రవేత్త "త్యాగ సంబంధమైన భావవృత్తులు కుటుంబము నుండే వ్యక్తికి సంక్రమిస్తాయి." అని అభిప్రాయపడ్డాడు.

పూర్వకాలం నుండి నేటివరకు కుటుంబం అనే సంస్థ, సామాజిక నియంత్రణా సాధనంగా మానవ సమాజాలలో ప్రముఖమైన పాత్రను పోషించింది. అసలు కుటుంబం లేకుండా సామాజిక నియంత్రణ సాధ్య పడదు. నేడు కుటుంబవ్యవస్థలో ఎన్నో మార్పులు సంభవించినప్పటికి నియంత్రణా సాధనంగా సమాజంలో పని చేస్తూనె ఉంది.

**20.2.2. మతము (Religion) :** సామాజిక నియంత్రణ అమలులో మతము ప్రముఖమైన పాత్రను వహిస్తుంది. మతములో విశ్వాసమున్న వ్యక్తులు ఆ మతములో ఏవైతే నీతిసూత్రాలు, ఆచార సాంప్రదాయాలు వుంటాయో వాటికి కట్టుబడి వుంటారు. ఇంచుమించు వారంతా ఒకేరకమైన ప్రవర్తనావళిని కలిగి ఉంటారు. ప్రతీ మతము కొన్ని సిద్ధాంతాల మీద ఆధారపడి వుంటుంది. మత విశ్వాసమున్న వ్యక్తులు తమ కంటే ఏదో ఒక బలమైన శక్తి తనను నడిపిస్తుందని నమ్ముతూ వుంటారు.

Ogburn and Nimkoff అనే శాస్త్రవేత్తలు మతాన్ని ఈ విధంగా నిర్వచించారు. "మానవాతీత శక్తులకు సంబంధించిన భావ వృత్తి." వీటిని ఆధారం చేసుకుని తమ తోటి వ్యక్తులకు సహాయపడటం, ఎన్నో సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా వ్యక్తులు సాంఘిక క్రమతకు, నియంత్రణకు శాంతికి ఎంతో దోహదపడి ఉన్నారు. ప్రపంచంలో వున్న మతాలన్ని భగవంతుడున్నాడని అనేక రూపాలలో

గోచరిస్తున్నాడని ప్రబోధిస్తున్నాయి: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని పాపపుణ్యాల ఫలితాన్ని వ్యక్తి అనుభవించవలసి వుటుందని నమ్ముతారు. మానవసేవే మాధవసేవ అని నమ్మి ప్రతీ వ్యక్తి ఏదో రకంగా తన తోటి వ్యక్తికి సహాయపడాలని ప్రయత్నిస్తుంటాడు. ఇది సమాజంలో క్రమతను ఎంతగానో పెంపొదిస్తుంది. శాస్త్రవేత్త ఎల్బర్ట్ ఐన్‌స్టీన్ ఈ విధంగా వివరించాడు. ఉదా : ప్రజలను, న్యాయాన్ని అణచివేయ ప్రయత్నించిన హిట్లర్‌ను చర్చి మాత్రమే ధైర్యంగా ఎదిరించగలిగింది. ప్రతీ మతము కూడా వ్యక్తిలో వున్న సంఘవ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తుంది. గాంధీజీ కూడా మతం ఒక్కటేనని అది వ్యక్తిని సత్యానికి కట్టుబడేటట్లు చేస్తుందని వివరించాడు. మానవజాతి క్రమాభివృద్ధికి ఇన్ని దశలలోనూ మతము వ్యక్తుల ప్రవర్తనను తీర్చిదిద్దుతుంది.

ఒక మతాన్ని నమ్మిన వ్యక్తి ఆ మత సూత్రాలను, సిద్ధాంతాలను ఆచరిస్తూ ఉంటాడు. ఆ నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తించడు. అతడు హిందువైనా ముస్లిమైనా, క్రైస్తవుడైనా అతని ప్రవర్తనలో మార్పు వుండదు. అందుకే Emile Durkhime తన 'ఆత్మహత్య' (Suicide) అనే గ్రంథంలో భగవంతుని పూజించడానికి ఆలయాలలో తరచు కలిసే వ్యక్తులలో అవ్యవస్థారీతులు తక్కువగా ఉంటాయని వివరించాడు. ఒకవేళ భిన్నంగా ప్రవర్తిస్తే భగవంతుడు శిక్షిస్తాడనీ, నరకానికి పోతారనీ భయాన్ని మానవులలో మతం కలుగజేస్తుంది. ఈ విధంగా మతం సామాజిక నియంత్రణా సంస్థగా పనిచేస్తుంది. మత గ్రంథాలు కూడా సాంఘిక నియంత్రణ సాధనాలుగా ఉపయోగపడతాయి.

**20.2.3. రాజ్యము (Staff) :** ప్రజాజీవనంపై ప్రభుత్వం యొక్క పాత్ర ప్రధానమైనది. అన్ని రంగాలలోను వివిధ సాధనోపకరణాలు అయిన, కుటుంబము, మతము సాధించలేనిది ప్రభుత్వం అదుపు ఆజ్ఞలు ద్వారా సాధిస్తుంది. పౌరహక్కులను కాపాడుటలో, మతము సాధించలేనిది ప్రభుత్వం అదుపు ఆజ్ఞలు ద్వారా సాధిస్తుంది. పౌరహక్కులను కాపాడుటలో, శాంతిని నెలకొల్పుటలో, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అమలుపరచుటలో ఇతరుల బారినుండి పౌరులను రక్షించుటలో ప్రభుత్వం ప్రధానమైన పాత్రను పోషిస్తుంది. ప్రభుత్వము తన పౌరుల సామాజిక లక్ష్యాలను గూర్చి, హక్కుల గూర్చి, బాధ్యతల గూర్చి, ఖచ్చితమైన సూత్రాలను లిఖితపూర్వకమైన వివరణతో తెలియజేస్తుంది. సామాజిక సమస్యలను నిర్మూలించుటకు, సమాజ సంక్షేమము కొరకు సాంఘిక శాసనాలను తయారుచేస్తుంది. వాటిని పోలీస్ శాఖ, న్యాయశాఖల ద్వారా అమలు జరిపి సమాజంలో శాంతి భద్రతలను కాపాడుతుంది. సమగ్ర సమాజాభివృద్ధికి మానవశక్తి సామర్థ్యాలను ఉపయోగించడం, వనరులన్నింటిని అందరికీ అందుబాటులో వుంచడం మొదలైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధమైన కృషితో నిర్వర్తించడం ఒక్క ప్రభుత్వానికే సాధ్యమవుతుంది.

సమాజంలో వ్యతిరేక అరాచక పరిస్థితులు నెలకొన్నప్పుడు సమాజాభివృద్ధి జరుగదు సరికదా సమాజ మనుగడ దుర్లభమవుతుంది. అటువంటి పరిస్థితిలో ప్రభుత్వము అనేక సాధనాల ద్వారా సమాజంలో అరాచకాన్ని అరికట్టి శాంతిని, సుస్థిరతను నెలకొల్పుతుంది. అంతేకాక సమాజ వ్యతిరేక శక్తులను నిర్మూలించి అట్టి చర్యలకు పాల్పడే వారిని చట్టాల ద్వారా శిక్షిస్తుంది. మానవజాతి చరిత్రలో ఎన్నోరకాల ప్రభుత్వ వ్యవస్థలు విలసిల్లుతూ వచ్చాయి. రాచరిక, నియంతృత్వ, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడుతూ వచ్చాయి. ప్రజలలో ఉత్సాహాన్ని ఉద్దేశాన్ని పెంపొందించుటకు అనేక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుంది. వారిలోని సృజనాత్మక శక్తులను దేశాభివృద్ధికి తోడ్పడుటకుగానూ ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెడుతుంది. వీటివలన జాతి సమైక్యతతో పాటు సామాజిక లక్ష్యాలు నెరవేరటం సాధ్యమౌతుంది. ఈ విధంగా ఆధునిక కాలంలో ప్రభుత్వం సామాజిక నియంత్రణలో ప్రముఖపాత్రను వహిస్తుంది.

**20.2.4 విద్య (Education):** సామాజిక నియంత్రణా సాధనాలో విద్య ప్రముఖమైన పాత్రను కలిగివుంది. ఆధునిక సమాజంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వ్యక్తికి మంచి లక్షణాలను, హేతుబద్ధమైన విధానాలను, శాస్త్రీయ దృక్పధాన్ని కలిగించాలంటే విద్య ఎంతో ఉపయోగపడుతుంది. అంతేకాక వ్యక్తిలోని శక్తి సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు అతనికనేక సాంస్కృతిక అంశాలను, సామాజికాంశాలను, సామాజిక విలువలను అవగాహన చేసుకొనుటలోను, తద్వారా వివిధ సాంఘిక పాత్రలను సమర్థవంతంగా పోషించుటలోను యెంతగానో తోడ్పడుతుంది. విద్య వ్యక్తిలో సంపూర్ణమైన మూర్తిమత్వాన్ని రూపుదిద్ది వ్యక్తిని సమాజంలో లీనం చేసి సామాజిక లక్ష్యసాధనకు దోహదం చేస్తుంది. దేశం బహుముఖంగా అభివృద్ధి చెందాలంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక విషయాలపట్ల సరియైన నిర్ణయాలు తీసుకోవడం ఎతైనా అవసరం. వ్యక్తి సాంఘికీకరణ ప్రక్రియలో విద్య, విద్యాసంస్థలు, ఉపాధ్యాయుడు ప్రముఖపాత్ర వహించడటం జరుగుతుంది.

విద్యను పలువురు పలురకాలుగా నిర్వచించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ "పాఠశాలల్లో, కళాశాలల్లో బోధనలద్వారా నేర్చుకున్న విద్యకాదు. సమాజంలో వివిధ సమూహాల ద్వారా తెలుసుకున్నదంతా విద్యే" అని చెప్పారు. ప్లేటో : "వ్యక్తిలో శారీరక, మానసిక పరిపూర్ణతలను ఏర్పరచుటే విద్య లక్ష్యం" అని అన్నాడు. అరిస్టాటిల్ "మానవత్వాన్ని, మంచితనాన్ని, సామాజిక వాస్తవాన్ని అవగాహన చేసికొనేటట్లు వ్యక్తియొక్క సామర్థ్యాలను పెంపొందించేదే విద్య" అని నిర్వచించాడు.

**20.2.5. శాసనాలు (Laws) :** సమాజంలో ప్రత్యక్షంగా అంటే నియత సాధనాల ద్వారా సామాజిక నియంత్రణం చేసేవి శాసనాలు. ఇటువంటి పద్ధతులను, శాసనాలను ధిక్కరించిన వారికి శిక్షలు కూడ తప్పవు. ఆధునిక సమాజంలో వీటి పాత్ర ఎంతో ఎక్కువగా వున్నది. జనాభా పెరుగుతున్నప్పుడు వారిని సక్రమ మార్గంలో పెట్టి క్రమతకు సుస్థిరతకు శాసనాలు ప్రముఖపాత్ర వహిస్తాయి. ఇవి లిఖిత పూర్వకముగా వుంటాయి. వీటిని ప్రభుత్వము, పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థలు అమలు చేస్తాయి. సమాజములో ఉండే సంఘవ్యతిరేక పనులను చట్టాల ద్వారా నిషేధిస్తారు. ఉదా : 1955 హిందూ వివాహ చట్టము, 1948 ఫ్యాక్టరీల చట్టము, కనీస వేతనాల చట్టము, సతీసహగమన చట్టము, భిక్షాటన నిరోధక చట్టము,

సామాజిక విలువలకు, పద్ధతులకు భయపడనివారు కూడా వీటికి తప్పక భయపడతారు. ఎందుచేతనంటే వీటిని ధిక్కరించినవారికి శిక్షలు కఠినంగా వుంటాయి. అందుచేత శాసనాలు ప్రతి సమాజంలోనూ సామాజిక నియంత్రణను అమలు చేయుటలో, ప్రముఖమైన పాత్రను పోషిస్తున్నాయి. ఇవి ఒక్కొక్క సమాజంలో ఒక్కొక్క రకంగా ఉంటాయి.

## 20.3 సామాజిక నియంత్రణ ప్రాముఖ్యత :

మానవ సమాజం ఏర్పడిన తొలిదశనుండి సమాజములో అనేక అంశాలు సమాజాన్ని, వ్యక్తుల ప్రవర్తనను అదుపులో వుంచడానికి ప్రయత్నించడము జరుగుతూనే వున్నది. సామాజిక నియంత్రణం లేనట్లయితే మానవ సమాజము జంతు సమాజము వలె వుంటుంది. సమాజంలో శాంతి, ఏకత్వము, సౌభ్రాతృత్వము సాధించాలంటే ప్రతి సమాజంలోను సమర్థవంతమైన సామాజిక నింత్రణా సాధనాలు తప్పనిసరి.

సమాజంలోని వ్యక్తులు భిన్న మనస్తత్వాలలో, భిన్న రీతులలో, ఆలోచనలో వుంటారు. ఏ ఇద్దరూ కూడా సామరస్యత కలిగి ఉండరు. ఒకే కుటుంబములో పెరిగిన ఇద్దరు కవలలు కూడా ఒకే మనస్తత్వాన్ని పూర్తిగా కలిగి ఉండరు. అందుచేత సమాజ అభివృద్ధికి, క్రమతకు అనేక రకాలైన నియంత్రణా సాధనాలు అవసరమయినాయి. వీటిని సమాజంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా, నియత, అనియత లాంఛనప్రాయమైన, లాంఛనప్రాయం కాని, నకారాత్మక, సకారాత్మక, మొదలైన పద్ధతుల ద్వారా అమలుపరచి సమాజంలో సుఖశాంతులు వుండేటట్లుగా చేస్తారు.

పూర్వకాలంలో ఆచారాలు, సాంప్రదాయాలు, విలువలు, పద్ధతులు మొదలైనవి ఎక్కువగా అమలులో వుండేవి. మతము కూడా ప్రముఖ పాత్ర వహించేది. ఆధునిక కాలంలో దైవముపై విశ్వాసము సడలింది. ఉత్పత్తి సాధనాలు పెరిగిన కొలదీ ప్రజల జీవన విధానంలో వూహించని మార్పులు సంభవించాయి. వాటిని దృష్టిలో వుంచుకుని ప్రభుత్వాలు శాసనాల ద్వారా సామాజిక నియంత్రణను చేస్తున్నాయి.

**20.3.1 సామాజిక ఐక్యతను ఏర్పాటు చేయుట (To Establish Social Unity) :** సమాజంలో వ్యక్తుల మధ్య ఐక్యత వుండటానికి సామాజిక నియంత్రణలు ఎంతో ఉపయోగపడతాయి. కుటుంబ సభ్యులు సామాజిక నియంత్రణను పాటించుటకు కొన్ని ప్రమాణాలను పాటిస్తారు. అలాగే సమాజంలో సభ్యులు ఒక లక్ష్యం కొరకు కలిసికట్టుగా పనిచేయుటకు దోహద పడుతుంది.

**20.3.2. వ్యక్తి ప్రవర్తనను క్రమబద్ధం చేయుట (Regulating Individual Behaviour) :** సమాజంలోని వ్యక్తులు అందరూ ఒకే రకంగా ఉండరు. ఒకే కుటుంబంలో జన్మించిన పిల్లలు అందరూ కూడా ఒకే రకంగా ఉండరు. లేదా ఒకే గ్రామంలో నివసిస్తున్న వ్యక్తులు కూడా ఒకే రకంగా ఉండరు. సమాజం మొత్తం మీద చూస్తే సామాజిక జీవనం సంక్లిష్టంగా ఉంటుంది. సమాజంలోని వివిధ రకాలైన వ్యక్తుల ఆలోచనలు, కార్యకలాపాలు సంఘర్షణ పడతాయి. వీటి ఫలితంగా కొట్లాటలు, దొమ్మీలు. హత్యలు మొదలైన అరాచకచర్యలు ఏర్పడతాయి.

వీటిని అదుపులో పెట్టటానికి సామాజిక నియంత్రణా సాధనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అప్పుడు సమాజంలో శాంతి నెలకొల్పబడుతుంది.

**20.3.3. సామాజిక అనుమతి పొందుట (To Provide Social Sanction) :** సమాజంలో అనేకమైన సామాజిక రీతులు, ఆచారాలు, జానపదతీరులు బహుళ వ్యాప్తిలో ఉన్నాయి. ఏ ప్రమాణాలు అనుసరించదగినవో సామాజిక నియంత్రణ ప్రక్రియలు తెలియజేస్తాయి. వ్యక్తి సామాజికంగా ఆమోదించిన ప్రమాణాలను ఉల్లంఘించినట్లయితే సామాజిక నియంత్రణ ద్వారా వ్యక్తిని బలంతంగానైన అనుసరించేటట్లు చేస్తుంది. ఈ విధంగా సామాజిక నియంత్రణ సామాజిక ప్రమాణాలను స్థిరపరస్తుంది.

**20.3.4 సాంస్కృతిక అక్రమ సంధానమును అదుపులో వుంచుట (To Check Cultural Maladjustment) :** సమాజంలో మార్పు అనివార్యము. ప్రతి మానవ సమాజంలోను నిరంతరము నూతన సిద్ధాంతాలు, కల్పనలు పుడుతూనే ఉంటాయి. అయితే సమాజంలో అందరూ ఈ నూతన మార్పులకు అనుగుణంగా మార్పు చెందలేరు. కొందరు పురోగామిగా ముందుకు సాగిపోతువుంటారు. మరికొందరు పాతభావాలను పట్టుకొని వుంటారు. ఉదా : ఒక గ్రామీణ ప్రాంతంలోని వ్యక్తి పట్టణ ప్రాంతంలోని కొత్త సాంస్కృతిక అలవాట్లను నేర్చుకోలేడు. కొందరు మద్యపానానికి, వేశ్యాగృహానికి అలవాటు పడటం జరుగుతుంది.

**20.3.5 పూర్వపు పద్ధతిని కాపాడుట :** సమాజంలో వున్న పాత పద్ధతులను ఆచరిస్తూ కొంతమంది వ్యక్తులు ఉంటారు. ఆ పద్ధతులలో మార్పు అవసరమైనప్పటికి మార్పు చెందటానికి ఇష్టపడరు. పాత పద్ధతులనే అవలంభిస్తూ వుంటారు. సమాజంలో వున్న కుటుంబ వ్యవస్థ ఈ లక్ష్యసాధనకై ఉపయోగపడుతుంది.

## 20.4 సారాంశము :

పై విదముగా సామాజిక నియంత్రణ అనునది అన్ని సమాజాలలోను తప్పనిసరి అయినది. సమాజం సంక్లిష్టం అయ్యే కొలది సామాజిక నియంత్రణ సాధనాల పాత్ర పెరుగుతున్నది. అందుచేత సమాజ శాస్త్రవేత్తలు, ప్రజా నాయకులు, విజ్ఞానవేత్తలు మొదలైన వారు సమర్థవంతమైన సామాజిక నియంత్రణా సాధనాలను కనుగొని వాటిని సమర్థవంతంగా ప్రజలు ఉపయోగించుకునే విధంగా చూచుట ద్వారా వ్యక్తి శ్రేయస్సు తద్వారా సమాజాభివృద్ధికై ప్రగుత్నించవలయును.

### ప్రశ్నలు

1. సామాజిక నియంత్రణా ఏజన్సీలను పేర్కొని నియంత్రణలో వాటి పాత్రను వివరించుము.
2. సామాజిక నియంత్రణ అనగానేమి? నియంత్రణా ఏజన్సీలను క్లుప్తముగా వివరించుము.
3. ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా వ్రాయుము.

ఎ) సామాజిక నియంత్రణలో కుటుంబము పాత్ర

బి) మతము-సామాజిక నియంత్రణ

సి) విద్య-సామాజిక నియంత్రణ

డి) సామాజిక నియంత్రణ-రాజ్యము-శాసనాలు

సి) సామాజిక నియంత్రణ ప్రాముఖ్యతను వ్రాయుము

యఫ్) సామాజిక నియంత్రణను ప్రభావితము చేయు అంశాలు

జి) సామాజిక నియంత్రణలో కుటుంబము శాసనాల పాత్రను వివరించుము

హెచ్) విద్య సామాజిక నియంత్రణ సాధనము వివరించుము

పాఠము : 21

# అనువంశికత (వారసత్వము) - సామాజిక వాతావరణం - వ్యక్తిపై వాటి ప్రభావము

(HEREDITY AND ENVIRONMENT - ITS INFLUENCE ON INDIVIDUAL)


21.0 లక్ష్యం

21.1 అనువంశికత - అర్థవివరణ

21.2 పరిసరాలు - అర్థవివరణ

21.3 అనువంశికత ఆధారంగా జాతుల వర్గీకరణ

21.4 వారసత్వము - జైవిక సిద్ధాంతాలు

21.5 అనువంశికతా లక్షణాలు

21.6 సంస్కృతిపై వారసత్వము యొక్క పాత్ర

21.7 వారసత్వము - ప్రజ్ఞ

21.8 కుటుంబాల పరిశీలన - అనువంశికత

21.9 నియంత్రిత పరిశీలన

21.10 పరిసరము - అర్థవివరణ - నిర్వచనాలు

21.11 పరిసరము వర్గీకరణ

21.12 సామాజిక పరిసరము - సామాజిక వారసత్వము

21.13 వారతస్వము - పరిసరము వాటి ప్రాముఖ్యత

21.14 సంస్కృతిపై పరిసరాల పాత్ర

21.15 అనువంశికత పరిసరాల సమ్మేళన ప్రభావము

21.16 సారాంశము


## 21.0 లక్ష్యం :

పర్సనాలిటీ అనే పదం 'పర్సొన' అనే లాటిన్ పదం నుండి వచ్చింది. రానురాను లాటిన్ భాషలో పర్సొన్ అనే పదం నుంచి పర్సని, లిటీ అనే ఇంగ్లీషు మాట వ్యవహారంలోకి వచ్చింది. దీనినే తెలుగులో మూర్తిమత్వము అంటారు. 'మూర్తి' అనగా ఆకారము 'తత్వము' అనగా మానసిక స్థితి లేక ఆలోచనలు, విజ్ఞానము, ప్రజ్ఞ మొదలగునవి. ఈ రెండు కలిసినట్లయితే దానిని మూర్తిమత్వము అని అందురు. శారీరక, మానసిక లక్షణముల సమగ్రరూపమే మూర్తిమత్వము అని అందురు.

కింబాల్ నిర్వచనము ప్రకారం "సామాజిక సహభాగిత దృష్ట్యా మనిషి వ్యవస్థీకరించుకున్న భావాలు, ప్రతిబింబాలు, దృక్పథాలు వీటి మొత్తమే మూర్తి-మత్వము". మానవుని వర్తనా విధానము, శీలం, విజ్ఞానం, ప్రత్యేక నైపుణ్యాలు, వైఖరులు, ఆశయాలు మొదలగు వాని యొక్క సంపూర్ణ సమ్మేళనమే అతడి మూర్తిమత్వము అని నిర్వచించవచ్చు. పరిసరాలతో సర్దుబాటు చేసుకోవడాన్ని నిర్ణయించే వ్యక్తి యొక్క అలవాట్లు, ఆలోచనలు, లక్షణాలు మూర్తిమత్వమని ఆల్‌పోర్టు అభిప్రాయం. రాబర్ట్ ఉడ్‌వర్త్ Robert S. Woodworth నిర్వచనము ప్రకారం మూర్తిమత్వము ఒక వ్యక్తి ప్రవర్తనలోని మొత్తం గుణాలను తెలియజేస్తుంది.

మానవుని ప్రవర్తన నిరంతరం మారుతుంటుంది. ఒక్కొక్క విధముగా వ్యక్తి ప్రవర్తించడం జరుగుతుంది. వ్యక్తి ప్రవర్తనను, అతని మూర్తిమత్వ లక్షణాంశములను అవగాహన చేసుకొనవలెనంటే అతని వారసత్వాన్ని పరిసరాలను అవగాహన చేసుకొనవలెను. వ్యక్తి సరి అయిన, సమగ్రమైన అభివృద్ధికి, అతనిలో శారీరక మానసిక లక్షణాల లోపాల కారణము. ఆ వ్యక్తి యొక్క వారసత్వము, పరిసరాలు, వ్యక్తిపైనే కాకుండా సమాజం పైన కూడా ఎక్కువగా ప్రభావాన్ని కలిగిస్తాయి. సమాజంపైన అనగా ముఖ్యముగా సంస్కృతిపై కూడ వారసత్వము, పరిసరాలు ప్రభావము ఎక్కువగా కలదు.

## 21.1. అనువంశికత - అర్థవివరణ (Meaning of Heridity)

వంశపారంపర్యంగా తల్లిదండ్రుల, తాతముత్తాతల, అమ్మమ్మ నాయనమ్మల, వారి పూర్వీకుల నుంచి సంతానానికి సంక్రమించే జైవిక లేదా మానసిక లక్షణాలనే అనువంశికత లేదా వారసత్వము అని అందురు. వ్యక్తులలో, సమూహాలలో కనపడే భిన్నతకు ముఖ్యంగా వారసత్వమే కారణమని చెప్పుకుంటాము. మానవులలో వారి సమాజాలలో ఉండే భిన్నతలను వివరించడానికి వారసత్వము ప్రబలమైన నిర్ణేత అని భావిస్తాము. మరియు ఆరోగ్యము, ప్రజ్ఞ వంటి గుణాలు వారసత్వము మీదే ఆధారపడతాయి.

## 21.2. పరిసరాలు అర్థవివరణ (Meaning of Environment) :

ఒక ప్రాణి చుట్టూ ఆవరించి ఉండేదంతా పరిసరమని చెప్పవచ్చు. పరిసమంటే కేవలం బయట ప్రపంచమనిగాని, చుట్టు ఆవరించి ఉన్న వస్తు సముదాయమనిగాని భావించకూడదు. ఒక జీవి పుట్టి పెరిగిన పరిసరాల ఫలితంగానే దాని నిర్మాణంగాని, గుణగణాలు గాని రూపొందుతాయి. జీవికి సామర్థ్యాలు, స్వభావాలు అవి పెరిగే పరిసరాల మీద ఆధారపడి ఉంటాయి. అంతేగాక ఆచారాలు, నమ్మకాలు, నైతిక విలువలు మొదలైన సాంఘిక గుణాలు పరిసరాల మీద ఆధారపడి ఉన్నాయని భావిస్తాము. మానవులు ఒక పరిసరం నుంచి మరొక పరిసరానికి అవసరాన్ని బట్టి మారగలరు. అయినప్పటికీ వారు పరిసరాలకి అతీతులుగాను, పరిసరం నుండి వేరుగాను జీవించలేరు. మానవ జీవితాన్ని పరిసరం చిత్రాతిచిత్రంగా మారుస్తుంది. ఉదా :- ఉత్తరహిందూస్థానం వారికి, దక్షిణ హిందూస్థానం వారికి సాంఘికాచార వ్యవహారాలలో భిన్నత్వం గోచరిస్తుంది. పర్వత ప్రాంతాలలో నివసించేవారికంటే తీర ప్రాంతాలలో నివసించే వారి ఆలోచనానుభూతులు వేరుగా ఉంటాయి.

## 21.3. అనువంశికత ఆధారంగా జాతుల వర్గీకరణ :

మానవులంతా ఒక జాతికి చెందిన వారే. కానీ శారీరక లక్షణాలను బట్టి మానవ శాస్త్రజ్ఞులు మానవులను మూడు (రకాలుగా) జాతులుగా విభజించినారు. 1. కాకసాయిడ్ లేదా శ్వేతవర్ణజాతివారు. 2. మంగోలాయిడ్ లేదా పసుపువర్ణ జాతివారు. 3. నీగ్రోయిడ్ లేదా నలుపు వర్ణ జాతివారు.

**21.3.1. కాకసాయిడ్ జాతి :** ఈ జాతి వారిఛాయ తెలుపు నుంచి గోధుమ రంగు వరకూ ఉంటుంది. కొంచెం వెంట్రుకలు మృదువుగా వుండి నిటారుగా గాని, ఉంగరాలుగా గాని ఉంటాయి. కంటి పాపలు నీలంగా గాని, గోధుమరంగుగాని ఉంటాయి. నాసిక ఎత్తుగాను, సన్నగాను ఉంటుంది. ముఖం వంకర లేక తీర్చిదిద్దినట్లు ఉంటుంది. శరీరం మీద రోమాలు పలుచగా పెరిగి వుంటాయి. శిరస్సు పొడుగుగా కొంచెం విశాలంగా వుంటుంది. ఈ జాతి వారిని మూడు ప్రధాన ఉపజాతులుగా విభజించారు. 1) నారిక్ 2) ఆల్పైన్ 3) మధ్యధర. ఈ జాతి లక్షణాలున్న ప్రజలు ఎక్కువగా యూరోప్, ఉత్తర ఆఫ్రికా, పశ్చిమ ఆసియా, భారత దేశాలలో ఉన్నారు.

**21.3.2. మంగోలాయిడ్ జాతి :** ఈ జాతి వారి చర్మం పసిమిరంగు లేదా కొంచెం గోధుమ ఛాయలోను ఉండి, కేశాలు మృదువుగా, నిటారుగా ఉంటాయి. శరీరం మీద రోమాలు పలుచగా వుంటాయి. రెప్పలు కలిసే చోట చర్మం ముడతలు పడి వుండటం ఈ జాతి లక్షణాలు. శిరస్సు సామాన్యంగా గుండ్రంగా వుంటుంది. చెక్కిలి ఎముకలు ఎత్తుగా ఉంటాయి. ముఖం దాదాపు చదునుగా వుంటుంది. నాసిక పొట్టిగా వుండి చప్పిడిగా కనపడుతుంది. ఈ జాతి వారు ఎక్కువగా మంగోలియా, మంచూరియా, చైనా, కొరియ, జపాన్ మొదలైన దేశాలలో కనిపిస్తారు.

**21.3.3 నీగ్రోయిడ్ జాతి :** ఈ జాతి ప్రజల శరీరచ్ఛాయ ముదురు గోధుమ వన్నె మొదలుకొని నలుపురంగు వరకు వేరువేరు ఛాయలలో ఉంటుంది. వారి శిరోజాలు మెలికలు తిరిగి ఉన్ని మోస్తరుగా మెత్తగా, నల్లగా ఉంటాయి. శరీరం పైన రోమాలు పరిమితంగా పెరుగుతాయి. ముక్కు చదునై వెడల్పుగా ఉంటుంది. కళ్ళు నల్లగా ఉన్నా కళ్లలో తెల్లని భాగం పసుపు పచ్చగా ఉన్నట్లనిపిస్తుంది. నోరు పెద్దది. పెదవులు పైకి తిరిగి ఉంటాయి. ఈ జాతి వారు ఎక్కువగా దక్షిణ ఆఫ్రికాలో నివసిస్తారు. బుష్మెన్‌లు, హాటెన్‌టాట్‌లు ఈ జాతికి చెందిన వారే.

## 21.4. వారసత్వము - జైవిక సిద్ధాంతాలు :

వారసత్వమంటే జైవికంగా, మానసికంగా తల్లిదండ్రుల నుంచి సంతానానికి సంక్రమించే కొన్ని లక్షణాలు. స్త్రీ - పురుషుల కలయిక జరిగినప్పుడు స్త్రీ గర్భంలో అండకణంతో, శుక్లకణం (Sperm) కలిసినప్పుడు సంయుక్త బీజం మైటాసిస్ అనే కణవిభజన చెందుతుంది. ఈ విధంగా ఏర్పడిన ప్రతికణంలోనూ 24 జతల క్రోమోజోములు ఉంటాయి. ప్రతి జతలోనూ ఒకటి తల్లికి సంబంధించింది, రెండోది తండ్రికి సంబంధించింది అయి ఉంటుంది. గుణకారం ప్రకారం కణవిభజన చెంది కోటానుకోట్లుగా విభజితమవుతుంది. కొన్ని కొన్ని కణసముదాయాలు ఒక్కొక్క అవయవంగా ఏర్పడి, పూర్తి మనిషి ఆకారంగా ఏర్పడి, తొమ్మిది నెలల తరువాత తల్లి గర్భం నుండి బయటకు రావడం జరుగుతుంది. అంటే పుట్టే సంతానంలో తల్లి వంశం నుండి సగం, తండ్రి వంశం నుండి సగం లక్షణాలు వస్తాయి. ఈ క్రోమోజోమ్స్‌లో జీన్స్ అనే పదార్థం ఉంటుంది. ఈ జీన్సే తల్లిదండ్రుల నుంచీ, వారి వంశాల నుంచీ వ్యక్తికి కొన్ని శారీరక, మానసిక లక్షణాల్ని సంక్రమింపజేస్తూ ఉంటాయి. వీటినే అనువంశికత లక్షణాలు అని అంటారు. అనువంశికత ద్వారా వ్యక్తి శరీరం భౌతిక లక్షణాలు, అంటే పొడవు, పొట్టి, లావు, సన్నం మొదలైన లక్షణాలు శరీరం రంగుని, తలవెంట్రుకల స్వరూపాన్ని, కనుగుడ్ల రంగునీ, విజ్ఞానం, ప్రజ్ఞ మొదలైన అంశాల్ని వంశపారం పర్యంగా సంక్రమింప జేసుకుంటూ ఉంటాడు. ఈ లక్షణాలన్నీ జీన్స్ ద్వారా సంభవిస్తాయి.

**21.4.1 కవలపిల్లలు (Twins) :** కొందరు కవల పిల్లలను కనడం జరుగుతుంది. అవి రెండు రకాలు. 1) సాధారణ కవలలు (2) ఏకరూప కవలలు

రెండు కానీ అంతకన్నా ఎక్కువ మంది కానీ పిల్లలు పెరుగలేరు. వీరు పూర్తిగా ఒకరినొకరు పోలి ఉండరు. ఒక్కొక్కప్పుడు కవల పిల్లల్లో ఆడా, మగా తేడాలు కూడా ఉంటాయి. ఇటువంటి కవల పిల్లల్ని మనం సాధారణంగా చూస్తూనే ఉంటాం. అయితే ఏకరూప కవలలు అపురూపమైన వారు. వీరు అసాధారణమైన వ్యక్తులు. ఇటువంటి కవలలు ఎప్పుడోకాని ఎక్కడోకాని పుట్టడం సంభవించదు. స్త్రీ పురుషుల కలయిక వల్ల సంయుక్తబీజం ఏర్పడుతుందని తెలుసుకున్నాం. ఈ సంయుక్త బీజం మొదట కణవిభజన జరగగానే రెండుకణాలుగా విడిపోతుంది. ఈ రెండు కణాలు విడివిడిగా పెరిగితే ఏకరూప కవలలు పుడతారు. సంయుక్త బీజకణం నుండి ఇద్దరు పిల్లలు పుట్టడం వల్ల ఈ ఇద్దరి పిల్లలలోనూ ఒకే రకమైన జీన్సు ఉంటాయి. అందువల్ల జన్మించే పిల్లలు ఇద్దరూ నూటికి నూరుపాళ్ళు ఒకే రకంగా ఉంటారు. వారిలో ఏ మాత్రం తేడాలుండవు. ఒకరినొకరు పూర్తిగా పోలిఉంటారు. వారిద్దరిలోనూ ఒకే రకమైన వంశపారంపర్య లక్షణాలుంటాయి. అంటే వారిద్దరి అనువంశికత ముమ్మూర్తులా ఒక్కటే.

**21.4.2 లింగభేదము :** స్త్రీ, పురుషుల కలయిక అనంతరం స్త్రీ విడుదల చేసే అండంలో 23 జతల క్రోమోజోములు ఉంటాయి. పురుష బీజకణంలో 22 X X క్రోమోజోమ్స్, ఒక్క జత X 4 క్రోమోజోములుంటాయి. స్త్రీ అండంలో 23 క్రోమోజోములు X గానే ఉంటాయి. పురుషుడు విడుదల చేసే 23 వ క్రోమోజోమ్ 4 అయినప్పుడు స్త్రీ అండంలో ఉండే X తో కలసి X+4 అవుతుంది. ఆ జన్మించే శిశువు మగపిల్లవాడు అవుతాడు. పురుషుడు విడుదల చేసే 23 వ క్రోమోజోము X అయినప్పుడు స్త్రీ అండంలోని X తో కలసి X+X ఏర్పడి ఆడశిశువు జన్మిస్తుంది.

## 21.5. అనువంశికతా లక్షణాలు :

వారసత్వము అనునది తల్లిదండ్రుల, తాతముత్తాతల నుండి జైవిక మరియు మానసిక లక్షణాలను సంక్రమింపచేస్తుంది. అంటే వ్యక్తి యొక్క భౌతిక లక్షణాలైన పొడుగు, పొట్టి, తెలుపు, నలుపు, సన్నము, లావు అనేవి నిర్ణయింపబడతాయి. ముఖ్యముగా సమూహాలలో కనపడే భిన్నత్వమునకు వారసత్వమే కారణమని చెప్పవచ్చును. రెండవదైన ఆరోగ్యము, ప్రజ్ఞాపాటవాలు కూడా వారసత్వ లక్షణాలే.

## 21.6 సంస్కృతిపై వారసత్వము యొక్క పాత్ర :

సంస్కృతి అనునది ప్రతి సమాజానికి, సముదాయానికి, సమూహానికి, వ్యక్తికి తప్పనిసరి అయినది. జనాభా పెరిగిన కొలది ప్రచార, ప్రయాణ సాధనాలు పెరుగుతున్న కొలది సంస్కృతి విస్తృతమవుతుంది. సంస్కృతి అనునది ముఖ్యముగా ఒక తరం నుండి ఇంకోతరానికి వారసత్వము రీత్యా సంక్రమిస్తుంది. వారసత్వ రీత్యా ఏర్పడే జనాభాకు సాంఘికీకరణ ద్వారా సామాజిక వ్యక్తులుగా తయారు చేస్తుంది. సంస్కృతిలో ముఖ్యమైన సాంఘిక నియంత్రణను వారసత్వము కాపాడుతుంది. ప్రస్తుతం వున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక పరమైన విజ్ఞానము పూర్వం మన ముందు తరాలవారు సమీకరించిన విజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని మనము ప్రస్తుతము ఉన్న విజ్ఞానాన్ని ఏర్పరచుకొని ఉపయోగించుకోగల్గుతున్నాము. ఇది అంతయు వారసత్వము వలన సాధ్యపడగలదు.

## 21.7 వారసత్వము - ప్రజ్ఞ :

ఉన్నత సామాజిక స్థాయిలో వుండి ప్రజ్ఞావంతులైన వారి సంతానం ప్రధానంగా విశిష్టులైన వ్యక్తులై ఉంటారని కొన్ని పరిశోధనల వల్ల తేలింది. ఉదా : రాజకుటుంబాలలో ఎక్కువమంది విశిష్ట వ్యక్తులుంటారు. అంతేకాక వృత్తి పరంగా కూడా ప్రజ్ఞ విభిన్న స్థాయిలలో ఉంటుందని కొన్ని అధ్యయనాల వల్ల తేలింది. ఉదా : ఉన్నత వృత్తి వర్గాలలో ఉన్న తల్లిదండ్రుల సంతానానికి ఒక భిన్నమైన ప్రజ్ఞ ఉంటుంది. ఒక రకంగా గుమాస్తాలు, నిపుణ వృత్తులలో ఉన్నవారి సంతానానికి ప్రజ్ఞ ఒక రకంగా, శ్రామిక వర్గంలో ఉన్నవారి సంతానానికి ప్రజ్ఞ ఒక రకంగా ఉంటుందని కొన్ని పరిశోధనల వల్ల తేలింది. ప్రజ్ఞా పాటవాలలో విశిష్టులుగా తయారుకావడానికి పూర్తిగా వారసత్వమే ప్రబలమైన కారకమని నిర్ణయించడానికి వీలులేదు. ఉదా : నీగ్రో, శ్వేత జాతుల వారిలో జరిపిన ప్రజ్ఞా పరీక్షల ఫలితాలను బట్టి వారసత్వానికి, పరిసరాలకు ఉన్న ప్రభావాన్ని నిర్ణయించడం కష్టమని తేలింది.

## 21.8. కుటంబాల పరిశీలన : అనువంశికత

అనువంశికతా ప్రభావాన్ని సమర్థించడానికి అనేక అధ్యయనాలు జరిగాయి. వాటిలో ఒకటి జూక్ వంశం పైన, మరొకటి ఎడ్వర్డ్ వంశం వారిపైనా జరిగింది. ఎడ్వర్డ్ వంశానికి చెందిన వారిని ఎ.ఇ. విన్‌షిప్ అధ్యయనం చేశాడు.

న్యూయార్క్ నగరంలో 1720 వ సంవత్సరంలో జన్మించిన జూక్ ఒకే వంశానికి చెందిన 1200 మందిని గుర్తించి, వారికి సంబంధించిన అనేక విషయాలను 1877 వ సంవత్సరంలో సేకరించి అధ్యయనం చేశారు. వీరిలో 420 మంది వికలాంగులుగాను, రోగులు గానూ ఉన్నారు. 310 మంది తిరుగుబోతులు, 130 మంది నేరస్థులు. ఈ నేరస్థులలో 7 మంది హంతకులుగానూ గుర్తించబడ్డారు. వీరిలో 300 మంది బలహీనత వల్ల మరణించారు. ఈ జూక్ వంశానికి చెందిన స్త్రీలలో సగానికి పైగా పడుపు వృత్తిలో తమ జీవితాన్ని కొనసాగించడం జరిగింది.

1900 సంవత్సరంలో గుర్తించబడ్డ జొనాథన్ ఎడ్వర్డ్ వంశస్థుల గురించి తెలిసిన సమాచారాన్ని బట్టి ఈ వంశానికి చెందిన వారిలో కనీసం 295 మంది కాలేజీల్లో చదివి డిగ్రీలు పొందారు. 13 మంది వారు చదివిన కాలేజీలకు ప్రెసిడెంట్లుగా ఉన్నారు. ఈ వంశస్థులు చాలా మంది వివిధ వృత్తుల్లోనూ, వ్యాపార రంగంలోనూ ఎంతో నైపుణ్యాన్ని సంపాదించారు. ఈ వంశస్థులలో ఒకరు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు

వైస్ ప్రెసిడెంట్‌గా చేయడం కూడా జరిగింది. మిగతా వారిలో కూడా చాలా మంది గౌరవనీయమైన వృత్తులను చేపట్టి సమాజంలో హోదా, ప్రతిష్ట పొందారు. ఈ రెండు అధ్యయనాలు మనిషిపైన అనువంశికత ప్రభావమే చాలా ఎక్కువగా ఉంటుందని తేలింది. ఒక్కొక్కప్పుడు తల్లిదండ్రులకుండే మంచి లక్షణాలు సంతానానికి సంక్రమించక వాటిస్థానే వారిలో ఉండే చెడు లక్షణాలే సంక్రమించవచ్చు. అందువల్ల ఏ ఇద్దరు జూక్‌లుగాని, ఎడ్వర్డ్‌లు గాని ఒకరినొకరు పోలి ఉండరు.

## 21.9. నియంత్రిత పరిశీలన :

వారసత్వ ప్రభావాన్ని గురించి పైన చెప్పిన పరిశోధనలన్నింటినీ అనియంత్రిత పరిశోధనలుగా చెప్పుకోవచ్చు. ఇందులో ఏ కారణాన్ని కూడా నిశ్చలంగా ఉంచి పరిశీలన జరపలేదు సమాజ శాస్త్రజ్ఞులు వారసత్వము, పరిసరము అన్న వాటి పాత్రలను నిర్ణయించడానికి కొన్ని నియంత్రిత ప్రయోగాలను చేసినారు. ఉదా: ఒకే వారసత్వాన్ని పంచుకున్న ఇద్దరు కవల పిల్లలను, విభిన్న పరిసరాలలో పెంచి పరిసర ప్రాధాన్యాన్ని ఆపాదించినారు. అందువల్ల వ్యక్తి ప్రవర్తనమీద వారసత్వ పరిసరాల ప్రభావాన్ని - ఇదమిద్ధంగా చెప్పలేము.

వారసత్వము, పరిసరము అన్న ఈ రెండింటి పరస్పర చర్యల పర్యవసానమే మానవ ప్రవర్తన. ఈ రెండింటి పరస్పర చర్యలను విస్తరించి, ఒక కారకాన్ని విస్మరించడానికి వీలులేదు. ప్రతిస్థితిలోనూ రెండింటి ప్రభావమూ ఉంటుంది. ఒక ప్రత్యేకమైన స్థితిని కల్పించడంలో రెండూ క్రియాత్మకంగా పనిచేస్తాయి. అన్ని స్థితులలో పరిసరము వారసత్వము ఒకే విధంగా సంయోగాన్ని పొందలేవు. వారసత్వము, పరిసరము అనే ఈ రెండు రకాలు భిన్నమైన విధాలుగా సంయోగం చెంది మూర్తిమత్వాన్ని రూపొందిస్తాయి.

## 21.10 పరిసరము - అర్థవివరణ నిర్వచనాలు (Environment) :

మానవుని చుట్టూ ఉండే మొత్తం పరిసరాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి దాన్ని కొన్ని రకాలుగా విభజించడం జరిగింది. కాని నిజానికి మనం అనుకొన్నట్లు మానవుడు తన అనుభవంలో పరిసరాన్ని వేర్వేరుగా విభజించి చూడలేడు. ఉదా : నిర్జన ప్రాంతాన్ని ఆక్రమించుకున్నప్పుడు లేదా ఒక ప్రదేశంలో నివసించడానికి ఇల్లు కట్టుకొన్నప్పుడు మానవుని భౌగోళిక పరిసరము సామాజిక పరిసరంగా మారుతుంది. కాబట్టి అతని అనుభవంలో పరిసరంలో భౌతిక సామాజికాంశాలు అన్నీ కలిసి ఒకే పరిసరంగా ఉంటాయి.

మొత్తం పరిసరము అనే భావాన్ని మెకైవర్ వివరించినాడు. వ్యక్తి జీవితం మొత్తం పరిసరం వల్ల ప్రభావితమవుతుంది. ఇందులో అతడు భౌతిక సామాజికాంశాలను రెండింటిని వేరు పరచి చూపినాడు. పరిసరాలకు సంబంధించిన ఈ వర్గీకరణం స్థూలమైంది. కొందరు సహజ పరిసరము, కృత్రిమ పరిసరము, సామాజిక పరిసరము అనె మూడు పరిసరాలను ప్రస్తావించారు.

## 21.11 పరిసరము వర్గీకరణ :

సహజ పరిసరము, కృత్రిమ పరిసరము కలసి మానవుని భౌతిక పరిసరమని చెప్పవచ్చు. మానవ నిర్మిత పరిసరాన్ని రెండు రకాలుగా విభజించినారు. అవి : 1) బాహ్యపరిసరము 2) అంతర పరిసరము.

**21.11.1 భౌగోళిక పరిసరము (Geographical Environment) :** మానవుని భౌతిక పరిసరంలో భౌగోళిక కారకాలు చేరి ఉన్నాయి. వ్యక్తుల లేదా సమూహాల ప్రవర్తనను నిర్ణయించడంలో భౌగోళిక పరిసరం విశిష్టమైన పాత్రను వహిస్తుంది. భౌగోళిక పరిసరానికి సామాజిక పరిసరానికి ఉన్న సంబంధాన్ని వివరించడానికి సమాజ శాస్త్రంలో మాంటెస్క్యూనాటి నుండీ ప్రయత్నాలు జరుగుతూ వచ్చినాయి. ఈ విషయంలో లీప్లే, డెమొలిన్స్, బ్రూన్‌హెస్ వంటి ఫ్రెంచి రచయితలు చాలా పరిశోధనలు జరిపినారు. భౌతిక నివాసానికీ, సామాజిక నివాసానికీ ఉన్న సంబంధాన్ని బట్టి రెండు వాదాలు ఏర్పడినాయి. అవి : ఆవరణవాదము, ప్రాంతీయ వాదము.

**ఆవరణ వాదము :** ఈ వాదాన్ని అనుసరించి సమాజ శాస్త్రజ్ఞులు కొన్ని పరిశీలనలను చేశారు. మానవుల సామాజిక సాంస్కృతిక వ్యవస్థయం మీద గ్రామీణ, నగర పరిసరాల ప్రభావాన్ని పరిశీలించినారు.

**ప్రాంతీయ వాదము :** మానవుల సామాజిక జీవనం మీద భౌతిక పరిసరానికి ప్రభావం ఉంటుందన్న వాదనను జర్మనీ దేశం రాట్జెల్ అనే శాస్త్రజ్ఞుడు మొట్టమొదట సారిగా ప్రారంభించారు. ఇంగ్లండు లో ఒకాల్, అమెరికాలో సెరఫెల్, డెక్స్టర్, హంటింటన్ అనే శాస్త్రవేత్తలు ఈ వాదాన్ని బలపరిచారు.

మార్పులేనివి, అనియంత్రిత కారకాలైన భూమి, ఉపరితలం, దాని భౌతిక లక్షణాలు, సహజవనరులైన నేల, నీరు, పర్వతాలు, పీఠభూములు, ఖనిజాలు, చెట్లు, జంతువులు, సముద్రపు ఆటుపోటులు, ఋతువులు, వర్షము, గాలులు మొదలైన వాటిని మానవుడు తన విజ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించి తన అవసరాలకు అనుగుణంగా మార్చుకొంటున్నాడు. ఉదా : ఋతువు క్రమాన్ని మార్చలేక పోయినప్పటికీ వాటినుంచి తనను రక్షించుకోగలుగుతున్నాడు. అలాగే పర్వతాల స్థానాన్ని మార్చలేకపోయినప్పటికీ వాటిని తొలిచి అందులో నుంచి రహదారుల ఏర్పరుస్తున్నాడు.

ఒక జాతికి ప్రత్యేకమైన లక్షణాలు ఏర్పడటానికి భౌగోళిక ప్రదేశము, వాతావరణము దోహదం చేస్తాయి. ఉదా: మధ్య ఆఫ్రికా ఉష్ణ మండలంలో ఉంది. ఉష్ణ వాతావరణం వల్ల అక్కడి ప్రజలు నల్లగా ఉన్నారు. ఆ దేశపు నాగరికత అక్కడి ప్రజలు సమకూర్చుకొన్నదే. కాబట్టి వాతావరణం మానవ శరీరం మీద సమాజం మీద తన ప్రభావాన్ని చూపిస్తుంది. శరీరం భౌగోళిక పరిసరాల ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. శరీరం భౌగోళిక పరిసరాల ప్రభావాన్ని బట్టి మార్పు చెందుతూ, ఆ వాతావరణానికి సర్దుబాటు చేసుకుంటుంది.

ఉదా : ఎస్కిమోల నాసిక రంధ్రాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అందువల్ల వారు చలిగాలి పీల్చినప్పుడు ఆ గాలి చర్మం ద్వారా లోనికి పోవడం వల్ల కొంత వెచ్చదనాన్ని అనుభవించడానికి వీలుగా ఉంటుంది.

మరికొందరి పరిశోధనలో జనాభా పెరుగుదలకు, వలసలకు భౌగోళిక స్థితిగతులు కొంతవరకు కారణం ఉందనితేలింది. నదీ ప్రాంతాల్లోను, సారవంతమైన పీఠభూములలోనూ జనసాంద్రత ఏర్పడి నగరాలు బయలుదేరి నాగరికత అభివృద్ధి చెందింది. నదుల మోస్తరుగానే సముద్ర తీరాలు కూడా నాగరికత స్థితిగతులను నిర్ణయిస్తాయి. నౌకాయానంలో ప్రత్యేకతను సంపాదించుకున్న బ్రిటిష్ వారి చరిత్ర ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. వివిధ ప్రాంతాలలో నివసించే వారిలో ఉన్న భిన్నతలు కూడా భౌగోళికపరమైనవే. ఆర్థిక పరిస్థితులు కూడా భౌగోళిక పరమైనవే. ఉదా : ప్రజల నివాసము, రహదారులు, వ్యవసాయము, పశు సంపద. ప్రపంచంలోని గొప్ప నాగరికతలు సమశీతోష్ణ మండలంలోనే ఏర్పడ్డాయి.

**21.11.2 సాంకేతిక పరిసరము (Technological Environment) :** మానవ నాగరికతా పరిణామాన్ని పరిశీలిస్తే సమాజంలో మనిషి తాను సంపాదించుకున్న సాంకేతిక విజ్ఞానం యొక్క పాత్ర స్పష్టం అవుతుంది. తాను సంపాదించుకున్న విజ్ఞానం సహాయంతో కొన్ని ధాతువులను తీసుకుని మూలపరిసరాల నుంచి వాటిని వేరు చేసి పనిముట్లు, యంత్రాలు మొదలైనవాటిని రూపొందించినారు. మానవులు ఇతర జంతువులవలె జైవికమైన అవసరాలను తృప్తిపరచుకొని సంతృప్తి చెందలేదు. మానవ నాగరికతా పరిణామం ఆహారం, గృహము, లైంగిక వాంఛ వంటి ముఖ్యావసరాలను అధిగమిస్తూ సాగింది. ఆహారాన్వేషణ కొరకై మానవుడు సంక్లిష్ట పరిస్థితులు సంభవించిన కొద్దీ అతని సాంకేతిక నైపుణ్యమూ, భౌతిక సంస్కృతీ వృద్ధి పొందినాయి. నిప్పుచేయడం, ఇళ్ళు కట్టుకోవడం మొదలైనవి ప్రథమ దశలలో జరిగాయి. సాంకేతిక నైపుణ్యాన్ని అనుసరించి ప్రాచీన శిలాయుగమని, నవీన శిలాయుగమని, లోహయుగమని సంస్కృతిని మూడు దశలుగా పేర్కొన్నారు.

**21.11.3 జైవిక పరిసరము (Biological Environment) :** మానవుడు తనకు సన్నిహితాలైన ఏప్‌కంటే భిన్నమైన లక్షణాలను సముపార్జించుకోవడం వల్ల వేరుపడ్డాడు. ఇటీవల కాలం వరకు మానవుడు తానొక విశిష్ట సృష్టినని భావిస్తుండేవాడు. కొన్ని శాస్త్రీయమైన

పరిశోధన వల్ల ఉన్నతస్థాయి జంతువులకు, మానవునికీ పుట్టుక సమానమని నిరూపించడం జరిగింది. సహజావరణ ప్రక్రియ మరియ జన్యువులు మార్పిడి కూడా జీవించటానికి ఎవరు అర్హులో నిర్ణయిస్తుంది. అందవలనే ప్రపంచంలో మానవులందరు వారివారి శారీర లక్షణాలను అనుసరించి వివిధ జాతుల క్రింద విడిపోయినారు.

## 21.12. సామాజిక పరిసరము - సామాజిక వారసత్వము :

భౌతిక పరిసరం మొస్తరుగానే సామాజిక పరిసరం కూడా వ్యక్తికి సంబంధించిన మొత్తం పరిసరంలో ఒక భాగము. మానవుడు తనకు సంక్రమించిన వారసత్వానికి జంతువుల వలె సంతృప్తి చెందక మరికొంత జతపరచగలుగు తున్నాడు. గ్రాహంవాలెస్ అనేవాడు సామాజిక వారసత్వాన్ని ఈ విధంగా నిర్వచించినాడు. ఒక తరం నుండి మరొక తరానికి మానవుడు వివిధ సమూహాలలో పాల్గొనడం చేత విద్య ద్వారా వచ్చే జ్ఞానాన్ని అభ్యాసాలను రూపొందించుకొన్న సాధనోపరికరణాలను కలిపి మొత్తంగా, సూచించడానికి "సామాజిక వారసత్వమన్న" పదాన్ని వాడినాడు. సమాజంలో కళలు, సాధనాలు పురాణగాధలు, రీతి, రివాజులు మొదలైనవి ఒక తరం నుండి మరొక తరానికి సామాజికంగా సంక్రమిస్తాయి. వ్యక్తి వికాసానికి సామాజిక వారసత్వం మీద పూర్తిగా ఆధారపడినాడు. సామాజిక వారసత్వం సహాయం లేకుండా వ్యక్తి జైవికమైన జీవిగా మనుగడ సాధించలేడు. అయితే సామాజిక వారసత్వాన్ని సమాజంలోని అన్ని అంశాలను ఏ ఒక్క వ్యక్తి పూర్తిగా సాధించలేడు. అందుచేత సామాజిక వారసత్వాన్ని సమాజ సభ్యులంతా సమంగా సముపార్జించలేరు.

## 21.13 వారసత్వము, పరిసరము వాటి ప్రాముఖ్యత :

మానవుని ప్రవర్తనను వారసత్వము, పరిసరము అన్నవి రెండూ ప్రభావితం చేస్తాయి. అయితే ఈ రెండింటిలో ఏది ముఖ్యమైన, ప్రబలమైన కారకము అన్న ప్రశ్న సామాన్యంగా బయలుదేరుతుంది. ఈ విషయాలు ఒక నిర్ణయానికి వచ్చేముందు దీనిని గురించి జరిగిన కొన్ని పరిశోధనలను పరిశీలించడం ముఖ్యము. వారసత్వాన్ని ప్రబలమైన కారకంగా ప్రతిపాదించే వారిలో గాల్టన్, కారల్ పియర్‌సన్, మెక్‌డగాన్, జి.బి. వాట్సన్ మొదలైనవారు ముఖ్యులు. వీరందరూ వారసత్వానికి ఎక్కువ ప్రాధాన్యతను ఆపాదించినారు. దీని ద్వారా విశిష్టమైన ప్రజ్ఞ ఉన్న తల్లిదండ్రులకు ప్రజ్ఞావంతులైన బిడ్డలు కలిగే అవకాశాలున్నాయని వివరించినాడు. కుటుంబాల పరిశీలన ద్వారా వారసత్వము ప్రముఖమైన పాత్ర పోషిస్తున్నదని చెప్పవచ్చును. ఉదా : జూక్స్, ఎడ్వర్డ్స్ కుటుంబాలు.

కార్ల్‌పియర్సన్ కూడా మానవ విభిన్నతలలో పరిసరం కంటే వారసత్వమే ప్రధానమైన పాత్ర వహిస్తుందన్న నిర్ణయానికి వచ్చినాడు. అతడు దీనికి నిదర్శనంగా ఒకే సముదాయంలో ఒకే పరిసరాలలో జీవించే జాతిలో పరిసరం కంటే వారసత్వమే ఏడురెట్లు ప్రబలమైందని వివరించాడు. వీటినన్నింటిని నియంత్రిత పరిశీలనల ద్వారా నిరూపించారు.

## 21.14. సంస్కృతిపై పరిసరాల పాత్ర

నేటి ఆధునిక కాలంలో పరిసరాల ప్రభావం రోజురోజుకీ పెరుగుతున్నది. జె.బి. వాట్సన్ అనే శాస్త్రవేత్త, వ్యక్తి పరివర్తనపై పరిసరాల ప్రభావాన్ని వివరిస్తూ 6 నెలల పిల్లవాడిని నాకిచ్చినట్లయితే 20 సం. తరువాత ఏ విధంగా కావాలంటే ఆ విధంగా తయారు చేస్తానని చెప్పి నిరూపించాడు. ఏ ప్రాంతంలోనైతే సరి అయిన సహజవనరులు లేదా భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా ఉంటాయో అక్కడ సంస్కృతి, నాగరికత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. పరిసరాలు మూడు రకాలు. భౌగోళిక, కృత్రిమ మరియు సామాజిక పరిసరాలు. అనగా వ్యక్తి చుట్టు ఉన్న సమాజము, సంస్థలు, సమితులు, సాంఘికీకరణ, సంస్కృతీకరణము, సామాజిక మార్పు, సామాజిక నియంత్రణ మొదలైనవి. కనుక తప్పనిసరిగా సంస్కృతికి, పరిసరాలకి మధ్య సహజసంబంధము ఉంటుంది.

## 21.15. అనువంశికత పరిసరాల సమ్మేళన ప్రభావము :

మనిషిపైన అనువంశికతా ప్రభావం ఎక్కువగా ఉంటుందా? పరిసర ప్రభావం ఎక్కువగా ఉంటుందా? అనే దానిపై ఎన్నో పరిశోధనలు జరిగాయి. యదార్థానికి ఒకే దృక్పథాన్ని కలిగిన ఈ రెండు సిద్ధాంతాల్ని మనం వ్యతిరేకించాలి. ఎందుకంటే అనువంశికత, పరిసరాలు రెండూ విడదీయలేనివి. ఈ రెండు అంశాల సమ్మిశ్రమ ఫలితమే మానవుని మూర్తి మత్వము. మానవ జీవితంలో ఏర్పడ్డ సంఘటనలన్నీ ఈ రెండు అంశాలు ప్రభావము వల్ల ఏర్పడతాయి. మానవునికి శారీరకమైన అన్ని శక్తులూ అనువంశికత వల్ల ఏర్పడతాయి. ఈ శక్తులను ఎలా ఉపయోగించుకోవాలి, తమ వాంఛల్ని ఎలా నెరవేర్చుకోవాలి అనే విషయాలు పరిసరాల మీద ఆధారపడి ఉంటాయి. మానవుడు పెద్దవాడౌతున్న కొద్దీ అతనిలో శారీరక, మానసిక శక్తులు అనువంశికత ద్వారా సంక్రమిస్తూ ఉంటాయి. ఈ శక్తియుక్తుల్ని ఉపయోగించుకోవం, తిరిగి వాటిని అభివృద్ధి పరచుకోవడం అనేవి ఒక వ్యక్తి నివసిస్తున్న పరిసరాలపైన ఆధారపడి ఉంటుంది.

ఈ శారీరక శక్తి యుక్తులను అభివృద్ధి పరచుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయా లేదా తక్కువగా ఉంటాయా అనే విషయం ఆ వ్యక్తి నివసిస్తున్న పరిసరాల మీద ఆధారపడి ఉంటుంది. ఒక ప్రత్యేక అనువంశికత గల వ్యక్తులు పరిసరాలను ఎలా ఉపయోగించుకుంటున్నారు, పరిసరాలలో ఎటువంటి మార్పును తీసుకు వస్తున్నారు అనే విషయాలను అవగాహన చేసుకోవడం కాక దానితో పాటు ఒక ప్రత్యేక పరిసరం, ఒక ప్రత్యేకమైన అనువంశికత కలిగి యున్న వ్యక్తుల ప్రవర్తనలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుంది, వారి మూర్తిమత్వ రూపకల్పన ఏ విధంగా తోడ్పడుతుంది అనే విషయాన్ని కూడ మనము దృష్టిలో పెట్టుకోవాలి.

## 21.16. సారాంశము :

యదార్థానికి వ్యక్తి మూర్తిమత్వము, అనువంశికత, పరిసరాల ప్రభావముపై ఆధారపడి యుండును. కావున ఈ రెండు అంశాల ప్రభావము విడదీయరానిది. వీటి సమ్మేళన ఫలితముగ వ్యక్తి మూర్తిమత్వాన్ని పొందగలుగుతాడు. ఒక్కొక్కప్పుడు వ్యక్తి పరిసరాలకు బానిస అగుటయే కాక వాటిని కూడ అదుపులో పెట్టగలుగును. తన అనువంశికత ప్రభావము వలన పరిసరాలలో మార్పులు తీసుకువచ్చి సంస్కృతి, మూర్తిమత్వములో ప్రగతిని సాధిస్తాడు. అనువంశికత మానవునికి శారీరకంగా ఒక ప్రాణికి లభించే అన్ని లక్షణాలను కలుగజేయగా, ఈ ప్రాణి సామాజిక జీవిగా రూపొందటానికి పరిసరాలు దోహదం చేస్తాయి. అనువంశికత లేకపోతే జీవము ఉండదు. అనువంశికతలో జన్మ ఎత్తిన వ్యక్తి పరిసరాల ప్రభావము లేకపోతే మనిషిగా, సంఘజీవిగా మారడం అసంభవం. కావున దీనిని బట్టి మనకు తెలిసేది ఏమిటంటే, వ్యక్తిపై సర్వకాల సర్వావ్యవస్థలలోను అనువంశికత, పరిసరాల ప్రభావము ఉంటాయి. ఈ రెండు అంశాలు అవిభాజ్యాలు. అంటే విడదీయరానివి.

### ప్రశ్నలు

1. వారసత్వము లేక అను వంశికత అనగా నేమి? వ్యక్తిపై దాని ప్రభావాన్ని వివరించుము?
2. వ్యక్తిపై అనువంశికత - పరిసరాల ప్రభావమును వివరించుము?
3. అనువంశికత మరియు పరిసరాల ప్రాముఖ్యతను వివరించుము?
4. వ్యక్తి మూర్తిమత్వముపై అనువంశికత, వారసత్వాల ప్రభావమును వివరించుము?
5. వివిధ రకాలైన పరిసరాలను విరించి వ్యక్తిపై వాటి ప్రభావమును వివరించుము?
6. సంస్కృతిపై వారసత్వము పరిసరాల పాత్రను వివరించుము?
7. వారసత్వముపై జైవిక సిద్ధాంతములను వ్రాయుము?
8. అనువంశికత ఆధారంగా జాతులను వర్గీకరించుము?

పాఠము 22

# సహజవరణము - సామాజిక వరణము

## (NATURAL SELECTION AND SOCIAL SELECTION)


22.0 లక్ష్యం

22.1 సహజ వరణ పరిమితి

22.2 నిర్వచనములు

22.3 సామాజిక వరణము

22.4 సామాజిక వరణము-రకాలు

22.5 సామాజిక ఆవరణశాస్త్రము

22.6 సామాజిక ఆవరణ శాస్త్రము - వివిధ రకాలైన పరస్పర చర్యలు

22.7 సహజ వరణము-సామాజిక వరణ ప్రక్రియలకు గల తేడాలు

22.8 సామాజిక వరణ ప్రభావము

22.9 సారాంశము


### 22.0 లక్ష్యం :

మానవుని ప్రవర్తన ప్రధానంగా అనేక శక్తుల వలన ప్రభావితమగును. వాటిలో ప్రధానమైనవి 1. సహజవరణము (Natural Selection) 2. సామాజిక వరణము (Social Selection) 3. ఆవరణము (Environment) 4. వారసత్వము (Heredity). అందువలన సామాజిక పరివర్తనలో జైవిక కారకాల పాత్ర ఎంతైనా కలదు. కాని సామాజిక పరివర్తనలో ప్రధానమైనవి సహజవరణము మరియు సామాజిక వరణము. వాటిని గురించి తెలుసుకోవటమే, ఈ పాఠం లక్ష్యము.

### 22.1 సహజ వరణ పరిమితి :

చార్లెస్ డార్విన్ (Charles Darwin) మరియు అతని అనుయాయుల అభిప్రాయము ప్రకారము "సామాజిక పరివర్తన ప్రధానంగా జైవికంగా వచ్చే మార్పువలన కలుగుతుంది. భౌతిక పరిసరాలలోని మార్పుల వలన గాని, జన్యువుల పరివర్తనము వలన గాని ప్రాణులలో వైవిధ్యాలు కలుగుతాయి. ఈ విధముగా ఉత్పత్తి అయిన ప్రాణులన్నీ భౌతిక, జైవిక పరిసరాల కనుగుణముగా సర్దుబాటు చేసుకోవాలి. ఈ సర్దుబాటు కొరకు అవి నిరంతరము పోరాటము సాగిస్తాయి. ఈ విధమైన పోరాటములో బలహీనమైన ప్రాణులు మరణిస్తాయి. బలవంతమైన ప్రాణులు మాత్రమే మిగిలి ఉంటాయి. ఆ విధమైన బలవంతమైన ప్రాణుల సంఖ్య పెరుగుచూ జైవిక పరిణామము జరుగుతుంది అనగా సహజ మరణము జైవిక పరిణామానికి దోహదం చేయును."

### 22.2. నిర్వచనములు :

గంప్లోవిజ్ (Gumplowiez) రాట్జన్ హోఫర్ (Ratzen Hofer) మొదలగు సామాజిక శాస్త్రవేత్తలు సహజవరణ సూత్రాన్ని మానవసమాజములకు వర్తింపజేసి సామాజిక పరిణామాన్ని వివరించారు. వీరి అభిప్రాయము ప్రకారము వివిధ మానవ సమూహాల మధ్య సంఘర్షణలు జరిగి బలహీన సమూహాలు అంతరించి, బలవంతమైన సమూహాలు మాత్రమే అభివృద్ధి చెందడము వలన సామాజిక పరిణామం జరుగునని భావించిరి.

పరిణామము ఇతర ప్రాణులలో సహజవరణము ద్వారా జరిగినప్పటికి, మానవ సమాజాలలో మాత్రమే సహజవరణ సూత్ర సహాయంతో సామాజిక పరిణామాన్ని వివరించుట కష్టమైనది. సహజవరణం యొక్క పాత్ర మానవ సమాజాలలో చాలా పరిమితంగా ఉండును. అంతేకాక జనన మరణాలు "సహజ వరణము" వలననే జరుగవు. జనన మరణములపై సామాజిక అలవాట్లు, జీవన విధానము, మానవుల యొక్క దృక్పథాలు మొదలగు వాటి ప్రభావము కూడా కొంతవరకు ఉండును. ఉదా : వికలాంగులను, అనారోగ్యవంతులను, వృద్ధులను, ఇతరుల దయాదాక్షిణ్యాలకు వదలి వేయక అట్టివారికి ఆరోగ్య వైద్య సదుపాయములు, ఇతర సాంఘిక సేవలను అందిస్తున్నారు. అందువలన ప్రతి సమాజమున వివిధ సమూహాల మధ్య సంఘర్షణలకు బదులు సహకారము, సర్దుబాటు, సమన్వయము, విలీనీకరణము పెంపొందుటకు తగిన ప్రయత్నాలు కూడా జరుగును. ఈవిధముగా ప్రకృతిశక్తులను అదుపులోనికి తీసుకొని రావటానికి మానవ సమూహాములన్ని సమిష్టిగా కృషి జరుపును. అంతేకాక ఆధునిక సమాజాలలో జనన మరణాల రేట్లను కూడా తగ్గించి జనాభాను నియంత్రిస్తున్నారు. ఈ విధముగా సహజవరణముయొక్క పాత్ర సమాజంలో చాలవరకు తగ్గిపోతున్నది.

## 22.3 సామాజిక వరణము (Social Selection) :

ప్రకృతిలో సహజవరణ ప్రక్రియ వలెనే, సామాజిక వరణ ప్రక్రియ సమాజములలో ఎవరు జీవించుటకు అర్హులో నిర్ణయించును. సమాజములోని ప్రతితరములో ఉన్న వారసత్వ 'సమిశ్రణం' (Heriditry Composition) సామాజిక వారసత్వము ద్వారా నిర్ణయించబడుతుంది. కాని సమాజంలో ఈ ప్రక్రియ ఏ విధముగా కార్యరూపము దాల్చునో, జైవికమైన కారకానికి, సామాజిక ఫలితానికి కల సంబంధం ఎటువంటిదో వివరించటం కష్టము. మానవ సమాజంలో సభ్యుల మధ్యకల సాంఘిక సంబంధాల పరస్పర చర్యలవలన సాంఘిక శక్తులు ఉత్పన్నమౌతాయి. ఈ సాంఘిక శక్తులు సమాజంలో జనాభాకు చెందిన ప్రత్యుత్పత్తిని (Fertility), అవశేషపు రేటు (Survival Rate) ను ప్రభావితం చేసే స్థితిగతులను సృష్టిస్తాయి. ఈ ప్రక్రియని "సామాజిక వరణము" అందురు. సహజవరణము మరణాల రేటుకంటె జననాల రేటు ద్వారా ఎక్కువ నిర్ణయమౌతుంది. సామాజిక వరణము ప్రత్యమ్నాయ (alternatives) పద్ధతులకు అవకాశాన్ని ఇస్తుంది. కాని సహజ వర్ణము కేవలము తొలగింపు (elemination) ద్వారానే నిర్ణయమవుతుంది. సామాజిక వరణానికి ఒక ఉదాహరణ వివాహము. వైవాహిక సంబంధాలు ఎవరెవరి మధ్య ఉండవచ్చు అన్న విషయం సంస్కృతిని బట్టి, కాలాన్నిబట్టి, ప్రదేశాన్ని బట్టి, అనేక సాంఘిక నిబంధనలను బట్టి ఉండును. అదేవిధముగా స్త్రీ పురుషుల మధ్య లైంగిక సంబంధాలకు అనేక సామాజిక ప్రమాణాలు ఏర్పడి ఉండును. ఈ విధమైన ప్రమాణాల వలన, నిబంధనల వలన సామాజిక ఎంపిక పరిమితమైన సామాజికవరణానికి దారితీయును. అందువలన సమాజానికి అనుగుణము కాని సామాజిక ప్రమాణాలు నిర్ణయమగును.

## 22.4. సామాజిక వరణము-రకాలు :

1. సామాజిక వరణము రెండురకములుగా జరుగును. అవి 1. ప్రత్యక్ష సామాజిక వరమణము (Direct Social Selection)

2. పరోక్ష సామాజిక వరణము (Indirect Social Selection) ప్రత్యక్ష సామాజిక వరణములో మానవుడు కొన్ని కృతిమ పరిస్థితులను కల్పించి జీవించ తగిన వారిని నిర్ణయిస్తాడు. ఉదా : కుటుంబ నియంత్రణ ద్వారా జననాలను, వైద్య సదుపాయాల ద్వారా మరణాలను అదుపులో ఉంచగలడు. పరోక్ష సామాజిక వరణములో సమాజములో ఏర్పడిన సంస్కృతిని బట్టి, సాంఘిక సంబంధాన్ని బట్టి అనేక సామాజిక ప్రమాణాలు ఏర్పడి ఉండును. ఈ ప్రమాణాల వలన నిబంధనల వలన ఎంపిక పరిమితమై పరోక్ష సామాజిక వరణానికి దారితీయును. సమాజానికి అనుగుణం కాని సామాజిక వరణ ప్రమాణాలు నిర్ణయమగును. మానవునికి అతని పరిసరాలకు సన్నిహితమైన సంబంధం కలదు. ఈ సంబంధము కేవలము భౌగోళికమైనదేకాక అందులో ప్రాణికి అది నివసించే పరిసరాలతో సంబంధం ఉండును. జీవులకు వాటి పరిసరాలకు ఉన్న సంబంధాన్ని తెలియజేసే శాస్త్రము "ఆవరణశాస్త్రము" (Ecology).

## 22.5. సామాజిక ఆవరణ శాస్త్రము (Social Ecology) :

సామాజిక ఆవరణశాస్త్రము మొట్టమొదట సమాజశాస్త్రవేత్తలు ఉపయోగించినప్పటికి, ఆవరణ శాస్త్రమును మొదట ప్రతిపాదించిన జీవశాస్త్రవేత్త "హేకెల్" (Haeclcel). Ecology అనే పదము గ్రీకు భాషలోని "ఐకాస్" (Oicas) నుండి గ్రహించబడినది. ఐకాస్ అనగా గృహము లేదా నివాసము అని అర్థము. ఈ పదమునకు నివాసము అనే కాక అందులో నివసించేవారు తమని తాము పోషించుకోవటానికి చేసే దైనిక చర్యలు అని కూడా అర్థము. ఆవరణ శాస్త్రము జీవులను వ్యక్తిగతంగా గాక ఒక సంక్లిష్టమైన పరస్పర సంబంధంకల జీవులుగా

పరిశీలన చేయును. అనగా జీవులకు పరిసరాలకు మధ్య ఉన్న సంబంధాలనుగూర్చి పరిశీలించే శాస్త్రము ఆవరణ శాస్త్రము . ఈ ఆవరణ శాస్త్రాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చును.

1. వృక్ష ఆవరణశాస్త్రము (Plant Ecology)
2. జంతు ఆవరణశాస్త్రము (Animal Ecology)
3. మానవ ఆవరణశాస్త్రము (Human Ecology) లేదా సామాజిక ఆవరణశాస్త్రము (Social Ecology)

సామాజిక ఆవరణశాస్త్రము మానవ సమాజాన్ని జైవిక సహజీవన (Symbiotic) అంశాల ద్వారా అధ్యయనం చేయును. ఒక సమాజంలో మానవుడు తన పరిసరాలలో సర్దుబాటు చేసుకుని జీవించటానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నంలో సమాజంలో వ్యక్తుల మధ్య "స్పర్థ" (Competition), సంఘర్షణ (Conflict) ఏర్పడవచ్చు. వ్యక్తులు పోటీపడి నిలద్రొక్కుకొని జీవించటమే కాక స్థిరనివాసాన్ని ఏర్పరచుకో గలుగుచున్నారు. సమాజమున నిరంతరము ఉండే స్పర్థ ఘర్షణల వలన జైవిక, సహజీవన అంశాలు ఉత్పన్నమవుతాయి.

## 22.6 సామాజిక ఆవరణ శాస్త్రము-వివిధ రకాలైన పరస్పర చర్య :

సామాజిక ఆవరణ శాస్త్రము ప్రకారం మానవ సమాజము 5 రకాలైన పరస్పర చర్యల వలన ఏర్పడుచున్నవి.

1. జనాభా ఒకే ప్రదేశంలో నివసించటం
2. కళాకృతులను (Articts) రూపొందించటం
3. ఆచారలు, నమ్మకాలు మొ. భౌతికేతర సంస్కృతిని పొంది ఉండటము
4. ప్రకృతివనరుల ఉపయోగాన్ని నిర్ణయించటము
5. సాంఘిక శ్రమ విభజనలో ప్రకార్యాలు నిర్వర్తించటము

ఈ ఐదు కారకాలు మానవ సముదాయంలో స్థానిక విస్తరణ (Spatial Distribution) ప్రకార్య వ్యవస్థాపనను (Functional Organisation) నిర్ణయించటమే కాక అందులో ఎప్పటి సామాజిక పరివర్తనని ఆ సమాజంలో సముదాయ స్థాయిని నిర్ణయిస్తాయి.

## 22.7. సహజవరణ, సామాజిక వరణ ప్రక్రియలకు గల తేడాలు :

22.7.1. సహజ వరణము బలహీన సమూహాలను వ్యక్తులను తొలగించటం ద్వారా అమలు జరుగును. అనగా బలహీనులు నశించగా శక్తిమంతులు మనుగడ సాధిస్తారు. సహజవరణ ప్రక్రియ మరణరేటు (Death Rate) పై ప్రభావాన్ని చూపుతుంది. కాని సామాజిక వరణము మరణరేటు పైనేకాక జననరేటు (Birth Rate) పైన కూడ తన ప్రభావాన్ని చూపును. అనగా జనన మరణాల రెండింటిని నియంత్రించటం ద్వారా అమలు జరుగును.

22.7.2. సహజవరణ అమలుకు వ్యక్తులకు ప్రమేయముండదు. సహజ పరిస్థితులకు అనుగుణంగా వ్యక్తి ప్రవర్తిస్తాడు. కాని సామాజిక వరణము వ్యక్తుల ప్రాధాన్యతను ప్రయోజనాలను బట్టి అమలు జరుగుతుంది. అందువలన సామాజిక వరణములో ప్రాంతాన్నిబట్టి, కాలాన్నిబట్టి, పరిస్థితులను బట్టి వైవిధ్యాలు లేదా భిన్నతలు ఏర్పడతాయి.

22.7.3. సహజ వరణములో రెండే రెండు ప్రత్యామ్నాయాలు ఉండును. అనగా పరిసరాలకు అనుగుణంగా వ్యక్తులు సర్దుబాటు చేసుకోవాలి లేదా నశించాలి, కాని సామాజికవరణములో బలహీన వ్యక్తులు మరణించరు. నశించరు. వారికి రక్షణ, భద్రత, సంస్కరణ, నిరోధన, నివారణ మొ.వాటికి సంబంధించిన అనేక నిర్మాణాత్మక ప్రత్యామ్నాయ కార్యక్రమాలు అమలు జరుపబడుతూ ఉంటాయి.

22.7.4 సహజ వరణము అమలు జరగటానికి ప్రత్యేక ప్రమాణాలు ఏవి ఉండవు. సామాజికవరణం అమలు జరగటానికి సమాజంలో అనేక ప్రమాణాలు రూపొందుతాయి. సహజవరణము ద్వారా సామాజిక వరణమునకు హద్దులు ఏర్పడతాయి. ఈ హద్దులకు లోనై సామాజిక రీతులు రూపొంది అమలు జరుగుతాయి.

## 22.8. సామాజిక వరణ ప్రభావము

సామాజిక వరణము సమాజమున రెండు రకాలైన ప్రభావాలను చూపుతుంది. అవి ఎ) ప్రత్యక్ష ప్రభావము బి) పరోక్ష ప్రభావము.

**22.8.1. ప్రత్యక్ష ప్రభావము :** సమాజంలో పారిశుధ్యము, ఆరోగ్య, వైద్య సదుపాయములు అధికము కావటం వలన మరణాల రేటు అధికశాతము తగ్గినది. వివాహ వయస్సును పెంచటం, బహుభార్యాత్వనిషేధము, గర్భస్రావాన్ని అనుమతించటం వంటి సామాజిక రీతులు గల సమాజాలలో జననరేటు తగ్గుతుంది. కుటుంబ నియంత్రణకు సంబంధించిన విజ్ఞాన ప్రచారము వాటిని అమలుపరచటానికి కావలసిన సాధనాలను అమలు పరచటం. అన్ని సమాజాలలోను భార్యాభర్తలు తమ ఇష్ట ప్రకారం శిశువులకు జన్మనిస్తారు.

**22.8.2. పరోక్ష ప్రభావము :** సమాజంలోని వివిధ వర్గాలలో జనన మరణాల రేట్లలో విభిన్న రీతులు కనబడతాయి. దీనికి పరోక్షకారణము వర్గాల మధ్య కల ఆర్థిక, సామాజిక పరిస్థితులు. ఉదా : బొగ్గు గనులలో, జనపనార పరిశ్రమలలో, అభ్రక గనులలో, నూనెగనులలో పనిచేసేవారి ఆరోగ్యము అంతంత మాత్రమే ఉండి మరణించే అవకాశము ఎక్కువ. పేద వర్గాల ప్రజలలో అజ్ఞానము, తక్కువ స్థాయి జీవన ప్రమాణాల వలన జనన మరనాల రేట్లు అధికముగా ఉండును. కాని ఉన్నత వర్గాల ప్రజలలో జీవన ప్రమాణాలు ఆకాంక్ష స్థాయి ఎక్కువగా ఉండుట చేత వైద్య ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో ఉండుట వలన జనన, మరణాల రేట్లు తక్కువగా ఉండును. ఈ విధంగా సామాజిక వరణము వివిధ వర్గాలలో పరోక్షంగా ప్రభావాన్ని చూపుతుంది.

## 22.9 సారాంశము :

సహాజవరణము, సామాజిక వరణము, సమాజశాస్త్ర అధ్యయనమున అత్యంత ప్రధానమైనవి. సమాజంలో మానసిక బలహీనతలతోను, నివారింపరాని అంటువ్యాధులతోను బాధపడేవారికి వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయటం ద్వారా వారి ప్రత్యుత్పత్తి సమస్యలను నిరోధించటం జరిగి సమాజంలో జనాభాను గుణాత్మకంగా మెరుగుపరచుకోవడం జరుగుతుంది. ఈ సమాజాలలో ఆరోగ్యవంతులను మాత్రమే ప్రత్యుత్పత్తి చేయటానికి అనుమతిస్తారు. ఈ విధంగా జనాభాను పరిణాత్మకంగా (Quantitatively) గుణాత్మకంగా (Qualitatively) నియంత్రణ చేయటం జరుగుతుంది. సామాజికవరణము ప్రత్యక్షంగాను, పరోక్షంగాను తమ ప్రభావమును సమాజంలో చూపి జనాభాను నియంత్రణ చేస్తుంది.

### ప్రశ్నలు

1. సహజ వరణము, సామాజిక వరణము అనగానేమి?
2. సహజ వరణము, సామాజిక వరణము మధ్యగల బేధము?
3. సామాజిక అవరణ శాస్త్రము అనగానేమి? వివరించుము?
4. సామాజిక వరణము నందలి రకాలను వివరించుము?

పాఠము-23

# సాంఘిక పరస్పర చర్య - అనుబంధ విచ్ఛిన్న ప్రక్రియలు

## (SOCIAL INTERACTION AND ITS ASSOCIATIVE & DISASSOCIATIVE PROCESSES)


23.0 లక్ష్యం
23.1 సాంఘిక పరస్పర చర్య (Social Intraction)
23.2 నిర్వచనము
23.3 సామాజిక పరస్పర చర్యలు - స్వభావము
23.4 సామాజిక పరస్పర చర్యల ప్రాముఖ్యత
23.5 సాంఘిక పరస్పర చర్య - అనుబంధ ప్రక్రియలు
23.6 సహకారము-రకాలు
23.7. సహకారము-కారణాలు-ప్రకార్యాలు
23.8 సర్దుబాటు (Accommodation)
23.9 సర్దుబాటు-రకాలు
23.10 సహనము (Toleration)
23.11 సారాంశము


### 23.0. లక్ష్యం :

మానవ సమాజమున ప్రధానాంశము సాంఘిక చర్య. సమాజశాస్త్ర ప్రధానాంశము సాంఘిక పరస్పర చర్య, సాంఘిక ప్రక్రియల అధ్యయనము. సమాజము సాంఘిక సంబంధాల అల్లిక. సాంఘిక పరస్పర చర్యకు ప్రధాన పూర్వ ఆపేక్షితాలు సాంఘిక సంబంధాలు. సమాజమున సాంఘిక పరస్పర చర్య వివిధ స్థాయిలలో సంభవించును. సమాజమున వ్యక్తులు వివిధ సాంఘిక పరస్పర చర్యలు కలిగి ఉండుటవలన అనేక రకాల సాంఘిక ప్రక్రియలు ఉత్పన్నమగును. మానవ సమాజము అనేక రకాల సాంఘిక పరస్పర చర్యలు, ప్రక్రియలు అంతర్భాగాలుగా ఉన్న సంఘటిత వ్యవస్థ. కావున మానవుల సాంఘిక సంబంధాల సమూహమే సమాజము. సమాజములోని సభ్యుల పరస్పర ప్రవర్తన, సన్నిహిత సంబంధాల ఫలితంగా సాంఘిక సంబంధాలు ఏర్పడును. సమాజములోని వివిధ వ్యక్తుల మధ్య జరిగే పరస్పర చర్యలు, ప్రేమాభిమానములు సమాజ సుస్థితికి, పనిచేయడానికి తోడ్పడును. కావున ఇద్దరులేక ఎక్కువ మంది సంఘజీవులైన వ్యక్తుల మధ్య అవిచ్ఛిన్నమైన పరస్పర సంబంధాలనే సాంఘిక పరస్పర చర్యలందురు. ఈ పరస్పర చర్యలు అనుబంధమైనవిగా గాని లేక విచ్ఛిన్నకరమైనవిగా గాని యుండవచ్చును. ఈ పరస్పర చర్యల ద్వారా మానవుల ప్రవర్తన ఏ దిశగా పయనిస్తుందో నిర్ణయించవచ్చు. అందుచే సమాజాలలో స్థిరమైన పద్ధతులను ప్రతిఫలించే సామాజిక ప్రమాణాల మీదనే మానవ పరస్పర చర్యలు ఆధారపడిఉంటాయి. ఈ పరస్పర చర్యలు కలిగియున్న వ్యక్తుల మధ్య ఇచ్చి పుచ్చుకొనే ధోరణిని పెంపొందిస్తాయి.

### 23.1 సాంఘిక పరస్పర చర్య (Social Interaction) :

మానవుడు సంఘజీవి. ప్రతివ్యక్తి సమాజ వాతావరణములో జీవిస్తాడు. కావున సమాజములోని తోటివారి సహాయ సహకారాలు అతనికి ఎంతైనా అవసరం అతనికి. అందుచే తోటివారితో సహజంగా అనేక సంబంధాలు కలిగిఉంటాడు. ఈ సంబంధాలు మానసికంగాను, భౌతికంగాను కల్గిఉండడం చాలా అవసరము. ఈ విధమైన సంబంధాలు, అభిప్రాయాలను పరస్పరం తెలుపుకోవడము సామాజిక పరస్పర చర్యగా పేర్కొనవచ్చు. ఈ సామాజిక పరస్పర చర్య సామాజిక ప్రక్రియకు అతి సాధారణ, ప్రాథమిక ఉదాహరణ. దీనిద్వారా సమాజంలోని వ్యక్తులు పరస్పరం ప్రభావితులౌతారు.

సామూహిక జీవనము, సహజీవనము సమాజము యొక్క ప్రధాన లక్షణము. సమాజమున అనేక రకాలైన పరస్పర సంబంధాలను ఏర్పరచుకొని వ్యక్తులు తమ అవసరాలను, లక్ష్యాలను నెరవేర్చుకొందురు. కాని వ్యక్తుల మధ్య ఏ విధమైన సంబంధాలున్నవి అన్న విషయం వారి మధ్య జరిగే పరస్పర చర్యల వలన తెలుస్తుంది. సాంఘిక సంబంధాలు వ్యక్తులు ఏ విధమైన ప్రవర్తనను కలిగియున్నారో తెలియజేయును. ఈ సామాజిక సంబంధాలు సమాజమును సుస్థిరంగాను, క్రమ పద్ధతిలోను నడిపిస్తాయి. వ్యక్తుల మధ్య జరిగే పరస్పర చర్యలే పరస్పర సంబంధాలు ఏర్పడడానికి కారణమౌతాయి. సహజ జీవనంలో ఈ సంబంధాలు మంచికి, చెడుకు కూడ దారితీయును. అనగా వ్యక్తుల మధ్య సంబంధాలు స్నేహానికి లేదా శతృత్వం, ఘర్షణకి దారి తీయును.

## 23.2 నిర్వచనము :

సాంఘిక జీవనము, సాంఘిక సంబంధాలు పరస్పర సాంఘిక చర్యల ఫలితంగా ఏర్పడును. సాంఘిక జీవనంలో మనకు కనబడే క్రమత, నిర్మాణం కూడ సమాజంలో ఉండే ఆయా వ్యక్తుల మధ్య జరిగే పరస్పర చర్యలను అనుసరించే వస్తుంటారు. అందుచేత పరస్పర సాంఘిక చర్య సమాజమున ప్రధానమైనది. విల్సన్ కోల్బ్ అభిప్రాయల ప్రకారము సమాజము సంస్కృతి అనే రెండూ సాంఘిక ప్రక్రియ పర్యవసానము. వివిధ రూపాలైన పరస్పర సాంఘిక చర్యను సాంఘిక ప్రక్రియలందురు. "ఒక స్థిరమైన రూపాన్ని ధరించే పరస్పర చర్యలనే సాంఘిక ప్రక్రియ" అని రాబర్ట్ పార్క్, బర్జెస్‌లు అభిప్రాయపడిరి. కావున సాంఘిక పరస్పర చర్యల అధ్యయన ఘనత వీరికి దక్కుతుంది.

## 23.3. సామాజిక పరస్పర చర్యల స్వభావము :

రాబర్ట్ పార్క్, మరియు బర్జెస్ అభిప్రాయము ప్రకారము సామాజిక పరస్పర చర్యలు సమాజములో మూడు రకముల ప్రక్రియల ద్వారా జరుగును. అవి 1. వ్యక్తికి వ్యక్తికి మధ్య 2. వ్యక్తికి సమూహానికి మధ్య 3. సమూహానికి మరియు సమూహానికి మధ్య వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య పరస్పర సంబంధాలను నెలకొల్పే సామాజిక క్రియా విధానాలనే సామాజిక ప్రక్రియ అందురు. కావున ఏదో ఒక నిర్దిష్టమైన విధంగా జరిగే పరస్పర చర్యలే సామాజిక ప్రక్రియలు. ఇవి సంపర్కము, సహచర్యము, భావ ప్రసారము మొదలగు వాటిద్వారా ఏర్పడును. సామాజిక చర్యల స్వభావాన్ని బట్టి ఈ ప్రక్రియలు రెండురకములు. అవి: అనుబంధ ప్రక్రియలు 2. విచ్ఛిన్న ప్రక్రియలు. అనుబంధ ప్రక్రియలు సమాజములోని వివిధ వర్గాల, వివిధ తరగతుల వ్యక్తుల మధ్య సత్సంబంధములను పెంపొందించి సమన్వయపరుస్తాయి. ఉదా : సహకారము ప్రజలలో సమజీవనాన్ని పెంపొందించును. ఈ సహజీవనము సభ్యుల మధ్య ఐక్యతకు తోడ్పడును. సామాజిక జీవనం ఒడుదుడుకులు లేకుండా సాఫీగా కొనసాగును. దీనివలన వ్యక్తులకు మేలు జరుగుతుంది. వారి మధ్య బేధాభిప్రాయములకు అవకాశముండదు. వారిమధ్య సర్దుబాటు సమైక్యతను సాధించవచ్చును. సమైక్యత లోపించిన సమాజము అవ్యవస్థాపన (Disorganisation) చెందును. తత్ఫలితంగా అనేక సామాజిక సమస్యలు, సామాజిక విచలిత ప్రవర్తన (Devient behaviour) ఉత్పన్నమగును. సహకారము, సర్దుబాటు, విధేయత, వితనీకరణము మొదలగు సాంఘిక చర్యల వలన వ్యక్తులు ఒంటరిగా చేయలేని పనులను, కష్టతరమైన పనులను సులభంగా చేయగలరు.

**23.3.1.** సమాజము, సహకారము, సర్దుబాటులతో ముందుకు సాగిపోతుందని ఖచ్చితంగా పేర్కొనలేము. ఎందుచేతననగా మానవులందరూ ఒకేరకమైన స్వభావములను కలిగి ఉండరు.

**23.3.2.** సమాజమున అన్ని సమయాలలోను, అన్ని విషయాలలోను సభ్యులందరూ ఎప్పుడూ ఒకేవిధంగా ఉండరు. ఎందుచేతననగా విభిన్న మనస్తత్వాలు, ఇతర భిన్నత్వాలు కలిగి ఉండుటవలన వారి అభిప్రాయాలలో బేధాలు రావచ్చును. ఫలితంగా సంఘర్షణ ఏర్పడి అవాంఛనీయమైన సంఘటనలు జరుగవచ్చును. దానిఫలితంగా సహకారము లోపించును.

**23.3.3.** సమాజమున సహకారము ప్రధానమైనది. సమాజమున విభేదీకరణ వలన సమాజములోని వ్యక్తుల మధ్య ద్వేషం పెరిగి, తమ స్వంత ప్రయోజనాల కొరకు ఎదుటివారిని అణచివేయలేక ప్రభావితము చేయ ప్రయత్నిస్తారు. దీని పర్యవసానమే సామాజిక అవ్యవస్థాపన.

**23.3.4.** సామాజిక అవ్యవస్థాపన ఫలితంగా సామాజికాభివృద్ధి కుంటుపడుతుంది. ఇటువంటి సమస్యలతో నిండియున్న క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొనడానికి సర్దుబాటు చాలా అవసరము. ఒకసారి తాత్కాలికంగా సర్దుబాటు జరిగినా కాలక్రమమున సంఘర్షణలకు కూడా దారితీయవచ్చును. అందుచేత పరిస్థితులను బట్టి సామాజిక ప్రక్రియలు జరుగుతుంటాయి.

## 23.4. సామాజిక పరస్పర చర్యల ప్రాముఖ్యత :

సాంఘిక జీవనము సామాజిక చర్యలపై ఆధారపడి యుండును. మానవుడు సంఘజీవి. ఆ విధమైన సంఘజీవనానికి మూలము సామాజిక పరస్పర చర్య. సమాజములోని ప్రతివ్యక్తి తన నిత్య జీవితావసరాలను తీర్చుకొనుటకు గాను, సుఖజీవనము గడుపుటకు, సంస్కృతి, నాగరికత, భాష అభివృద్ధి చేసుకొనుటకు ఇతరులతో అనేక రకాల పరస్పర చర్యలను జరుపుతారు. సాంఘిక ప్రక్రియవల్ల సమాజములో మార్పులు ఏర్పడునని పార్క్ మరియు బర్గెస్ అభిప్రాయపడిరి. వీరి అభిప్రాయము ప్రకారము భావ ప్రసారము, సంఘర్షణ, పోటీ, సర్దుబాటు, విలీనీకరణము ప్రధానమైన సాంఘిక పరస్పర చర్యలు.

**23.4.1. భావ ప్రసారము :** సామాజిక పరస్పర చర్యకు మూలము భావ ప్రసారము. ఇది అత్యంత ప్రధానమైనది. సమాజములోని వ్యక్తుల మధ్య సహనము, స్నేహపూరిత సాంఘిక సంబంధాలు భావ ప్రసారముపై ఆధారపడి ఉంటాయి. భావ ప్రసారము ఒకరి అభిప్రాయాలను, భావాలను మరొకరు అర్థము చేసుకోవడానికి, ఇతరుల భావాలను తెలుసుకోవటానికి తోడ్పడుతుంది. భావ ప్రకటన లేనిదే వ్యక్తుల మధ్య పరస్పర చర్య జరుగదు. పరస్పర చర్య లేకుండా జీవించుట కష్టము.

**23.4.2. సంఘర్షణ :** సంఘర్షణ తరువాత క్రమంగా, వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య సర్దుబాటు ఏర్పడితే అస్తవ్యస్తంగా ఉన్న సామాజిక వ్యవస్థలో మార్పును తీసుకొని రావచ్చు. తద్వారా నూతన వ్యవస్థాపన జరుగుతుంది. సామాజిక పరివర్తన జరుగుతుంది. ఉదాహరణకు, బాల్య వివాహములు, సతీసహగమనము, అంటరానితనము, పేదరికము, నిరుద్యోగము మొదలైన మూఢాచారాలను, సాంఘిక దురాచారాలను, సమస్యలను నివారించుటలో ప్రజలలో మొదట వ్యతిరేకత ఉన్నప్పటికి కాలక్రమమున వాటివలన అనేక ఇబ్బందులకు గురి అగుట వలన వాటిని విడిచిపెట్టుటకు, అంతము చేయుటకు, నివారించుటకు సాహసించిరి.

**23.4.3. పోటీ మరియు సర్దుబాటు :** పోటీ వలన సమాజంలో వ్యక్తుల అర్హతను, యోగ్యతను నిర్ణయించడంతో పాటు వారిలోని ఉత్సాహాన్ని, చైతన్యవంతమైన సామర్థ్యాన్ని పెంపొందింప చేయును. సర్దుబాటు ద్వారా వ్యక్తులు ఎప్పటికప్పుడు మారుచున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు సమయోజనం చెందుతారు. అలాకాకపోతే సామాజిక, మానవ మనుగడ కష్టమౌతుంది. వితలీకరణము ద్వారా విభిన్న సంస్కృతులు గల సమూహాలు తమ మధ్యగల విభేదాలను, వ్యత్యాసాలను విస్మరించి తద్వారా నూతన సంస్కృతిని ఏర్పరచుకొందురు.

**23.4.4.** మానవులు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకొనుటకు, భౌతిక సుఖాలను అనుభవించుకొనుటకు ఆర్థిక వ్యవస్థ సహాయపడును. మానవుని ఆర్థిక కార్యకలాపములన్నీ తన సమాజంలోయున్న ఆర్థిక వ్యవస్థ విధానంపై ఆధారపడి యుండును. ఆర్థిక కార్యకలాపములు కూడా సాంఘిక పరస్పర చర్యపై ఆధారపడి యుండును.

**23.4.5.** పార్క్ మరియు బర్గెస్ అభిప్రాయము ప్రకారము సాంఘిక ప్రక్రియవల్ల ఏర్పడే మార్పులు హింసాత్మక రూపము దాల్చినప్పుడు, సామాజిక సంస్థలు అహింసాత్మక ధోరణులను అరికట్టలేనపుడు సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది. కావున అనుబంధ ప్రక్రియలైన సహకారము, సర్దుబాటు, విలీనీకరణం, సమైక్యతల ద్వారా ప్రతికూల వాతావరణమును అధిగమించవలెను.

**23.4.6.** సాంఘిక ప్రక్రియలైన అనుబంధ, విచ్ఛిన్న ప్రక్రియలు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలకు కూడ వర్తిస్తాయి. సాంఘిక జీవనంలో ప్రజల నడవడిక, విలువలు, నమూనాలు, ప్రమాణాలు ఇమిడి ఉంటాయి. ఈ విధమైన సాంఘిక జీవనం మొత్తాన్ని సాంస్కృతిక ప్రక్రియగా చెప్పవచ్చు. ఇవి మానవ మనుగడకు సుఖజీవనానికి ఎంతైనా అవసరం.

23.4.7. సాంస్కృతిక ప్రక్రియలోని అంశాలు వారసత్వంగా ఒక తరం వారినుండి మరొక తరానికి సంక్రమిస్తాయి. మారుతున్న సాంఘిక విలువలకు, ప్రవర్తనకు అనుగుణంగా వ్యక్తులు సర్దుబాటు చేసుకొనవలెను. సర్దుబాటు ఫలితంగా సామాజిక జీవనంలో అవరోధాలు ఉండవు. లేకపోతే, సాంస్కృతికపరమైన సంఘర్షణలకు గురి అవుతారు. ఉదాహరణకు హిందూ, మహ్మదీయులకు మధ్య తరచూ వచ్చే మతపరమైన సాంస్కృతిక పరమైన ఘర్షణలు.

23.4.8. రాజకీయ ప్రక్రియలో లిఖిత పూర్వకమైన శాసనాలను, చట్టాలను రూపొందించి వాటిని పోలీసు శాఖద్వారా, న్యాయస్థానాల ద్వారా అమలుపరచి ప్రజలలో క్రమబద్ధ జీవన విధానాన్ని కలుగజేస్తారు. ప్రజల ప్రవర్తనలను అదుపులో ఉంచుటకు అనుగుణంగా అధికార యంత్రాంగమును రూపొందిస్తారు. ఈ విధమైన వ్యవస్థనే రాజ్యముగ పేర్కొనవచ్చు. సమాజమున శాంతి భద్రతలను పరిరక్షించవలసిన బాధ్యత పరిపాలనా యంత్రాంగముపై ఉంటుంది. ఈ విధమైన ప్రక్రియలను రాజకీయ ప్రక్రియగా పేర్కొనవచ్చు.

ఈ విధంగా మానవుడు తన అవసరాలను బట్టి సమాజంలో వివిధ రంగాలలో అనేక రకాలైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ ప్రక్రియల ద్వారా మనుగడ సాధిస్తాడు.

**23.5. సాంఘిక పరస్పర చర్య-అనుబంధ ప్రక్రియలు (Social Interaction-Associative Processes) :**

**23.5.1 సహకారము (Co-operation) :** మానవుడు సంఘజీవి. సమాజమున ఇతరులతో కలిసి సహజీవనము గడుపును. ఈ విధమైన సహజీవనమున ఇతరుల సహాయ సహకారాలు చాలా అవసరము. అదేవిధంగా తాను కూడ ఇతరులకు సహకారమును అందజేయును. కావున సహకారము ఒక విధమైన సామాజిక ప్రక్రియ. ఇందు విభేదీకరణ అవకాశము లేకపోవుటచే సహకారమును అనుబంధ ప్రక్రియగా పేర్కొనవచ్చును. సహకారము అనగా సమాజములోని వ్యక్తుల మధ్య స్పర్ధ లేకుండా అన్యోన్యతతో కలసి మెలసి జీవించుట. సహకారము లేనిదే మానవ మనుగడ సాధ్యంకాదు. అందుచే సమాజ స్థాపన, సహకారము మానవుని సాంఘిక స్వభావాల వల్ల జరుగుతుంది. సహకారము లోపించినచో సమాజ మనుగడ సాధ్యంకాక పోవటమేకాకుండా, అతి శీఘ్రంగా నశిస్తూ పోతుంది. వ్యక్తులు భద్రత లేని వారగుదురు. అందుచే వ్యక్తి మనుగడకు, సంఘ అభ్యుదయానికి సహకారము తప్పనిసరి. చార్లెస్ కూలే అభిప్రాయము ప్రకారము మానవ చరిత్ర అంతటిలోను వివేకవంతమైన సహకారము (Rational Co-operation), సామాజిక చైతన్యము, మానవ సమాజ ప్రగతికి మూలము. ఆధునిక కాలంలో వ్యక్తులు, సమూహాలే కాక దేశాలు కూడ పరస్పరం సహకరించక తప్పదు. సమాజము సంక్లిష్ట (Complex) మగుచున్న కొద్ది సహకారము ప్రధానమవుతుంది. అందుచే సామూహిక జీవనం సమాజములోని సభ్యుల మధ్య జరిగే పరస్పర సహకారము మీదే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇందులో రెండు అంశాలు ఉంటాయి.

1. హితాలలో ఐక్యాన్ని గుర్తించడం 2. వ్యవస్థాపనా సామర్థ్యము

ఆధునిక సమాజాలలో సహకారము అత్యంత ప్రధానమైనవి. నేటి ఆధునిక సమాజాలలో శ్రమ విభజన, విశిష్టీకరణ వల్ల అనేక సమూహాలు, వ్యవస్థలు, సంస్థలు పనిచేస్తున్నవి. భిన్నత్వము ఎక్కువగా కన్పిస్తున్నది. వ్యక్తుల మధ్య వైరుధ్యాలు అధికమయ్యే కొలది వ్యక్తుల ఆశయాలు, లక్ష్యాలు కూడ భిన్నంగా ఉంటాయి. అందువల్ల ఒకదానికొకటి పొత్తుకుదరకపోతే సమాజ వ్యవస్థాపన దెబ్బతింటుంది. అందుచేత సహకారము నేటి సమాజంలో చాలా ప్రాముఖ్యమైనది. ఒక లక్ష్యాన్నిగాని, ధ్యేయాన్ని గాని సాధించుటకు వ్యక్తిగాని, సమూహము గాని ఇతరులతో కలసి శ్రమించి జీవించుటను సహకారమని చెప్పవచ్చును. సమాజమున ఒక వ్యక్తి ఒక ఫలితాన్ని ఇతరులనుండి ఆశించినప్పుడు, ఇతరులకు తోడ్పడుట ద్వారా సహాయము ప్రారంభమవుతుంది. అసూయ, స్వార్థము, ద్వేషము, అసహనము ఘర్షణకు దారితీయగా దయ, సహనము, అభిమానము, అనురాగము, సర్దుబాటు మొదలైనవి సహకారానికి దోహదము చేయును. మానవుడు తన జీవితములో అన్ని సమయాల్లో కాకపోయినా కొన్ని సమయాల్లోనైనా ఇతరులపై ఆధారపడక తప్పదు. ఎన్ని సరిసంపదలున్నా, తన అవసరాలను తానే స్వయంగా తీర్చుకోలేడు. ఇతరులపై తప్పక ఆధారపడతాడు. ఈ పరస్పర ఆధారము వల్లనే సహకారం ఏర్పడుతుంది. అందుచేత సహకారము మానవనైజము, ధర్మము. అందువల్ల మానవ సమాజములో సహకారము ఎక్కువగా కన్పించును. ఈ సహకారము ఆదిమ మానవ

సమాజాలనుండి ఆధునిక సంశ్లిష్ట సమాజాలకు సంక్రమిస్తూనే ఉన్నది. ఉదాహరణకు మానవుని దైనందిన కార్యక్రమాల్లో సహకారము ఎంతైనా అవసరము. వేటాడుటలోను, చేపలు పట్టుటలోను, ఉత్సవాలలోను, ఉత్పత్తిలోను పరస్పరము సహకరించుకొంటారు. ఆ సహకారం తరతరాలనుంచి సాంప్రదాయకంగా, అలవాటు ప్రకారం వచ్చేది. అందులో ఏర్పాటుగాని, ఒప్పందముగాని, ప్రణాళికలు గాని లేవు. కావున సహకారం అనాలోచితంగా కూడ ఏర్పడవచ్చు.

## 23.6. సహకారము - రకాలు (Types of Co-operation) :

**23.6.1. ప్రాథమిక సహకారము (Primary Co-operation) :** సమూహాలలో ప్రాథమికమైనది ప్రధానమైనది సహకారము. సమూహంలో అంతర్భాగమై సమూహిక జీవనంలో పాలుపంచుకోవాలని కోరే ప్రతి సభ్యుడూ మిగిలిన వారితో సహకరించవలసినదే. ఎంత వ్యక్తిత్వమున్న వానికైనా అది తప్పదు. ఇతరులతో సౌఖ్యంగా కలసి మెలసి వ్యవహరించాలంటే సహకారము తప్పనిసరి. ప్రాథమిక సమూహంలో ఉండే సహకారం చాలావరకు తెలియకుండానే జరుగుతుంది. ఉదాహరణకు, కుటుంబము తీసుకుంటే కుటుంబ సభ్యుల మధ్య సహకారము అనివార్యము. కుటుంబ సభ్యుల మధ్య సహకారము లోపిస్తే ఆ కుటుంబము, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతుంది. అదేవిధంగా భార్యా భర్తల మధ్య సహకారము వారి సంతానాన్ని పెంచటంలోను వారిని తీర్చిదిద్దటంలోను అధిక ప్రభావాన్ని చూపుతుంది. తల్లిదండ్రుల మధ్య సహకారము లోపిస్తే వారి పిల్లలను సక్రమ మార్గములో పెట్టలేరు. కుటుంబ సభ్యుల మధ్య సహకారము స్వేచ్ఛాయుతమైనది, మరియు సహజమైనది. ఎవరి వ్యక్తిత్వం వారికున్నా, భిన్నత్వము కల్గి ఉన్నా కుటుంబ సభ్యులందరు ఏకాభిప్రాయముతో సహకరించుకొనక తప్పదు. ఈ విధంగా ప్రాథమిక సమూహాలలో ఉండే సహకారాన్ని ప్రాథమిక సహకారం అని అంటారు. ఇది సమాజంలో నివసించే ప్రతి వ్యక్తికి అత్యంత అవసరము. తన అవసరాలను తీర్చుకొనటానికి, భాష, సంస్కృతిని అలవరచుకొంటానికి, ప్రధానమైనది ప్రాథమిక సహకారము.

**23.6.2. గౌణ సమూహ సహకారము (Secondary Co-operation) :** సమాజమున ప్రాథమిక సహకారము అనంతరము వ్యక్తికి ప్రధానమైనది గౌణ సమూహసమకారము. ఈ విధమైన సహకారము వ్యాపార, వాణిజ్య రంగాలలో ఉన్న సహకార సంఘాలలో కనబడుతుంది. ఇది ఉద్దేశ్య పూర్వకంగా వచ్చేది. ఇది ప్రణాళిక బద్ధమైనది కావున ఉద్దేశ్య పూర్వకంగా ప్రయత్నాపూర్వకంగా వచ్చును. ఇది కొన్ని నియమ నిబంధనలకు కట్టుబడి వుంటుంది. కొన్ని దేశాలు వ్యాపార సంబంధమైన ఒడంబడికలు చేసుకొని సహకారాన్ని పొందుతుంటారు. ఒడంబడికలోని నిబంధనలను పాటించకపోతే వ్యాపార సరళి సక్రమంగా కొనసాగదు. తత్ఫలితంగా రెండు పక్షాల మధ్య సంబంధాలు దెబ్బతింటాయి.

**23.6.3. సహజీవన సహకారము (Symbiotic Co-operation) :** మానవుడు సంఘజీవి. సహజీవనము అనగా ఇతరులతో కలసి జీవించుట అని అర్థము. ఈ రకమైన సహకారము అధికంగా జంతువులలోను, వృక్షాలలోను కన్పిస్తుంది. వేరువేరు జాతులకు చెందిన జంతువులు, వృక్షాలు పరస్పరం ఆధారపడి సహకారముతో జీవిస్తాయి. ఈ విధమైన సహకారము కొంతవరకు సహజబద్ధమైనది మరియు ఉద్దేశ్యపూర్వకము కానిది. అనగా అనుకోకుండా కాకతాళీయంగా జరిగేది. దీనినే సహజీవన సహకారం అని అంటాము. ఇందులో ఇతరులతో సహకరించాలనే ఉద్దేశ్యము గాని, నిర్ణయంగాని లేకుండానే ఇతరులతో సహకరిస్తుంటాము. ఉదాహరణకు ఒక రైతు తన జీవనోపాధికి కష్టపడి పనిచేసి పంటలు పండిస్తాడు. కాని ఆ పంట అనేక మందికి ఆహారంగా ఉపయోగపడుతుంది. అదే రైతుకు కావలసిన వ్యవసాయపు పనిముట్లు మరొక పరిశ్రమవల్ల లభ్యమవుతున్నాయి. అవన్నియు మార్కెట్టులో అవసరమైనవారు కొనుక్కొని అనుభవిస్తారు. ఎవరికివారు తమ, తమ లాభము కోసం తయారుచేస్తున్న వస్తువులు గాని, పనులు వల్ల గాని యితరుల అవసరాలు కూడ పరోక్షముగా తీరుస్తూ ఉంటారు..

**23.6.4. స్వేచ్ఛాయుతమైన సహకారము (Voluntary Co-operation) :** ఒక సమాజములో వ్యక్తి ఇతరుల సహాయాన్ని పొందడమే కాకుండా ఇతరులకు తాను కూడ సహాయపడాలనే కోరిక ఫలితంగా ఏర్పడేదే స్వేచ్ఛాయుతమైన సహకారము. ఈ విధమైన సహకారము పైన పేర్కొన్న వాటికంటే కొంచెము భిన్నమైంది. ఎదుటివారికి తోడ్పడుటవలన అతనికి సంతోషము, తృప్తి కలుగుతాయి. ఆ విధమైన వ్యక్తి ఇష్టానుసారముగ సహకరించే సందర్భాలలో ఒక్కొక్కసారి ప్రతిఫలమును కూడ కోరడు. ఉదాహరణకు, తల్లిదండ్రులు తమ పిల్లలతో

సహకరించుట, ముసలితనములో ఆ పిల్లలు తల్లిదండ్రులకు సహకరించుట వ్యక్తి తన స్వయంతృప్తి కొరకు, ఆనందము కొరకు సహకరించుటే గాని ఏదో బహిర్గతమైన వత్తిడి వల్లగాదు. అందుచేత స్వచ్ఛందమైనది. ఏ విధమైన నిర్బంధము లేకుండా స్వేచ్ఛాగా జరుగుతుంది. ఉదాహరణకు దానధర్మాలు చేయుట మొదలగునవి స్వేచ్ఛాయుతమైన సహకారము. కాన్ని కొన్ని సందర్భాలలో వ్యక్తి శ్రమించుట వలన దానికి కొంత ప్రతిఫలాన్ని ఆశించి ఎదుటివారితో సహకరిస్తూ ఉంటాడు. ఉదాహరణకు కార్మికులు తమ యజమానితో సహకరించటం; అలాగే ఒక ఉద్యోగి తనపై అధికారికి అనుగుణముగా తన విధిని సక్రమంగా నిర్వహించవటం.

మెకైవర్ తన గ్రంథమైన "సమాజము" (Society) లో సహకారమును రెండు విధములుగా ఉంటుందని చెప్పాడు. అవి: ప్రత్యక్ష సహకారము (Direct co-operation) మరియు పరోక్ష సహకారము (Indirect Co-operation).

**23.6.7. ప్రత్యక్ష సహకారము :** ప్రతి సమాజమున ప్రత్యక్ష సహకారము ప్రధానమైనది. ఇందు కొంతమంది వ్యక్తులు ఒకే లక్ష్యం కొరకు ఒకేవిధంగా శ్రమించెదరు. ఉదాహరణకు కలసి ఆటలాడుట, కలసి ప్రార్థనలు చేయుట, సహపంక్తి భోజనము మొదలైనవి. ఒక వ్యక్తి యితరులతో కలసిపనిచేయుట వల్ల ఉత్సాహము సంతృప్తి ఉండును. మానసికంగా నూతన శక్తిని పొందగలడు. ఇతరులతో కలసి మెలసి వుండటం వల్ల వ్యక్తి మూర్తిమత్వము వికసించును.

**23.6.8. పరోక్ష సహకారము :** ఒకే లక్ష్యాన్ని సాధించటానికి కొంతమంది వ్యక్తులు వేరు వేరు పనులు చేయుట వలన వారు పరోక్షముగా ఒకరితో మరొకరు సహరించుకొంటారు. ఇందులో వ్యక్తులు వివిధ రకాలైన పనులు చేయుటవలన శ్రమ విభజన వుంటుంది. ఉదాహరణకు ఒక భవన నిర్మాణమున తాపీపనివాళ్ళు, వడ్రంగులు, సాంకేతిక నిపుణులు మొదలగు వారు పనిచేయుదురు. వీరు వారివారి నైపుణ్యాన్ని చూపెట్టి పనిచేయుచూ భవన నిర్మాణమ పూర్తి చేయుదురు. వీరందరి ప్రధానధ్యేయము భవన నిర్మాణము పూర్తిచేయుట. భవన నిర్మాణమంతటిని ఒకేపనిగా తీసుకొంటే వివిధ వృత్తుల వాళ్ళు ఒకే పనిని కలసి చేసినట్లగును. ఇందులో అనేక రకాల పనులున్నందువల్ల, శ్రమ విభజన వున్నందువల్ల పరోక్షముగా సహకరిస్తున్నట్లు అనుకొనవలెను. సంక్లిష్టమైన ఆధునిక సమాజాల్లో శ్రమ విభజన, విశిష్టీకరణ ఎక్కువగా వున్నందువల్ల పరోక్షణ, సహకారము అధికముగా యున్నది.

## 23.7. సహకారము-కారణాలు-ప్రకర్యాలు : సమాజమున సహకారానికి అనేక కారణాలు కలవు. వాటిలో ప్రధానమైనవి.

**23.7.1. వ్యక్తిగత లాభము :** వ్యక్తిగత లాభమే కొంత సహకారానికి ప్రధాన కారణముగా పేర్కొనవచ్చును. సహకారము లేకుండా ఏ వ్యక్తి సమాజమున జీవించలేడు. సహకారము లేనిచో ఏ వ్యక్తి రక్షణ, మనుగడ, ప్రగతి సాధించలేడు. అందుచే ప్రతివ్యక్తి ప్రత్యక్షముగానో, పరోక్షముగానో ఇతరులతో సహకరించితీరవలెను.

**23.7.2. పరహితము :** పరహితార్థము వలన కూడ సహకారము ఏర్పడును. అనగా ఆపద సమయాలైన అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, ప్రకృతి భీభత్సాలు, వరదలు మొదలైనవి సంభవించినప్పుడు వ్యక్తులు పరస్పరం సహకరిస్తారు.

**23.7.3. ఉమ్మడి లక్ష్యాలు :** సహకారము కేవలము వ్యక్తిగతమే కాక, ఉమ్మడి లక్ష్యాలతో కూడ కూడుకొని ఉండును. ఉదాహరణకు రోడ్డు వేయుటం, బావి తవ్వడం, మొదలైన సామాజికాభివృద్ధి పథకాలలో సహకారము ఎంతైనా అవసరము.

**23.7.4. శ్రమ విభజన :** ఆధనిక సమాజాలు సంక్లిష్ట సమాజాలు. ఈ సమాజాలలో శ్రమ విభజన, విశిష్టీకరణ ప్రధానంగా ఉంటుంది. కావున సహకారము తప్పనిసరి. కుటుంబము, విద్యాలయాలు, పరిశ్రమలు, మొదలైన సంస్థలలో ఆ సంస్థల లక్ష్యాలను, ఆశయాలను నెరవేర్చుటకు సహకారము చాలా అవసరము.

ఈ విధముగా సహకారము ప్రతి సమాజమున అత్యంత ప్రధానమైనది. మానవుడు ఒంటరిగా జీవించలేడు. అతడు అనేకమంది వ్యక్తులతో కలసి సహజీవనము గడుపుటలో ఆనందాన్ని, తృప్తిని పొందుతాడు. సమాజమున తన అవసరాలను తీర్చుకొనుటలో సహకారము

చాల ప్రధానమైనది. ఈ సహకారము సర్వ వ్యాపితమైనది. పుట్టుకనుండి మరణించేంతవరకు కొనసాగే సాంఘిక ప్రక్రియ. వ్యక్తుల మధ్య సమైక్యతను పెంపొందించును. వ్యక్తిగతంగా సాధించలేని అనేక సాంఘిక ప్రకార్యాలను యితరుల సహకారముతో సులభంగా చేయగలడు. సమాజమున వ్యక్తి తన నిత్యావసరాలను తీర్చుకొనుటలో సహకారము లేనిచో జీవితము శూన్యమగును. కావున సహకారము వ్యక్తిగత లాభాముతో పాటు పరహితమ, ఉమ్మడి లక్ష్యసాధన, శ్రమ విభజన మొదలైన ప్రకార్యాలతో సమాజమున ప్రధానపాత్ర వహించుచున్నది.

## 23.8. సర్దుబాటు (Accommodation) :

సాంఘిక పరస్పర చర్య అనుబంధ ప్రక్రియలలో సహకారము అనంతరము మరొక ప్రధానమైన ప్రక్రియ సర్దుబాటు. సర్దుబాటు ఫలితంగా సహకారము ఏర్పడును. సమాజమున అనేక వ్యత్యాసాల, విభేదీకరణల ఫలితంగా ఘర్షణ, పోటీ సర్వసాధారణమైన అంశంగా మారుతుంది. ఘర్షణ, పోటీల ఫలితంగా అనేక సమస్యలు, నష్టములు కలవు. వాటి ఫలితంగా హింసాత్మక చర్యలు చోటు చేసుకొని భయాందోళనలతో మనశ్శాంతిని కోల్పేయే అవకాశము కలదు. కావున సామాజిక జీవనము సాఫీగా జరగాలంటే అవాంఛనీయమైన పరిస్థితులనుండి బయటపడాలి. ఏ సమాజములో అన్ని వేళలా అనుకూల వాతావరణము ఉండదు. ఒక్కొక్కప్పుడు ప్రతికూల పరిస్థితులేర్పడుతాయి. వాటిని కూడ ఎదుర్కొని పరిస్థితులను చక్కపరచినపుడు సమాజములో కొంత స్థిరత్వమేర్పడును. కావున వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య, సంఘర్షణ, విభేదీకరణ లేకుండా ఉండుటకు, సమాజ స్థిరత్వానికి జరిగే ప్రయత్నము సర్దుబాటు. రెండు సమూహాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు, అభిప్రాయబేధాలు ఉన్నప్పుడు తాత్కాలికమైన సహకారపు ఏర్పాట్లు చేసుకొందురు. ఈ విధమైన తాత్కాలిక సహకారపు ఏర్పాట్లనే సర్దుబాటు అందురు. పరస్పర సహకారానికి, అట్లే పరస్పర సంఘర్షణకు కూడ వ్యక్తులు, సమూహాలు ఇష్టపడనప్పుడు వచ్చేది సర్దుబాటు. ఒకసారి సర్దుబాటు జరిగిన తరువాత మళ్ళీ ఘర్షణరాదని నిర్ధారించలేము. ఈ సర్దుబాటే తాత్కాలికమైన ఏర్పాటు. ఈ సర్దుబాటులోని అంశాలను ఒక ఒడంబడికగా చేసుకొందురు. సర్దుబాటుకు సహకారానికి ప్రధానంగా మూడు తేడాలు కలవు. అవి :

**23.8.1.** సర్దుబాటు అనేది సంఘర్షణకు, సహకారానికి మధ్యంతరముగా ఉండును. అనగా ఇది పాక్షికమైన సహకారము. వ్యక్తులు, సమూహాలు పరస్పరం ఒకరితో ఒకరు శక్తివంచన లేకుండా సంపూర్ణంగా మనఃపూర్వకంగా సహకరించడమనేది సాధ్యం కానప్పుడు సర్దుబాటు వస్తుంది.

**23.6.2.** సర్దుబాటు సాధారణంగా తాత్కాలికమైన ఏర్పాటు అయినప్పటికి చాలాకాలం సాగవచ్చును.

**23.6.3.** మతాల మధ్య పరస్పర వైరుధ్యాలు, స్పర్ధలు ఉన్నప్పటికి రెండు వర్గాలవారు సర్దుబాటు వల్ల పరస్పరం సహకరించుకొని సామాజిక జీవనం గడుపుతారు. కావున సర్దుబాటు వలన వైరుధ్యాలు సంపూర్ణంగా అవతరించడము అనేది ఉండదు. ఇరువర్గాలు తమతమ లక్ష్యాలలోగాని, దృక్పథాలలోగాని, హితాలలోగాని మార్పుచేసుకొనే అవసరం లేదు. వాని కారణంగా కలహించుకొనే అవసరమూ లేదు. ఈ విధంగా పరస్పరం సహకరించుకోవడానికి చేసుకొన్న ఒప్పందమే సర్దుబాటు.

సర్దుబాటు శాంతియుతమైన పరస్పర సాంఘిక ప్రక్రియకు దోహదపడుతుంది. కావున దాని వలన స్నేహపూర్వకమైన అభివృద్ధి ఏర్పడే అవకాశము ఉంది. అంతేగాక ఒక్కొక్కప్పుడు సర్దుబాటు వలన సంక్రమించే పరస్పర ప్రక్రియ మూలంగా ఇరుపక్షాల సంస్కృతి మిళితమవుతుంది. లేక ఒక పక్షము సంస్కృతిని, రెండవ పక్షంలోని సభ్యులు స్వీకరించవచ్చు. కావున ఆధునిక సమాజాలలో సంశ్లిష్ట వైరుధ్య (Heterogeneous) ధర్మములను కలిగియుండుటవలన సర్దుబాటు ఎంతైనా అవసరము. అందులోని సమూహాలు, ఉపవ్యవస్థలు తమ తమ లక్ష్యాలను సర్దుబాటు వల్లనే సాధించుకొంటాయి. సామాజిక జీవనంలో సర్దుబాటు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ శామ్యూల్ బట్లర్ "జీవితమే ఒక సర్దుబాటు. సర్దుబాటు స్వల్పంగానైనా లోపించడము మూర్ఖత్వమవుతుంది. అది పూర్తిగా లోపించటం ఉన్మాద సూచకము' ' (ఉదాహరణకు భారతదేశములోని మత కలహాలు, రాజకీయ కలహాలు, కులతత్వము). సర్దుబాటు తాత్కాలికంగా ఆగిందంటే మనం నిద్రిస్తున్నామన్నమాట. దానిని పూర్తిగా విస్మరించిడం మరణంతో సమానము. కావున సమాజ శాస్త్రవేత్తలు అనేకమంది సర్దుబాటును ఒక సాంఘిక ప్రక్రియగా పరిగణిస్తారు. కాని కొందరు దీనిని ఒక స్థితిగా లేదా పర్యవసానంగా కూడా పరిగణిస్తారు.

## 23.9. సర్దుబాటు-రకాలు :

సర్దుబాటు అనేది అనేక విధాలుగా ఉంటుంది. వాటిలో కొన్ని ఉద్దేశ్య పూర్వకంగానూ, చర్చాపూర్వకంగాను ఉంటాయి. మరికొన్ని అప్రయత్నంగా అనగా కాకతాళీయంగా ఏర్పడుతాయి. సమాజములో సర్దుబాటు ఈ క్రింది విధాలుగా జరుగుతుంది.

**23.9.1 ప్రాబల్యము-విధేయత** (Superordination - Subordination) : కుటుంబ వ్యవస్థలో ఒక వ్యక్తి ప్రాబల్యం వహించడం ఇతర సభ్యులు అతనికి విధేయులై ఉండడం సర్వసాధారణము. ప్రాబల్యము చెందిన ఒక సమూహానికి గాని, ఒక వర్గానికి గాని మరొక వర్గము లోబడి వుంటారు. ఈ విధమైన సర్దుబాటులో రెండు పక్షాలకు వ్యత్యాసముండుట వల్ల సాంఘిక సమానత్వముండదు. సమాజములో ఒక సమూహానికి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాంస్కృతికంగా, మతపరంగా ఆధిక్యత వున్నప్పుడు, ఆధిక్యత లేని సమూహాలు వారి యెడల విధేయతతో నడచుకొంటారు. బలహీనవర్గాలు ప్రాబల్య వర్గము యొక్క ప్రబలతకు, పలుకుబడిని అంగీకరించి వాళ్లకు లోబడి వుంటారు. ఆ విధంగా లేనియెడల ఇరువర్గాలకు ఘర్షణ సంభవిస్తుంది. ఈ విధమైన సర్దుబాటు సాధారణంగా రెండు అంశాలపై ఆధారపడి యుండును. (a) ఒక సమూహానికి సాధన సంపత్తులు ఎక్కువగా ఉండి, రెండో సమూహానికి అవి లేనప్పుడు (b) ప్రాబల్యము, అధీనత అనేవి మరొక సందర్భంలో కూడా సాధించవచ్చును. అది అసమత్వంతో కూడిన ఈ సాంఘిక సంబంధం తరతరాలుగా, సంప్రదాయసిద్ధంగా సంక్రమిస్తున్నప్పుడు.

## 23.10. సహనము (Toleration) :-

సమాజమున ప్రధానంగా వ్యక్తుల మధ్య సహనము సర్దుబాటు లోపించడం వల్ల సంఘర్షణకు దారితీయును. కొన్ని సంఘర్షణలు వాటి స్వభావాన్ని అనుసరించి రాజీని అసాధ్యం చేస్తాయి. విశ్వాసాలు చాలా బలీయంగా ఉండి, వాటిమధ్య రాజీకి అవకాశంలేని ఘర్షణ ఉన్నపుడు రాజి ఒక ప్రక్రియగా తనశక్తిని కోల్పోతుంది. ఉదాహరణకు మతసంబంధమైన సంఘర్షణలు. మతపరమైన సంఘర్షణలు, విలువలకు, విశ్వాసాలకు చెందుతాయి. అందుచే వాటి విషయంలో రాజీగాని, విజయంగాని, ఓటమి గాని అంగీకరించడము కష్టతరమైనది. ఆ పరిస్థితులలో సహనమే ప్రధాన పరిష్కార మార్గమగును. సహనము వల్ల ఏ పక్షానికి నష్టము వాటిల్లదు. ఎందుచేతననగా ఎవరెవరి ధోరణులు, విశ్వాసాలు, విలువలు వారివి. ఇతరుల జోక్యము గాని, ప్రమేయం గాని ఉండదు. వివిధ మతాలకు నిలయమైన భారతదేశాన సహనసూత్రానికి ప్రాధాన్యం ఎంతైనా కలదు. ఈ విధమైన సర్దుబాటు రాజకీయ సిద్ధాంతాల వల్ల ఏర్పడే సంఘర్షణలకు కూడ వర్తిస్తుంది. భిన్నమైన రాజకీయ సిద్ధాంతాలను అనుసరిస్తున్న రెండు దేశాలు శాంతియుత సహజీవనానికి ఒప్పుకోవచ్చు (ఉదాహరణకు సార్క్ దేశాలు, అలీన దేశాలు). రెండు పక్షాలు పరస్పర సహనంతో వ్యవహరిస్తున్నప్పుడు వాటి మధ్య జరిగే పరస్పర క్రియ సంఘర్షణ విషయానికి దూరంగా ఉంటుంది. స్వవర్గవాదము (Ethno Centrism) సహనానికి శత్రువు. విలువలు, విశ్వాసము ఉన్నచోట స్వవర్గవాదం అధికంగా ఉండే అవకాశము కలదు. ఎందుచేతననగా విలువలకు, విశ్వాసాలకు బలమైన ఆంక్షలు కలిగియుండి సాంస్కృతిక ఉద్వాటన ఉంటుంది. స్వవర్గ వాదం వల్ల సహనము కొరవడుతుంది. కావున సహనము ఏర్పడాలంటే భిన్నమయిన మానసిక స్థితి ఉండవలెను. ఒక విధమైన మానసిక దృక్పథం ఉన్నప్పుడే సహనం సాధ్యమవుతుంది. అనగా ఇతరుల హక్కును, మానవత్వాన్ని, ఇతర సంస్కృతుల విశిష్టతను గుర్తించి సహించగలిగిన మానసిక స్థితి అవసరము. అంతేగాక ఒప్పందం గాని, తీర్మానం గాని అవసరంలేని విషయాలలోనే సహనం పనిచేయును. ఉదాహరణకు మతసంబంధమైన విషయాలలో ప్రత్యర్థులు ఒక తీర్మానానికి రావలసిన అవసరము లేదు. భిన్నమైన ధర్మాలు పాటిస్తున్నా వాటి విషయంలో ఎట్లాంటి తీర్మానం గాని, ఒప్పందంగాని అవసరం లేకుండానే వర్ణాంతర, మతాంతర వివాహము చేసుకొనవచ్చును.

**23.10.1. రాజీపడుట** (Compromise) : సహనము లోపించినపుడు ఘర్షణకు దారితీయును. ఘర్షణకు లోనైన ఇరువర్గాలు సమావేశమవుతారు. తమ మధ్య ఉన్న విభేదాలను కక్షలను, వారే సమిష్టిగా పరిష్కరించుకొంటారు. ఈ విధమైన సమిష్టి చర్య కేవలము సహనము ద్వారా పరిష్కరించుకొనుటను రాజీపడుట అందురు. ఈ రాజీ వలన ఇరుపక్షాలు ఒక అంగీకారానికి వస్తారు. ఘర్షణపడిన

ఇరుపక్షాల వారు కొన్ని నిబంధనలకు కట్టుబడి సమాధానపడతారు. ఆ విధంగా నిర్ణయించుకొన్న నిబంధనలను ఇరుపక్షాల వారు పాటిస్తారు. అట్లా పాటించినచో తిరిగి ఘర్షణ ఏర్పడును.

**23.10.2 మూడోపక్షం సర్దుబాటు విధానము లేదా మధ్యవర్తిత్వము** (Third-party Techniques (or) Mediation) : సమాజమున వివిధ సమూహాల మధ్య సన్నిహిత సంబంధాలు లోపించినపుడు, విభేదీకరణ వలన ఘర్షణ ఏర్పడును. ఈ ఘర్షణ సహనము, రాజీ లేక మధ్యవర్తిత్వము ద్వారా నివారించవచ్చును. కాని సంఘర్షణ తీవ్రతరమైనపుడు దానికి లోనైన వ్యక్తులు గాని, సమూహాలు గాని పరస్పర విభేదాల వలన వారి మధ్య సయోధ్య కుదరదు, ఆ విధంగా తమకు తాము సర్దుబాటు చేసుకోలేనప్పుడు మధ్యవర్తిద్వారా వారి మధ్య సమయోజనం ఏర్పరచుకోవచ్చును. సాధారణంగా ఈ విధమైన చర్య కుటుంబాల తగాదాలలోను, భార్యాభర్తల వివాదాలలోను, విద్యార్థుల, రాజకీయసంఘాలలోను ఎంతైనా అవసరము. ఇటువంటి మూడో పక్ష సమయోజనాల ద్వారా విడాకులు, తగాదాలు, కొంతవరకు నివారణ అవుతుంటాయి. మూడోపక్షం సర్దుబాటు విధానాలు ఎక్కువగా పారిశ్రామిక రంగంలో కార్మికుల, యజమానుల మధ్య ఏర్పడే సంఘర్షణలను తీర్మానించడానికి ఉపయోగపడతాయి. (కార్మిక సంఘాలు, కార్మిక సంస్థలు మూడో పక్షానికి ఉదాహరణలు) కావున రాజీ (Conciliation) మధ్యవర్తిత్వము (Mediation) ఆర్బిట్రేషన్ (Arbitration) మొదలైనవి మూడోపక్ష సర్దుబాటు విధానాల నుంచి వస్తాయి.

## 23.11. సారాంశము :

సామూహిక సామరస్యానికి సర్దుబాటు చాలా అవసరము. కాని పరిస్థితుల వల్ల, కాలం మార్పుల వల్ల ఒకనాడు చేసుకొన్న సర్దుబాటు మరొకనాటికి సరిపడక పోవచ్చు. ఉపపాదనలకు కాలదోషం పట్టవచ్చు. అప్పుడు కొత్త మార్గాలను అన్వేషించవలె. లేకపోతే పాత వైరాలు తల ఎత్తుతాయి. ఈ కారణంగానే ఉపపాదన అంతిమ సమయోజనం కాదని పేర్కొనబడెను. కావున సర్దుబాటు కూడ ఒక విధమైన ప్రక్రియ అని చెప్పవచ్చును. అందుచేత సామూహిక సామరస్యానికి సర్దుబాటు అనివార్యము. కాని మారుచున్న పరిస్థితులవల్ల ఒకప్పుడు చేసుకొన్న సర్దుబాటు మరొకప్పుడు సరిపడకపోవచ్చును. పాతకక్షలు, విరోధాలు తిరిగి తలెత్తకుండా వుండాలంటే ఎప్పటికప్పుడు కొత్త విధానాలను అన్వేషించవలసిన అవసరము ఎంతైనా కలదు.

### ప్రశ్నలు

1. సాంఘిక పరస్పర చర్య అనగానేమి? దాని స్వభావము అందలి రకములను వివరించుము?
2. సామాజిక పరస్పర స్వభావమును ప్రాముఖ్యమును వివరించుము?
3. సాంఘిక పరస్పర చర్యలు ఎన్ని విధములు వివరించుము?
4. సహకారము అనగానేమి? సహకారము యొక్క ప్రాముఖ్యతను వివరించుము?
5. సర్దుబాటు అనగానేమి? ఎన్ని విధములు?
6. సామాజిక పరస్పరచర్య - అనుబంధ ప్రక్రియలను వ్రాయుము?

రచయిత
యస్. సుబ్రమణ్యం

పాఠము-24

# విలీనీకరణము - సంస్కృతీకరణము-సమైక్యత

## (ASSIMILATION - ACCULTURATION & INTEGRATION)

24.0 లక్ష్యం
24.1 నిర్వచనములు
24.2 సంస్కృతీకరణము
24.3 విలీనీకరణము
24.4 సామాజిక సమైక్యత
24.5 సామాజిక సమైక్యత లక్షణాలు
24.6 సారాంశము

### 24.0 లక్ష్యం :

మానవ సమాజము భిన్న సంస్కృతులు, మతాలు, భాషలు, జాతులు కలిగిన సమూహాల పరస్పర చర్యల ద్వారా సాంఘిక సంబంధాల ద్వారా ఏర్పడినది. సమాజమున అనేక రకాల ప్రజలు జీవిస్తుంటారు. అందుచే విభిన్న సంస్కృతులను కలిగిన వర్గాలు సహజీవనము సాగిస్తున్నప్పుడు వారి మధ్యగల విభిన్న సాంప్రదాయ, సాంస్కృతిక అంశాలను స్వీకరించడం, మార్పిడి చేసుకోవడం ద్వారా జరిగే ప్రక్రియను సంస్కృతీకరణముగాను లేదా విలీనీకరణముగాను పేర్కొనవచ్చును. కావున విభిన్న సంస్కృతులున్న రెండు సమూహాల మధ్య సంపర్క మేర్పడినప్పుడు సంస్కృతీకరణము గాని, విలీనీకరణముగాని జరుగవచ్చును. ఈ రెండు ప్రక్రియలకు చాలా దగ్గర సంబంధము కలదు. అందుచే వీటిని వేరువేరుగా విశదీకరించడము సులభతరమైనది కాదు. అందుచే వీటి నిర్వచనాలు కూడా స్పష్టంగా, ఇదమిత్థంగా పేర్కొనలేము. అందుచే సామాజిక శాస్త్రవేత్తలు ఈ రెండు పదాలను ఒకే ప్రక్రియకు పర్యాయపదాలుగా వాడిరి. సంస్కృతీకరణం, విలీనీకరణం ఒకే ప్రక్రియను లేదా తద్వారా ఏర్పడే పర్యవసాన స్థితిని అభివర్ణించేవి. అందుచే ఈ రెండు పదాలు సమూహాల మధ్య జరిగే పరస్పర చర్యలకు రూపాంతరాలు లేదా పర్యవసానాలు. మరికొంతమంది సమాజశాస్త్రవేత్తలు విలీనీకరణాన్ని తొలిదశలో ఏర్పడు ప్రక్రియగాను, సంస్కృతీకరణము తదుపరి దశలో ఏర్పడే ప్రక్రియగానుగాను, పేర్కొనిరి. మరికొందరి అభిప్రాయం ప్రకారం సాంస్కృతికమైన మార్పులకు సంబంధించినది సంస్కృతీకరణము, సాంఘిక సంబంధాలలో, నిర్మితిలో జరిగే మార్పులకు సంబంధించింది విలీనీకరణము. అనగా సంస్కృతి విశ్లేషణ వస్తువు అయినప్పుడు సంస్కృతీకరణము అంటారు. సామాజిక వ్యవస్థలు, సాంఘిక సంబంధాలు విశ్లేషణ వస్తువు అయినపుడు విలీనీకరణమంటారు. అందుచే ఈ వ్యత్యాసం ఆధారంగా సామాజిక శాస్త్రంలో విలీనీకరణమనే పదాన్నే సమాజశాస్త్రవేత్తలు ఎక్కువగా సమాజశాస్త్ర అధ్యయనమున వాడుచున్నారు.

24.1 నిర్వచనము (Definition) : సమాజమున సామాజిక వ్యవస్థలకు, సంస్కృతికి మధ్య సన్నిహిత సంబంధము కలదు. అందుచే సంస్కృతీకరణము, విలీనీకరణము వేరుచేసి ఆపాదించడం కృత్రిమమౌతుంది. జి.డి. స్పిండ్లర్ (G.D. Spindler) అభిప్రాయము ప్రకారము, రెండు సమూహాల మధ్య జరిగే సంస్కృతీకరణము సంపూర్ణమైన అనుకరణ ప్రక్రియ (Total Adaptive Process) అని తద్వారా విలువలలోనూ, సామూహికాంతస్సంబంధాలలోనూ, సామాజిక నియంత్రణలోనూ (Social Control), సాంఘిక వ్యవస్థాపనలోనూ (Social Organisation), ఆర్థిక వ్యవస్థలోనూ (Economic Organisation), వ్యక్తుల మానసిక ప్రవృత్తులలోను మార్పులు జరుగుతుంటాయని పేర్కొనెను. దీనిని బట్టి సంస్కృతీకరణము సాంఘిక వ్యవస్థలకు కూడా వర్తింపచేస్తారని విశదమగుచున్నది. అందుచే సంస్కృతీకరణాన్ని, విలీనీకరణాన్ని వేరుచేయడం అసమంజసమని స్పష్టమగుచున్నది. మరికొందరు సామాజిక శాస్త్ర వేత్తలు సంస్కృతీకరణం ఏకపక్ష స్వీకారము కావున దీనికి ఇతర ప్రత్యేకతలు కూడ ఉండునని పేర్కొనిరి. వారిలో ప్రముఖులు జె.డబ్ల్యు పావల్ (J.W.Powell)

డబ్ల్యు.జె.మెక్ గీ C.W.J.Mc Gee మొదలైనవారు. వీరి అభిప్రాయం ప్రకారము 1) శక్తివంతమైన సంస్కృతి ప్రభావంవల్ల స్వకీయమైన సాంప్రదాయాలు, అధిక భాగము పరివర్తన చెందడమే సంస్కృతీకరణము, అనగా (J.W.Powell) ఒక ఏకపక్ష స్వీకారము. 2) ఏకపక్షమైన సంస్కృతీకరణము బాహ్యమైనది, విరుద్ధమైనదని అది స్నేహపూర్వకమైన మార్పుకాదని W.J.Mc Gee అభిప్రాయపడెను.

పైన పేర్కొనబడిన అంశాలలో వ్యత్యాసం ప్రస్ఫుటముగా కనబడినప్పటికి ఈ అంశములో కూడ ఏకాభిప్రాయములేదు. రెండు విభిన్న సంస్కృతుల మధ్య సంపర్క మేర్పడినపుడు సంస్కృతి సాంస్కృతికపరమైన మార్పులకు గురి అగుటలో కొన్ని మార్పులుంటాయని, కొంత సాంస్కృతిక సమ్మేళనము జరుగుతుందని పరిశీలనాత్మకముగా తెలియుచున్నది. అందుచే రాబర్ట్ రెడ్‌ఫీల్డ్, (Robert Redfield) రాల్ఫ్ లింటన్ (Ralph Linton) హెర్స్కోవిట్స్ (Herskovits) మొదలైనవారు ఈ విషయాన్ని పేర్కొనిరి. వీరి అభిప్రాయము ప్రకారము సంస్కృతీకరణము ద్విపక్ష స్వీకారము. అనగా రెండు భిన్న సంస్కృతుల మధ్య సంపర్క మేర్పడినపుడు ఒక పక్షము ఇవ్వడము, రెండవ పక్షము స్వీకరించడము కాకుండా ఉభయపక్షాలలోను కొన్ని సాంస్కృతికపరమైన మార్పులు, చేర్పులుంటాయని పరిశీలనాత్మకంగా తెలియుచున్నది. అందుచే ఈ అంశములను దృష్టిలో ఉంచుకొని మనము ఈ ప్రక్రియలను వేరువేరుగా పరిశీలించవలసియున్నది.

## 24.2 సంస్కృతీకరణమ (Acculturation) :

ఒక సాంస్కృతిక వర్గానికి చెందినవారు మరియొక సాంస్కృతిక వర్గానికి చెందిన వారి యొక్క సాంస్కృతి విధానాలతో తమ సంస్కృతి విధానాలు పోలి ఉండాలి అనుకోవడమే సంస్కృతీకరణమని ప్రొ. రాస్ (Prof. Ross) అభిప్రాయము. ఈ ప్రక్రియ పర్యవసానంగా స్వీయ సంస్కృతి పూర్తిగా అదృశ్యమై పర సంస్కృతిని అనుకరింతురు లేదా సమపాళ్ళలో ఉభయవర్గాలలోనూ సాంస్కృతి మిశ్రమం జరుగవచ్చు. లేదా ఒక వర్గం కంటె మరొక వర్గం పరసంస్కృతిని అధికంగా స్వీకరించవచ్చును. ఈ విధమైన పర్యవసానాలు అనేక అంశములపై ఆధారపడియుండును. అవి 1) సమూహాల పరిమాణము, 2) సమూహాల పరువుప్రతిష్ఠలు 3) సంపర్కంవల్ల ఏర్పడిన సాంఘిక సంబంధ స్వభావము. 4) పరస్పరాభి వృత్తులు, 5) ఉభయ సంస్కృతులమధ్య ఉన్న అనుకూల్యము మొదలైన అంశాల మీద ఆధారపడి సాంస్కృతిక సమ్మేళనం జరుగుతుంది. కావున సంస్కృతీకరణ ఉన్నతదశలోఉన్న సాంస్కృతిక వర్గము తన ప్రభావాన్ని సామాన్య సాంస్కృతిక వర్గము పై ప్రసరింప చేస్తుంది. అయితే సామాన్య సాంస్కృతిక వర్గం నుండి కొన్ని విషయాలను ఉన్నత సాంస్కృతిక వర్గము కూడ స్వీకరిస్తుంది ఉదాహరణకు నిమ్నకులాలు అగ్రకులాల వారి యొక్క ఆచార సాంప్రదాయాలను ఇతర సంస్కారములను అనురించుట. దీనినే అచార్య యమ్.యన్. శ్రీనివాస్ (M.N.Sreenivas) సంస్కృతీకరణముగా (Sanskritisation) పేర్కొనెను. ద్విజులుకాని వారు యజ్ఞోపవీతము, పూజ, పునస్కారము మొదలైనవి పాటించటము, బ్రాహ్మణ్యాన్ని చేపట్టడము జరుగును. సంస్కృతీకరణము వలన సంస్కృతి బాగుగా అభివృద్ధి చెంది సమాజ వికాసానికి దారితీయును. విభిన్న సంస్కృతుల మధ్య అంతరాలు బాగా తగ్గును. సంస్కృతీకరణము, విలీనీకరణమునకు తొలిదశ అయినప్పటికిని కొన్ని సందర్భాలలో విలీనీకరణమునకు దారితీయును.

## 24.3 విలీనీకరణము (Assimilation) :

ఒకే రూపాన్ని, ఒకే స్థితినిగాని పొందడాన్ని విలీనీకరణమందురు. అనగా సాంస్కృతిక సారూప్యము కలిగియుండుట. సంపర్కంలో ఉన్న రెండు భిన్న సంస్కృతులు బహుశా మిశ్రమంచెంది చివరకు ఒక క్రొత్త సంస్కృతిగా అవతరించడం విలీనీకరణమగును. విలీనీకరణ ప్రక్రియలో సాంప్రదాయాలు, విలువలు, అధికృత్తులు, సాంఘిక సంస్థలు సమ్మిళితమై ఒక నూతన స్థితిని పొందుతాయి. విలీనీకరణంలో సాంస్కృతిక వ్యత్యాసాలు సమసిపోయి పరస్పర సహకారము అధికమగును. ఉభయపక్షాలు ఒకేవిధమైన సంప్రదాయాలు, విలువలు, సంస్థలు, భావవృత్తులను నెలకొల్పు కోవడము, అంగీకరించడం ద్వారా వారి మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు సమసిపోయి పరస్పర సహకారము అధికమగును. ఉదా: ఉమ్మడి కుటుంబాలకు చెందిన తోడికోడళ్ళు వివిధ కుటుంబాలకు చెందిన వివిధ రకాలైన సాంప్రదాయాలను, ఆచార వ్యవహారములను కలిగి ఉంటారు. కాని అత్తవారింట వారి పూర్వపు ఆచార సాంప్రదాయాలను కొంతవరకు విడిచి ఆ యింటి ఆచారాలను అలవర్చుకోవడం జరుగుతుంది. లేనిచో సంఘర్షణలకు గురై కుటుంబం విచ్ఛిన్నానికి దారితీస్తుంది.

విలీనీకరణంలో సాంస్కృతిక వ్యత్యాసాలు సమ[illegible]యి. తద్వారా సంఘర్షణలు కూడా అంతరిస్తాయి. పరస్పర సహకారము అధికమగుతుంది. వైధర్మాలు సమసిపోయి సాంస్కృతిక తాదాత్మ్యం ఏర్పడుతుంది. ఉభయ పక్షాలు ఒకేరకమైన భావవృత్తులు, సాంప్రదాయాలు, విలువలు, సంస్థలు నెలకొల్పుకోవడం అంగీకరించడం వాటినే శాశ్వతం చేసుకోవడానికి ప్రయత్నించడం జరుగును. కావున ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో విలీనీకరణం కొంత జరుగుతుంది. ఈ విధమైన విలీనీకరణము చాలా అవసరము. లేనిచో సంఘర్షణకు దారితీసి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంది.

విలీనీకరణము సమాజ లేక జాతీయ స్థాయిలో కూడ జరుగుతుంది. ఉదాహరణకు నేడు అమెరికాలో అనేక దేశాల నుండి వలసవచ్చిన ఎన్నో సమూహాలున్నాయి. ఇవన్నీ వివిధ ఆచారములను సాంప్రదాయాలను, సంస్కృతులను, విలువలను, విశ్వాసాలను, కట్టుబాట్లను కలిగియున్న సమూహాలు. కాలక్రమేణా విలీనీకరణము చెంది, నేడు ఒక ప్రత్యేకమైన ఉమ్మడి సంస్కృతిని రూపొందించుకున్నాయి. దీనినే అమెరికన్ సంస్కృతి లేదా అమెరికన్నైజేషన్ (Americanization) అందురు. అదేవిధంగా భారతదేశమున కూడ అనేక మతాలకు, భాషలకు, సంస్కృతులకు సంబంధించిన సమూహాలు దేశం నలుమూలలా వ్యాపించి అనేక వైవిధ్యాలను సృష్టిస్తున్నాయి. ఆ వైవిధ్యాలన్నీ తొలగిపోయి వినూత్నమైన విశిష్టమైన ఆధునిక భారత సంస్కృతి ఒకటి ఏర్పడె ప్రక్రియనే ఇండియనైజేషన్ (Indianisation) అందురు. కావున సువిశాల భారతదేశానికి విలీనీకరణము ఎంతైనా అవసరము. విలీనీకరణము జరుగకపోయిన యెడల మతపరమైన, రాజకీయపరమైన, సాంస్కృతికపరమైన వాదాలకు దారితీయును.

విలీనీకరణము నెమ్మదిగా జరుగుతుంది. అంతేగాక సమగ్రంగాను, సంపూర్ణంగాను జరగడం చాలా అరుదు. అందుచే పాక్షికమైన విలీనీకరణము జరుగుతుంది. దాని ఫలితంగా సాంస్కృతిక బాహుళ్యము (Culture Pluralism) ఏర్పడుతుంది. సమాజంలో కొన్ని సాంస్కృతిక వర్గాలు సంపూర్ణ విలీనీకరణానికి ఇష్టపడకపోతే సాంస్కృతిక బాహుళ్యం ఏర్పడుతుంది. మెజారిటీ వర్గం మైనారిటీ వర్గాన్ని తృణీకరించినా, నిరాదరించి నిరాకరించినా కూడ సాంస్కృతిక బాహుళ్యం ఏర్పడుతుంది. సాంస్కృతిక బాహుళ్యము అనగా మెజారిటీ సంస్కృతిలో మైనారిటీ సంస్కృతులు అనేకం ఉండడం కాదు. అందుచే మైనారిటీ సంస్కృతులలో మెజారిటీ సంస్కృతి ప్రభావం వల్ల కొంత మార్పు ఏర్పడుతుంది. అటువంటి మార్పు పాక్షికంగా మాత్రమే వచ్చినప్పుడు సాంస్కృతిక బాహుళ్యంవస్తుంది ఈ కారణంగా సాంస్కృతిక బాహుళ్యంలో నూతనత్వం కొంత కన్పించును. కాని ఆ నూతనత్వం పూర్తి విలీనీకరణానికి దోహదం చేస్తుందని గాని విలీనీకరణానికి ముందు వచ్చే సంధిస్థితి అనిగాని అనుకోకూడదు.

**24.3.1 విలీనీకరణము అంతరాయాలు :** సాధారణంగా ప్రతిసమాజమున విలీనీకరణము అన్నివేళలా సాంతం కొనసాగదు. ఇది పాక్షికంగా ఉండును. దానికి ప్రధాన కారణము అనేక అంతరాయాలు కలిగి యుండుటయె.

**24.3.1.1** రెండు సంస్కృతుల మధ్య అంతరాలు అధికంగా ఉన్నపుడు వాటి మధ్య అనుకూలత లోపించడము చేత విలీనీకరణము పూర్తిగా జరగదు. ఉభయ సంస్కృతుల లోను కొంతవరకు సారూప్యం ఉండె విలీనీకరణము చక్కగా సాగుతుంది.

**24.3.1.2** సారూప్యాలు లేని రెండు భిన్న సంస్కృతులు, ఒక సంస్కృతి మరొక సంస్కృతిని మార్చుటకు ప్రయత్నించినపుడు తీవ్రమైన విభేదాలు ఏర్పడతాయి. ఉదాహరణకు ఆదిమవాసుల సమాజాలను పాశ్చాత్య నాగరిక సమాజాలుగా మార్చాలని ప్రయత్నించినపుడు సాంస్కృతిక అంతరం కారణంగా ఆ ఆదిమవాసుల సమాజాలలో తీవ్రమైన బాధాకరమైన కలతలు, సంక్షోభాలు చెలరేగును. దాని ఫలితంగా విలీనీకరణము ఏ సంస్కృతికి చెందదు.

**24.3.1.3.** దురభిమానము, స్వవర్గవాదము విలీనీకరణానికి మరొక ప్రధాన అవరోధము. ఎందుచేతననగా సాంస్కృతిక దురభిమానులు తమ సంస్కృతి మిన్నయైనదని భావించడము.

**24.3.1.4.** రూపంలోను, రంగులోను, భౌతికమైన తేడాలు రెండు సంస్కృతులమధ్య ఉన్న యెడల విలీనీకరణము జరుగదు. అనగా సారూప్యము కలిగిన రెండు సంస్కృతుల మధ్య విలీనీకరణము జరుగును.

**24.3.1.5.** సమలీనీకరణము (Amalgamation) ఇది జైవికమైన ప్రక్రియ అనగా రెండు భిన్న సంస్కృతివర్గాల మధ్య వివాహ సంబంధాలు అధికమైనపుడు ఆ వర్గాల మధ్య జైవికమైన మార్పులువస్తాయి. వివాహాలలో ఉండే నిషేధాలు తొలిగి స్వేచ్ఛగా వివాహాలు జరుగుట వలన భిన్నవర్గాల మధ్య జైవికమైన తాదాత్మ్యం వచ్చును. దీనినే సమలీనీకరణమందురు. సమలీనీకరణము, విలీనీకరణము పరస్పరం దోహదం చేసుకొంటాయి. అనగా వైవాహిక సంబంధాలు రెండు భిన్నసంస్కృతుల మధ్య ఏర్పడినపుడు క్రొత్త సంస్కృతి ఏర్పడును. దాని ఫలితంగా రెండు సంస్కృతులకు చెందిన వ్యక్తులు నూతన సంస్కృతికి ప్రభావితులై వారిమధ్య సయోధ్య ఏర్పడును. ఈ సయోధ్య సామాజిక అనుబంధ ప్రక్రియలకు అత్యంత ప్రధానమైనది. సాంఘిక సంబంధాలు నిర్విరామంగా కొనసాగును.

## 24.4. సామాజిక సమైక్యత (Social Integration) :

సాంఘిక పరస్పరచర్యలో ఒక భాగంగా అనుబంధ ప్రక్రియలలో మరొక ప్రధానమైన ప్రక్రియ సమైక్యత. మానవుడు సంఘజీవి. ఈ విధమైన సంఘజీవనానికి ప్రధానమైన మరొక ప్రక్రియ సామాజిక సమైక్యత. ప్రతి సమాజమున ఏదో ఒక అంశం ఆధారంగా విభేదీకరణ ఉండును. ఈ విధమైన విభేదీకరణలో సమైక్యత లోపించుట వలన విచ్ఛిన్న ప్రక్రియలకు అనగా పోటీ, సంఘర్షణలకు దారితీయును. కావున సమాజం ఒక సామాజిక సంబంధాలతో కూడిన గూడువంటిది. అందుచేత ఆ సాంఘిక సంబంధాల సమైక్యత వ్యవస్థీకృతమైన సామాజిక సంబంధాలపై ఆధారపడి ఉండును. "సామాజిక సమైక్యత అనగా సామాజిక సంబంధాల యొక్క కలయిక." అలాగని అవి ఒకే రకమైన అంశాల కలయిక కాదు. అలవాట్లు, సాంప్రదాయాలు, ఆదర్శాలు, సమూహాలు తరగతులు మొదలైనవి. విజాతీయ - (Hetero-genetic) సమాజంలో వివిధ అంగాలు, వీటన్నిటిని వ్యవస్థీకృతం చేయుటకు ఒక వ్యవస్థ అవసరము. కాని ఈ వ్యవస్థ యొక్క నమూనా అన్ని సమాజాలలోను ఒకేరకంగా ఉండనక్కరలేదు. వివిధ సమాజాలు విభిన్న భౌగోళికావసరాలలో ఉండి వివిధ చారిత్రాత్మక అంశాలకు లోనై వాటి సంస్కృతి వేరైతే సామాజిక వ్యవస్థ మారుతుంది. అందువలన ఒక సమాజము సంస్కృతే ఆ సమాజము యొక్క సామాజిక వ్యవస్థలోని నమూనాలను నిర్ణయిస్తుంది. ఈ విధంగా సామాజిక సమైక్యత ప్రత్యేక సాంస్కృతిక నమూనాల ద్వారా సమాజముయొక్క వివిధ అంగాలైన వ్యవస్థలతో కూడి వుంటుంది.

## 24.5 సామాజిక సమైక్యత-లక్షణాలు :

**24.5.1. సాంఘికీకరణము:** సాంఘికీకరణము ఒక స్థిరమైన స్థితికాదు. ఇది ఒక గతిశీల ప్రక్రియ. సాంఘిక గుణాలను, సాంఘిక జీవన నమూనాలను పొందుటకు, వృద్ధిచేసుకొనుటకు సాంఘికీకరణము వ్యక్తికి ఉపయోగపడును. ఇది వ్యక్తులయొక్క పరస్పర సంబంధాలలో సామరస్యాన్ని, సమన్వయాన్ని కలుగజేస్తుంది. సామాజిక సమైక్యతకు ప్రధానంగా తోడ్పడుతుంది. సాంఘికీకరణము ద్వారా వ్యక్తి మూర్తిమత్వము అభివృద్ధిచెంది విశాల దృక్పధమును పెంపొందించుకొనును. ఈ విధమైన విశాల దృక్పధము వ్యక్తుల మధ్య సమైక్యతను పెంపొందించును. కావున సాంఘికీకరణము చెందని వ్యక్తులమధ్య సమైక్యత లోపించును.

**24.5.2 ఉమ్మడి ఉద్దేశ్యాలు-ఆశయాలు;** వ్యక్తుల అభిరుచులలో, అలవాట్లలో, ఉమ్మడి ఉద్దేశ్యాలు కలిగి ఉండుట ద్వారా సామాజిక సమైక్యత ఏర్పడును. ఉమ్మడి ఉద్దేశ్యాలు, ఉమ్మడి కోరకలు సమాజంలోని వ్యక్తులు ఒకటిగా ముడివేస్తాయి. సారూప్యము, పరస్పర సమన్వయం వ్యక్తులమధ్య బంధాన్ని సృష్టిస్తాయి. ఉమ్మడి ఉద్దేశాలు ఆశయాలు కలిగి ఉండుట వలన వ్యక్తులమధ్య విభేదీకరణ ఉండదు. వారి మధ్య పరస్పర అవగాహన ద్వారా వారి ఆశయాలను నెరవేర్చుకొంటారు. సమాజంలోని సాంఘిక, ఆర్థికపరమైన విభేదాలు ఉన్నప్పటికి ఉమ్మడి ఆశయాలు, ఉద్దేశ్యాలు వారిమధ్య సమైక్యతను పెంపొందించును. ఉదాహరణకు యాజమాన్యము-కార్మికుల మధ్య ఉమ్మడి ఉద్దేశ్యాలు-ఆశయాలు ఉత్పత్తిని పెంచడము. తద్వారా ఇరువురు ప్రయోజనాన్ని పొందుతారు. అదేవిధంగా కుటుంబంలోని సభ్యులమధ్య ఉమ్మడి ఉద్దేశ్యాలు, ఆశయాలు కలిగి ఉండుట వలన కుటుంబము విచ్ఛిన్నంకాదు. కుటుంబాలు విచ్ఛిన్నమయ్యేదానికి ప్రధాన కారణం సభ్యులమధ్య సమైక్యత లోపించడమె.

**24.5.3. సాంస్కృతికాంశాలలో సన్నిహిత సంబంధాలు :** ప్రతి సమాజంలోనూ సాంఘికంగా, ఆర్థికంగానే కాక సాంస్కృతికంగా భిన్నత్వముంటుంది. ఈ భిన్నత్వము వలన వ్యక్తుల మధ్య విభేదీకరణ చోటుచేసుకొని సమైక్యత లోపించును. దాని ఫలితంగా వ్యక్తుల మధ్య సన్నిహిత సంబంధాలు లోపిస్తాయి. అందుచేత సామాజిక సమైక్యత సాంస్కృతికాంశాలపై, వ్యవస్థాపనపై ఆధారపడి ఉండును. అందువలన వివిధ సాంస్కృతికాంశాలమధ్య సన్నిహిత సంబంధాలు ఉండటము సామాజిక సమైక్యతకు ఎంతైనా అవసరము.

**24.5.4. బహుకుల, బహుభాషా సమాజాలలో సామాజిక సమైక్యత :** ఈ సమాజాలలో సామాజిక సమైక్యత, స్తరీకరణ భాష, మత, కుల ప్రాతిపదికలతో ఏదో ఒక దానిపై ఆధారపడి ఉంటుంది. ఏక జాతి సమాజాలు అరుదుగా కనిపిస్తాయి. ప్రతి సమాజంలోను ఏదో ఒక అంశంపై ఆధారపడి విభజన జరుగుతుంది. అంతేగాక, సామాజిక సమైక్యతకు సజాతీయత (ఏకజాతి) భావము తప్పనిసరిగా అవసరము. అందుచేత బహుకుల సమాజాలలో సామాజిక సమైక్యత కష్టమైనప్పటికినీ, సాధించబడక తప్పదు. ఇందుకు సామాజిక నిర్మితిలోని వివిధ కులాల మధ్యనున్న ఊర్ధ్వ, అధోస్థితికి, గతిశీలతకు, వ్యవస్థా రూపాన్నివ్వటం ఎంతో ముఖ్యము.

వివిధకులాలు, మతాలు, భాషలు, జాతులు, కలిగియున్న భారతదేశములాంటి సమాజములలో సమైక్యత కొంతవరకు కష్టతరమైనది. ఎందుచేతననగా భిన్న ధోరణులు కలిగియుండి ఏదో ఒక అంశముపై వారి మధ్య సంఘీభావము లోపించును. అందువలన కులతత్వము, మతత్వము, భాషాతత్వము, ప్రాంతీయతత్వము, ఏదో ఒక అంశము వారిపై అధిక ప్రభావాన్ని చూపి వారి మధ్య అనైక్యతకు దారితీయును. కావున సామాజిక సమైక్యత సాధించుటకు లౌకిక వాదము ఎంతైనా అవసరము.

## 24.6. సారాంశము :

పైన పేర్కొనబడిన అంశాలను దృష్టిలో ఉంచుకొని వ్యక్తులు వ్యవహరించిననాడు వారి మధ్య సమైక్యత ఏర్పడుతుంది. సమైక్యత అనగా సాంఘిక సంబంధాలను వ్యవస్థీకృతం చేసే ప్రక్రియ. ఇట్టి వ్యవస్థీకృతమైన సామాజిక సంబంధాలకు వ్యక్తులమధ్య సామరస్యపూరితమైన వాతావరణం ప్రధాన అవసరం. ఈ విధమైన సామరస్యపూరిత వాతావరణము ఉమ్మడి ఆశయాలను, లక్ష్యాలను, భాషను, కలిగి యుండుట ద్వారా ఏర్పడుతుంది. అందుచేత సమాజంలో అనేక భాషలుండటం, సహజంగా సామాజిక సమైక్యతకు ఒక అవరోధము. అందుచేత వివిధ భాషలున్నప్పటికి సామాజిక సమైక్యతను సాధించుటకు ఒకే భాషను జాతీయ భాషగా గుర్తించి ప్రాధాన్యత ఇవ్వడం, అనగా అన్ని భాషలకు భాషాస్వేచ్ఛనిచ్చి, ఉమ్మడి భాషను వృద్ధిచేయడము అవసరం. అంతేగాక కులాలతో, భాషలతో కూడిన సమాజంలో సామాజిక సమైక్యతను సాధించాలంటే ఒకేసారి అన్ని మతాలను, కులాలను, భాషలను ప్రోత్సహించాలి. అదేసమయంలో కుల భాషాపరమైన భావవృత్తులను సమర్ధవంతంగా నిరోధించాలి. ఉమ్మడి భాషపైన, సామాజిక చైతన్యముపైన, ఆధారపడి సమాజాన్ని నిర్మించుకోవాలి. కాబట్టి సమాజంలో సమైక్యతను సాధించుటకు భిన్నత్వము ఉన్నప్పటికి వ్యక్తుల మధ్య సహనాన్ని పెంపొందించుటకు అవసరమైన వాతావరణాన్ని కల్పించాలి. ప్రధానంగా లౌకిక విధానమును అనుసరించుట ద్వారా సామాజిక సమైక్యతను సాధించవచ్చు. ఆధునిక సమాజాలలో సమైక్యత ఎంతైనా అవసరము. సామాజిక సమైక్యతద్వారా వ్యక్తుల మధ్య అనుబంధ సాంఘిక ప్రక్రియలను పెంపొందించవచ్చును.

### ప్రశ్నలు

1. సామాజిక సమైక్యత అనగానేమి వివరించుము?
2. సాంఘిక ప్రక్రియలో విలీనీకరణము, సంస్కృతీకరణముల పాత్రను వివరించుము?
3. సామాజిక సమైక్యత ప్రధాన లక్షణాలను వివరించుము?

రచయిత :
యస్. సుబ్రమణ్యం

పాఠము - 25

# సాంఘిక పరస్పరచర్య - విచ్ఛిన్న ప్రక్రియలు

## (SOCIAL INTERACTION - DISASSOCIATIVE PROCESSES)

25.0 లక్ష్యం
25.1 పోటీ - పరిచయము
25.2 పోటీ - సంఘర్షణ మధ్య గల భేదాలు
25.3 పోటీ - ప్రయోజనాలు - పర్యవసానాలు
25.4 సారాంశము
25.5 సంఘర్షణ రకాలు
25.6 వ్యక్తిగత - సామూహిక సంఘర్షణలు
25.7 ప్రాంతీయ భేదాలు
25.8 మత కలహాలు
25.9 జాతి వైషమ్యాలు
25.10 సారాంశము

## 25.0 లక్ష్యం :

ఒక స్థిరమైన రూపాన్ని ధరించే పరస్పర చర్యలనే సాంఘిక ప్రక్రియ అందురు. సాంఘిక ప్రక్రియ అనేక రూపాలు ధరిస్తుంటుంది. ఒక వైపు పృధక్కరణ (Isolation), మరొకవైపు వ్యక్తులమధ్య లేదా సమూహాల మధ్య పరస్పర చర్య ఉంటుంది. ప్రధానంగా సామాజిక పరస్పర చర్యలు రెండు రకాలు. అవి అవిచ్ఛిన్న లేక అనుబంధ సామాజిక పరస్పర ప్రక్రియలు (Associative Social Proceses) మరియు విచ్ఛిన్న ప్రక్రియలు - (Disassociative process). అనుబంధ ప్రక్రియలను గురించి ఇంతకుముందు పాఠాలలో తెలుసుకొన్నాము. విచ్ఛిన్న ప్రక్రియలు ప్రధానంగా రెండు రకాలు. అవి 1) పోటీ (Competition) 2) సంఘర్షణ (Conflict). వీటి గురించి వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యము.

## 25.1 పోటీ - పరిచయము :

సమాజమున ప్రతి మానవునికి అనేక అవసరములు వుంటాయి. అవి ప్రాథమికమైనవి, ద్వితీయమైనవి. మానవ జీవనానికి ప్రధానమైనవి ప్రాధామిక అవసరాలు కాగా, సుఖ జీవనానికి ఆడంబరానికి సంబంధించినవి ద్వితీయ అవసరాలు. ప్రాధమిక అవసరాలు తీరనిదే సమాజమున వ్యక్తి మనుగడ దుర్లభము. తిండి, బట్ట, నివాసము ప్రతి మానవునికి కావలసిన ప్రాథమిక అవసరాలు. ఈ అవసరాలు తీర్చుకొనడానికి ప్రతి వ్యక్తి నిరంతరము కృషి చేయును. కాని అవసరాలకు తగిన అవకాశాలు సదుపాయాలు లేకపోవుటచే, వారి మధ్య అవసరాలను తీర్చుకొనటానికి పోటీ ఏర్పడును. అంతేకాక ధనము, వస్తువులు, అంతస్తు, హోదా, అధికార పదవులు మొదలైనవి ప్రతి మానవుడు కోరుకుంటాడు. కావున ప్రతి చోటా ఇవి కొరతగా వుండి అందరికి లభ్యముకావు. కొరతగా ఉండే ఈ ప్రయోజనాల వనరుల కొరకు పోటీ పడవలసి ఉండును. అందుచే ఈ పోటీ సర్వ వ్యాపితమైన ప్రక్రియ. కావున అధికముగాయున్న అవసరాలు ఎక్కువగానున్న అవకాశాలు పోటీ ద్వారా సర్దుబాటు చేసుకొనబడతాయి. ఈ పోటీ కేవలము మానవ సమాజమునకే పరిమితము కాక అన్ని జీవరాసుల్లోను, జంతు సమాజాలలోను సర్వసాధారణము. ఈ విధముగా పోటీ వరణానికి (Selection) ప్రాతి పదికగా చెప్పవచ్చును.

## 25.2. పోటీ, సంఘర్షణల (Conflict) మధ్యగల తేడాలు :

25.2.1. అస్పష్టము, సునిశితము : పోటీ సంఘర్షణ మధ్య కల తేడాలు అస్పష్టంగా సునిశితంగా ఉండును. ఈ రెండు ప్రక్రియలు కొరతను బట్టి వచ్చును. కాని కొరత రెండింటికీ కారణమైనప్పటికి యే ప్రక్రియకు దారి తీస్తుందనేది సమాజపు విలువలు, విపేదాలు, చట్టాలు, నైతిక విశ్వాసాలు మొదలైన సామాజికనియంత్రణ శక్తులమీద ఆధారపడి ఉండును. అందుచే "సమాజము సమాజ కట్టుబాట్లకులోనై ప్రయోజనాల కొరుకు పడే శ్రమని పోటీ అని" నిర్వచించవచ్చును. పోటీకి సంఘర్షణకు మధ్య కొన్ని సూక్ష్మమయిన భేదాలు కలవు. ఆ పోటీలో పోటీదారులు ఒకరికొకరు అధిగమించడానికి ప్రయత్నిస్తారు. ఉదా : ధనసంపాదనలో కాని, ఉద్యోగాలలో కాని, మత ప్రచారములో కాని పోటీదారులు ఒకరినొకరు అధిగమించడానికి ప్రయత్నిస్తారు. కాని సంఘర్షణలో ఈ విధమైన అధిగమించాలనే ప్రయత్నము ఉండదు.

25.2.2. ప్రత్యక్ష పరోక్షపోటీ : పోటీ ప్రత్యక్షముగానూ పరోక్షముగాను జరుగవచ్చును. ప్రత్యక్షమైన పోటీ ఒక్కొక్క సారి ఘర్షణకు దారితీయును. ఉదా : ఆటలలో రెండుజట్టుల మధ్య ఉండేది ప్రత్యక్షపోటీ. పరోక్షపోటీ వ్యాపార వాణిజ్య పారిశ్రామిక రంగాలలో ఎక్కువగా ఉండును. ఈ విధమైన పోటీలలో ప్రత్యర్థులు ఒకరికొకరు తెలియరు. వీరి మధ్య పోటీ సమాజములోని కొన్ని నియమనిబంధనలకు కట్టుబడి ఉండును. ఆ విధమైన నియమనిబంధనలను ఆచరించినపుడు, సక్రమంగా పాటించనపుడు పోటీ సంఘర్షణగా మారును. ఎందుచేతననగా పోటీలో వారి వారి ఆశయాలపైనే కేంద్రీకరిస్తారు. కాని ఘర్షణలో ప్రత్యర్థుల లక్ష్యము మీద దృష్టినుంచి వారు దానిని సాధించకుండా ఆటంకాలను కలుగచేస్తారు.

25.2.3. ఘర్షణ వలె పోటీ నియమ బద్ధమైన ప్రక్రియ కావున పోటీ స్వభావము, ప్రాధాన్యత సమాజాన్ని బట్టి మారును. సామాజిక విలువలు, ప్రమాణాలు, కట్టుబాట్లు సాంఘిక ప్రక్రియల స్వరూప స్వభావాలను నిర్ణయిస్తాయి. ఉదా: కొన్ని సమాజాలలో (జానీ, కెరోకోస్) పోటీకన్నా సహకారమే ఎక్కువగా కాంక్షిస్తారు. అదేవిధంగా అమెరికాలో కాక్పిటాల్ తెగలో పోటీ ప్రాబల్యము అధికంగా ఉండును.

25.2.4. సంఘర్షణలో ప్రత్యర్థులను అసమర్థులుగా చేయడంగాని, అణగదొక్కటంకాని, నాశనం చేయటంకాని జరుగును. కావున సంఘర్షణలో ఉద్రిక్తత, భయము మొదలైన వికారాలు, ప్రత్యర్థుల పట్ల ద్వేషపూరితమైన అభివృత్తులను కల్పించి మారణ హోమానికి దారితీయును. కాని పోటీలో ఈ విధమైన ఉద్రిక్తలు, ద్వేషాలు లేక కొంతవరకు శాంతియుతంగానే నడుస్తుంది. ఎందుచేతననగా దీనిలో కేవలం ప్రత్యర్థులను అధిగమించే ప్రత్నమే ఉంటుంది.

25.2.5. డోనాల్డ్. ఆర్. యంగ్ (Donald. R. Young) అభిప్రాయము ప్రకారము ఒకరితో మరొకరు కలహించక పోటీ మాత్రమే పడుదురు. కాని వారి మధ్య అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడినపుడు ఈ పోటీ సంఘర్షణగా మారును. ఈ పరిస్థితులలో నష్టపోయిన కొంతమంది ప్రజలను రెచ్చకొట్టుదురు. అప్పుడు పోటీ అంతరించి సంఘర్షణకు దారితీయును. అస్సాంలోని బోడో సమస్య, మిజోరాం, నాగాలాండ్‌లోని ఉద్రిక్తతలు మొదలయినవి ఇందుకు ఉదాహరణలు. సంఘర్షణలో వ్యక్తుల లక్ష్యము ప్రత్యర్థుల నుండి తాము ఆశించిన ప్రయోజనాల మీద ఉండును. కాని పోటీలో కేవలము స్వప్రయోజనాల మీదనే వుండును. అందుచే గతిశీలత గల సమాజాలలో సాధించదలచిన అంతస్తు (Achieved Status) పై పోటి ఆధారపడియుండును. ఉన్నతమైన అధికారము, పదవి, ఐశ్వర్యము సాధించిన వారికి ఈ సమాజాలలో గౌరవము, ప్రతిష్ట లభించును. కాని కొన్ని సమాజాలలో ఆరోపించిన అంతస్తు (Ascribed Status) ప్రాతిపదికగా గౌరవం ఉండును. ఈ విధమైన సమాజాలలో పోటీకి అవకాశము అంతగా ఉండదు. ఉదా : ఆధునిక సమాజాలలో అంతస్థు వ్యక్తి యొక్క దక్షత, సామర్థ్యము, నైపుణ్యము మీద ఆధారపడిఉండును. ఉన్నత పదవులు, సిరిసంపదలు సాధించినవారికి సాంఘిక గౌరవము ఉండుటచే అవి పొందటానికి వ్యక్తులు తరచూ పోటీ పడుదురు. కాని హిందూ సమాజమున వ్యక్తులు సమర్థులైన, అసమర్థులైన కులాన్ని బట్టి వారి అంతస్తు నిర్ణయించబడును. అందుచే పుట్టుక వారికి సామాజిక అంతస్తులు అనగా ఆరోపించబడిన అంతస్తును కల్పించుటచేత వారి మధ్య పోటీ పట్ల ఆసక్తి కన్పించదు. అందుచే అటువంటి సమాజాల్లో పోటీకి అవకాశాలు తక్కువ.

25.2.6. మార్గరెట్ మీడ్ పరిశోధన ఫలితంగా సమాజము విలువను బట్టి సాంఘిక ప్రక్రియ, స్థానము, ప్రాధాన్యము మారినప్పటికి ఏ సమాజంలోను కేవలం ఒకే ఒక సాంఘిక ప్రక్రియ ఉండదు. పోటీ ప్రమాణంగా ఉన్న సమాజాలు కొన్ని అయితే, సహకారము ప్రమాణంగా ఉన్న సమాజాలు మరికొన్ని. సహకారము అధికంగా వున్న సమాజాలలో అందరూ అన్ని విషయాలలో పోటీ చేయరు. ఉదా : ప్రతి సమాజంలోనూ కొన్ని విషయాలలో స్త్రీలు పురుషులతో పోటీపడరు. అదేవిధంగా కొన్ని వర్గాలు, సమూహాలు కొన్ని పదవులకొరకు పోటీ పడే అవకాశముకాని, సామర్థ్యముగాని లేకపోవచ్చు.

12.6.7. పోటీ, అత్యాశగా దురాశగా మారి హద్దు మీరినప్పుడు తీవ్రరూపముదాల్చి ఘర్షణ లేదా మోసానికి దారితీయవచ్చును. అందుచే పోటీని పరిమితము చేయుటకు కొన్ని ప్రమాణాలను సూచించవచ్చును: ఇవి ప్రధానంగా మూడు రకములు అవి : 1 కొంతమంది వ్యక్తులు పోటీలో పాల్గొనే ధైర్యము లేక విరమించుకొందురు. మరికొందరు తరచూ అపజయము పొందుటవలన పోటీకి వెనుకాడెదరు. అందువలన వ్యక్తులే కొన్ని సమయాలలో పోటీ పడటానికి నిరాకరిస్తారు. మరికొందరు పోటీవలన అప్రతిష్ఠ, ఉద్రేకము, ఆందోళన తప్పదని వీటికి భయపడి విరమించుకొందురు. 2. వర్తకులు, కార్మికులు పారిశ్రామికులు సంఘాలుగా ఏర్పడి ధరలు, ఉత్పత్తి, అమ్మకము, కొనుగోలు మొదలైనవి నియంత్రణ చేయుటద్వారా వారి మధ్య ఉమ్మడి నిర్ణయాలు తీసుకొనుట వలన, గుత్తవిధానాలు పాటించుటవలన పోటీ పరిమితగమగును. ఉదా : కార్మిక సంఘాలు, రైతుసంఘాలు ఈ పోటీని పరిమితం చేస్తాయి. రైతులు కనీస ధర పరిరక్షణ కొరకు ఆందోళన నేయుట పోటీని పరిమితము చేయడానికే. 3. సీనియారిటీ, రిజర్వేషన్, కోఆప్షన్ మొదలైన సూత్రాలద్వారా తగవులు, పదవులు, అధికారాలు, విద్యాలయ ప్రవేశాలు మొదలగు వాటికి జరిగేపోటీ కొంతవరకు పరిమితమగును.

సమాజమున సాధారణంగా అనేక రంగాలలో పోటీ కన్పించును. ప్రతి వ్యక్తి సమాజమున ఎప్పటికప్పుడు సుఖముగా, మంచి హోదాతో బ్రతకాలని కోరుకుంటాడు. ఫలితంగా మారుతున్న సమాజంలో జీవన ప్రమాణాలను పెంపొందించుకోవడానికి, తన ఆర్థిక స్థోమతను మెరుగు పరుచుకొనడానికి ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంటాడు. అందుచేత ఆధునిక సమాజాలలో ధనమును సంపాదించు కొనుటకు వ్యక్తుల మధ్య పోటీ ఎక్కువగా నుండును. ఆధునిక పెట్టుబడిదారీ విధానము వలన ఈ దేశాలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కూడా పోటీ ఉంటుంది. ఉద్యోగా[illegible]కు, ఆర్థిక స్థోమతను పెంపొందించుకోవటానికి వివిధ సంస్థలమధ్య పోటీ ముఖ్య పాత్రవహిస్తున్నది. వివిధ సాంస్కృతిక, ఆర్థిక ఆశయాలు మధ్య పోటీ ఏర్పడుచున్నది. కొందరు సంస్కృతిని ఆధారంగా చేసుకొని పోటీ పడితే, మరికొందరు అంతస్తును పెంపొందించుకోవటానికి పోటీపడతారు. దీనికి ప్రధానకారణము ప్రతి ఒక్కరు తమను ఎదుటి వారు గొప్పగా గుర్తించాలని ఆరాటపడటమో అయితే, మరికొందరు పేరు ప్రఖ్యాతులు సంపాదించుటకు పోటీ పడి దానధర్మాలు చేస్తూఉంటారు. ఈ విధంగా తమకు ఇతరులకు ఉన్న తేడాలను చూపిస్తూ గౌరవాన్ని పొందుతారు.

సమాజములో సహకారాన్ని సాధించాలంటె చాలా కష్టము. ఎందుచేతనంటె దానికి విరుద్ధమైన మరొక సాంఘిక ప్రక్రియకు, పోటీకి ఎక్కువ విలువలను ఇస్తారు. ఉదా : అమెరికా లాంటి పెట్టుబడిదారి సమాజాలలో పోటీకి అధిక ప్రాధాన్యతనిస్తారు. దాని ఫలితంగా పరస్పర సహకారము లోపిస్తుంది. వివిధ సాంఘిక ప్రక్రియల ప్రాధాన్యతను బట్టి వ్యక్తి మూర్తిమత్వము, సాంఘికనిర్మితి కూడా మార్పు చెందును. ఉదా : పోటీకి ప్రాధాన్యతనిస్తే వ్యక్తికి గాఢమైన వ్యక్తిత్వము, అహంభావము పెరుగుతుంది. దాని ఫలితంగా తీవ్రమైన అస్థిమితత్వానికి, ఆందోళనకు, భయానికి గురి అయి కొంత మనశ్శాంతిని కోల్పోతారు. అందే సహకారానికి ప్రాధాన్యతనిస్తే సమాజంలో వ్యక్తి తాదాత్మ్యం పొందుతాడు. ఒక్కొక్క సారి సమర్థమైన పోటీ కోసం వ్యక్తులు ఒకే సమూహంగా ఏర్పడి పరస్పరం సహకరించవచ్చు.

## 25.3 పోటీ - ప్రయోజనాలు - పర్యవసానాలు :

1. పోటీవల్ల కొంతమంది వ్యక్తులు, సమూహాలు శాశ్వతంగా వెనుకబడటానికి వీలులేదు. ఎందువల్లనంటే గతిశీలత ఉన్నది కాబట్టి అంతస్తును సాధించడానికి అవకాశమున్నది. ఒకప్పుడు సామాజికంగా వెనుకబడియున్న వ్యక్తిగాని, సమూహంగాని తమ సామర్థ్యము వలన ఉన్నత అంతస్తును పొందవచ్చును.

2. ఎంపికచేసుకోవటంలో ప్రజ్ఞావిశేషాలకు ప్రాధాన్యతనిస్తుంది.

3. పోటీవల్ల ఓడిపోయిన వ్యక్తులుగాని, సమూహాలుగాని మానసికమైన బాధలకు గురి అవుతారు.

4. పోటీవల్ల వ్యక్తులలో సామర్థ్యాన్ని పెంపుచేసుకోవాలనే ఆకాంక్ష, సాధనా శక్తిని ఎక్కువ చేస్తాయి.

'5. తక్కువగా ఉన్న అవకాశాలను, వస్తువులను, ప్రయోజనాలను అర్హత కల్గినవారికి పోటీ ద్వారా సామరస్యంగా పంచి పెట్టడం జరుగుతుంది. పోటీవల్ల వరణము (ఎంపిక) జరుగుతుంది. కావాలని కొందరిని నిరుత్సాహపరచే అవకాశం ఉండదు. యోగ్యత కల్గిన వారి మధ్యనే పోటీ ఉండటం వల్ల ఆవరణము అందరికీ నచ్చుతుంది.

6. పోటీవల్ల సమాజంలో గతిశీలత ఎక్కువగా ఉంటుంది.

7. పోటీవల్ల సామాజిక పరివర్తన కలుగుతుంది.

సమాజమున పోటీ ఒకరకమైన సాంఘిక ప్రక్రియ. ఏ సమాజమయిన ఒకరకమైన సాంఘిక ప్రక్రియకు ప్రాధాన్యత నిచ్చినప్పుడు, దానికి వ్యతిరేకమైన సాంఘిక ప్రక్రియను బలపరచలేదు. ఉదా : పోటీకి ప్రాముఖ్యతనిచ్చే అమెరికా లాంటి పెట్టుబడిదారీ సమాజాలలోని వ్యక్తులు పోటీకి విలువనిస్తారు. అందుచేత అటువంటి సమాజాలలో, ప్రజలలో పోటీ ఎక్కువగా ఉంటుంది. కాని కుటుంబము వంటి సామాజిక వ్యవస్థ పూర్తిగా సహకారము పై ఆధారపడియున్నది. ఉదా : భార్యాభర్తల మధ్య కుటుంబ సభ్యుల మధ్య సహకారము లోపించిన ఆ కుటుంబము అవ్యవస్థపాలవుతుంది. దాని ఫలితంగా కుటుంబమునందు సుఖసంతోషాలు లోపించును. పోటీకి ఎక్కువ విలువ ఇచ్చిన సమాజంలో దానికి అలవాటుపడిన సభ్యులు కుటుంబములోగాని, పరిశ్రమలోగాని, ఆటల జట్టులో గాని సహకారము అవసరమైన చోట సక్రమంగా సర్దుబాటు చేసుకోలేక పోతున్నారు. అందుచే వ్యక్తిత్వము, అహంభావము పెరిగి మానసిక ఆందోళనకు గురి అవుతారు. ఈ విధముగా సమాజమున పోటీ విచ్ఛిన్న ప్రక్రియగా పేర్కొనవచ్చును.

## 25.4 సంఘర్షణ - రకాలు :

సామాజిక జీవనము సహకారము వలన నిరంతరను కొనసాగును. కాని సంఘర్షణ వలన సమాజంలో కొంత హింసాకాండ జరుగవచ్చును. అందుచే సంఘర్షణలేని సమాజాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. వ్యక్తులమధ్యగాని, సమూహాల మధ్యగాని సంఘర్షణ ఏర్పడవచ్చు. అందుచేత సామాజిక జీవనంలో సంఘర్షణ అనేది కొంత వరకు అనివార్యమే. సమాజంలో భిన్నవ్యక్తులు, భిన్న స్వభావాలు, ఆశయాలు కలిగి ఉండుటవలన ఒక్కొక్కసారి వారి మధ్య స్పర్థ ఏర్పడుతుంది. కోయాలగ్ అభిప్రాయము ప్రకారము సంఘనిర్మాణానికి, సక్రమ విధి నిర్వహణకు సహకారముతో పాటు ఘర్షణ కూడ అవసరము. దుర్మార్గులను, నిరంకుశ పరిపాలనను, తిరస్కరించుటకు, వ్యతిరేకించుటకు ఘర్షణ పడక తప్పదు.

కొన్నిసార్లు సాంఘిక బలహీన వర్గాలు ఘర్షణకు పాల్పడుతుంటారు. పోటీ సక్రమంగా జరుగక తీవ్రరూపము దాల్చితే ఘర్షణకు దారితీయును. ప్రత్యర్థిని లేదా పోటీదారుని ఏదోఒక రకంగా బలహీనుని చేసిగాని, అణగద్రొక్కిగాని, సమూలంగా మట్టుపెట్టిగాని తమ ప్రయోజనాలు పొందుకొనే ప్రక్రియను సంఘర్షణ అందురు. కావున సాధరణముగా సంఘర్షణ మూడు సందర్భాలలో ఏర్పడును. అవి :

25.4.1 ఒకరు లేదా అంతకంటే ఎక్కువమంది ఒకే వస్తువును కోరి దానిపై అధికారం కావాలనీ దానిని వినియోగించాలని ఆశించినప్పుడు సంఘర్షణ కలుగుతుంది. ఉదా : ఆదిమవాసుల సమాజాలలో ఆటవిక సంపదల పట్ల స్పర్ధలు, సంఘర్షణలు ఏర్పడుతుంటాయి. జలమార్గాలు, వాణిజ్యమార్గాలు, కాలనీలు మొదలైనవి కూడా దేశాల మధ్యస్పర్ధలకు, సంఘర్షణలకు కారణభూతాలైనట్లు చరిత్ర తెలుపుతుంది. ఆధునిక నాగరిక సమాజాలలో కూడా ఖనిజసంపదలు, మాగెనులు, బొగ్గుగనులు మొదలైనవి స్పర్ధలకు, యుద్ధాలకు దారి తీయవచ్చు. ఉదాహరణకు నదీజలాల విషయంలో మనదేశంలో కొన్ని రాష్ట్రాలు పరస్పరం తగవులాడుకోవడం మనం చూస్తూనే ఉన్నాము.

25.4.2. సాంస్కృతికమైన అంతరాలుకూడా సంఘర్షణకు దారితీయవచ్చు. ముఖ్యంగా విలువలలోగాని, ఆదర్శాలలోగాని, సిద్ధాంతాలలో గాని భేదాలుంటే సంఘర్షణ ఉంటుంది. హిందూ ముస్లిం కొట్లాటలు మనకు పరిచయమైన విషయమే. పాశ్చాత్య దేశాలలో కూడా మతపరమైన బేధాలు యుద్ధాలకు దారితీయడం చారిత్రకమైన సత్యము.

విలువలకు, ఆదర్శాలకు సంబంధించిన సంఘర్షణలలో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి సంఘర్షణలలో తీవ్రమైన స్వీయ పరకీయ భావాలు, ద్వేషంతో కూడుకొన్న అభివృద్ధులు, భయాందోళనలు ఉంటాయి. ఉదా : విరుద్ధమైన రాజకీయ సిద్ధాంతాల ననుసరిస్తున్న అమెరికా, చైనా దేశాల సంఘర్షణలో ఈ లక్షణాలు కనబడతాయి.

25.4.3. అంతస్తు, హోదా, గౌరవము, అధికారం మొదలైన సాంఘిక ప్రయోజనాల విషయంలో కూడా వ్యక్తులు, సంఘాలు పోటీపడటం, మనకు తెలిసిందే. ఇవికూడ సంఘర్షణలకు కారణములు. హోదా, అంతస్తులనేవి వ్యక్తులకేకాక దేశాలకు కూడా ముఖ్యమైనవి. కాబట్టి ఈ విషయంలో కూడా దేశాల మధ్య స్పర్థలు, సంఘర్షణలు ఏర్పడుతుంటాయి.

25.4.4. వ్యక్తిగత సామూహిక సంఘర్షణలు : వ్యక్తిగతమైన సంఘర్షణలకు, సామూహిక సంఘర్షణలకు మధ్య తేడా కలదు. సామూహికమైన సంఘర్షణ వ్యక్తిగత ప్రమేయము లేనిది. అనగా సామూహిక సంఘర్షణలో వ్యక్తికి, వ్యక్తి అభిప్రాయాలకు, అభిరుచులకు ప్రాముఖ్యంలేదు. వ్యక్తి విశ్వాసము, వ్యక్తిహితముకంటె సామూహిక విశ్వాసము, సామూహిక హితమే బలవత్తరంగా ఉంటాయి. అందువలన సామూహిక సంఘర్షణకు వ్యక్తి పరమైన సూత్రాల ద్వారా పరిష్కరించలేము. ప్రతిపక్షాలకు చెందిన వ్యక్తులను దగ్గరకు చేర్చి వారి మధ్య స్నేహసంబంధాలు కల్పించి నంత మాత్రాన సంఘర్షణ పరిష్కారముకాదు. సామూహిక సంఘర్షణలో ఒకవ్యక్తి తన అభిరుచులు, అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పటికి సామూహిక విశ్వాస, హితాల దృష్ట్యా సర్దుబాటు చేసుకోవడానికి అంగీకరించకపోవచ్చును. ఉదా॥ రెండు దేశాల మధ్య యుద్ధము సంభవించినప్పుడు ప్రతిపక్షాలకు చెందిన వ్యక్తులు స్నేహితులై ఉండికూడ యుద్ధరంగంలో ఒకరితో మరొకరు తలపడవచ్చు. కావున ఇక్కడ వ్యక్తిగత స్నేహంకంటే సామూహిక హితమే ఆధిక్యం వహిస్తుంది, హార్టన్ మరియు హంట్ (Horton and Hunt) అభిప్రాయము ప్రకారము సామూహిక సంఘర్షణల కారణంగా అనేక హింసలు, ఘాతుక కృత్యాలు, జరుగవచ్చు. ఇవి జరుగడానికి ప్రధానంగా వ్యక్తుల పైశాచికభావం, క్రౌర్యం, మానసిక వైపరీత్యం తోడ్పడతాయి.

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే ఘర్షణలేని సమాజమే అరుదు. ప్రతి సమాజము తమ ఆర్థిక, రాజకీయ అధికారాన్ని బలపరచుకోటానికి ఒక దేశము మరొక దేశముతో పోటీ పడుతూ యుద్ధంలోకి ప్రవేశిస్తారు. రాజ్యాలను విస్తరింపచేసుకోటానికి ఒక దేశము మరొక దేశముతో పోటీ పడుతూ యుద్ధం లోకి ప్రవేశిస్తారు. రాజ్యాలను విస్తరింపచేసుకొనుటకు కొన్ని దేశాలు దురాక్రమణ జరుపుతుంటాయి. ఆయా దేశాల సామాజిక విలువలకు, ఆదర్శాలకు సంబంధించిన ఘర్షణలు స్వీయపరకీయ భావాలు ద్వేషంతో నిండివుంటాయి. విరుద్ధమైన రాజకీయ సిద్ధాంతాలు కూడా ఘర్షణకుదారి తీస్తాయి. ఉదా॥ అమెరికా, రష్యా దేశాల రాజకీయ సిద్ధాంతాలు విరుద్ధమైనందున ఆ దేశాల మధ్య ఘర్షణకు అవకాశమున్నది. ఘర్షణకు ప్రధానంగా తోడ్పడునది ప్రాంతీయబేధాలు, మతకలహాలు, భాషాకలహాలు, జాతివైషమ్యాలు.

## 25.5. ప్రాంతీయ బేధాలు (Regional disparities) :

వివిధ సంస్కృతులకు చెందిన రెండు ప్రాంతాలు ఒకే రాష్ట్రానికి అనుబంధంగా ఉన్నప్పుడు ఇటువంటి ఘర్షణలేర్పడవచ్చు. ఉదా॥ ఆంధ్రరాష్ట్రము మదరాసు నుండి వేరుపడినది. అందుచేత ఆంధ్రప్రదేశ్‌లోనే తిరిగి ప్రత్యేక తెలంగాణాకొరకు 1969 లో పోరాటము జరిగినది. ప్రస్తుతం క్రొత్తనేతల నాయకత్వంలో అదే కోరికపై ఉద్యమం నిర్వహించబడుతున్నది. అదేవిధంగా ఆంధ్రప్రాంతము వారు తమకు ప్రత్యేక ఆంధ్రకావాలని 1973 లో జై ఆంధ్ర ఉద్యమము, సమ్మెలు, బందులు, ఆందోళనలు జరిపారు. కావున సంఘర్షణకు ప్రాంతీయబేదాలు తోడ్పడుతాయి. ఈ విధమైన ప్రాంతీయ విభేదాలకు ప్రధానంగా రెండు ప్రాంతాల మధ్య, ఆర్థిక, సాంఘిక, రాజకీయ, విభేదాలు కూడ కారణంగా పేర్కొన వచ్చును. ఈ విధమైన ప్రాంతీయ తత్వము ప్రాంతీయ దురభిమానానికి తోడ్పడి వివిధ ప్రాంతాలు మధ్య ఘర్షణకు దారితీయును.

## 25.6. మత కలహాలు (Religious Conflicts) :

సామాజిక సంఘర్షణకు తోడ్పడు మరొక ప్రధానకారణము మత వైషమ్యాలు. మతసహనము లోపించుట వలన వివిధ మతాలకు చెందిన వ్యక్తుల మధ్య తమ తమ మతాల ప్రాబల్యానికి కలహించుకొంటారు. భారతదేశము రాజ్యాంగరీత్యా మతసహనాన్ని పాటించే లౌకిక రాజ్యమైనప్పటికి తరచూ మతపరమైన కలహాల సర్వసాధారణము అయిపోయాయి. ఉదా : హిందూ మహమ్మదీయుల మధ్య ఇటీవల ఏర్పడిన రామజన్మభూమి, బాబ్రీమసీదు సమస్య. హైదరాబాదులోని ముస్లిం, హిందువుల మధ్య మతకలహాలు మొదలైనవి. ఇటువంటి సమయాలలో ప్రజల నిత్య జీవనానికి అనేక ఆటంకాలు ఏర్పడుతాయి. సాంఘిక భద్రత లోపిస్తుంది. అరాచకము, అలజడులు, సమ్మెలు, ధర్నాలు, రక్తపాతములాంటి అనేక సామాజిక అరాచకాలు ఏర్పడతాయి. స్వార్థపరులైన కొందరు సంఘవిద్రోహక శక్తులుగా మారి వీటిని ఆధారంగా చేసుకొని సంఘ విచ్ఛిన్నతికి, అరాచకానికి కారణమగుచున్నారు. కావున సంఘర్షణకు మతకలహాలు కూడ ప్రధానంగా తోడ్పడుచున్నాయి.

## 25.7. భాషా కలహాలు (Linguistic Coflicts) :

సామాజిక సంఘర్షణకు తోడ్పడేమరొక ప్రధాన కారణము భాషాకలహాలు. ఒక భాషకన్నా వేరొక భాష గొప్పదనే భావము వలన భాషా కలహాలు ఏర్పడతాయి. భారత సమాజము విభిన్న భాషలకు నిలయము. వివిధమతాలేగాక, కులాలేగాక విభిన్న భాషా వర్గాలు కూడ కలవు. భాషాభిమానము వలన ఆంధ్రులు, మదరాసునుండి వేరుపడి భాషా ప్రాతిపదికగా ఆంధ్రరాష్ట్రమును ఏర్పరచుకున్నారు. భారతదేశమున అనేక రాష్ట్రాలు భాషా ప్రాతిపదికగా ఏర్పడినవి. ఉత్తర హిందూదేశములో హిందీ భాష అధికార భాషగా గుర్తించబడినది. దానికి వ్యతిరేకముగా దక్షిణ భారతదేశమున అనేక ఆందోళనలు, ప్రదర్శనలు జరిపినారు. దాని ఫలితముగా భారతదేశమున భాషాపరమైన భిన్నత్వము ఏర్పడినది.

## 25.8. జాతి వైషమ్యాలు (Racial Conflicts) :

ప్రపంచ సమాజము విభిన్న జాతుల సమ్మేళనము. ప్రపంచములోని మానవులందరిని కొన్ని దైహిక, శారీరక లక్షణాలను బట్టి కొన్ని జాతులుగా, జాతి విభాగాలుగా విభజించిరి. ఒక జాతి వారు మరొక జాతికన్న మిన్న అనుకోవడము వలన జాతి వైరుధ్యాలు ఏర్పడతాయి. ఉదా ; నల్లజాతి, తెల్లజాతి విభేదాలు దక్షిణాఫ్రికా, అమెరికాలో జాతి సంఘర్షణకు దారితీసినది. శ్వేతజాతివారు వారి జాతి అన్ని జాతులకన్న గొప్పదని భావించి నీగ్రోలను బానిసలుగా భావించిరి. ఆ బానిసత్వ విమోచనకు నీగ్రోలు పోరాటాన్ని సాగించిరి. నేటికిని ఈ సమస్య అంతర్జాతీయ సమస్యగానే మిగిలిపోయింది.

**ఇతర విభేదాలు : (Other Coflicts) :** పై కారణాలతోబాటు మరి కొన్ని కారణాలు కూడా సామాజిక సంఘర్షణకు దారితీయుచున్నవి.

25.9.1. సమాజమును ప్రకృతిసిద్ధమైన సంపదలయిన నూనెగనులు, బొగ్గుగనులు, ఖనిజ సంపద, జల మార్గాలు, నదీ జలాలు పంపకము రాష్ట్రాల మధ్య ఘర్షణలకు దారి తీయుచున్నవి.

25.9.2. భిన్నత్వము కలిగిన రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు నానాటికి పుట్టగొడుగుల్లాగా తలెత్తుచున్నాయి. ఒక పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు ఇంకొక పార్టీకి అభ్యంతరకరంగా ఉంటాయి. ఒక పార్టీని మరొక పార్టీ విమర్శించుటవలన వారిమధ్య పోరాటము జరిగి అది వివిధ పార్టీల మధ్య సంఘర్షణకు దారితీస్తున్నది. స్వార్థపరులైన రాజకీయ పార్టీ నాయకులు తమ స్వప్రయోజనాలకు రాజకీయ పార్టీలను ఆధారంగా చేసుకొని ప్రతి చిన్న విషయానికి ఆందోళనలు, సమ్మెలు, నిరాహారదీక్షలు, మారణహోమాలకు అవకాశం కల్పించి ప్రజల మధ్య సంఘర్షణకు దారితీస్తున్నారు.

25.9.3. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సమాజాలలో సమ్మెలు సర్వసాధారణము. విద్యార్థులు మొదలు కార్మికుల వరకు సమ్మెలు చేస్తున్నారు. నిరసనలు ప్రదర్శిస్తున్నారు. ప్రధానంగా పారిశ్రామిక రంగంలో కార్మికులకు, యాజమాన్యానికి మధ్య లాభాల పంపిణీపై పొత్తుకుదరనపుడు, శ్రామికులు తమ కనీస అవసరాలను తీర్చుకోలేనపుడు ఘర్షణ తలఎత్తుతున్నది. దీనినే వర్గపోరాటమందురు.

25.9.4 సమాజమున అంతస్థు, హోదా, గౌరవము, అధికారము గుర్తింపు కొరకు వ్యక్తులేగాక దేశాలు కూడ ఘర్షణకు దిగుతున్నాయి

## 25.10. సారాంశము :

పైన పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలించిన పర్యవసానమేమనగా సంఘర్షణవలన అనేక వాంఛిత, అవాంఛిత పర్యవసానాలు తల ఎత్తుతున్నాయి. ఈ పర్యవసానాలను ఈ విధంగా పేర్కొనవచ్చును.

సమాకలనం చేసేవి సమాకలనాన్ని భంగపరిచేవి.

1. సంఘర్షణ వలన విషయం స్పష్టమవుతుంది.
2. విషయ పరిష్కారానికి దోహదకారి అవుతుంది.
3. సాంఘిక సమాకలనము అధిక మవుతుంది.
4. ఇతర సంఘాలతో సంబంధ బాంధవ్యాలుకల్పిస్తుంది.
5. సభ్యులను సాంఘిక హితాల పట్ల అప్రమత్తులను చేస్తుంది.

1. సభ్యులమధ్య సంబంధాలను క్లిష్టపరుస్తుంది.
2. రక్తపాతానికి. వినాశనానికి దారి తీయును.
3. సాంక్షిక లక్ష్యాలనుంచి సభ్యులను పెడదోవకు మళ్ళిస్తుంది.

సంఘర్షణలేని సమాజము ప్రపంచ చరిత్రలో లేదని నిత్య జీవిత అనుభవాన్ని బట్టి తెలియుచున్నది. ఘర్షణ క్రమతను, ఐక్యతను కొంతవరకు లోపింపచేసినా కొన్ని సందర్భాలలో మేలు కూడ చేకూరును. ఉదా : ఒక సమాజమున నాయకత్వములో గాని, అసమర్థపాలనలోగాని, అవకతవకలు ప్రతిఘటించడానికి ప్రజలు ఘర్షణపడక తప్పదు. అట్లు ఘర్షణ పడనిచో స్వార్థపరులైన నాయకులు సమాజాన్ని స్వంతప్రయోజనము కొరకు ఆశ్రిత పక్షపాతానికి బలిచేస్తారు. సామాజిక న్యాయము కొంతవరకు లోపిస్తుంది. కావున సమాజములో ఏదైనా అస్తవ్యస్థమైన పరిస్థితి ఏర్పడినపుడు వాటిని ఎదిరించుటకు తప్పనిసరియైనది ఘర్షణ. కావున ఘర్షణ ద్వారా కొన్ని సామాజిక విచలితలను నివారించవచ్చును. సమాజాభివృద్ధికి సహకారముతో బాటు సంఘర్షణకూడ ఎంతైనా అవసరము.

సంగ్రహ ప్రశ్నలు

1. విచ్ఛిన్న ప్రక్రియలు అనగానేమి? సోదాహరణముగ వివరించుము?
2. సామాజిక ప్రక్రియగా పోటీని, సంఘర్షణను వర్ణింపుము?
3. పోటీ-సంఘర్షణ అనగానేమి? అవి ఎన్ని రకములు వివరించుము?
4. పోటీ-సంఘర్షణల మధ్యగల తేడాలను వివరించుము?
5. పోటీవలన గల ప్రయోజనాలను వ్రాయుము?
6. సంఘర్షణకు దారితీసే అంశాలు వివరించుము?

పాఠము : 26

# సామాజికస్తరీకరణము - స్వభావము రూపాలు, ప్రధాన లక్షణాలు

**(Social-Stratification : Its Nature-Forms and Characterstics)**

26.0 లక్ష్యం

26.1 స్వభావము

26.2 సామాజిక స్తరీకరణ-వివిధరకాలైన అంతస్థులు

26.3 సామాజిక స్తరీకరణ లక్షణాలు

26.4 సారాంశము

## 26.0 లక్ష్యం :

సమాజము విభిన్న వ్యక్తుల సమూహము. భిన్నత్వము కలిగిన వ్యక్తుల కలయిక ఫలితంగా సాంఘిక విభేదీకరణము సర్వసాధారణము. ప్రతిసమాజమున విభేదీకరణ జరుగుతుంది. మతము, వృత్తి, ఐశ్వర్యము, ఆస్తి, సాంస్కృతిక విభేదాలవలన సాంఘిక విభేదీకరణం జరుగుతుంది. సాంఘిక విభేదీకరణకు స్తరీకరణమునకు మధ్య సంబంధము కలదు. ఒక సామాజిక వ్యవస్థలో ఉన్న వ్యక్తులకు, వర్గాలకు వివిధాలైన స్థానములుండును. ఈ స్థానాలకు అంతస్తు అనేక హెచ్చు తగ్గులు కల్పించడము జరుగునో అప్పుడు స్తరీకరణ జరుగును. స్తరీకరణ అనగా విభజన. ఈ విభజన అంతస్తు అనే కొలమానముపై వ్యక్తులనుగాని, వర్గాలనుగాని సమూహాలనుగాని, పేర్కొని వారికి ప్రత్యేకమైన అంతస్థులు ఆపాదించే ప్రక్రియను స్తరీకరణమందురు. ఈ విధమైన స్తరీకరణలో ఒకవ్యక్తి లేదా వర్గం మరొక వ్యక్తి లేదా వర్గంకంటే పై అంతస్థులోనో లేదా క్రింది అంతస్థులోనో ఉంటాడు.

## 26.1 స్వభావము :

మానవసమాజము అనేకరకముల వ్యక్తులతోను, సమూహాలతోను కూడి ఉంటుంది. వ్యక్తుల మధ్య సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత సాంస్కృతిక అంశాలరీత్యా భిన్నత్వాలు ఉంటాయి. అంతేకాకుండా అనేక సమస్తరీయ పొరలతో (Horizontal Layers) కూడి ఉంటుంది. ఈ పొరలనే స్తరాలు (Strata) అని పేర్కొన్నారు. ప్రతి స్తరంలోను విభిన్న శారీరక, మానసిక, సామాజిక లక్షణాలతో కూడిన వ్యక్తులుందురు. ఈ స్తరాల మధ్య అనేక వ్యత్యాసాలు సామాజిక విలువలలోని శ్రేణీ పరంపరల మీద ఆధారపడి ఉంటాయి. అనగా సామాజిక విలువలు, స్తరాలు ఒక క్రమశ్రేణి (Hierarchy) లో ఉంటాయి. అట్టి క్రమశ్రేణిలో అమర్చబడిన స్తరాలపై స్థాయినుండి, క్రిందిస్థాయికి వస్తున్న కొద్దీ ఖ్యాతి, కీర్తి, అధికారము మున్నగునవి తగ్గుతాయి. సామాజిక విలువల ద్వారానే కాకుండా, ధనము, విద్య, శక్తి, అంతస్థు హోదా, అధికారము మొదలగు వాటివలన కూడా సమూహాలను క్రమశ్రేణిగల వర్గాలుగా విభజించవచ్చును. ఈ సమూహాలను, విలువలు, అంతస్థులతోగల హెచ్చు తగ్గుల భేదాల ఆధారంగా ఒక క్రమశ్రేణిలో విభజించుటను స్తరీకరణమందురు.

మాక్స్‌వెబర్ (Max Weber) అభిప్రాయము ప్రకారము సాంఘికవ్యవస్థలో మూడు రకములైన స్తరీకరణ (Stratification) ములుండును. అవి :

26.1.1 ఆర్థికస్థితిని బట్టి స్తరీకరణ

26.1.2 అంతస్తును బట్టి స్తరీకరణ

26.1.3 శక్తి, అధికారమును బట్టి స్తరీకరణ

సమాజ శాస్త్రవేత్తలు సామాజిక స్తరీకరణను గురించి వివరించుచూ అన్ని సమాజాలలోను స్తరీకరణయుండును కాని స్తరీకరణకు కారణాలు ఒకే విధంగా ఉండవు అని అన్నారు. కాని సాధారణంగా అధికారము ఆస్తి, బలము, గోత్రం, కులము మొదలగు వాటినిబట్టి స్తరీకరణ ఏర్పడును. ఆధునిక పారిశ్రామిక, నాగరిక సమాజాలలో స్తరీకరణ అనేక రూపాలలో ఉంటుంది. ఎందుచేతననగా ఈతరహా సమాజాలు శ్రమవిభజనద్వారా అనేక రకాలైన ప్రకార్యాలను నెరవేర్చే ప్రజలతో కూడుకొని ఉంటాయి. ఈ విధమైన సంశ్లిష్ట సమాజాలలో ధనములోను, ఆదాయంలోను, చదువులోనూ, అవకాశములోను, అనేక రకాలైన వ్యత్యాసాలు ఉండును. అందుచేత సమాజము సంక్లిష్టమైన కొలదీ స్తరీకరణకూడ వ్యాపించును. వివిధ సాంఘిక స్థానాలకు ఎక్కువ, తక్కువ అంతస్థులను ప్రతిపాదించడంతో సామాజిక స్తరీకరణ జరుగుతుంది. అందుచే సమాజమున ఒక వ్యక్తి లేదా ఒకవర్గము మరొక వ్యక్తి లేదా వర్గము కన్నా పై స్థాయిలో ఉంటారు. అనగా సమాజములోను వివిధ వర్గాలు తమమధ్యగల హెచ్చుతగ్గులను, అంతస్థులను గూర్చి భావించడము చేత సామాజిక స్తరీకరణ జరుగును.

సమాజములోని వ్యక్తులు శ్రమవిభజన (Division Labour), విశిష్టీకరణ (Specialisation), ద్వారా వివిధ సంవర్గాలుగా (Strata), సమూహాలు (Associations) గా, విడిపోవడము ద్వారా ఏర్పడిన తారతమ్యాలే (Differences) స్తరీకరణకు ప్రధాన కారణాలు. వ్యక్తులు భౌతికంగా, దైహికంగా, సాంఘికంగా, తాత్వికంగానే కాకుండా సామర్థ్యములోనూ, అభిరుచులలోనూ, తెలివితేటలలోనూ, ప్రజ్ఞాపాటవములోనూ, గుణాలలోనూ తారతమ్యాలను పొంది విభేదీకరణమును చెందుతారు. కావున అంతస్తు ఒక వ్యక్తికి సమాజంలో వుండేహోదాని నిర్ణయిస్తుంది. ఒక వ్యక్తి కలిగి ఉన్న హోదాల వల్లగాని, అతనిలో ఉన్న ప్రత్యేక లక్షణాలు వల్లగాని అతని అంతస్థు నిర్ణయమవుతుంది.

అంతస్థు ప్రధానంగా రెండురకాలుగా ఉంటుంది.

1) ఆరోపించిన అంతస్థు 2) సాధించిన అంతస్థు


**26.2.1. ఆరోపించిన అంతస్థు :** ఒక వ్యక్తి తన పుట్టుక నుండి సమాజంలో కలిగి ఉన్న అంతస్థు. అనగా అతని అంతస్థు పూర్వనిర్ధారితమైనది. ఆ వ్యక్తి జన్మించిన కుటుంబం నుండి అంతస్థును పొందుతాడు. సమాజము ఆ అంతస్థును గుర్తిస్తుంది. ఈ విధమైన అంతస్థుగల వ్యక్తి సమాజంలో తనదైన ప్రత్యేకస్థానాన్ని పొందుతాడు. అతడు తన ఆరోపించిన అంతస్థును మార్చుకోలేడు. ఉదాహరణకు భారత సమాజములోని కులవ్యవస్థలో వైశ్యుడుగా జన్మించిన వ్యక్తి బ్రాహ్మణుడు కావటం లేదా బ్రాహ్మణుడు వైశ్యుడు కావటం జరుగదు.

**26.2.2. సాధించిన అంతస్థు :** ఒకవ్యక్తి తన స్వయంకృషి, నైపుణ్యము, ప్రజ్ఞాపాటవాల ద్వారా లేక ఇతర ప్రత్యేక లక్షణాల ద్వారా తన అంతస్థును పెంచుకోగలిగితే దానిని సాధించిన అంతస్థు అందురు. ఉదాహరణకు ఒక అంటరాని వ్యక్తి స్వయంకృషి, పట్టుదలతో ఐ.ఎ.ఎస్. పరీక్షలలో నెగ్గితే అతనితో బాటు అతని కుటుంబ అంతస్తు కూడ పెరుగుతుంది. అందుచే అతడు సమాజంలో ప్రత్యేక హోదాను పొందుతాడు. కావున పుట్టుకతో వచ్చిన అంతస్థును ఆరోపిత, స్వయంకృషితో వచ్చిన అంతస్థును సాధించిన అంతస్థుగా పేర్కొనవచ్చును. కాని కొన్ని సమయాలలో పరిస్థితులను బట్టికూడ అంతస్థు మారుతుంది. ఉదా : ఒక ధనవంతుని కూతురును ఒక బీద కుటుంబానికి చెందిన యువకుడు వివాహము చేసుకొన్న ఆమె తన పూర్వపు అంతస్థునుగాని, లేక ఆ వ్యక్తి తన పూర్వపు అంతస్థుగాని కోల్పోవుదురు. అందువలన సమయ సందర్భాలను బట్టి, ప్రదేశాన్నిబట్టి, అంతస్థులు మార్పే విషయాలు, కారణాలగును. ఒకవ్యక్తి సమాజంలో కలిగి ఉన్న అంతస్థును బట్టి గౌరవం పొందుతాడు. ఈ విధమైన అంతస్థు, హోదా, గౌరవము, పేరు ప్రతిష్టలు సామాజిక స్తరీకరణకు ప్రాతిపదికలుగా పేర్కొనవచ్చును. కింస్లేడేవిస్ అభిప్రాయం ప్రకారము సామాజిక సమానతలు సహాయంతో సమాజాలు అతిముఖ్య స్థానాలను అత్యున్నత

అర్హతలు కలిగిన వ్యక్తులే పొందేట్టు చూసుకోగలరు. అందుచేత ప్రతి సమాజం, అది ఎంత సామాన్యమైనదైనా, సంక్లిష్టమైనదైనా, వ్యక్తులను వారి ప్రతిష్టను గౌరవాన్ని బట్టి వర్గీకరించాలని పేర్కొనెను.

## 26.3. సామాజిక స్తరీకరణ లక్షణాలు :


**26.3.1 వ్యవస్థాపితమైన నిర్మితి (Organisational Structure)** : స్తరీకరణ వ్యవస్థ సువిశాలమైనది. సమస్తరీయముతో కూడి అనేకపొరలుగా (Layers) ఏర్పడి సమాజములోని వ్యక్తులతోనూ, సమూహాలతోనూ ఉంటుంది. ఈ విధముగా ఏర్పడిన అనేక వర్గాల వ్యక్తుల నిర్మితిని ఒక శంఖువుతో పోల్చి చూచిన అది అనేక వ్యత్యాసాలతో కూడిన పొరలతో (స్తరాలతో) ఉంటుంది. క్రింది నుండి పై పొరకు వెళ్ళేకొలది స్తరాలు తక్కువ వైశాల్యమును కలిగి ఉండటమే కాకుండా అందులోని వ్యక్తులు తక్కువగా ఉంటారు. ఈ విధమైన విభజన ఈ దిగువ ఇవ్వబడిన పటము విశదీకరించును. ఈ విధమైన నిర్మితితో కూడిన స్తరీకరణము దాదాపు అన్ని సమూహాలలోనూ, సమాజాలలోనూ ఏదో ఒక రూపంలో కనిపించును.




**26.3.2 విలువ నిర్మితి (Value Structure)** : సామాజిక స్తరీకరణకు చెందిన మరొక లక్షణము విలువల నిర్మితి. ఈ విధమైన స్తరీకరణలో వివిధ పొరలుగా స్తరీకరించిన ప్రతి స్తరానికి కొన్ని సామాజిక విలువలు, మరియు ప్రమాణములుండును. వివిధ స్తరాలకు చెందిన ప్రమాణాల మధ్యే వ్యత్యాసము లుండును. ప్రజలలో విలువల వ్యవస్థ ఎక్కువ-తక్కువ అని రెండు వర్గాలుగా విభజింపబడును. ఈ వర్గాలు విభిన్న ఆచారలు, సాంప్రదాయాలతో కూడి సంస్థాగతమై పై స్తరాలలోని వారు తమకన్న అధికులని, క్రిందిస్తరాలలోనివారు అల్పులనే భావము కలిగియుందురు. అందుచే పై స్తరాలవారు అధికులమనే భావముతో క్రింది స్తరాల వారిని అధములు లేక అల్పులుగా భావించి వారిని చిన్నచూపుతో చూస్తారు. అయితే ఒక స్తరంలో ఉన్న వారిలో దైహికంగాను, భౌతికంగానూ వ్యత్యాసాలున్నప్పటికినీ వారందరు మిగిలిన విషయాలలో సమానులుగా భావింతురు. ఈ విధంగా ఒక స్తరానికి, మరొక స్తరానికి మధ్యవ్యత్యాసం ఏర్పడుతుంది.

**26.3.3 హోదా, సదుపాయము మొగమాటాల నిర్మితి (Prestige, Privilege and Obligations Structure)** : ప్రతి సమాజమున విలువల క్రమశ్రేణి (Hierarchy)ని బట్టి హోదాలో క్రమశ్రేణి ఏర్పడును. సమాజంలో హోదా, గౌరవము సదుపాయాలలో విభజన ఏర్పడును. అనగా వివిధ అంతస్థులలో వున్నవారు, వేరువేరు హోదాలను సదుపాయములను పొందుతారు. ఈ విధమైన హోదా, అంతస్తు, పై స్తరాలలో కలవారికి ఎక్కువగానూ, క్రింది స్తరాలలోని వారికి తక్కువగానూ ఉండును. హోదాలోనూ, గౌరవములోనూ భేదాలు ఉన్నందు వలన వారి విధులలోనూ, హక్కులలోనూ అవకాశాలలోను వ్యత్యాసాలు ఉంటాయి.

ఈ విధమైన వ్యత్యాసాలు ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలలో కూడ రూపొందుతాయి. ఈ విధమైన ఏర్పాటును ఈ క్రింది పటము వివరించును.




**26.3.4 శక్తి, అధికారము, నియంత్రణ : (Power, Authority & Control) :** సామాజిక స్తరీకరణకు మరొక ప్రధాన లక్షణము శక్తి, అధికారము, నియంత్రణ. స్తరీకరణలో అనేక విలువలు, ప్రమాణాలు ఉండును. అందువలన స్తరాలలోని వ్యక్తులు అదుపులో ఉంటారు. వీటితోబాటు శక్తి, అధికారము మొదలగునవి స్తరీకరణ చెందుతాయి. వివిధ స్తరాలకు చెందిన వ్యక్తులకు, సమూహాలకు వేర్వేరు అధికారములను కేటాయించడం జరుగును. శక్తి, అధికారము పై స్తరం నుండి క్రింది స్తరమునకు వస్తున్న కొలది తగ్గుతూ ఉంటాయి. అందువలన పై స్తరంలోని వ్యక్తులు, సమూహాలు తమక్రింద ఉన్న వ్యక్తులమీద, సమూహాల మీద అధికారాన్ని చెలాయిస్తారు. దీనివలన ప్రాబల్యము (Super Ordination), విధేయత (Subordination) అనే ద్వంద్వ ప్రక్రియలు ఏర్పడుతాయి. అధికారం ద్వారా ఆజ్ఞలను ఇవ్వడం, తీర్పులను, నిర్ణయాలను తీసుకోవడము మొదలైనవి జరుగును. శక్తి, అధికారముల వలన ఏర్పడిన ప్రాబల్యము విధేయత ద్వారానే సామాజిక వ్యవస్థలో కార్యకలాపాలను, వారి పాత్రలను క్రమ బద్ధం చేసి అదుపులోనికి తెస్తుంటాయి. కాని పై స్తరాలలో ఉన్న వ్యక్తులకు మాత్రమే మిగిలిన స్తరాలలో వ్యక్తులు అవ్యవస్థా ప్రవర్తనను అదుపులోనికి తెచ్చే అధికారాన్ని కేటాయించడం జరుగుతుంది. దీనిద్వారా స్తరాలలోని వ్యక్తులు, సమూహాలు నియంత్రణలోనికి వస్తాయి.

**26.3.5 స్తరము, ఒక ఉపసంస్కృతి, ఉపసమాజము (Stratum as Sub-culture and as Sub-Society) :** సామాజిక స్తరీకరణము ఒక ఉపసంస్కృతిగాను, ఒక ఉపసమూహంగాను కనబడుట ఈ విధమైన స్తరీకరణ యొక్క మరొక లక్షణము. స్తరాలు ఒకదానికొకటి సంబంధము లేకుండా విడిపోవడమేగాక ఒక స్తరంలోనివ్యక్తులు ఒకే రకమైన విలువలను, ఆచార వ్యవహారములను, కట్టుబాట్లను, ప్రమాణాలను, పద్ధతులను, విధులను, అధికారాలను, అంతస్థులను కల్గి ఉంటారు. కావున ఒక్కొక్కస్తరం ఒక్కొక్క సంస్కృతిగానూ కనిపిస్తుంది.

**26.3.6. సామాజికమైనది :** స్తరీకరణ సామాజిక స్వభావముకలది. అనగా జైవికమైన అసమానత్వాలను గూర్చి చర్చించడంలేదని అర్థము. సామాజిక ఉన్నత, న్యూనత భావాలతో జైవిక లక్షణాలకు ప్రాధాన్యత ఉండదు. ఒక పరిశ్రమలో పనిచేస్తున్న మేనేజర్ తానుపొందిన విద్య, శిక్షణ, నైపుణ్యం వ్యక్తిత్వం మొదలగువాటివల్ల ఉన్నతస్థానాన్ని పొందుతాడు. అంతే కాని అతని శారీర సౌష్ఠం, బలాలవల్లకాదు. కావున స్తరీకరణ సామాజిక దృష్టితో పరిశీలించిన ఏ సమాజములోనైనా వివిధ వ్యక్తులకు ప్రతిఫలాలు కొన్ని సాంప్రదాయబద్ధమైన నిబంధనలను బట్టి లభించును.

**26.3.7. పురాతనమైనది :** సామాజిక స్తరీకరణ అన్ని సమాజాలలోను, అన్నికాలాలలోను, సర్వవ్యాపకమైన, అనాగరిక సమాజాలలోకూడ కన్పిస్తుంది. స్త్రీ పురుషులమధ్య, పెద్దలు, పిన్నలు మధ్య, సామాజికంగా నిర్ణయించిన అసమానత్వాలు ఉంటాయి. ఈ అసమానత్వాలను అధికారం, అంతస్తు, గౌరవం విషయాలలో సమాజం ఏర్పరుస్తుంది.

**26.3.8. వివిధ రూపాలు కలది :** స్తరీకరణ ప్రతి సమాజములోనూ ఏదో ఒక రూపములో ఉండును. ఈ స్తరీకరణ ఒక్కో సమాజంలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. ప్రాచీన సమాజాలను ఆధునిక సమాజాలను పోలిస్తే నేటి సమాజాలలో స్తరీకరణ భిన్నంగాను, వేర్వేరు రూపాలలోను కన్పించును. తరగతి లేక వర్గము, కులం హోదా ఆధారంగా వివిధ శ్రేణులు ఏర్పాటు చేస్తారు.

**26.3.9. అనుషంఘికమైనది :** సామాజిక స్తరీకరణ అధికారం, ఆస్థి, మూల్యాంకనం, మానసికతృప్తి ఆధారంగా ఏర్పడే, అసమానత్వాల వల్ల కలిగే ఫలితాలను రెండు రకాలుగా విభజించవచ్చును. అవి 1) జీవితావకాశాలు (Lifechances) 2) జీవితరీతులు (Life Styles). జీవితావకాశాలలో శిశు మరణాలు గరిష్ఠ జీవస్థాయి, శారీరక, మానసిక వ్యాధులు, వైవాహిక జీవితం చేరి యుండును. ఇవన్నియు స్తరీకరణ ఫలితంగా కలుగుతాయి. జీవితరీతులలో వ్యక్తులు ఎటువంటి నివాసాన్ని కల్గియున్నారు, ఇరుగు పొరుగు వారు ఎటువంటివారు, వినోదాలు, అనుభవించే సాంస్కృతిక విషయాలు మొదలయినవి చేరివుంటాయి. ఇవికూడ స్తరీకరణ వల్ల కలిగే ఫలితాలు.

## 26.4 సారాంశము :

సామాజిక స్తరీకరణలో సాంఘిక అసమానత్వాలకు ప్రధాన పాత్రకలదు. సమాజములోని వ్యక్తులు, సమూహాలు ఒకరికొకరికి ఈ విధమైన తేడాల వలన అవకాశాలలో హక్కులలో విభేధాలు కలుగుతాయి. సంఘర్షణ సంభవించి, ప్రాభల్యం, విధేయతలకు దారితీస్తాయి. కావున స్తరీకరణలో పోటీ, ప్రధానపాత్ర వహిస్తాయి. పోటీ ప్రభావమువలన వ్యక్తులు కృషి చేసి కొన్ని ప్రముఖ స్థానాలను పొందదానికి, ఆ విధంగా తమతమ అంతస్థులను పెంచుకొనే దానికి ప్రయత్నిస్తారు. ఈ విధంగా సామాజిక స్తరీకరణ అనగా ఒకదానితో ఒకటి ప్రాబల్యం, విధేయతలకు చెందిన సంబంధాలతో ముడిపడిఉన్న శాశ్వత సమూహాలు లేక వర్గాలుగా సమాజం విభజింపబడటం అని అర్థము. ఈ విధమైన వ్యక్తులతో కూడి వివిధ సమూహాలు సమాజంలో కలిగివుండే స్థానమును నిర్ణయిస్తాయి.

### ప్రశ్నలు :

1. సామాజిక స్తరీకరణము అనగానేమి? ముఖ్య లక్షణాలను వివరించుము.
2. సామాజిక స్తరీకరణమును నిర్వచించి దాని స్వభావమును పేర్కొనుము?
3. సామాజిక స్తరీకరణలో అంతస్థుము, శ్రమ విభజనను పేర్కొనుము?

రచయిత
యస్. సుబ్రమణ్యం

పాఠము - 27

# కులము - వర్గము స్వభావము - లక్షణాలు - భేధములు

## (CASTE AND CLASS - NATURE - CHARACTERISTICS & DIFFERENCES)


27.0 లక్ష్యం
27.1 కులవ్యవస్థ - అర్థవివరణ
27.2 నిర్వచనములు
27.3 కులవ్యవస్థ ప్రధానలక్షణములు
27.4 వర్గవ్యవస్థ
27.5 సామాజికవర్గ విభాగములు
27.6 వర్గవ్యవస్థ లక్షణములు
27.7 సామాజిక వర్గ జీవితావసరాలు
27.8 కులము వర్గమునకు మధ్యగల తేడాలు
27.9 సారాంశము


### 27.0. లక్ష్యం :

ఆధునిక సమాజాలలో సామాజిక స్తరీకరణకు ప్రాతిపదికలు కులము లేదా వర్గము. భారత సమాజమున సామాజిక స్తరీకరణ కులప్రాతిపదికగా, పాశ్చాత్య సమాజాలు, వర్గ ప్రాతిపదికగా స్తరీకరించవచ్చును. కావున శాశ్వతమైన గౌరవము, హోదా, అంతస్థు, అధికారము అనే ప్రాతిపదికలపై క్రమశ్రేణి (Hierarchy) లో సమాజమును వివిధ వర్గాలుగా విభజిస్తే అది సామాజిక స్తరీకరణ. అన్ని సమాజాలలోను ప్రాతిపదికలు ఒకేవిధంగా ఉండవు. బానిసత్వము, వర్గము, కులము మొదలైనవి స్తరీకరణలో ప్రధానాంశములు. వీటన్నింటికి గల ప్రధాన కారణం సమాజములోని వివిధ వర్గాల మధ్య ఏదో ఒక ప్రాతిపదికగా అంతస్థు, హోదా, గౌరవములో గల హెచ్చు, తగ్గులు మరియు అసమానతలు. ఈ విధమైన స్తరీకరణ కొన్ని సమా జాలలో శాశ్వతంగాను మరి కొన్ని సమాజాలలో తాత్కాలికంగానూ ఉండును. ఈపాఠములో కులము మరియు వర్గాన్ని గురించి తెలుసుకోవచ్చును.

### 27.1. కులవ్యవస్థ - అర్థవివరణ :

భారతదేశమున కులం ఒక ప్రత్యేకమైన సామాజిక స్తరీకరణం (Social Stratification) గా కనిపించును. దీనినే కులవ్యవస్థ అందురు. ప్రపంచమున మరే ఇతర సమాజాలలో ప్రస్ఫుటంగా కనిపించని కులవ్యవస్థ భారత సమాజమున కనిపించును. హిందూ సామాజిక వ్యవస్థ కులవ్యవస్థపై ఆధారపడినది. కులములో ఏమాత్రము సరళత లేనందువలన ఏవ్యక్తి తనకులాన్ని మార్చుకోజాలడు. అందుచే కులవ్యవస్థ మన సమాజంలో ఒక ప్రత్యేక నిర్మితి కలిగి ఉన్నది. ఇట్టి స్తరీకరణ ఏ ఇతర సమాజాలలోను లేదని చెప్పవచ్చును. అందువలన భారత దేశంలో కులవ్యవస్థ ఒక ప్రత్యేకమైన లక్షణము. కులమును ఆంగ్లభాషలో "కాస్ట్" (Caste) అందురు. ఈ పదము స్పానిష్ భాషలోని "కాస్టా" (Casta) అనే మాట నుండి పుట్టినది "కాస్టా" అనగా జాతి, వ్యవస్థ లేక వారసత్వ లక్షణాల సముదాయమని అర్థం. పోర్చుగీసువారు భారతదేశంలో "జాతి" అని పిలువబడె తరగతులకు ఈ పదాన్ని అన్వయించారు.

### 27.2. నిర్వచనములు :

కులము అనేపదానికి అనేక నిర్వచనములు కలవు. కులవ్యవస్థను అనేకమంది సామాజిక శాస్త్రవేత్తలు అనేక విధములుగా నిర్వచించిరి. క్రీ.పూ. 3 వ శతాబ్దంలో గ్రీకు యాత్రికుడు మెగస్తనీసు తను "ఇండికా" గ్రంథమున కులమును నిర్ణయించడానికి హిందు

సమాజంలో రెండు లక్షణాలను పేర్కొనెను. అవి (1) అంతర్వివాహము (సగోత్రవివాహము) లేకపోవుట (2) వృత్తులలో మార్పులేక పోవడము. సర్ హెర్బర్ట్ రిస్లే (Sr Herbert Risley) అభిప్రాయము ప్రకారము "ఒకే పేరుగల కుటుంబాల సముదాయము కులము, ఈ కుటుంబాలన్నీ ఒక పురాణ పురుషుని లేక దేవుని తమ మూల పురుషుడని చెప్పుకుంటారు. వారసత్వంగా సంక్రమించే వృత్తినే అనుసరిస్తారు, వీరిని సమాజం ఏక జాతిగా గుర్తించును" ఇతను కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిసి ఒకే పేరుతోను, ఒక విధమైన వంశానుక్రమములోనూ ఉండి వంశ పారంపర్యంగా ఒకే విధమైన పేరుతో వ్యవహరించుతూ, అందరూ సాధర్మ్యంగా ఉండుటకు కులము అని వివరించెను. స్టూర్టిండేల్, మొనా చేసే కులమును జన్మతో బాధ్యతలు, హక్కులు నిర్ణయించబడిన సమూహమని నిర్వచించారు. ఈ బాధ్యతలను, హక్కులను మతము అంగీకరించి, సమర్థిస్తుంది. వై.బి. డామ్లే అభిప్రాయము ప్రకారము "కులమనగా ఇతరులతో కలవకుండా తమ సముదాయంలోనే సహపంక్తి భోజన, వివాహములు జరుపుకుంటూ సాంప్రదాయ సిద్ధంగా వచ్చే పూర్వీకుల వృత్తిని అవలంబిస్తూ, ఇతర వర్గాలతో భిన్నమైన సామాజిక గౌరవ వృత్తులు కలిగిన ఒక సవర్ణ ప్రజా సముదాయము". కేట్కర్ అభిప్రాయము ప్రకారము కులము ప్రధానంగా రెండు లక్షణాలు కలిగియుండే సమూహం. అవి 1. కులములో వున్నవారి సంతానానికి ఆ కులములో సభ్యత్వం పరిమితమై ఆ విధంగా జన్మించిన వారితో కూడి వుంటుంది. 2. కులములోని సభ్యులు కులం వెలుపలి వారిని వివాహము చేసుకోవడం కఠినంగా నిషేదిస్తారు. హట్టన్ అభిప్రాయము ప్రకారము ఒక వ్యక్తి ఒక కులంలో పుట్టి తద్వారా అందులో సభ్యుడై అతడు మరణించే వరకు అందులోనే సభ్యుడుగా ఉంటాడని; అందుచే సంపదగాని, పేదరికము గాని, విజయంగాని ఓటమి గాని అతనియొక్క కులాన్ని మార్చలేవు. టి.యన్. మదన్, డి.ఎన్ మజుందార్ అభిప్రాయం ప్రకారము "కులం ఒక సంబంధిత సమూహము (closed group) ఒక వర్గం ఖచ్చితంగా వారసత్వాన్ని పాటించినప్పుడు దీనిని కులమని చెప్పవచ్చును". ఈ అభిప్రాయాన్ని కూలే కూడ సమర్థించెను. మెకైవర్ మరియు పేజ్ అభిప్రాయం ప్రకారము "అంతస్తు సంపూర్ణంగా పూర్వ నిర్ధారితమై, దానిని మార్చుకోలేని, ఆశలేని విధంగా మానవులు భూమిపై జన్మించినపుడు వర్గం అనేది కులంగా రూపొందును".

పై నిర్వచనముల ఆధారంగా కులము అనునది అనేక ప్రాతిపదికలపై వివిధ అంశాలను కలిగియుండును అని తెలియుచున్నది. హిందూకుల వ్యవస్థను వర్ణవ్యవస్థ అని కూడ అనవచ్చును. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్గాలుంటాయి. దీనినే చతుర్ వర్ణ వ్యవస్థ అని పిలుస్తారు. ఆధునిక సమాజంలో హరిజనులను పంచమ వర్ణంగా దీనికి కలిపిరి. ప్రతి కులము అనేక ఉపకులాలుగా విభజింపబడినది. దీనిని 'జాతి' అని కూడ అందురు. ఇది అంతర్వివాహ వ్యవస్థ. అనగా ఇందులోని సభ్యులు తమ ఉపకులములోనే వివాహ సంబంధాలు కలిగియుందురు. కులాలు, కుల సిద్ధాంతాలు అన్ని రకాల మానవ సంబంధాలను ఆవరించి అనేక భావ వృత్తులను (Sentiments) అభివృద్ధి చేస్తాయి. నేడు భారతదేశమున దాదాపు 3,000 కులములు కలవని ప్రొఫెసర్ ఘుర్యే (Ghurye) పేర్కొనెను. ప్రతి కులానికి కొన్ని పద్ధతులు కలవని, ఆ పద్ధతులు ఆ కులములోని సభ్యులు అందరూ పాటించవలెనని సూచిస్తాయి. అంతేగాక కులములో వృత్తికి, మతానికి, సాంప్రదాయక జీవనానికి సంబంధించిన కొన్ని నియమాలు సదుపాయలు కూడ ఉంటాయి. వ్యక్తి మరణించినపుడు, సమాధి చేసేటప్పుడు, కర్మకాండలు నిర్వహించేటప్పుడు ప్రతి కులము కొన్ని పద్ధతులను సూచిస్తుంది. కావున కులము హిందూ సామాజిక నిర్మితిలో వ్యక్తులతో అన్ని వేళలా, అన్ని పనులలోనూ, అన్ని సంబంధాలతోనూ, ముడిపడి అల్లుకొని ఉంటుంది.

**27.3 కుల వ్యవస్థ ప్రధా లక్షణాలు :** ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఎమ్.ఎన్. శ్రీనివాస్ (M.N. Srinivas) భారత సమాజమున కుల వ్యవస్థలో ఈ క్రింది ప్రధానలక్షణాలను పేర్కొనెను.

**27.3.1. కులం సహజమైనది :** కుల వ్యవస్థ ప్రధాన లక్షణాలలో ప్రధానమైనది సహజత్వం. అనగా కుల వ్యవస్థలో ఏ మాత్రం సరళత లేకపోవడము దాని సభ్యులకు ఇతర కులాలోనికి మారే స్వేచ్ఛ లేకపోవడము. ఒక కులములో జన్మించిన వ్యక్తి మరణించేవరకు అందులోనే సభ్యుడుగా కొనసాగును. జీవితంలో అతను పొందే స్థానాన్ని కులమే నిర్ణయిస్తుంది. అందువలన కులం వ్యక్తికి పుట్టుకతో ప్రాప్తిస్తుంది. ఒక కులములో పుట్టిన వ్యక్తి ఆ కులములోనే పెరిగి, పెద్దవాడై జీవన యాత్ర చేసి మరణిస్తాడు. వ్యక్తులకు సాంఘిక హోదా, గౌరవము, సామాజిక అంతస్థు తాము జన్మించిన కులాన్ని బట్టి నిర్ణయించబడతాయి.

**27.3.2. కుల అంతస్థు :** భారత దేశమున దాదాపు 3000 కులాలు కలవు. ప్రతి కులానికి అది నిర్వహించే, పొందే, ఆచరించే అనేక మత, సాంఘిక, సాంస్కృతిక పరమైన సంస్కారాలు, వృత్తులు ఆధారంగా ఒక్కొక్క కులానికి ఒక్కొక్కరకమైన అంతస్థు ఇవ్వబడింది. కాని కొన్ని గ్రామాలలో గాని పట్టణాలలో గాని, కొన్ని కులాలకు చెందినవారే ఉంటారు. అయితే కులం ఒక ప్రాంతానికి, మరొక ప్రాంతానికి వేరగుట చేత దేశము మొత్తం మీద అనేక కులాలు ఏర్పడినాయి. ఒక గ్రామములోని, పట్టణంలోగాని, ఒక ప్రాంతములో గాని ఉన్న కులాలను వారి వారి అంతస్థులను అనుసరించి క్రమశ్రేణిలో (Hierarchy) పెట్టవచ్చును. కాని కుల అంతస్థులో ప్రథమ స్థానాన్ని బ్రాహ్మణులకు, చివరి అంతస్థును హరిజనులకు (అంటరాని వారు) ఇవ్వడం జరిగినది. కాని ఈ అంతస్తు ఒక్కొక్క ప్రాంతమున ఒక్కొక్క రకంగా ఉండును.

**27.3.3. అంతర్వివాహము :** వ్యక్తులు పుట్టుకతోనే వివిధ కులాలకు చెందియుందురు. వారు తమ కులం వారినే వివాహము చేసుకొందురు. ఇతర కులాల వారిని వివాహం చేసుకోరు. ఒక కులములో అనేక గోత్రాలు, శాఖలు ఉండవచ్చును. కులాలు అంతర్వివాహాన్ని ప్రోత్సహిస్తాయి. అనగా ఒక శాఖలోని వారు తిరిగి అదే శాఖలోని వారిని వివాహం చేసుకోవాలి కాని సరి గోత్రాలు, బహిర్వివాహాలను చేసుకోకూడదు. ప్రతి కులానికి ఇది ప్రధాన లక్షణమని వెస్టర్ మార్కు (Wester Mark) అభిప్రాయపడెను. కావున కులాంతర వివాహములు పూర్తిగా నిషేధమేగాక అవి చేసుకున్నవారు కుల బహిష్కరణకు గురౌతారు.

**27.3.4. ఆహారానికి సంబంధించిన కట్టుబాట్లు :** వివిధ కులాల ప్రజలకు వారి ఆహారపు అలవాట్లను గురించి కొన్ని నియమములుండును. ఉదా : బ్రాహ్మణులు మాంసాహారము తినరాదు. క్షత్రియులు, వైశ్యులు గొడ్డు మాంసము వంటి కొన్ని రకాల ఆహారాన్ని తినకూడదు. కాని శూద్రులలో కొన్ని వర్గాలు ఏ రకమైన ఆహారమునైనా తినే స్వేచ్ఛను కలిగి వుంటారు. అంతేగాక సహపంక్తి భోజనము తన కులము వారితో కలసి మాత్రమే చేయాలి, వండిన ఆహార పదార్థములను తమకంటే తక్కువ కులమువారి నుండి తీసుకొనకూడదు. కాని తక్కువ కులమువారు తమకంటె ఎక్కువ కులాల వారినుండి వండిన ఆహార పదార్థములను తీసుకొనవచ్చును.

**27.3.5 శాశ్వతంగా నిర్ణయించిన కుల వృత్తులు :** కుల వ్యవస్థలో మరొక ప్రధాన లక్షణము కుల వృత్తులు. ప్రతికులం ఏదో ఒక వృత్తిని వంశ పారంపర్యంగా తనదిగా భావించుకొని, ఇతరులు దానిని స్వీకరించకుండా అడ్డు పడుతుంది. అనగా కుల వృత్తులు జన్మతః లభించినవి. ఉదా. బ్రాహ్మణులు మత, విద్యా సబంధమైన బాధ్యతలను, క్షత్రియులు దేశ రక్షణను, వైశ్యులు వర్తక వ్యాపారాన్ని, శూద్రులు ఇతర కులాలకు సేవలను అందించడాన్ని తమ వృత్తులుగా కలిగి వుంటారు. కాని కాల క్రమేణా ఈ ఏర్పాట్లలో నేక మార్పులు వచ్చినవి. అందుచేత కుల వ్యవస్థ వ్యక్తులకు వివిధ అంతస్తులతో పాటు మార్పులను కూడ ఆపాదించినది. కావున ఏ కులములో పుట్టిన వారు ఆ కుల వృత్తినే చేపట్టాలి. కాని వ్యక్తి తన అభిమతానికి అనుగుణంగా, శక్తి సామర్థ్యాలను బట్టి వృత్తిని ఎన్నుకోవడానికి వీలులేదు.

**27.3.6 కుల పంచాయతీలు :** కుల వ్యవస్థలో ఒక కులానికి చెందిన సభ్యులు అందరూ విధేయత చూపే అధికార వ్యవస్థను కుల పంచాయతీలందురు. కుల పంచాయతీ తన అధికారాన్ని వినియోగించి కులంలోని కట్టుబాట్లను, క్రమశిక్షణను కాపాడుతుంది. కావున కుల పంచాయితీ ఆ కులానికి ఒక న్యాయస్థానంగా పనిచేస్తూ కులం కట్టుబాట్లను ఉల్లంఘించిన వారికి శిక్షలను విధిస్తుంది. ఈ కుల పంచాయితీలు తమ కులంవారి మధ్య ఏర్పడే తగాదాలను పరిష్కరించటంలోనూ, కులాచారాలను, ధర్మాలను పాటించుటలోనూ, కులస్థుల అవసరాలను పరిక్షించుటలోనూ సహకరిస్తాయి. కాని నేడు ఈ కుల పంచాయితీలు కుల సంఘాలుగా వ్యవహరిస్తున్నాయి. ఇవి విద్య, ఆర్థిక, రాజకీయ సంబంధమైన చర్యలను కూడ చేబడుతున్నాయి. కులానికి సంబంధించిన దిన, వార, పక్ష, మాస పత్రికలను ముద్రించడం, సమావేశాలను జరిపి తమ కులస్థుల అవసరాలను తెలుసుకొని వాటిని కల్పించడము జరుగుతున్నది. పట్టణాలలో కుల సంఘాలు, వసతి గృహాలు కళ్యాణ వేదికలను నిర్మిస్తున్నాయి. ఈ కుల సంఘాలు వారి సభ్యులకు ఎక్కువ సంస్కారాలను ఆచరించి ఉన్నత కులములను చేరుటకు ప్రయత్నం చేయాలని (సాంస్కృతీకరణము (Sanskritilisation) ప్రోత్సహిస్తున్నాయి.

**27.3.7. క్రమశ్రేణి సామాజిక వ్యవస్థ :** భారత సమాజమువ క్రమశ్రేణి సామాజిక వ్యవస్థ కుల వ్యవస్థపై ఆధారపడింది. కుల వ్యవస్థలో ప్రాబల్యం, విధేయత ఆధారంగా క్రమశ్రేణి సామాజిక వ్యవస్థ కనిపిస్తుంది. ఈ క్రమశ్రేణిలో అత్యున్నత స్థానంలో బ్రాహ్మణులు,

అందరికంటే దిగువ స్థానంలో హరిజనులు ఉంటారు. సామాజిక వ్యవస్థలో బ్రాహ్మణులు తరువాత క్షత్రియులు, వారి తరువాత వైశ్యులు ఉంటారు. దిగువ కులం స్థాయినుండి ఎగువ కులంవారు ఆహారాన్ని గాని, పానీయాన్ని గాని స్వీకరించరు. కొన్ని సందర్భాలలో హరిజనులు తమను ముట్టుకుంటేనే మైల పడిపోతామనే భావము అగ్ర వర్ణాలవారు వ్యక్తపరుస్తారు. అందుచేత హరిజనులను అంటరానివారుగా భావిస్తారు. ఈ క్రమశ్రేణి సామాజిక వ్యవస్థ వలన బ్రాహ్మణులు, క్షత్రియులు అనేక సాంఘిక, మత, ఆర్థిక, సాంస్కృతిక పరమైన ప్రత్యేక హక్కులను పొందారు. ఈ విధంగా కుల వ్యవస్థలో ఎక్కువ, తక్కువ తేడాలు ప్రధానంగా కనిపిస్తాయి. అగ్ర కులాల వారు నిమ్నకులాల వారిపై అనేక ఆంక్షలను విధిస్తారు. ఈ విధంగా సామాజిక వ్యవస్థ అనేక ఆంక్షలతో కూడిన క్రమశ్రేణిని కుల వ్యవస్థను నిర్ణయించును.

**27.3.8 విధి నిషేధాలు :** అగ్ర వర్ణాలు తమ స్వచ్ఛతను కాపాడుకోవడానికి, కుల వ్యవస్థలో చెడు ప్రవేశించకుండా చేయడానికి, వారి వారి కుల పవిత్రతను, ఆచారాన్ని, వృత్తులను కాపాడుకోవడానికి కొన్ని నిషేధాలను అమలు చేస్తాయి. ఈ నిషేధాలు ముఖ్యంగా మత, సాంఘిక, సాంస్కృతిక, వృత్తి పరంగా ఉండును. ఉదా : కర్మకాండలు, ఆహారానికి, సాంఘిక పరస్పర చర్యకు సంబంధించిన నిషేధాలు మొదలైనవి. ఒక వ్యక్తి ఎటువంటి ఆహారము తినవచ్చునో, తినరాదో నిర్ణయిస్తాయి.

**27.3.9. సామాజిక, మత అవకాశాలు :** కులవ్యవస్థలో ప్రధానంగా సామాజిక, మతపరమైన అవకాశాలు అందరికీ ఒకేవిధంగా ఉండవు. అనగా అగ్రకులాల వారు ముఖ్యంగా ద్విజులు అధ్యయనం చేయుటకు, యజ్ఞయాగాదులు, వ్యాపార వాణిజ్యాలు చేయుటకు అర్హులని, క్రింది కులాల వారు ముఖ్యంగా పంచములు (హరిజనులు) విద్యను అభ్యసించడం కాని, ఉన్నత కులాల వారి వృత్తులను చేపట్టడంగాని, దేవాలయాలలోనికి, దుఖాణాలలోనికి ప్రవేశించడం గాని చేయకూడదు. అనగా ఇవన్నీ వారికి నిషేధింపబడినవని అర్థము.

**27.3.10. అశుభ్రత, వేష భాషలు మొదలైనవి :** కుల వ్యవస్థలో ప్రధానంగా శుభ్రత, అశుభ్రత (Purity and Pollution-Sacred and Profane) ఆధారంగా చేసుకొని అనేక కులాల వారిని దూరంగా ఉంచడం జరిగినది. ఉన్నత కులాలకు చెందిన వ్యక్తి క్రింది కులాలకు (ఉదా. మంగలి, చాకలి, కుమ్మరి, హరిజన, గిరిజన మొ.వి) చెందిన వారిని అంటుకొనడు. ఒక వేళ ఏ కారణము చేతనైనా అంటుకుంటే అతనిని అంటరానివానిగా పరిగణించి, కొన్ని సంస్కారాలు చేయడం ద్వారా అతనిని తిరిగి తమ కులంలోనికి తీసుకొంటారు. అనగా అతడు తన వెనుకటి స్థితిని పొంద గలుగుతాడు. ఉదా : దక్షిణ భారతదేశంలో ఈ అశుభ్రతను గూర్చిన నిబంధనలు పటిష్టంగా కలవు. ఈ అశుభ్రత కొన్ని వృత్తులకు కూడా ఉండును. మంగలి, చాకలి కులాల వారి వృత్తి పనులను హరిజనులు చేయరు. అదేవిధంగా ప్రతి కులానికి ఒక ప్రత్యేక సంస్కృతి ఉండును. ఉదా : వస్త్రధారణ, అభరణాలను ధరించడం, భాషలను, ఆచారాలను అచరించడం మొదలైనవి వివిధ కులాల మధ్య వివిధ రకాలుగా ఉండును. ఈ విషయాలను యమ్.ఎన్. శ్రీనివాస్ (M.N. Srinivas) తన గ్రంథమైన "ఆధునిక భారతదేశములో సామాజిక పరివర్తన" (Social Change in Modern India) లో వివరిస్తూ ఈ విధమైన నిబంధనలు సమాజంలో అనేక సమస్యలకు దారితీయునని వివరించెను.

**27.3.10. కుల వ్యవస్థ భారత సమాజము :** భారతదేశమున కుల వ్యవస్థ ప్రాచీనమైనప్పటికి నేడు ఈ వ్యవస్థలో అనేక మార్పులు ఏర్పడెను. ఆధునిక భారత సమాజమున సంభవిస్తున్న పరిణామాల వలన పూర్వం కులము నిర్వహించే అనేక విధులను ఇప్పుడు వేరు వేరు సంస్థలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా సాంఘిక సంస్కర్తలు, పాశ్చాత్య విద్యా విధానము, చట్టాలు మొదలైనవి కుల వ్యవస్థను వ్యతిరేకిస్తాయి. ఉదా : రాజారామమోహన్‌రాయ్, వీరేశలింగం పంతులు మొదలగు వారు కుల వ్యవస్థను నిరసించిరి. అంటరాని తనము నిషేధముతో పాటు, కుల వ్యవస్థలో అనేక మార్పులు ఏర్పడుటకు పారిశ్రామికీకరణ, నగరీకరణ, మొదలగునవి ఎంతగానో తోడ్పడినవి. వ్యక్తులు తమ సాంప్రదాయ కుల వృత్తులను విడనాడి కర్మాగారాలలో, పరిశ్రమలలో పనిచేయుటకు గాను పట్టణాలకు వలస వెళ్ళుచున్నారు. ఈ కారణంగా అనేక కులాల వారు ఒకచోట కలసి పనిచేయడం, కలసి నివసించడం, హోటళ్ళలో భుజించడం మొదలగు చర్యల ద్వారా తమ కుల మత విభేదాలను కొంతవరకు మరచిపోగల్గుతున్నారు. నేటి ఆధునిక సమాజంలో ఒక వ్యక్తి హోదా అంతస్థు అతని ప్రజ్ఞను బట్టి, నైపుణ్యాన్ని బట్టి నిర్ణయిస్తున్నారు. అందుచేత కుల వ్యవస్థ దెబ్బతిని దానిస్థానే తరగతివారీ వ్యవస్థ ఏర్పడినది. కుల పంచాయితీలు తమ బాధ్యతలపై పట్టును కోల్పోతున్నాయి. క్రమ శ్రేణిలో, స్తరీకరణంలో సమానాంతర స్థాయినికలిగి వున్న కులవ్యవస్థ ఇప్పుడు సమాజంలోని విభజనలను అంతం

చేస్తూ నూతన దిశలో రూపొందుతున్నది. కాని కులానికి సంబంధించిన కార్యకలాపాలన్నీ అంతమైనాయని చెప్పజాలము. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగములో ఏర్పడుచున్న వివిధ మార్పులు కుల వ్యవస్థలో కూడ మార్పు తెస్తున్నాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ప్రభుత్వం మొదలైనవి కుల వ్యవస్థకు వ్యతిరేకంగా వితంతువుల పునర్వివాహము, అనుమతిస్తూ బాల్య వివాహాలను రద్దుచేయుచూ, పరదా పద్ధతిని తొలగిస్తూ, కులాంతర మతాంతర వివాహాలను ప్రోత్సహిస్తూ అనేక సంస్కరణలను చట్టరీత్యా రూపొందించి తద్వారా కుల వ్యవస్థను బలహీన పరచిరి.

## 27.4 వర్గ వ్యవస్థ (Class System) :

మానవ సమాజాన్ని జాగ్రత్తగా పరిశీలించిన వయస్సు, లింగబేధం, ఆస్తి, యాజమాన్యం, దాంపత్యస్థాయి, విద్య, వృత్తి స్థాయి, సహచరులనుండి తమకు లభించే గౌరవ రాజకీయ ఆధికారం వంటి విషయాలలో మానవులు ఒకరికొకరు పరస్పరం భిన్నంగా వుండటాన్ని గమనిస్తాం. ప్రతి సమాజమున, సముదాయమున వర్గ విభేధాలుండును. సమాజము ఒక క్రమపద్ధతిలో అనేక వర్గాలుగా విభజింపబడి ఒక్కొక్క వర్గము ఒక్కొక్క స్తరంగా రూపొందుతుంది. ఇట్టి పద్ధతిపై స్తరీకరణ పొందిన దానిని వర్గవ్యవస్థ లేదా తరగతివారి వ్యవస్థ అందురు. ఇందులోని ప్రతిస్థరం భిన్నంగా ఉంటుంది. అంతేగాకుండా, సామాజిక వర్గ స్తరీకరణంలో ఐశ్వర్యము ఒక ప్రధాన కారణముగా ఉంటుంది. వ్యక్తియొక్క ఆస్తి అతని గౌరవాన్ని, సాంఘిక అంతస్థును సంపాదించి పెడుతుంది. ప్రతి వ్యక్తి తన అంతస్థును గాని, హోదాను గాని పెంపొందించుకొవచ్చు. వ్యక్తి యొక్క ఆస్తి అతని గౌరవాన్ని ఎక్కువగా పెంపొందిస్తుంది. ఒక వ్యక్తి తక్కువ కులములో జన్మించినప్పటికి తన ప్రజ్ఞా పాటవాల వల్ల సమాజంలో ఉన్నత పదవిని పొందవచ్చును. పదవుల ద్వారా అతని అంతస్తు హోదా పెరుగును. ఇటువంటి విషమ స్తరీయ గతిశీలత (Vertical Mobility), తరగతి వారి వ్యవస్థకు ఒక ప్రధానమైన లక్షణముగా పేర్కొనవచ్చును. తరగతి వ్యవస్థలోని స్తరాలు ద్రవరూపాలు ఇవి ఎట్లాకావాలంటే అల్లా మారిపోతాయి. ఈ మార్పులు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. ప్రధానంగా పాశ్చాత్య సమాజాలలో ఈ ప్రక్రియ ఎక్కువ రేటులో ఉంటుంది.

## 27.5 సామాజిక వర్గవిభాగములు :

సామాజిక వర్గాన్ని మూడు విభాగాలుగా పేర్కొనవచ్చును. అవి : 1) ఉన్నత వర్గము (Upper Class) 2) మధ్యవర్గము (Middle Class) 3) నిమ్నవర్గము (Lower Class). కాని వార్నర్ (Warner) అనే సామాజిక శాస్త్రవేత్త వర్గవ్యవస్థను ఆరు భాగములుగా విభజించెను. అవి 1) ఉన్నతోన్నత వర్గము (Upper Upper Class) 2) నిమ్న ఉన్న వర్గము (Lower Upper Class) 3) ఉన్నత మధ్య వర్గము (Upper-Middle Class) 4) నిమ్న మధ్యవర్గము (Lower-Middle Class) 5) ఉన్నత నిమ్న వర్గము (Upper Lower Class) 6) నిమ్న నిమ్న వర్గము (Lower-Lower Class). కాని కారల్ మార్క్స్ (Karl Marx) సిద్ధాంతము ప్రకారము కేవలం రెండు వర్గాలు మాత్రమే కలవు, 1) ధనము కలిగిన వారంతా ఒక వర్గముగాను - పెట్టుబడి దారీ వర్గము (Captalist Class) 2) ధనము లేని వారంతా ఒక వర్గము గాను (Working Class) వర్గీకరించెను. మేక్షివర్ అభిప్రాయం ప్రకారము సాంఘికమైన హోదాల వల్ల సమాజములోని ఒక సమూహము మిగిలిన వారితో కలవక విడిగా ఉండటమే వర్గమని అని నిర్వచించెను. వర్గము లేక తరగతి అనగా ఒక సమాజములో ఒక సాంఘిక అంతస్థును కలిగిన సమూహము; కావున ప్రతి వర్గములోని వారు వారివారి వర్గాలంటే అభిమాన తత్పరతము, కల్గి ఉంటారు. కావున మానవ సమాజమును పరిశీలించిన ఈ క్రింది అంశాలు వర్గ వ్యవస్థలో ప్రధానంగా ఉన్నాయి.

**27.5.1.** సమాజమున అనేక సాంఘికవర్గాలు ఉండి వారు తమ తమ వర్గ తేడాలను కలిగి ఉండుటవల్ల వారి వారి బేధాల ప్రాతిపదికగా సమాజము అనువంశిక వారసత్వ విభజన చెందును.

**27.5.2.** ధనము, సంపద, హోదా, గౌరవము, అంతస్థు, రాజకీయాధికారాలు తారతమ్యాలపై వర్గవ్యవస్థ ముఖ్యంగా ఆధారపడి ఉండును. ఇవి అనువంశికత ద్వారా (Heriditory) గాని లేక, తమ ప్రజ్ఞాపాటవాల వల్లగాని పొందవచ్చును.

27.5.3. వర్గవ్యవస్థ ప్రబలియున్న సమాజాలలో సంపద, ఆదాయం మొదలైన తారతమ్యాలు విచ్ఛిన్న జీవన విధానాలు, వినియోగ పద్ధతులు, విద్య, వేష, భాష, నడవడిక, అభిరుచులు తదితర సాంస్కృతిక లక్షణాల పరంగా సువ్యక్తమౌతాయి.

27.5.4. సమాజమున ఉన్నత శ్రేణి పారిశ్రామికవేత్తలందరూ, ఒక సామాజిక వర్గంగా ఏర్పడాలని అభిలషిస్తే, అల్పాదాయాలవారు (శ్రామికులు) మరొక సామాజిక వర్గంగా ఏర్పడి వారికి భిన్నంగా వుండి వర్గ పోరాటానికి దారితీయవచ్చును.

27.5.5. వర్గ వ్యవస్థలోని ప్రజల జీవన విధానమున అనేక వ్యత్యాసాలు కనిపిస్తాయి. ఉదా: ఉన్నతవర్గాలవారు భవంతులలో విలాస జీవితాలు అనుభవిస్తూ, వారి పిల్లలను ఉన్నతస్థాయి పాఠశాలలకు పంపుతారు. విలువైన దుస్తులు ధరిస్తారు. కాని దిగువ తరగతి వారి జీవన విధానము దీనికి భిన్నంగా ఉంటుంది.

27.5.6. సామాజిక వర్గాల సంఖ్య నిర్దేశించబడనప్పటికి ఒక సమాజంలోని ప్రజలు ఉన్నత తరగతి, మధ్యతరగతి, దిగువ తరగతివారుగా విభజింపబడ్డారు. ఉన్నత తరగతికి చెందినవారు వారికిగల సంపద, అందుకు తగిన సామాజిక ప్రాముఖ్యతలననుసరించి ఒక శాశ్వత ఉన్నత తరగతి ప్రజలై ఉంటారు. మధ్యతరగతిలో సాధారణంగా మంచి కుటుంబ చరిత్ర ఆదాయమువున్న వ్యాపారం, వృత్తులకు చెందిన వారుంటారు. మధ్యతరగతిలో సాధారణంగా మంచి కుటుంబ చరిత్ర ఆదాయమువున్న వ్యాపారం, వృత్తులకు చెందిన వారుంటారు. దిగువ తరగతిలో శ్రామికులు, ఉపాధిపనివారలు, వలస వచ్చినవారు ఉంటారు.

## 27.6. వర్గ వ్యవస్థ లక్షణాలు :

27.6.1. వర్గ వ్యవస్థ అనేక లక్షణాలను కలిగి ఉండును. వర్గాలను గురించిన అవగాహన కావాలంటే ఏవి వర్గాలవుతాయో గ్రహించుటకు ప్రధానంగా సామాజిక వర్గాల లక్షణాలు తోడ్పడతాయి. వ్యక్తి యొక్క ఆర్థికశక్తి, ప్రజ్ఞ, విద్య, విజ్ఞానము, నైపుణ్యము, సంస్కృతి మొదలగు అంశాలవలన అతని వర్గాన్ని నిర్ణయిస్తారు. కార్ల్‌మర్క్స్ అభిప్రాయం ప్రకారము "సామాజిక వర్గాలు లేని సమాజము వుండదు. కాని వివిధ సామాజిక వర్గాలమధ్య ఆస్తి యాజమాన్యం ప్రధాన పాత్ర వహిస్తుంది. యాజమాన్య వర్గం ఆధిపత్యం చెలాయిస్తూ ఉన్నతవర్గంగా ఉంటుంది." మాక్స్ వెబర్ అభిప్రాయం ప్రకారం "ఒక వ్యక్తి ఆర్థిక స్థితి ఒక సమాజవర్గం నుండి విడిపోయేందుకు లేదా కలసి వుండేందుకు ఆధారభూతమవుతుంది." అవకాశాలు అందరికి లేకపోవుట మొదలగు అంశాలతో కూడుకొన్న వ్యవస్థ వర్గవ్యవస్థ. కావున వర్గ వ్యవస్థలో ఈ క్రింది లక్షణాలు ప్రధానంగా ఉండును.

27.6.2. **సామాజిక గతిశీలత ఏర్పాటు :** వర్గ వ్యవస్థ శాశ్వతమైనదికాదు. ప్రతివర్గము ప్రతివ్యక్తిని ఎప్పుడూ ఆహ్వానిస్తుంది. ఎందుచేతననగా ఇది స్వేచ్ఛాపూరితమైన వ్యవస్థ. ఇందులో ప్రతివ్యక్తి తన స్వయం కృషి ద్వారా, విద్య ద్వారాగాని, వృత్తిద్వారాగాని, ధనంద్వారాగాని ఆదాయంద్వారాగాని నిమ్న వర్గము నుండి ఉన్నత వర్గములోనికి మారిపోవచ్చును. ఆ విధంగా వ్యక్తి తన పూర్వ వర్గాన్ని వదిలి ఉన్నత వర్గంలో సభ్యుడగుట ద్వారా అతనికి పూర్వమువున్న తక్కువ అంతస్తుపోయి ఉన్నత అంతస్తు, గౌరవము, హోదా, అధికారము సంప్రాప్తమౌతాయి. వర్గవ్యవస్థ ఉన్న సమాజాలలో వ్యక్తులు అల్పవర్గాలనుండి ఉన్నత వర్గాలలోనికి, ఉన్నత వర్గాలనుండి, అల్పవర్గాలలోనికి మారడానికి ఆకాంక్షలు, విశేష లక్షణములు కలిగి ఉండవలెను. అవి నెలకొనడానికి వ్యక్తులలో శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు, ప్రజ్ఞ, చదువు, అవకాశము మొదలగునవి ఉండవలెను. అవి లోపించిన వ్యక్తి ఉన్నత వర్గానికి చేరుకొనలేడు. అంతేకాక ఉన్నత వర్గాన్ని విడనాడి క్రింది వర్గములోనికి పోవలసి వస్తుంది. ఈ విధంగా వర్గ వ్యవస్థలో సామాజిక గతిశీలత అనే ముఖ్యమైన లక్షణంగా పేర్కొనవచ్చును.

27.6.3 **బహిర్వివాహం :** సాధారణంగా సామాజిక వర్గంలో బహిర్వివాహము మరొక ప్రధాన లక్షణము. వర్గ వ్యవస్థలో వ్యక్తులు బహిర్వివాహాలు చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. అంతేకాక అంతర్వివాహాలు కూడా జరుగుతాయి. ఒక వర్గంలోని వ్యక్తులు అదే వర్గానికి చెందిన వారిని వివాహము చేసుకోవడన్ని అంతర్వివాహమని ఒక వర్గానికి చెందిన వారు ఇంకొక వర్గములో వివాహము చేసుకోవడాన్ని బహిర్వివాహమని పేర్కొనవచ్చు. వర్గవ్యవస్థగల సమాజాలలో ఈ విధమైన రెండు రకాలైన వివాహాలు జరుగుతాయి.

**27.6.4.** వర్గచైతన్యము : ఇది వర్గ వ్యవస్థలోని అన్ని స్తరాలకు స్వీయ లక్షణము. ఒక స్తరంలోని వ్యక్తులతో స్వల్పమైన విభేదీకరణము, వైవిధ్యము ఉన్నప్పటికి ఉమ్మడి ఆర్థిక, నైతిక, సాంస్కృతిక వైఖరులవలన ఉమ్మడి విలువలు, లక్ష్యాలు, తాత్విక సిద్ధాంతాలవల్ల విభేదాలు; మరచి వర్గ చైతన్యాన్ని సృష్టి చేసుకుంటారు. ప్రతి వ్యక్తి ఆ వర్గంలో లీనమై ఆ వర్గపు మనిషిగా అందరి చేత గుర్తింపు పొందడానికి ప్రయత్నిస్తాడు. మిగిలిన వర్గాల పట్ల, వర్గప్రజల పట్ల ద్వేషభావాన్ని విరోధ భావాన్ని, వివ్యాభావాన్ని మనస్పర్థలను పెంచుకొంటూ ఉంటాడు.

**27.6.5.** ప్రమాణాలు : సమాజములోని వివిధ వర్గాలకు వివిధ హోదాలు, అంతస్తులు యివ్వబడతాయి. కాని ఏ వర్గానికి ఎంత హోదా, అంతస్తు యివ్వవలెనో నిర్ణయించడం వర్గ వ్యవస్థ మరొక ప్రధాన లక్షణము. ప్రధానంగా సామాజిక, ఆర్థిక ప్రమాణాలే వర్గాల అంతస్తు, హోదాను నిర్ణయిస్తాయి. ఆస్తి, వృత్తి, జీవన ప్రమాణాలు కలిసి సామాజిక, ఆర్థిక ప్రమాణాలుగా ఏర్పడి వర్గాల అంతస్తును నిర్ణయిస్తాయి. జాతి, ప్రాంతీయతలు కూడ నిర్ణయ ప్రమాణాలే. జాతి అనేది శరీర లక్షణాలను బట్టి, భాషను బట్టి, ఏర్పడుతుంది. ఉదా : అమెరికాలో నీగ్రోలు, మెక్సికన్‌లు, తెల్లవారు, అమెరికన్ ఇండియన్లు, ఒక్కొక్క వర్గానికి చెంది ఉన్నారు. వీరిలో తెల్లవారి వర్గము ఉన్నత వర్గానికి చెందిఉండి, మిగిలిన వర్గాలపై అధికారాన్ని చెలాయిస్తుంది. కావున వర్గ వ్యవస్థలో ప్రతి వర్గానికి కొన్ని ప్రమాణాలు ఉండును.

**27.7. సామాజిక వర్గం - జీవితావసరాలు :**

జీవితావసరములు అనగా సమాజమున విలువైన భౌతిక వస్తువులు, వస్తు నగదు రూపేణా ప్రతి ఫలాన్ని సంపాదించే అవకాశాన్ని సూచించును. వెబర్ అభిప్రాయం ప్రకారము వర్గంలో ప్రధానాంశము "ఈ జీవిత అవకాశాల అసమాన పంపిణీ". ఎందుచేతననగా సమాజంలో అందరికీ వీటిని పొందేందుకు ఒకే విధమైన అవకాశము లభించదు.

**27.7.1.** వర్గవ్యవస్థ ప్రజల జీవితావకాశాలపై పెద్దగా ప్రభావం చూపుతుంది. ఒక వర్గంలోని సభ్యులు దాదాపు ఒకే విధమైన జీవితావకాశాలను కలిగివుంటారు. స్వేచ్ఛ, ఉన్నతప్రమాణాలు, విరామం, విలాసాలు, పలుకుబడి, ఎక్కువ జీవన ప్రమాణము, వినోదాలు మొదలైనవి ఇందులకు ఉదాహరణము.

**27.7.2.** సామాజిక వర్గం-జీవితావసరాలు జీవన సరళులను ప్రభావితం చేస్తాయి. జీవన సరళులు అనగా విశ్రాంతి పొందడం, మనోల్లాసరీతులు, సౌందర్యాభిరుచి.ఎంపిక, వినోద విధానం, మతపరమైన తారతమ్యాలు, నైతిక దృక్పథం, కుటుంబ జీవన పద్ధతులు, దాంపత్య సంబంధాలు, పిల్లల పెంపకము పోషణ మొదలగు అంశాలలో ఒక వర్గానికి మరొక వర్గానికి తేడాలు కన్పిస్తాయి.

**27.7.3.** సామాజిక వర్గమున గృహిణుల జీవన సరళిలో కూడ భిన్నత్వం కన్పిస్తుంది. ఉదాహరణకు దిగువ వర్గాలకు చెందిన గృహిణులు కుటుంబ సమస్యలతో సతమతమగుచుండగా ఎగువ వర్గాలకు చెందిన మహిళలు కాలక్షేపము కొరకు నవలలు, పత్రికలు, కుట్టుపని, అల్లికలు, రేడియో, టెలివిజన్, మొదలగు కార్యకలాపాలు కాలక్షేపంగా కలిగి ఉందురు.

**27.7.4.** సామాజిక వర్గమున వివిధ మానసిక, సంతృప్తిస్థాయిలు యుండును. అనగా కొంతమంది మానసికంగా అనేక సమస్యలకు గురి అగుచూ అశాంతి, అలజడులకు, అసంతృప్తులకు గురి అగుచుందురు. ఇంకొక వర్గము ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయముగా అధికారమును, ప్రభావాన్ని ఇతరులపై కల్గి ఉండి నియంత్రణా వ్యక్తులుగా వ్యవహరింతురు.

## 27.8. కులమునకు, వర్గమునకు మధ్య బేధములు :

| కులము (Caste) | వర్గము (Class) |
|---|---|
| 1) వర్గములో అంతస్తు ఆరోపించబడినది | 1) వర్గములో అంతస్తు సాధించబడినది |
| 2) వ్యక్తులు సాంప్రదాయకమైన వృత్తిని అవలంబిస్తారు | 2) ఇందు వృత్తిపరమైన నిర్బంధము లేదు. |
| 3) కులము అనేది అంతర్వివాహాలను మాత్రమే అనుసరిస్తుంది | 3) వర్గమున బహిర్వివాహము, అంతర్వివాహములను కూడా ప్రోత్సహించబడును. |

| | |
|---|---|
| 4) మతము మీద ఆధారపడి ఆమోదాలను పొందుతుంటారు. | 4) మతమునకు, వర్గమునకు మధ్య సంబంధము లేదు. |
| 5) కులం ఒక సంకుచిత వ్యవస్థ గతిశీలత ఏర్పడుటకు అవకాశములేదు | 5) వర్గ వ్యవస్థ ఒక స్వేచ్ఛా వ్యవస్థ. ఇందులో గతిశీలత ఎక్కువగా ఎప్పటికప్పుడు జరుగుతుంటుంది. |
| 6) కులములో వర్గాలు కూడ ఏర్పడతాయి (ఉపకులములు). | 6) వర్గమున కులాలు ఏర్పడవు. |
| 7) కులవ్యవస్థలో ఆహార, తదితర నిషేదాలను విధించడం జరుగుతుంది. | 7) వర్గవ్యవస్థ ఆహార తదితర విషయాలపై నిషేదాలు ఉండవు. |

## 27.9. సారాంశము :

ఆధునిక కాలమున సామాజిక స్తరీకరణ అనేక కారణాల ఫలితంగా మార్పులు చేర్పులకు గురి అగుచున్నది. కుల వ్యవస్థ ఆధునీకరణ ఫలితముగా, పాశ్చాత్య విద్యా విధానము ఫలితముగా కొంతవరకు పట్టు సడలి వర్గ వ్యవస్థ మార్పు చెందినది. ఈ విధమైన మార్పు భారతీయ సమాజమున గమనించవచ్చును. కల వ్యవస్థలోనే కాక వర్గ వ్యవస్థలో కూడ అనేక మార్పులు ఏర్పడుచున్నవి. కాని కులమత వర్గవిభేదాలు పూర్తిగా నశించిపోలేదని చెప్పవచ్చును.

### ప్రశ్నలు

1. కులము అనగానేమి నిర్వచించి ప్రధాన లక్షణాలను వ్రాయుము?
2. సామాజిక స్తరీకరణలో కులవ్యవస్థ పాత్రను వివరించుము?
3. వర్గ వ్యవస్థ అనగానేమి వివరించి దాని ప్రధాన లక్షణాలు తెల్పుము?
4. కులమునకు, వర్గమునకు గల బేధములను తెల్పి, వర్గవ్యవస్థలోని ప్రజల జీవన సరళులను, జీవితావసరములను వివరించుము?
5. కులము మరియు వర్గ వ్యవస్థ యొక్క స్వభావములను వివరించుము?
6. సామాజిక వర్గవిభాగాలను వ్రాయుము?
7. సామాజిక వర్గ ప్రధానాంశములను వ్రాయుము?
8. సామాజిక వర్గము - జీవితావసరాలను వ్రాయుము?

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| Course | Year | Paper No. & Title |
|---|---|---|
| B.A. Sociology | Ist Year | Principles of Sociology |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)